# హయగ్రీవ స్తోత్రము

*Vyakhyanam By Srimaan Ramacharyulu, Delhi*







*అస్మద్గురుభ్యోనమః*

*శ్రీ లక్ష్మీ హయగ్రీవ పరబ్రహ్మణే నమః*

హయగ్రీవ వైభవము-హయగ్రీవ స్తోత్రము

"విశ్వోత్తీర్ణ స్వరూపాయ చిన్మయానంద రూపిణే

తుభ్యమ్ నమో హయగ్రీవ విద్యారాజాయ విష్ణవే

స్వాహా, స్వాహా నమః

ఋగ్యజుస్సామరూపాయ వేదాహరణ కర్మణే

ప్రణవోద్గీథవపుషే మహాశ్వశిరసే నమః

స్వాహా, స్వాహా నమః

ఉద్గీథ ప్రణవోద్గీథ సర్వ వాగీశ్వరేశ్వర

సర్వ వేదమయాచింత్య సర్వమ్ బోధయ బోధయస్వాహా,

స్వాహా నమః"

పెద్దనాన్న గారింట్లో అడుగు పెడుతూంటే చుట్టు ప్రక్కల ఏదో ఇంటిలోంచి మంత్రాలు మైకులో వినబడుతున్నాయి. వదిన ఇంతట్లో ఎదురుగా కనబడింది.

*నేను:* ఎప్పుడు వచ్చేవు వదినా, ఏమిటి మంత్రాలో ఏవో వినబడుతున్నాయి. ఎక్కడయినా పూజలు అవుతున్నాయా!

*వదిన:* నిన్న రాత్రె వచ్చేను. ఆ కోస వారింట్లో హయగ్రీవ పూజలో, యాగమో ఏదో చేస్తున్నారు. వాళ్ళు పిల్లలకు స్కూళ్ళు పెట్టినప్పుడు అలా హయగ్రీవ పూజ చేసి స్కూళ్ళకు పంపుతారట, పిల్లలకు బాగా చదువు అబ్బాలని. నువ్వు ఎలాగున్నావు. కాలేజీ తెరచీసేరా, అన్నట్లు నువ్వీమధ్య శ్రీభాష్యం నేర్చేసుకుంటున్నావట, పండితుడవయిపోదామనే.

*నేను:* లేదు వదినా, ఆ మధ్య ఎందుకో బుద్ధి పుట్టించేరు పెరుమాళ్ళు, మనకందరికీ ముఖ్యమయిన శాస్త్ర గ్రంథము శ్రీభాష్యం అంటారు కదా, అసలు దానిలో విషయం ఏమిటో సంక్షిప్తంగా తెలుసుకుందామని. మా అమ్మ మాట కాదనలేక మామయ్య అందులో కొన్ని విషయాలు మాకు సంక్షిప్తంగా చెబుతున్నారు, మేము వింటున్నాము అంతే. శ్రీభాష్యం అంటే ఎట్టిట్ట పుస్తకము అని తప్ప అందులో ఒక్క ముక్కా ఇంకా చూచినది లేదు, ఆయన చెబుతున్నది అర్థం చేసుకుందికి ప్రయత్నించడమే. కాని చాలా కష్టం వదినా, ఒక పట్టున అర్థం అవడం లేదు. నేనింతకు ముందు organic chemistry వే కష్టమనుకునే వాడిని. దీనిలో విషయాలు దానికి బోలెడు రెట్లు కష్టంగా ఉన్నాయి.

*వదిన:* మఱి, శ్రీభాష్యం అంటే ఏమిటను కున్నావు?

*నేను:* లేదు వదినా, అప్పుడు మామయ్య చెబుతూంటే కొంచెం అర్థం అయినట్లే ఉంటుంది, మళ్ళీ కొంతసేపు తరువాత అంతా గోడలాగే ఉంటోంది.

*వదిన:* అలాంటి విషయాలకు ఆచార్యానుగ్రహము, భగవద్రామానుజుల కటాక్షము ఉండాలి. దానికి తోడు ఆ భగవదనుగ్రహము ఉండాలి. ఆ భగవదనుగ్రహము కోసమే కదా ఆ కొస వారింట్లో హయగ్రీవారాధన చేస్తున్నారు.

*నేను:* ఈ హయగ్రీవుడంటే గుఱ్ఱపు తల ఉంటుంది, ఆయనేనా, ఆయన కూడా మహావిష్ణువు అవతారమేనా!మఱి మనకు తెలిసిన దశావతారాలలో ఈ అవతారము పేరు వినలేదు కదా, అంటే తరువాత ఎవరయినా మనలాంటి వాళ్ళు ఈ అవతారాన్ని కనిపెట్టేరా!

*వదిన:* మన సనాతన ధర్మములో కొత్తగా కనిపెట్టడాలు అంటూ ఏమీ ఉండవు. తెలియని విషయాలు తెలుసుకోవడం మాత్రమే ఉంటుంది. హయగ్రీవ అవతారాన్ని గురించి నీకు బాగా తెలియక పోవచ్చు. కాని వేదములలోను, ఇతిహాసములలోను, పురాణాలలోనూ, ఇంకా ఆగమ శాస్త్రాలలో, సంహితలలో, తంత్రాలలో ఇలా ఎన్నింటిలోనో చెప్పేరు. విశేషమేమిటంటే ఈ అవతారము అన్ని అవతారాలలోను ప్రప్రథమమైనది. ఈ హయగ్రీవ ఉపాసన వైష్ణవులకే కాక, మధ్వులకూ, ఇంకా ఇతర సంప్రదాయాల వాళ్ళకూ కూడా ఉంది. అంత ఎందుకు, థాయిలేండ్, మలేసియా లాంటి దేశాలలో హయగ్రీవ ఉపాసన చేసే ఆలయాలు, వాట్లలో ఉపాసన చేసే బౌద్ధాది ఇతర మతస్థులు కూడా ఉన్నారు.

*నేను:* అయితే కొంచెం ఆ హయగ్రీవ భగవానుని గురించి చెబుదూ, ఆయన దయ వలనైనా నాకు కూడా కొంచెం చదువు ఒంటబడుతుంది.

*వదిన:* హయగ్రీవ భగవానుని గురించి ఎంతని చెప్పగలము, నాకు తెలిసినదే చాలా కొంచెం, అయినా నీకు వివరంగా కావాలా,

*నేను:* మరీ అంత వివరంగా అని కాదు కాని, ఆయన వైభవాన్ని తగుమాత్రంగా చెప్పు. ఒక idea రావడానికి.

## *హయగ్రీవ వైభవము.*

*వదిన:* ఆ శ్రీమన్నారాయణుని అవతారమే హయగ్రీవ భగవానుడు.

ప్రళయ సమయములో ఈ ప్రకృతి, జీవుళ్ళు పరమాత్మలో లయమయి ఉంటాయి కదా, అలా లయమయి సూక్ష్మావస్థలో ఒక రూపము లేక ఆనందానుభవము ఎఱుగక పడియున్న జీవుళ్ళపై దయ కలిగిన పరమాత్మ వారిని తన వద్దకు రప్పించుకొని, నిత్య, నిరవధిక ఆనందాన్ని ప్రసాదించాలని తలుస్తాడుట. అదుగో అప్పుడు పరమాత్మ వ్యూహరూపముతో యోగనిద్రావస్థలో ఉండగా, ఆయన నాభి నుండి ఒక కమలము, దానియందు చతుర్ముఖ బ్రహ్మ బయటకు వస్తారు. ఆ పరమాత్మ చతుర్ముఖ బ్రహ్మకు వేదములను ప్రసాదించి, ఆ జ్ఞానముతో సృష్టి కార్యము నిర్వర్తించమని నిర్దేశిస్తాడుట. పరమాత్మ నుండి వచ్చిన ఱెండు నీటి కణాలనుండి జన్మించిన తమో, రజో గుణాలకు ప్రతీకలైన మధు, కైటభులనే ఇద్దరు రాక్షసులు ఆ సమయములో చతుర్ముఖ బ్రహ్మ వద్దనుండి ఆ వేదాలను దొంగలించి రసాతలములో కనపడకుండా పోయారట. అప్పుడు..

*నేను:* వదినా, ఇది చిన్న పిల్లలకు చెప్పే ఏదో కథలా ఉన్నట్టుంది, వేదాలు అంటే శ్రుతులు కేవలము ఒకరి నుండి విని నేర్చుకునేవి కదా, అవి పరమాత్మ చతుర్ముఖ బ్రహ్మ యోగ నిద్రలో ఉండి ఎలా చెప్పేడు, పోనే చెప్పేడు అనుకో, అవేమీ పుస్తకాలు కాదుకదా దొంగలించి తీసుకు పోవడానికి. అయినా, ఆ పరమాత్మ తనే ఆ రాక్షసులను సృష్టించి ఆ వేదాలను దొంగలింపించడం ఎందుకు? ఇదంతా నువ్వు చెబుతున్న కథా, ఎక్కడయినా ఉందా!

*వదిన:* అన్నట్లు నువ్వు ఇంకా చిన్న పిల్లడివే అనుకుంటున్నాను, పెద్దవాడివయి పోయినావన్న మాట!

*నేను:* అది కాదు వదినా, ఔచిత్యముగా లేదేమోనని, వేఱే ఎవరయినా అడిగితే చెప్పాలి కదా!

*వదిన:* వేదాలంటే అపారమైన జ్ఞాన రాశి కదా, జ్ఞానము ఎప్పుడూ పోదు, అంటే నాశనమైపోదు, అందకుండా, తెలియకుండా పోతుంది, రజస్తమో గుణాలవలన. అంటే వీటి వలన విపరీత జ్ఞానమో, అజ్ఞానమో కలుగుతుందన్నమాట. రావణాసురిడిలా ఒకదానికి బదులు మఱియొక రకంగా గ్రహించడం, ప్రవర్తించడం అనే విపరీత జ్ఞానము రజో గుణము వలననైతే, జ్ఞానమే కలుగక పోవడం, కలిగినా కుంభకర్ణుడిలా ప్రవర్తించకుండా ఉండడం తమోగుణము వలన కలుగుతుంది. నేనే ఈ సృష్టి చేస్తున్నాననే అహంకారమో, నా కోసమే ఈ సృష్టి

అంతా అనే మమ కారమో ఇలా ఎన్నో దురాలోచనలు మొదలవుతాయి. అంటే ఉన్న సత్యమైన జ్ఞానం కనుమరుగయినట్లే కదా. ఇలా కలిగించే రజస్తమో గుణాల ప్రతీకలే ఆ మధుకైటభులనే రాక్షసులు.

*నేను:* ఆ రజస్తమో గుణాలు కూడా సృష్టి ప్రారంభము నుండీ ఉంటాయన్నమాట. కాని చతుర్ముఖ బ్రహ్మకు కూడా ఇవి తప్పదా?

*వదిన:* చతుర్ముఖ బ్రహ్మ కూడా ఈ లీలా విభూతిలో ఒక జీవుడే కదా, ఈ లీలా విభూతిలో ఉన్న వాళ్ళెవ్వరికయినా తప్పదు. సముద్రంలో మునిగి, తడి తగలకూడదంటే ఎలా! భగవానుడనే కవచము మనని రక్షించేదాకా!

*నేను:* మఱి భగవద్గీతలో "శ్రద్ధాత్రయ విభాగ యోగము" లో కొన్ని ఆహారాల వలన సత్త్వ గుణము, కొన్నిటి వలన రజోగుణము, కొన్నిటి వలన తమోగుణము వస్తుంది అని కదా చెప్పేరు, ఆ సత్త్వ గుణాన్నిచ్చే పదార్థాలను మాత్రమూ వాడితే, అప్పుడు రజస్తమో గుణాలు ఉండవు కదా!

*వదిన:* బాహ్య మయిన ప్రేరణ కొంత తగ్గుతుంది, కాని, ఆ భగవద్గీత లోనే "నిరాహారస్య దేహినః రస వర్జమ్" అని పాత వాసనలు ఉంటాయన్నారు కదా, ఇవి పోవాలంటే ఆ పరమాత్మే గతి.

*నేను:* అంటే సృష్టి ప్రారంభంలో నున్న ఆ చతుర్ముఖుకు బ్రహ్మ కూడా పాత వాసనలు ఉంటాయన్నమాట, ముందు కల్పం నుండి వస్తూన్నవి, అయితే ఆ వేద విజ్ఞానము కోల్పోయిన తరువాత ఏమి చేసేడుట ఆయన.

*వదిన:* నువ్వు మరొక ప్రశ్న వేసేవు కదా, ఇదంతా ఎక్కడయినా ఉన్నదా అని, చెబుతాను విను.

"అజస్య నాభా వధ్యేకమర్పితమ్ యస్మిన్నిదమ్ భువనమధిశ్రితమ్

విశ్వకర్మాహ్య జనిష్ట దేవః ఆది గంధర్వః ద్వితీయః" అని తైత్తిరీయ సంహితలో ఉంది. అంటే అనిరుద్ధ వ్యూహరూపి అయిన నారాయణుని నాభిలో కమలము వికసించింది. అందులోనుండి బ్రహ్మ పుట్టేడు. హయరూపము గల హయగ్రీవుడే రెండవ రూపంగా ఆవిర్భవించేడు అని.

"ధ్రువమ్ హంసమ్" అని మాంత్రికోపనిషత్ లోను, "ఏకో హంసః భువనస్య మధ్యే..." అని ప్రారంభించి "యో బ్రహ్మాణమ్ విదధాతి పూర్వమ్..." అని శ్వేతాశ్వతర ఉపనిషత్ లోను ఆ హయగ్రీవుడు హంస రూపంలో బ్రహ్మకు వేదాలను అనుగ్రహించడం తెలుపబడినది.

తరువాత, చెప్పేనుగా, చతుర్ముఖ బ్రహ్మ కూడా ఒక జీవుడే అని. అంతకు ముందు ఎక్కువ పుణ్యాలు చేయడం వలన ఆ పదవి వచ్చిందాయనకు. ఆయనకు కూడా జ్ఞాన అపహరణము జరిగితే, ఇందాకా అనుకున్నాము కదా, ఆ పరమాత్మే గతి అని, ఆ విషయమే తెలుసుకున్నాడు. ఆ పరమాత్మనే ప్రార్థించేడు ఆయన మళ్ళీ వేద విజ్ఞానము పొందడానికి. అప్పుడు పరమాత్మ హయగ్రీవావతారము ఎత్తి పెద్దగా సకలించేడు. ఆ గర్జనకే ఆ రాక్షసులు ఆ వేద విజ్ఞానాన్ని అక్కడే వదలి పరుగు తీసేరు. ఆయన ఆ వేదాలను చతుర్ముఖ బ్రహ్మ గారికి అందించి, తరువాత ఆ రాక్షసులను అంతమొందించేడు.

ఇందాకా నువ్వు మరొక ప్రశ్న అడిగేవు, చతుర్ముఖ బ్రహ్మకు పరమాత్మ ఆ వేద విజ్ఞానాన్ని ఎలా ప్రసాదించేడు అని. ఆ బ్రహ్మ గారికి పుట్టిన తరువాత దిక్కు తోచక ఆ మున్నీటి మధ్య అటూ, ఇటూ దిక్కులు చూసి ప్రార్థిస్తే "తప తప" అని శబ్దము వినబడినదట. అంటే ఆయన ఎన్నో ఏళ్ళు తపస్సు చేస్తే ఆ హయగ్రీవుడు హంస రూపంలో వచ్చి వేద విజ్ఞానాన్ని అందించి సృష్టి కార్యాన్ని ఉద్బోధించేడు. మన హయగ్రీవ భగవానుడికి అందుకే హంస అనే నామము కూడా ఉన్నది. ఈ విషయాలు ఋగ్వేదం లో, ఘర్మ సూక్తం లో కూడా ఉన్నాయి.

*నేను:* అంటే సత్యమైన జ్ఞానము కలుగడానికైనా, ఉన్న జ్ఞానము సమంగా ఉపయోగపడడానికైనా, పోయిన జ్ఞానము తిరిగి రావడానికైనా హయగ్రీవ భగవానుడి దయ కావాలి అన్నమాట.

*వదిన:* అందుకే శ్రీమన్నారాయణుడి ద్వాదశ నామాలలో మనము ఓమ్ మధుసూదనాయ నమః అని అంటాము కదా. మధుసూదనుడంటే హయగ్రీవుడే.

*నేను:*ప్రళయ సమయంలో ఈ వేద విజ్ఞానమంతా ఏమిటవుతుందో?

*వదిన:* ప్రళయము వచ్చేముందు కలి పురుష ప్రభావము వలన రజస్తమో గుణాలు అంతటా విపరీతంగా పెరిగి పోతాయి. అంటే అప్పుడు కూడా వేద విజ్ఞానానికి ఆపద సంభవిస్తుందన్నమాట. అప్పుడు మళ్ళీ పరమాత్మ హయగ్రీవావతారము నెత్తి వేదవిజ్ఞానాన్ని కాపాడుతాడు. అంటే సృష్టి ప్రారంభములోను, చివర కూడా వేద విజ్ఞాన సంరక్షణ చేసేది హయగ్రీవావతారములోనే. ఈ వివరం మత్స్య పురాణములో కూడా ఉంది.

*నేను*: హయగ్రీవుడు అంటే గుఱ్ఱము మెడ, తల ఉన్న మనుష్య శరీరము కదా. మఱి నేను హయ గ్రీవుడనే అలాంటి గుఱ్ఱపు తల ఉన్న రాక్షసుడిని చంపడానికి పరమాత్మ ఈ అవతారము ఎత్తేడని విన్నానే.

*వదిన:* భగవద్గీత లో *"పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయచ దుష్కృతామ్ ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి"* అని కదా అన్నాడు. అవతారము ముఖ్య ప్రయోజనము సాధు పరిత్రాణము. ఇబ్బందిలో ఉన్న చతుర్ముఖ బ్రహ్మ కోసము. ఇంక అమెరికా ప్రెసిడెంట్ గారు ఏదో అంతర్జాతీయ సమావేశానికి మన దేశము వచ్చిన తరువాత ఏదో ఒక మొక్క నాటడమో, ఒక భవనము శంఖు స్థాపనమో చేయిస్తారు కదా, అలాగే అవతారమెత్తిన తరువాత రాక్షస సంహారాలు కూడా చేస్తూంటాడాయన. ఈ హయగ్రీవ భగవానుడి గురించి వివిధ పురాణాలలో కొంచెం కొంచెం భేదాలతో కనబడుతుంది.

*నేను:* అవి కొంచెం చెప్పవా!

*వదిన:* మనకా వివరాలు పూర్తిగా అక్కరలేదు కనుక క్లుప్తంగా విహంగ వీక్షణం చేద్దాము.

-వేదాలలో హయగ్రీవ భగవానుడినే హంస అని తార్క్ష్యుడు అని నామములతో పిలవడమే కాక, వేదములనందించినట్లు చెప్పబడినది కదా. శ్వేతాశ్వతర ఉపనిషత్ పేరు విన్నావు కదా. అంటే ఏమిటి అర్థం. శ్వేతాశ్వేన తరతీతి శ్వేతాశ్వతరః" అని. అంటే తెల్లని అశ్వరూపునిచే (ఈ సంసారమును) దాటు చున్నాడు అని కదా. అంటే హయగ్రీవుడే కదా మనకు సద్బుద్ధిని ఇచ్చి ఈ సంసారాన్ని దాటించేది.

అధర్వణ వేదము లో. హయగ్రీవోపనిషత్ అని కూడా ఉంది. ఇందాకా మనము విన్న మంత్రాలు ఆ ఉపనిషత్ లోవే, మొదట్లో వస్తాయి.

ఇంక పురాణాలకు వస్తే కొంచెం కొంచెం మార్పులతో ఈ హయగ్రీవుల వృత్తాంతము కనబడుతుంది. ఉదాహరణకు, ఒక కథలో దేవతలు యజ్ఞము చేస్తే, ఆ హవిర్భాగములు అచ్చటకు వచ్చిన మహావిష్ణువు ఆరగించి యోగనిద్రకు జారుకున్నాడుట. తదనంతరము ఆయనను లేపడానికి చతుర్ముఖ బ్రహ్మ ఒక కీటకాన్ని సృష్టించి పంపితే ఆ కీటకం మహావిష్ణువు అల్లెత్రాడు కొరికితే బిగించి కట్ట బడిన ఆ విల్లు మహావిష్ణువు శిరస్సుకు తగిలి, ఏదో ఇంతకు ముందు ఆయనకు గల శాపము కారణముగా, ఆ శిరస్సు వేరయి పోగా, అప్పుడు బ్రహ్మాదులందరూ కలసి మహావిష్ణువుకు హయ శిరస్సును అమర్చగా ఆయన రాక్షస సంహారము చేసేడు.

ఈ కథ కొంచెం వ్యత్యాసముతో దేవీ భాగవతములోను, స్కంధ పురాణములోను ఉన్నది.

మహాభారతములో శాంతి పర్వములో మనము ఇంతకు ముందు అనుకున్న మధు, కైటభ దమనము గురించే ఉంది. అంతేకాక గాలవ వృత్తాంతము సందర్భములో హయగ్రీవ కటాక్షము వలన గాలవుడు వేద పఠనము "క్రమ" అనే పద్ధతిలో నేర్చుకున్నట్లు ఉన్నది.

భాగవతములో కూడా ద్వితీయ స్కంధములో "సత్రే మమాసి భగవా న్ హయశీర్ష....." అని హయగ్రీవావతారము ప్రసక్తి ఉంది. అక్కడ హయగ్రీవుడు చతుర్ముఖ బ్రహ్మ యజ్ఞమునందు ఆవిర్భవించినట్లుంది. అలాగే పదకొండవ అధ్యాయంలో మధు, కైటభ సంహారము గురించి ఉన్నది. శ్రీమన్నారాయణుని అవతారాలలో హయగ్రీవావతారాన్ని కూడా చెప్పేరు భాగవతములో.

హరివంశములో హయగ్రీవుడనే రాక్షసుడిని బ్రహ్మ చే తనలాగే హయ శిరస్సు ఉన్నవానిచేతనే మరణము కలగాలని వరాన్ని పొందడం వలన పరమాత్మ హయగ్రీవునిగా జన్మించి వానిని సంహరించినట్లు ఉంది.

బ్రహ్మాండ పురాణములో మధు, కైటభ సంహారమే కాక అగస్త్యునికి ఔషదాద్రి వద్ద లలితా సహస్రాన్ని , శ్రీవిద్యనూ బోధించినట్లుంది.

అగ్ని పురాణములోను, మత్స్య పురాణములోను కూడా వేద సముద్ధరణము గురించే ఉంది. మత్స్య పురాణములో కల్పాంతములో ఆయన తిరిగి వచ్చి వేదాలను కాపాడడము కూడా చెప్పబడినది. శ్రీమద్రామాయణము లో బాల కాండలోను (అక్షయ్యమ్ మధుహంతారమ్...76 వ సర్గ, 17 వ శ్లోకము), అయోధ్యాకాండము లోను (శిరసా మధుసూదనమ్.....6 వ సర్గ, 7 వ శ్లోకము), వాలి వధ దర్భములోను

(17 వ సర్గ,49 వ శ్లోకము), యుద్ధకాండ 74 వ సర్గ, 59 వ శ్లోకము ఇలా కొన్ని చోట్ల హయగ్రీవ భగవానుని ప్రస్తావన కనబడుతుంది. విష్ణు పురాణములో పరమాత్మ అవతారాలలో ఒకటిగా హయగ్రీవావతారము ఒకటిగా చెప్పబడినది. అలాగే గరుడ పురాణములోకూడా హయగ్రీవావతారము గురించి చెప్పబడ్డది.

చతుర్ముఖ బ్రహ్మ కు ముందు పరమాత్మ హంస రూపంలో భాసించి వేద విజ్ఞానాన్ని అంద చేసేడుట. బ్రహ్మగారు దానిని కోల్పోతే హయవదనుడై దానిని తిరిగి అందిచ్చేడు.

హయగ్రీవ మంత్రాలలో, నామాలలో, అలాగే అనేక చోట్ల హంస అని వాడబడుతుంది. అందువలన హంసావతారము కూడా హయగ్రీవ స్వరూపము అపరావతారమే అని చెప్పుకోవాలనుకుంటాను. హంస, తార్క్ష్య,హయగ్రీవ, గంధర్వ, సుపర్ణ.. ఇలా అనేక పేర్లతో పిలువబడుతున్నాడు ఈయన.

హయగ్రీవుడు పరమహంస స్వరూపుడే కనుక, హంసమనే పదము హయగ్రీవావతారాన్నే తెలుపుతుందని పరకాల మఠాధీశులు శ్రీరంగనాథ యతీంద్రులు తమ హయశిర ఉపాఖ్యాన వ్యాఖ్యలో ఉపపాదించేరు.

అడియేన్

*నేను:* చతుర్ముఖ బ్రహ్మకు హంస రూపుడై పరమాత్మ వేద వాఙ్మయాన్ని అందిచ్చేడనీ, తరువాత ఆ వేదాలు కోల్పోతే హయగ్రీవావతారములో మళ్ళీ ఆ వాఙ్మయాన్ని ప్రసాదించేడనీ కదా చెబుతున్నావు. అంటే ఈ హంసావతారము, హయగ్రీవావతారము రెండూ వేర్వేరేనా! అలాగయితే నువ్వు చెబుతున్న శాస్త్ర భాగాలలో హంస అని హయగ్రీవుని గురించి చెప్పినట్లనిపిస్తోంది.

*వదిన:* ఒకే తత్త్వము యొక్క రెండు రూపాలు అని చెప్పుకోవాలేమో. ఎందుకంటే హయగ్రీవ మంత్రాలలో

"ఓమ్ నమో హంసాయ స్వాహా" అని హయగ్రీవ గాయత్రీమంత్రములో

"ఓమ్ వాగీశ్వరాయ విద్మహే హయగ్రీవాయ ధీమహి తన్నో హంస ప్రచోదయాత్" అని ఉంటుంది.

హయగ్రీవ ధ్యాన శ్లోకములో కూడా

"హయముఖమ్ ధ్యాయామి హంసాత్మకమ్" అని ఉంటుంది.

పరాశర పురాణోక్తమైన హయగ్రీవాష్టోత్తరములో నున్న హయగ్రీవ నామాలలో హంస అని కూడా ఉంది. "హంతా సంగానామ్" అని వ్యుత్పత్తి చెబుతారు, అంటే విషయ సాంగత్యమునుండి విడిపించి విజ్ఞానాన్ని అందించేవాడని.

వేదములు అనాది, సృష్టి పూర్వమునుండీ ఉన్నవి కదా, నామ, రూప వ్యాకరణము సృష్టి తరువాత కదా. అందువలన నాకనిపించేది వేదాలలో తత్త్వము ముఖ్యము, పురాణేతి హాసాలు తరువాత వచ్చినవి, వాటిలో నామ, రూపాల విశిష్ఠత కనబడుతుంది. ఆగమాలలోను, తంత్రాలలోను ఉపాసన, విధి, విధానాలకు ఎక్కువ ప్రాముఖ్యత అనుకో.

అందువలన వేద విజ్ఞానము ప్రసాదించడానికి, అజ్ఞానాధకారమును పారద్రోలడానికి అవతరించిన హంసావతారము కూడా హయగ్రీవ స్వరూపము అపరావతారమే అని చెప్పుకోవాలనుకుంటాను.

హయగ్రీవుడు పరమహంస స్వరూపుడే కనుక, హంసమనే పదము హయగ్రీవావతారాన్నే తెలుపుతుందని పరకాల మఠాధీశులు "హయగ్రీవ దివ్య పాదుకా సేవక" బిరుదాంకితులు శ్రీరంగనాథ యతీంద్రులు తమ హయశిర ఉపాఖ్యాన వ్యాఖ్యలో వివరించేరు.

ఇంతకీ నీకు ఈ హయగ్రీవావతారాన్ని మనలాంటి వాళ్ళెవరైనా కనిపెట్టేరేమోనని ఎందుకనిపించింది?

*నేను:* గ్రీకు mythology లో Centaur అని తల భాగము మనిషి, క్రింద భాగము గుఱ్ఱము ఆకారములో ఒక దేవత ఉన్నది. అలాగే Iliad అనే గేయములో Homer అనే గ్రీకు కవి హిప్పోకాంపస్ అనే పై భాగము గుఱ్ఱము, క్రింద భాగము చేప ఆకారములో ఉన్న దేవతను వర్ణిస్తాడు. ఎక్కడో విన్నాను, ఈ mythological characters ఒక దేశమునుండి మరొక చోటికి ఎగుమతి, దిగుమతులు అవుతోంటాయి అని. అందుకోసం!

*వదిన:* అనుకున్నాను, మన సనాతన శాస్త్రాలు mythology కాదు. నిత్య సత్యాలు. అందువలన కలలో కూడా మన వాఙ్మయాన్ని mythology అని అనుకోకు, అనకు. Greek mythology ఎప్పుడిది, 900-800 BC. అంతేనా. మన వేదాలు అనాది అయినవి. పోనీ, రామాయణము ఎప్పుడిది. భగవద్గీత లో మధుసూదన అన్న పదము విన్నావు కదా, భగవద్గీత పుట్టి 5000 సంవత్సరాలు దాటిందని ఆ పాశ్చాత్య చరిత్రకారులే ఒప్పుకుంటారు. అందువలన ఈ హయగ్రీవావతారాన్ని గ్రీకు mythology నుండి వచ్చిన దనడానికి ఏమాత్రమూ అవకాశము లేదు.

అయినా నీకు నమ్మకము కలగడానికి ఇంకా వివరిస్తాను విను.

మన ప్రబంధాలలోకూడా మధు కైటభ దమన వృత్తాంతము పలు మారులు వర్ణింప బడినది. "స్వామి నమ్మాళ్వార్" ఎనిమిదవ దశకములో "మావాకి యామైయాయ్" అని మావాకి అనగా "హయరూపమును పొంది" పెరుమాళ్ళను అని కీర్తించేరు.

పెరియ తిరుమొళిలో "పరిముగమాయ్ ఇశై కొళ్ వేద నూల్ ఎన్ఱు ఇవై పయన్దవనే" అనిన్నీ "పన్ను కలై నూల్ వేదప్పొరుళ్ ఎల్లామ్ పరిముగమాయ్ అరుళియ ఎమ్ పెరుమాన్" అనిన్నీ "మదుశూదా" అనిన్నీ తిరుమంగై ఆళ్వారు కీర్తించేరు.

ఇంకా పొయ్ గై ఆళ్వార్ ముదల్ తిరువందాది లోను, పేయాళ్వార్ మూన్ఱామ్ తిరువందాదిలోను (వాయ్న్ద మదుకైటబరుమ్ ) తిరుమళిశై ఆళ్వార్ నాన్ముగన్ తిరువందాది (ఇకళ్వాన్దయ్ ఇరువరైయుమ్) లోను హయగ్రీవావతార ప్రస్తుతి ఉంది.

చతుర్ముఖ బ్రహ్మకు వేదాలు అందిచ్చినట్లే, యాజ్ఞవల్క్య మహర్షికి శుక్ల యజుర్వేదాన్ని ఉపదేశించినది హయగ్రీవ భగవానుడే.

ఇదేవిధంగా పాంచ రాత్ర ఆగమాన్ని ఉపదేశించినవాడు హయగ్రీవుడే. నిర్ణయసింధు మొదలైన ధర్మ శాస్త్రాలను రచించిన "కమలాకర భట్టు" హయశీర్ష పాంచరాత్రం లో ఈ క్రింద శ్లోకాలను ప్రమాణీకరిస్తూ ఈ విషయము చెప్పేడు.

"తేనాశ్వశిరసా గత్వా వేదానాదాయ శాశ్వతాన్

ప్రయయౌ భవనమ్ దివ్యమ్ మహర్షి గణపూజితమ్

......

కియంతి పాంచరాత్రాణి త్వయా ప్రోక్తాని వై పురా

...

అద్యమ్ సమస్త తంత్రాణామ్ హయశీర్షమ్ ప్రకీర్తితమ్.

పాంచరాత్రము, సమస్త తంత్రములు హయగ్రీవుని ప్రసాదములే అని అర్థము. ఈ అంశం మహాభారతములో హయ శిర ఉపాఖ్యానములో గల "సాత్త్వతమ్ విధి మాస్థాయ ప్రాక్ సూర్య ముఖ నిఃసృతమ్" అనే శ్లోకము వలన కూడా సూచించ బడినది.

పాద్మ పురాణములో (సృష్టి ఖండం 5-1) "పురాణమ్ బ్రహ్మ శాస్త్రాణామ్....వాజిరూపేణ కేశవః" అని హయగ్రీవులే సకల శాస్త్రాలూ ప్రసాదించినట్లున్నది.

నువ్వు సంధ్యావందనం చేస్తున్నప్పుడు చదివే "దధి క్రావిణ్ణో..." అనే మంత్రంలో "దధి క్రావిణ్" అనే పదానికి విశిష్టమైన అశ్వము అంటే హయగ్రీవుడనే చెబుతారు.

ఋగ్వేదములో "రక్షోహణమ్ వాజినమ్..|ఋ 10-87-1" అన్న మంత్రానికి హయగ్రీవ పరం గానే అర్థము చెప్పాలని శ్రీ కరుణాకరస్వామి చెప్పేరు.

ఇంక సంహితల సంగతికి వస్తే హయగ్రీవుని ప్రాశస్త్యము పద్మ సంహితలోను, సనాత్కుమార సంహిత లోను, పరాశర సంహిత లోను, విశ్వామిత్ర సంహితలోను, హయ శీర్ష సంహిత లోను, నారదీయ సంహితలోను, ఈశ్వర సంహితలోను, కపింజల సంహితలోను ఇలా ఎన్నింటిలోనో చెప్పబడినది. ఆయా సంహితలలో హయగ్రీవ పూజావిధానము, హయగ్రీవమూర్తిని ఏ దిక్కులో(ఉత్తర దిక్కులో) వేంచేపుచేసి ఆరాధించాలో, ఏయే ఉపచారాలు చేయాలో వివరాలున్నాయి.

జయాఖ్య సంహితలో హయగ్రీవుని దేవేరి అయిన "వాగీశ్వరీ దేవి" ప్రస్తావన కూడా ఉంది. ఈవిడనే వాగ్దేవి అనికూడా అంటారు. ఈమెను చతుర్ముఖ బ్రహ్మ భార్య సరస్వతిగా పొరబాటు పడకూడదనుకో. ఈమె అంభృణుడనే ఋషి కుమార్తె అని చెబుతారు. ఈమె దర్శించి పలికిన సూక్తాన్ని "వాగాంభృణీ సూక్తమని"(ఋ10-125) అంటారు. దీనికి ముందు సూక్తం లోకూడా "భీభత్సూనామ్ సయుజమ్ హంసమాహుమ్..." అని హయగ్రీవ ప్రసక్తి ఉన్నది.

వైఖానస ఆగమములో మరీచి విమానార్చన కల్పము లో "హయాత్మకమ్ దేవేశమ్.." అనిన్నీ, కాశ్యప జ్ఞానకాండ లోను హయగ్రీవ ప్రశస్తి ఉన్నది.

పాంచరాత్రాగమములో హయగ్రీవుడు సంకర్షణ వ్యూహ రూపమునుండి వచ్చినట్లుంటే, మహాభారతములో అనిరుద్ధ రూపమునుండి వచ్చినట్లుందనుకో,

అలాగే పాంచరాత్రములో హయగ్రీవుడుండేది లీలావిభూతిలో "భద్రాశ్వ"మను ద్వీపములో ఉంటాడని దాని వర్ణన అదీ ఉంది.

అలాగే లక్ష్మీ తంత్రము లోను, శారదాతిలక తంత్రములోను, మేరు తంత్రములోను, యోగినీ తంత్రము లోను, పౌష్కర తంత్రములోను, శేష తంత్రము, పరశురామ కల్ప సూత్రము లోను ఇలా ఎన్నిటిలోనో హయగ్రీవ ప్రశస్తి ఉన్నది.

విష్ణుతిలక సంహితలో 250 వ అధ్యాయములో "అథ హంసమనుమ్ వక్ష్యే" అని ప్రారంభించి వివరిస్తూ "హయగ్రీవమహమ్ వందే" అని చెప్పడం వలన హయగ్రీవుడే హంస శబ్దవాచ్యుడని తెలుస్తోంది.

శాక్త దర్శనములోను, బౌద్ధములోను కూడా ఈ హయగ్రీవోపాసన అనుసరిస్తారు. అందుకే మన దేశము ఈశాన్యాన ఉండే కామరూప దేశము, తూర్పు దేశాలు ఇలా పై దేశాలలో కూడా హయగ్రీవ ఆరాధన చేసేవాళ్ళున్నారు. కామరూప దేశములో "హాజో" అనే చోట "హయగ్రీవ మాధవ భగవానుడు" ఎంత ప్రసిద్ధమంటే బౌద్ధులు లాంటి ఇతర మతస్థులు, చైనా, భూటాన్ వంటి ఇతర దేశాల వారు ఈ ఆలయాన్ని సందర్శిస్తారు.

అలాగే ఆగ్నేయాసియా దేశాలలో అవైదిక మతాలలో కూడా హయగ్రీవారాధన ఉన్నదట. ఇందుకు సాక్ష్యంగా "ఖెమ్యూ" ప్రాంతంలో హయగ్రీవ మూర్తి లభించింది. అంతేకాక హయగ్రీవారాధనా స్థలాలు థాయిలాండు లోను, మలేసియా లాంటి దేశాలలోను ఉన్నాయి.

అద్వైత మతంలో శంకరాచార్యుల వారు తమ విష్ణు సహస్రనామ భాష్యంలో "తీర్థకర" అంటే హయగ్రీవులే అని వివరించేరు.

ద్వైత మతములో మధ్వాచార్యుల వారు తమ "తంత్రసారము" నే గ్రంథములో హయగ్రీవ ప్రస్తావన చేసేరు. తరువాత అంతటి వాడయిన "వాదిరాజ" స్వామి నిత్య హయగ్రీవోపాసకులు. ఆయన అనుదినము ఉపాసనానంతరము ఉడికించిన గుగ్గిళ్ళు ఒక పళ్ళెరములో పోసి తలపై పెట్టుకుంటే హయగ్రీవుడు తెల్లని గుఱ్ఱము రూపంలో వచ్చి ఆ గుగ్గిళ్ళను ఆరగించేవాడట. ఒకసారి ఒక వ్యాపారికి ఆ హయగ్రీవుని చూడవలెనని కోరిక కలిగి వాది రాజ స్వామిని ప్రార్థించి ఎంత వద్దని చెప్పినా ఒప్పుకోకపోతే వాదిరాజ స్వామి ఒక కంటిని వెన్నముద్దతో కప్పివేసుకొని ఒక కంటితో చూడుమన్నారట. ఆ వ్యాపారి హయగ్రీవుడు గుఱ్ఱము రూపములో వచ్చినది చూచిన వ్యాపారికి ఆ కన్ను తరువాత కనబడకుండా పోయిందిట.

ఒకసారి బేలూరులో వాదిరాజుల పై పఠాన్ల దాడి సమయమున హయగ్రీవుడు అశ్వముల రూపంలో వచ్చి వారిని తరిమి కొట్టేడుట.

రాఘవేంద్ర స్వామి బృందావనములో ప్రవేశించిన తరువాత వచ్చిన అప్పణాచార్యులు ఎంతో బాధ పడుతూ రాఘవేంద్రస్వామిని స్తుతిస్తే రాఘవేంద్రులు ఆ బృందావనము నుండియే "సాక్షి హయాస్యః త్రాహి" అని ఆ హయగ్రీవ స్వామియే సాక్షి కాపాడుగాక! అంటూ బదులు ఇచ్చేడుట.

ఇలా ద్వైత మతస్థులకు కూడా ఆరాధ్య దైవము హయగ్రీవ స్వామి.

*నేను:* శంకరాచార్యుల వారు విష్ణు సహస్రనామాలలో హయగ్రీవుల గురించి ఉన్నట్లు చెప్పేరన్నావు. మనవాళ్ళు చెప్పలేదా!

*వదిన:* బాగా గుర్తు చేసేవు. అనిరుద్ధుల తరువాత నామమైన సురానందః, గోవిందః, గోవిదామ్ పతిః, మరీచిః, దమనః, హంసః, సుపర్ణః నామాలు హంసావతారాన్ని చెబుతాయి అని అంటారు. అలాగే విష్ణు సహస్రనామాలలో "గురుః", "ఉత్తరః", "గోపతిః", "గోప్తా", "జ్ఞాన గమ్యః", "పురాతనః", "శరీరభూతభృత్", "భోక్తా" అను నామములు హయగ్రీవావతారాన్నే చెబుతాయని శ్రీమాన్ పరాశర భట్టర్ వారు తన "భగవద్గుణ దర్పణము" అను విష్ణు సహస్రనామ భాష్యమునందు పరోక్షముగా సూచించేరు.

ఆయనే తన "రంగ రాజ స్తవము" లో "మధుకైటభశ్చేతి"(ఉ.భా. 52 వ శ్లోకము) అని హయగ్రీవ ప్రస్తుతి చేసేరు.

యామునుల స్తోత్ర రత్నములో "మధు జిదంఘ్రి సరోజ తత్త్వ జ్ఞాన" అన్న చోట "వేదాపహార" అన్నచోట హయగ్రీవ ప్రస్తావన ఉన్నది.

నారాయణోపనిషత్తు లో "అథ పురుషో హ వై నారాయణః అకామయత్" అని నారాయణుడు జగత్సృష్టి చేయడాన్ని తెలుపుతూ "బ్రహ్మణ్యో దేవకీపుత్రో బ్రహ్మణ్యో మధుసూదన" అని మధుసూదనుడైన హయగ్రీవుడు నారాయణుడే అని చెబుతోంది.

పెరియ వాచ్చాన్ పిళ్ళై "తన్నైత్తాళవిట్టు హయగ్రీవనాయ్, నిన్ఱాయిత్తు ఉపదేశిత్తదు సారథి యాయ్" అని హయగ్రీవ, శ్రీకృష్ణ భగవానులిద్దరికీ సామ్యాన్ని చెప్పేరు.

తత్త్వత్రయమ్ లో ఈశ్వర తత్త్వములో "ఉపేంద్ర, త్రివిక్రమ, దధిభక్త, హయగ్రీవ, నర నారాయణ, హరికృష్ణ, మత్స్య, కూర్మ, వరాహాది అవతార విశేషంగళుమ్" ...అని హయగ్రీవావతారాన్ని విభవావతారముగా వర్ణించేరు.

విష్వక్సేన సంహితలో కూడా

"కృష్ణాచ్చ మత్స్యరూపస్యాత్ మత్స్యాత్, హయశిరో యథా" అని పరమాత్మ విభవావతారముగా హయగ్రీవుని చెప్పడం జరిగింది.

*నేను:* ఆ హయగ్రీవ మూర్తులు, విగ్రహాలు ఎక్కడ ఉన్నాయో!

*వదిన:* హయగ్రీవ మూర్తులు, విగ్రహాలు ఎన్నో చోట్ల ఉన్నాయి. ఉదాహరణకు తమిళనాడులో అత్యంత ప్రాచీనమైన మన శ్రీరంగం లో కులశేఖర ప్రాకారంలో హయగ్రీవ సన్నిధిలో చూడవచ్చును. ఈ మూర్తి 2' 6'' ఎత్తులో ఱెండు చేతులలో శంఖ, చక్రాలు ధరించి ఒక అభయ హస్తము, ఒక వరద హస్తము తో సేవ కటాక్షిస్తూంటారు. చాలా మహిమాన్వితమైన సన్నిధి ఇది. అలాగే కాంచీ పురములో వరదరాజ పెరుమాళ్ కోయిల్ లోనిలపడి యున్న భంగిమలో సేవ ప్రసాదిస్తూంటారు.  ఇంతే కాక కాశీ లాంటి క్షేత్రాలలోను, బౌద్ధ ఆరామాలలోను కూడ హయగ్రీవ భగవానుని ప్రతిమలు కనబడతాయి. గుప్తుల ముందుకాలము నుండీ కూడా మనకు హయగ్రీవ భగవానుని మూర్తులు వివిధ రూపాలలో ఉన్నవి కొన్ని కాశీ, మథుర లాంటి ప్రదేశాలలో కనబడతాయి. అంతెందుకు, జర్మనీ లాంటి పై దేశాలలోకూడా హయగ్రీవ మూర్తులను మనము పురావస్తు సంగ్రహ శాలలలో చూడవచ్చును.

భగవద్రామానుజులకు కాశ్మీరములో సరస్వతీ దేవి బ్రహ్మసూత్ర భాష్య గ్రంథానికి తన ఆమోదాన్ని తెలియజేస్తూ దానికి "శ్రీభాష్యము" అని నామకరణము చేసి భగవద్రామానుజులకు సరస్వతీ దేవి తాను ఆరాధించుకొంటున్న లక్ష్మీ హయగ్రీవ మూర్తిని ఇచ్చిందట. ఆ మూర్తి రామానుజుల అవతారానంతరము తిరుక్కురుగైప్పిరాన్ పిళ్ళై వారికి సంక్రమించింది. అలా కొన్నాళ్ళకు ఆ మూర్తి మైసూరులో పరకాల మఠములో వేంచేసేరు. పరకాల మఠ జీయర్ స్వాములు హయగ్రీవోపాసకులు "హయగ్రీవ దివ్య పాదుకా సేవక" బిరుదాంకితులు. మైసూరు మహారాజ వంశస్థులు కూడా హయగ్రీవ భగవానునియందు చాల భక్తి కలవారు, ఎనలేని సేవలు చేసినవారు. ఒకసారి Rudolf Otto అను జర్మన్ విద్యాధిక పండితుడు మైసూరు వచ్చినప్పుడు కొన్ని సంఘటనల వలన హయగ్రీవ భక్తుడై, తను తిరిగి పోవునప్పుడు పరకాల మఠ జీయర్ స్వామిని హయగ్రీవ మూర్తి కోసం అర్థించేడుట. అలా పరకాల మఠ జీయర్ స్వామి వారి వద్ద ఆయన పొందిన మూర్తి అప్పటికీ University of Marburg లో ఉన్నదని అంటారు.

అలాగే వేదాంతదేశికులకు గరుడ భగవాన్ సాక్షాత్కరించి ప్రసాదించిన యోగ హయగ్రీవ మూర్తి "తిరువహీంద్ర పురము"లో దేశికుల సన్నిధిలో ఉన్నది. వేదాంత దేశికుల మూర్తి ఎక్కడుంటే అక్కడ తప్పక హయగ్రీవ పెరుమాళ్ళు ఉంటారు. వారి అనుబంధం అలాంటిది.

*నేను:* సరే, సరే, దశావతారాలలో లేదు కదా, తరువాత కనిపెట్టేరా అన్న దానికి ఇంత పెద్ద ఉపన్యాసము ఇస్తున్నావు. విశ్వాసము లేక కాదు వదినా, అలాగంటే నువ్వు నాలుగు మంచి విషయాలు చెబుతావని. మఱి యొకటి, ''అనన్యాః చింతయంతోమామ్ యేజనాః పర్యుపాసతే" అనిన్నీ, యేతు అన్య దేవతా భక్తాః యజన్తే శ్రద్ధయాన్వితమ్ తే...యజంతి అవిధి పూర్వకమ్" అనిన్నీ శ్రీకృష్ణ భగవానుడు అన్య

దేవతలను పూజించేవారు విధి పూర్వకంగా పూజించినట్లు కాదు అని చెప్పేడు కదా, అందువలన, హయగ్రీవుడన్నా శ్రీమన్నారాయణుడని ఆయన అవతారమే అని ఇప్పుడు తెలిసింది కదా, కాని మనం శ్రీమన్నారాయణునే పూజించవచ్చును కదా విద్యకు కూడా, మరి ఈ హయగ్రీవ భగవానుడిని ఎందుకు?

***వదిన:*** ఆ శ్రీమన్నారాయణుడే హయగ్రీవునిగా విభవావతార రూపము దాల్చి చతుర్ముఖ బ్రహ్మకే అజ్ఞాన నిర్మూలన చేసి, విజ్ఞానాన్ని అందించిన వాడు కదా. పరమాత్మలో అన్ని కళ్యాణ గుణాలు పర, వ్యూహ, విభవ, అర్చ, అంతర్యామి రూపాలలో ఎల్లప్పుడూ ఉన్నప్పటికీ, కొన్ని రూపాలలో కొన్ని కొన్ని గుణాలు మనకోసం సులభంగా ప్రకటమయి లభ్యమవుతాయి. హయగ్రీవావతారంలో విద్యా ప్రదానము, అజ్ఞాన నిస్తరణము, అలాగే ధన్వంతరీ అవతారములో ఆరోగ్యము నిచ్చు గుణము, నారసింహ రూపములో తత్‌క్షణ ఆపదుపశమనమూ ఇలా అన్నమాట. అందుచేత వేదాంత దేశికులు వంటి మన పూర్వాచార్యులెందరో హయగ్రీవ భగవానుడిని ఉపాసన చేసి లబ్ధి పొందేరు.

***నేను:*** అయితే ఆ హయగ్రీవ భగవానుడిని ప్రార్థించాలంటే ఏమయినా విధి, విధానాలున్నాయా!

*వదిన:* ఎందుకు లేవు. వివిధములైన ఆరాధనా విధానాలు ఆయా తంత్రాలలో చెప్పబడ్డాయి. అన్నిటిలోను బాహ్య పూజ, ఆంతరంగిక పూజ, అంగన్యాస కరన్యాసాలు, వివిధ ఉపచారాలు ఇవన్నీ ఉంటాయి. హయగ్రీవ సాలిగ్రామారాధన...

*నేను:* హయగ్రీవ సాలిగ్రామము అంటే ఎలా ఉంటుంది?

*వదిన:* రకరకాలుగా ఉండవచ్చును, అంకుశము లాంటి రూపంతో, లేదా గుఱ్ఱపు ముఖము ఆకారములో, పద్మాకారములో, నీల లోహితమైన జంబూ ఫలము ఆకారములో ఇలా వేర్వేఱు రూపాలలో ఉండవచ్చును. అనుభవజ్ఞులైన పెద్దలు గుర్తిస్తారు.

*నేను:* యంత్ర, మంత్రాలతో పూజలున్నాయా?

*వదిన:* హయగ్రీవ మంత్రాలు 1లేదా 3 లేదా 6 లేదా 10 లేదా 12 లేదా 32 ఇలా 1000 అక్షరాలున్న మంత్రాలు కూడా ఉన్నాయి. వీటిని సద్గురువుల వద్ద ఉపదేశము పొంది, సాంగంగా విధి పూర్వకంగా సాధన చేయడం అంటే జప, హోమ, తర్పణ, బ్రాహ్మణ సమారాధనాదుల తోబాటు చేస్తే దాని వలన జ్ఞానము, సమస్త

సంపదలు కలగడం, ఆ హయగ్రీవ భగవానుని అనుగ్రహం కలగడం జరుగుతుంది. ఇదంతా సదాచార్యానుగ్రహంతో చాలా శ్రద్ధతో చేయ వలసిన కార్యక్రమము.

హయగ్రీవ ముద్ర అంటే ఎడమ అఱచేతి మండపై, కుడి అఱచేతి మండనుంచి, బొటన వేళ్ళు ఱెండూ ఱెండు ప్రక్కలా గుఱ్ఱపు చెవులలా పైకి పెట్టి మిగిలిన వేళ్ళను గుఱ్ఱపు మూతిలా కొంచెం క్రిందకు వంచి ఉంచడం, దీనివలన తెలివితేటలు పెరుగుతాయి అంటారు.

ఇంక హయగ్రీవ యంత్రాల గురించి చెప్పాలంటే ఏ యంత్రానికైనా స్థాపన, ధారణ, ఉపాసన ఇవన్నీ ఉంటాయి. యంత్రమునకు ముఖ్యంగా 10 అంగాలు చెబుతారు.

మంత్రబీజ, ప్రాణబీజ, శక్తిబీజ, దృష్టిబీజ, సాధ్య, వశ్య, మంత్రగాయత్రి, భూతపంచక, దిక్పాలబీజ, ప్రాణస్థాపన అంటూ. యంత్రాన్ని (మధ్యలో ఓం కారము ఉంటుంది) నిర్మించుకొని, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనము, ఆచార్యావరణ, వాస్తుపూజ, యంత్రశుద్ధి, ప్రోక్షణ, శోధన, అంతహోమ, అభిషేక, ఉపచార సమర్పణ, స్థాపన, అర్చన, ప్రతిష్ఠ, పురశ్చరణ, తర్పణ, హోమ, బ్రాహ్మణ భోజనము అంటూ ఎన్నో కార్యాలు శాస్త్ర ప్రకారము నిర్వర్తించాలి ఈ యంత్రోపాసనలలో. నాకూ సమంగా తెలియదు అనుకో. అవన్నీ మనకు కష్టసాధ్యాలు.

*నేను:* మరి హయగ్రీవ అనుగ్రహము కావాలంటే, మన లాంటి వారికి..

*వదిన:* అందుకే మన పెద్దలు మనలాంటి వారికోసం రకరకాల వాఙ్మయాన్ని అందించేరు. అందులో దండక, కవచ, మాలామంత్ర, పంజర, స్తోత్రాదులు ముఖ్యమైనవి.

*నేను:* దండకము అంటే ఒక ప్రత్యేకమైన ఛందస్సులో(సింహ విక్రాంత, సంగ్రామ, అనంగ శేఖర, కుసుమేస్తబక మొదలగునవి) పెరుమాళ్ళను కీర్తించే స్తోత్ర విశేషమేకదా, మఱి కవచము అంటే

*వదిన:* సర్వదేశ, సర్వకాల, సర్వావస్థలలో మనలను సమస్త ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక మైన ఆపదలనుండి కాపాడుమని వివిధ ఆయుధాలతో, రూపాలతో, నామాలతో ఉన్న ఆ పెరుమాళ్ళను ప్రార్థించడం.

*నేను:* మఱి హయగ్రీవ భగవానులకు ఇవి అన్నీ లభ్యమవుతాయా?

*వదిన:* తప్పక, ఉపనిషత్ సస్వరంగా చదువ గలచిన వారికి హయగ్రీవోపనిషత్ ఉన్నది.అది కూడా మనకు అధికారము కావాలి, ఉపదేశము పొందాలి, నియమాలూ అవీని.

అలా కుదరక, చేయలేని మన లాంటి వాళ్ళకు హయగ్రీవ కవచము, దండకము, పంజరము, ప్రపత్తి, మాలామంత్రము, అష్టకము, సుప్రభాతము, ఉపాఖ్యానములే కాక అనేకములైన స్తోత్రాలున్నాయి. మన రామతీర్థ వాస్తవ్యులు, మనకు కావలసిన వారు అయిన శ్రీమాన్ తి.ప. రామానుజస్వామివారు వారు అనుగ్రహించిన "హయానన వింశతి" కూడా వీట్లలో ఒకటి.

వీటన్నిటిలోనూ వేదాంతదేశికులు హయగ్రీవ పెరుమాళ్ళను సాక్షాత్కరింప చేసుకొని ఆయన కృపను పొంది అనుగ్రహించిన "హయగ్రీవ స్తోత్రము" చాలా మహామహిమాన్వితమైనది, శక్తిమంతమైనది అని పెద్దలు చెబుతారు.

*నేను:* బాగుంది వదినా, ఆ వేదాంత దేశికులు హయగ్రీవ సాక్షాత్కారాన్ని పొందేరని అంటున్నావు, ఆ వివరాలు కొంచెం చెప్పవా

## హయగ్రీవ స్తోత్ర పూర్వ పీఠిక- వేదాంతదేశిక వైభవము

***వదిన:*** అలాగే, అసలు వేదాంత దేశికులు అంటే ఎవరో తెలుసునా!

*నేను:* తెలియదు వదినా, ఆయన photo కూడా చూచినట్లు గుర్తులేదు.

***వదిన:*** పిళ్ళై లోకాచార్యులవారు ముముక్షుప్పడిలో "మంత్రత్తిలుమ్ మంత్రత్తుక్కు ఉళ్ళీదాన వస్తువిలుమ్ మంత్రప్రదనాన ఆచార్యన్ పక్కలిలుమ్ ప్రేమమ్ కళక్క వుండానాల్ కార్యకరమావతు" అని అంటారు. అంటే ఏదయినా మంత్రము నేర్చుకున్నప్పుడు ఆ మంత్రము విషయముపైన, మంత్రాధిష్టాన దేవత పైన, ఆ మంత్రము ప్రసాదించిన ఆచార్యుల పైన ప్రేమ, గౌరవాలుండాలన్న మాట. హయగ్రీవ స్తోత్రము మంత్రసమానమైనదే.

ఇక్కడ మరొక విషయము. ఈ స్తోత్ర ప్రయోజనము పూర్తిగా పొందాలన్నా, దాని గొప్పదనాన్ని అనుభవించాలన్నా ఆ స్తోత్రాన్ని ప్రసాదించిన వేదాంత దేశికులపైన, ఆ స్తోత్రమునందు స్తుతించబడిన హయగ్రీవ పెరుమాళ్ళ గురించీ ఈ కాలపు వాళ్ళకు

విషయ వివరణ అవసరము. మా కాలంలో అయితే నువ్వు గుడ్డి నమ్మకమంటే అను, మా పెద్దలు చెప్పిన తరువాత మాకు దేనిపైనేనా పరిపూర్ణ మైన గౌరవ, విశ్వాసాలు ఉండేవి. కాని ఇప్పటి కాలం వేఱు కదా. అంతా

హేతు బద్ధంగా ఉండాలంటారు. అది పూర్తిగా తప్పని అనడం లేదు. నువ్వు ప్రశ్న అడిగినప్పుడు శైశవ సహజమైన కుతూహలం తో బాటు, హేతు విచారణ కూడా అంతర్లీనంగా ఉంటుంది. ఇది మనకు తెలిసి కావచ్చు, తెలియకుండా కూడా కావచ్చు. నేను మీ అన్నయ్యను గౌరవిస్తున్నాను అంటే దానికి కారణం ఆయన ఆస్తి, అందము అని కారణాలు చూచి కాదు, ఆయన నాకు భర్తగా పెద్దవాళ్ళు నిర్ణయించి ఆయనను గౌరవించమని చెప్పేరు కనుక. కాని ఇప్పుడు దేనికయినా కారణం తెలియాలి. అందుచేత ఆ హయగ్రీవ భగవానుని వైభవాన్ని, ఆయన స్తోత్రాన్ని కృప చేసిన వేదాంత దేశికుల గొప్పదనాన్ని తెలుసుకోక పోతే ఆ భక్తి, గౌరవాలు నిలబడవు. అందుకే నువ్వడిగిన తరువాత హయగ్రీవ పెరుమాళ్ళ వైభవాన్ని, కొంతయినా, తెలుసుకున్నాము.

ఇంక ఆ స్తోత్రాన్ని ప్రసాదించిన ఆచార్యుని గురించి తెలుసుకోవడం అవసరము, క్లుప్తంగానైనా.

వేదాంత దేశికుల అసలు పేరు "వేంకట నాథుడు". వారి తండ్రి అనంత సూరి, తల్లి తోతరంబ. వీరిది కాంచీపురము దగ్గరుండే "తూప్పుల్" అను పల్లెటూరు.

*నేను:* మనమూ తూప్పుల్ నాడు వాళ్ళమే కదా,

*వదిన:* అవును. మన పూర్వీకులూ ఆ ప్రాంతము వారే. ఆరోజులలో మన సిద్ధాంత ప్రచార, సముద్ధరణాలకు ఇటు ప్రక్క వచ్చేసేరు.

వీరు వడగలై సంప్రదాయము వారు. ఆ దంపతులకు పిల్లలు లేక పిల్లల కొఱకు తిరుమల వెళ్ళి శ్రీ వేంకటేశ్వరుని దర్శనము చేసుకొని పుత్ర సంతానము కోసం ప్రార్థించి, ఆ రాత్రి అక్కడ విశ్రమించేరట.

ఆ రాత్రి తోతరంబ కలలో శ్రీనివాసుడు చిన్నపిల్లవాని రూపములో కనబడి ఒక బంగరు గంటను తోతరంబకు ఇచ్చేడట. ఆవిడ ఆ గంటను మ్రింగి వేసి, గర్భవతి అయి వేంకటనాథునికి తల్లి అయింది. అంటే వేంకట నాథుడు తిరుమల వెంకన్న "గంట" అవతారము. అందుకే ఇప్పటికీ తిరుమల శ్రీనివాసుని సన్నిధిలో గంట ఉండదు, బయట హాలులో ఉన్న పెద్ద గంటనే తిరువారాధన సమయంలోనూ అప్పుడూ ఉపయోగిస్తూంటారు.

ఈయన వరదరాజ స్వామి జన్మ నక్షత్రమైన హస్తా నక్షత్రమున అవని మాసములో క్రీ.శ. 1268 లో జన్మించేరు. వీరిది విశ్వామిత్ర గోత్రము. ఈ వేంకట నాథుని మేనమామ, తరువాత ఆయన ఆచార్యుడు అయిన అప్పుళ్ళార్ శ్రీభాష్య వివరణ గ్రంథమైన "శ్రుత ప్రకాశిక" ను పలికిన నడాదూర్ అమ్మాళ్ శిష్యులు. "పలికిన" అని ఎందుకు

అన్నానంటే ఆయన కాల క్షేప రూపంలో చెప్పిన వ్యాఖ్యానాన్ని గ్రంథస్థము చేసిన వారు "సుదర్శన సూరి" అని నడాదూర్ అమ్మాళ్ శిష్యులు.

ఒకసారి అప్పుళ్ళార్ తన మేనల్లుడైన 5 ఏళ్ళ వేంకట నాథుడిని నడాదూర్ అమ్మాళ్ వద్దకు తీసుకొని వెళ్ళేరు. ఆ సమయంలో ఆయన శ్రీభాష్యంకాలక్షేపం లో ఉన్నారు. వీరిని చూచి, పలకరించి, మాటలాడి, పిల్లవానికి పండూ అదీ ఇచ్చి తరువాత మళ్ళీ కాలక్షేపం ప్రారంభిద్దామని తను అంతకుముందు కాలక్షేపం ఎక్కడ ఆపేనో తెలియక తన శిష్యులను అడిగేరుట.అప్పుడు వేంకట నాథుడు తనకు శ్రీభాష్య పరిచయం ఏమీ లేకున్నా నడాదూర్ అమ్మాళ్ కు ఎక్కడ ఆపేరో సమంగా సమాధానము చెప్పేడుట. అప్పుడు అతనిని నడాదూర్ అమ్మాళ్ ఆశీర్వదించి మన సంప్రదాయ పరిరక్షణకు రామానుజుల తరువాత అంతటి వాడవుతాడని ఆశీర్వదించేరట.

ఆయన తన 20 వ ఏటికి సకల శాస్త్రాలూ నేర్చుకొన్నాడు. ఆయనకు అప్పుళ్ళార్ "గరుడ మంత్రాన్ని" ఉపదేశించేరు. తన 21 వ ఏట అప్పుళ్ళార్ పరమపదించిన తరువాత  వేంకట నాథుడు కాంచీ పురానికి దగ్గరలో ఉన్న తిరువహీంద్ర పురము వద్ద నున్న చిన్న కొండ పైకి ఎక్కి కొన్ని రోజులు నిద్రాహారాలు మాని గరుడ మంత్ర జపము చేసేడు.

అప్పుడు వేంకట నాథుని భక్తి, శ్రద్ధలకు మెచ్చి గరుడ భగవానుడు ప్రత్యక్షమై హయగ్రీవ మంత్రాన్ని ఉపదేశించి, యోగ హయగ్రీవ మూర్తి విగ్రహాన్ని కూడా ప్రసాదించి వేంకటనాథునికి హయగ్రీవుని ఉపాసించమని చెప్పేరు.

అప్పుడు వేంకట నాథుడు అత్యంత భక్తితో ఆ హయగ్రీవ మంత్ర జపాన్ని ఆ కొండపైననే చేసేడు. అతడి భక్తి, శ్రద్ధలకు సంతసించి హయగ్రీవుడు ప్రత్యక్షమవగా, ఆ గుఱ్ఱము నోటినుండి ద్రవము (ముఖామృతము) వేంకటనాథుని నోటిలో పడినది. అప్పటికే అన్ని శాస్త్రాలు పుక్కిట పుచ్చుకొనియున్న వేంకట నాథుడు అసమాన పాండిత్యమును పొంది ఆ హయగ్రీవుడిని అప్పుడు స్తోత్రము చేసేడు. ఆ స్తోత్రమే మనము చదువుకొన బోయే హయగ్రీవ స్తోత్రము.

*నేను:* అందుకే ఆచార్యుల తళియ ప్రసాదమని మనవారు ఆచార్యుల ఎంగిలి శిష్యులకు ఇచ్చే సంప్రదాయాన్ని ఏర్పాటు చేసేరు కాబోలు.

మఱి ఆయనను వేదాంత దేశికులు అని ఎందుకు అంటారు.

***వదిన:*** వేదాంత దేశికులనేది సాక్షాత్తూ శ్రీనివాసులు ఆయనకు ప్రసాదించిన బిరుదము.

ఈయన మహా పండితుడయినా అతి నిరాడంబరమయిన జీవనము నడుపుతూ భిక్ష వృత్తితో పొట్టపోసుకొని జీవించేవారు. కర్ణాటక దేశములో హరిహర రాయలు బుక్కరాయలు చేత విజయనగర సామ్రాజ్య స్థాపనము చేయించిన విద్యారణ్యస్వామి ఈయనకు స్నేహితులు. ఈయన కడు బీద జీవితము గడుపు తున్నారని బాధపడి ఎన్నోసార్లు వీరిని విజయనగర సంస్థానానికి ఆహ్వానించేరుట. కాని వేంకటనాథులు ఆ ఆహ్వానము తిరస్కరించి వైరాగ్య పంచకమను శ్లోక పంచకము విద్యారణ్యులకు పంపించిరట. అలాగే కొంతమంది అభిమానులు ఆయనకు సహాయము చేద్దామని ఆయన భిక్షలో కొన్ని బంగరు నాణ్యములు వేయగా, ఆతని ఇల్లాలు కనకవల్లి, ఆవిడ పేరు కనకవల్లి కాని బహుదొడ్డ ఇల్లాలు తన జీవితములో బంగారాన్ని చూచి ఎఱుగదు, ఆమె వేంకటనాథుని వద్దకు వచ్చి బియ్యములో ఏవో రాళ్ళ లాంటివి మెరుస్తూ ఉన్నాయి అని చెబితే వేంకటనాథులు ఆ బంగరు నాణెములు ముట్టుకొనకుండా దర్భతో వేఱు చేసి పారవేయించేరట.

కాని, ఎవరో పిల్లవాడు తనకు పెళ్ళిచేసుకొనుటకు ద్రవ్యము లేదని చెబితే, కాంచీపురములో వరదరాజ పెరుమాళ్ కోయిల్ కు వస్తే అమ్మవారి చేత ఇప్పిస్తానని చెప్పి అమ్మవారి సన్నిధిలో "శ్రీస్తుతి" అనే స్తోత్రము తో అమ్మవారిని స్తోత్రము చేస్తే అమ్మ కరుణించి బంగరు నాణెముల వర్షము కురిపించినదట. వాటిని తను ముట్టుకొనకుండా ఆ పిల్లవానిని తీసుకొనమని చెప్పేరట వేంకట నాథులు.

***నేను:*** ఇలా ఇంకా ఏమయినా వ్రాసేరా!

***వదిన:*** ఈయన రచించినంత వాఙ్మయము ద్రావిడ, సంస్కృతాలలో మరెవ్వరూ రచించలేదేమో. ఈయన సంస్కృతంలో రచించిన స్తోత్రాలు 29, కావ్యాలు 5, రహస్య గ్రంథాలు 32, వేదాంత గ్రంథాలు 11, వ్యాఖ్యాన గ్రంథాలు 10, అనుష్ఠాన గ్రంథాలు 4, ఇతర గ్రంథాలు 13, తమిళ ప్రబంధాలు 24. ఇలా ఈయన శతాధిక గ్రంథ కర్త. ఒకరోజు రాత్రి పట్టుబట్టి పాదుకా సహస్రము అని రంగనాథ పాదుకలపై 1000 శ్లోకముల గ్రంథమును పూర్తి చేసిన వారు. తిరుమల వెళ్ళి దయా శతకమను శతకమును దయాస్వరూపిణి అయిన అమ్మపై చెప్పినవారు. అప్పుడే శ్రీనివాసుడు వీరికి వేదాంతదేశిక బిరుద ప్రదానాన్ని చేసేడుట.

***నేను:*** వేదాంత దేశికులంటే వేదాంత గ్రంథాలు తన శిష్యులకు చెప్పేవారనా, ఇంకేమయినా చేసేరా?

*వదిన:* ఈయన నూటికి పైగా శ్రీభాష్యము కాలక్షేపములు నిర్వహించేరట. 1311 లో శ్రీరంగాన్ని ముస్లిముల ముట్టడించి వేలాది వైష్ణవులను ఊచకోత కోసినప్పుడు నంబెరుమాళ్ళను రక్షించుకోవడం కోసము ఆయనను తీసికొని పిళ్ళై లోకాచార్యులవారు శ్రీరంగమును విడచి వెళ్ళగా, శ్రుత ప్రకాశికా గ్రంథాన్ని రక్షించుకోడం కోసము వేదాంత దేశికులు శవాల గుట్టల క్రింద నిద్రాహారాలు లేకుండా ఆ శ్రుతప్రకాశికాగ్రంథాన్ని తన గుండెల క్రింద దాచుకొని కొన్ని రోజులు పడుకున్నారుట. తరువాత అక్కడ నుండి కర్ణాటకకు వచ్చి ఆ శ్రుతప్రకాశికను తన శిష్యులచే తిరిగి వ్రాయించడం, ఎంతో మంది శిష్యులకు శ్రుతప్రకాశికా సహిత శ్రీభాష్యమును కాలక్షేపరూపముగా అనుగ్రహించడం చేసేరు. ఇప్పుడు శ్రుతప్రకాశికా సహిత శ్రీభాష్యమును ఎవరయినా సేవించ గలుగుతున్నారంటే అది ఆయన అనుగ్రహము వలననే.

*నేను:* మఱి ఆయనను "సర్వతంత్ర స్వతంత్ర" అని ఎందుకు అంటారు?

*వదిన:* ఆయనకు రాని విద్య లేదు. ఒకసారి తిరువహీంద్రపురములో ఒక మేస్త్రి తో వివాదము వచ్చి అసమానముగా ఉన్న ఇటుకలతో తానే ఎంతో చక్కగా నుయ్యి కట్టేరు. ఆ నూతిని మనమింకా చూడవచ్చును.అలాగే ఒక శిల్పితో అతడు తయారు చేసిన పీఠానికి తగినట్లు తన మూర్తిని తయారుచేస్తానని తానే తన మూర్తిని తయారుచేసుకున్నారట. దానిని ఆ పీఠముపై ప్రతిష్ఠించడానికి ఆ మూర్తిని చెక్కబోతే స్వామి వేదాంతదేశికుల శరీరమునుండి రక్తము వచ్చినదట. ఈ విగ్రహము ఇప్పటికీ తిరువహీంద్రపురములో ఉన్నది. ఇంకొకసారి, తనకు కావలసిన పాదరక్షలు తానే తయారు చేసుకొన్నారు.

అన్ని విద్యలనూ, అన్ని కళలనూ ఒకరి సహాయము అక్కరలేకుండా ప్రదర్శించిన మహానుభావులు. ఈయన సన్నిధిని తనకు దగ్గరగా శ్రీరంగనాయకి తన ప్రాకారములోనే కట్టించుకొన్నదట. అట్టి మర్యాద మరే ఆచార్యులకు జరగలేదు. సాక్షాత్తూ శ్రీరంగనాథునిచే "రామానుజ దయాపాత్రునిగా" పిలువబడినవారు.

వీరి కుమారులైన కుమార వరదాచార్యులు వీరిపై చేసిన తనియ శ్లోకము

"శ్రీమాన్ వేంకటనాథార్యః కవితార్కిక కేసరీ

వేదాంతాచార్య వర్యో మే సన్నిధత్తామ్ సదా హృది"

వీరిపై పరకాల మఠ జీయర్ స్వామి వారి తనియన్

"రామానుజ దయాపాత్రమ్ జ్ఞాన వైరాగ్య భూషణమ్

శ్రీమత్ వేంకట నాథార్యమ్ వందే వేదాంత దేశికమ్."

వీరు 7 రోజుల శ్రీరంగములో సమస్త దర్శనములవారితో, మతములతో వారితో వాదమని చేసి విశిష్టాద్వైత సాంప్రదాయ ప్రతిష్ఠాపన చేసేరు. అప్పుడే ఆయన "శత దూషిణీ అను గ్రంథాన్ని వివిధ సంప్రదాయాలను ఖండిస్తూ చెప్పేరు. అందుకే ఆయనకు "కవితార్కిక కేసరీ" అను బిరుదము కలిగినది. ఇప్పుడు చెప్పిన గ్రంథాలే కాక అధికరణ, దర్పణ, తత్త్వ శిఖామణి, మధుర కవి హృదయము, నిగమ పరిపాలనము ఇలా ఎన్నో గ్రంథాలు ఆయన రచించినవి ఇప్పుడు అలభ్యములై పోయినాయి. ఇలా అలభ్యములైన గ్రంథాలతో కలిపితే ఆయన గ్రంథాల సంఖ్య 124 కు పైచిలుకే.

*నేను*:వేదాంత దేశికులు వడగల్లై ఆచార్యులు అన్నావు కదా! తెన్నాచార్య సంప్రదాయము వారు ఆయన గ్రంథములను సేవించ వచ్చా!

***వదిన:*** తెన్నాచార్య సంప్రదాయానికి మూలమైన పిళ్ళై లోకాచార్యుల వారు అంటే వేదాంత దేశికులకు అత్యంత గౌరవము. వారి శ్రీసూక్తులను వేదాంత దేశికులు తన గ్రంథాలలో కనీసము 32 సార్లు ప్రస్తావించేరు.

అలాగే తెన్నాచార్య సంప్రదాయములో ప్రథమంగా మనము చదువుకొనే "శ్రీశైలేశ దయాపాత్రమ్" అనే తనియన్ మణవాళ మహామునులది కదా, ఆయనకు వేదాంత దేశికులంటే చాలా పూజ్య భావముండేది. ఆయన వేదాంత దేశకులను "అభియుక్తర్" అంటే మహానుభావులు/ గొప్పవారు అని సంబోధించేవారు. తన "ఉపదేశ రత్నమాల" లో కూడా దేశికులను కీర్తించేరు కూడా.

పిళ్ళై లోకాచార్యులవారికి 82 ఏళ్ళ వయస్సునాటికి దేశికులకు సుమారుగా 23 ఏళ్ళు. లోకాచార్యులవారు దేశికుల ప్రతిభా, పాటవాలు తెలుసుకొని దేశికులను శ్రీరంగానికి ఆహ్వానించేరుట. వారిరువురూ కలసి సుమారు 22 ఏళ్ళు శ్రీరంగములో ముస్లిముల ముట్టడి వరకూ కలసి యున్నారు.

శ్రీరంగముపై "మాలిక్ కాఫుర్" మొదలైన ముస్లిముల దండయాత్ర సందర్భములో అప్పుడు అక్కడ ఉన్న ఆచార్య వర్గములో పిళ్ళై లోకాచార్యులు అందరి కంటే పెద్దవారు. దేశికులు అందరికంటే చిన్నవారు. అప్పుడు వారందరూ చర్చించుకొని తాము మూడు వర్గాలుగా ఏర్పడ్డారుట. పిళ్ళై లోకాచార్యులు కొంతమందితో నంబెరుమాళ్ ను తీసుకొని నైఋతి దిక్కుగా ప్రయాణానికి సిద్ధమైనారు. శ్రుత ప్రకాశికను వ్రాసిన సుదర్శన సూరి కొంతమందితో తత్‌క్షణము శ్రీరంగము పెరుమాళ్ళకు ఎదురుగా గోడనుకట్టి, దానిముందు వేరొక విగ్రహమును ముస్లిములను మోసగించుటకు ఉంచి, రంగనాయకిని దగ్గరలోనున్న నూతిలో వేంచేపు చేసి

తాము రంగనాథుని కోవెలకు కాపుగా ఉన్నారు. అప్పుడే సుమారుగా 12,000 మంది వైష్ణవులను వరాహ స్వామి సన్నిధి ప్రాంతంలో ముస్లిములు ఊచకోత కోసేసరు. అందరికంటే చిన్నవారు గొప్ప పండితులు కనుక దేశికులను పిళ్ళై లోకాచార్యులవారు ఉత్తరంగా వెళ్ళి సంప్రదాయ గ్రంథములతో వెళ్ళి విశిష్టాద్వైత పరిరక్షణ చేయుమని ఆదేశించేరు. అప్పుడు సుదర్శన సూరి తమ అమ్మగారి వద్ద దాచిన శ్రుత ప్రకాశికా గ్రంథాన్ని తమ పిల్లలిద్దరినీ కూడా ఆయనకు అప్పచెప్పి ఆ రక్షణ బాధ్యత వారిపై ఉంచేరు. అప్పుడు దేశికులు శవాల క్రింద పిల్లలతో దాగుకొని, అనేక ప్రమాదాలను ఎదుర్కొని సత్యమంగళము అడవులలో గూఢముగా ప్రయాణించి కర్ణాటక రాష్ట్రాన్ని చేరిన సంగతి మనము ఇంతకు ముందు అనుకున్నదే.

మణవాళమహాములు శ్రీభాష్యము సేవించిన కిడాంబి నాయనార్ వేదాంత దేశికుల ఆచార్యులు, ఆయన మేనమామ అయిన కిడాంబి అప్పుళ్ళార్ వంశము వారే.

తెన్నాచార్య సంప్రదాయములో మహా మహులు ఇప్పటికీ కంచి వరదుని జరిగే గరుడ సేవలో ముఖ్యమైన దొడ్డయాచార్య సేవకు కారణ భూతులు అయిన దొడ్డయాచార్య స్వామి "శ్రీదేశిక వైభవ ప్రకాశిక" అని దేశికుల గురించి, దేశికుల "శతదూషిణి" అనే గ్రంథము పై "ఛండామారుతమ్" అనే గ్రంథము వ్రాసేరు. ఆయన శిష్యులైన "శ్రీనివాసాచార్యుల వారు, తెన్నాచార్య సంప్రదాయములో పేరుపొందిన వారు వ్రాసిన "యతీంద్ర మత దీపిక" పేరు విన్నావు కదా!

*నేను:* అవును. మామయ్య దానిని తెలుగులో అనువదించేరు కూడా. మన సంప్రదాయానికి guide లాంటిది అని చెబుతారు

*వదిన:* అవును. దానిలో ఆయన గ్రంథ ప్రారంభం మంగళ శ్లోకాలలో మొదటిది తనకు స్వప్నములో సాక్షాత్కరించిన శ్రీనివాసుని గురించి, పూర్వాచార్యుల గురించీ అయితే రెండవ శ్లోకములో రామానుజులకు, దేశికులకు, తన ఆచార్యులైన దొడ్డయాచార్యులకు నమస్సులు అని పలికేరు.

"యతీశ్వరమ్ ప్రణమ్యాహమ్ వేదాంతార్యమ్ మహాగురుమ్" అని.

ఎందుకు చెబుతున్నానంటే ఆ పెద్ద వారికి ఎప్పుడూ ఒకరిపై ఎక్కడికి గౌరవ భావమే తప్ప విప్రతిపత్తి లేదు.

మన సంప్రదాయానికి మహనీయమైన సేవ చేసి మన శ్రీరంగనాథుడినీ, మన శ్రీభాష్యాన్ని మనకు అందిచ్చిన మన వైష్ణవ సంప్రదాయానికి రెండు కళ్ళు "పిళ్ళై లోకాచార్యులు", "వేదాంత దేశికులు".

అంతటి మహానుభావుల గురించి సుతి మాత్రమైనా అగౌరవము చూపించడం, వారు మన ఉజ్జీవనానికి అనుగ్రహించిన మహద్గ్రంథాలను ఆదరము చూపించకపోవడం "అసహ్యాపచారము"వుతుంది.

ఇలా మన సంప్రదాయానికి అసమానమైన సేవ చేసిన వేదాంత దేశికులు తన 101 సంవత్సరములో ఆచార్యతిరువడి పొందేరు.

*నేను:* నిజంగా మహానుభావులే వదినా!

*వదిన:* ఇంక మనము స్తోత్రము లోకి వెళదామా!

*నేను:* తప్పక, కాని వెళ్ళేముందు నేను మీ ఇంట్లోకి వస్తున్నప్పుడు వినిపించేయే, ఆ మూడు మంత్రాలకూ అర్థం చెప్పవా! అర్థం మాత్రం చెప్పు చాలు, వివరణ అక్కరలేదు.

*వదిన:* అలాగే, ఇంతకు ముందు అనుకున్నట్లు ఇవి హయగ్రీవోపనిషత్ లో మంత్రాలు. అనుష్టుప్ ఛందస్సులో స్తోత్ర రూపంలో ఉంటాయి కనుక మనం శుచిగా ఉన్నప్పుడు చదువుకోవచ్చు.

"విశ్వోత్తీర్ణ స్వరూపాయ చిన్మయానంద రూపిణే

తుభ్యమ్ నమో హయగ్రీవ విద్యారాజాయ విష్ణవే"

విశ్వ విలక్షణమైన స్వరూపము కలవాడవు, జ్ఞానానంద రూపుడవు, విద్యలకు ప్రభువు అయిన ఓ హయగ్రీవా! నీకు నమస్కారము.

"ఋగ్యజుస్సామరూపాయ వేదాహరణ కర్మణే

ప్రణవోద్గీథ వపుషే మహాశ్వశిరసే నమః"

ఋక్, యజుస్సామములనే మూడు వేదాలను స్వరూపముగా కలవాడు, వేదాలను వెదకి తెచ్చినవాడు, ఓంకార నాద స్వరూపుడు, గొప్ప అశ్వ శిరస్సు కలవాడైన హయగ్రీవునకు నమస్కారము.

"ఉద్గీథ ప్రణవోద్గీథ సర్వ వాగీశ్వరేశ్వర

సర్వ వేదమయాచింత్య సర్వమ్ బోధయ బోధయ"

ఉద్గీథ, ప్రణవోద్గీథ స్వరూపుడవు, సమస్త విద్యలకు అధిపతివి, సమస్త వేదములును స్వరూపముగా కలవాడవు, భావించడానికి సాధ్యము కానివాడవు అయిన హయగ్రీవా! నాకు అన్ని విద్యలను బోధించుము.

*నేను:* ఇంక మనము స్తోత్రములోకి వెళదాము వదినా!

## శ్రీహయగ్రీవ స్తోత్రము-అర్థ, తాత్పర్య, వివరణములు

*వదిన:* ముందు వేదాంత దేశికుల ప్రార్థనా శ్లోకంతో ప్రారంభించుకుందాము.

"శ్రీమాన్ వేంకట నాథార్యః కవితార్కిక కేసరీ

వేదాంతాచార్య వర్యో మే సన్నిధత్తామ్ సదా హృది"

కవిత్వమునందు, తర్కమునందు కూడ సింహమువలె గొప్పవారు, వేదాంతాచార్యులు, శ్రీమాన్ (భగవత్కైంకర్య సంపద మెండుగా నున్నవారు) అయిన వేంకటనాథులు నా హృదయమునందు ఎల్లప్పుడు నెలకొని ఉందురు గాక.

ఈ తనియన్ శ్లోకము దేశికుల కుమారుడైన కుమార వరదాచార్యులు ప్రసాదించినది.

ఇందులో దేశికుల గొప్ప గుణములు చెప్పబడినవి, ఆయన "వాల్మీకేః ముని సింహస్య" అని వాల్మీకి ముని సింహమన్నట్లు కవితార్కిక సింహము. వీరు తన కవిత్వముతో, తర్క పటిమతో, ఇతర మతస్థులను జయించి విశిష్టాద్వైత సిద్ధాంతమును ప్రతిపాదించినవారు, తన అనేకులైన తన శిష్య వర్గమునకు వేదాంత గ్రంథములను బోధించిన గొప్ప ఆచార్యులు, సంతత భగవత్కైంకర్యైక నిష్ఠులు అయిన వారు. అట్టి వేంకటనాథులు నా హృదయమున ఎప్పుడూ వేంచేసి యుండుగాక అని ప్రార్థించుచున్నారు.

తరువాత హయగ్రీవ ధ్యాన శ్లోకము.

1."జ్ఞానానందమయమ్ దేవమ్ నిర్మల స్ఫటికాకృతిమ్

ఆధారమ్ సర్వ విద్యానామ్ హయగ్రీవముపాస్మహే"

*జ్ఞాన+ఆనంద మయః జ్ఞానానంద స్వరూపుడును*

*నిర్మల: దోషము లేని*

*స్ఫటికాకృతిమ్: స్ఫటికము వలె స్వచ్ఛమైన ఆకారమును కలిగిన వాడు*

*సర్వ విద్యానామ్: అన్ని విద్యలకు*

*ఆధారమ్: ఆధారమైన వాడు (అయిన)*

*హయగ్రీవమ్ దేవమ్: హయగ్రీవ భగవానుని*

*ఉపాస్మహే: ఉపాసించుచున్నాము.*

జ్ఞానానందములను స్వరూప నిరూపకములుగా కలవాడు, ఏ దోషములు లేనివాడు, స్ఫటికము వలె స్వచ్ఛమయిన ఆకారము కలిగిన వాడు

సమస్త విద్యలకు ఆధారమైన వాడు అయిన హయగ్రీవ భగవానుని ధ్యానించుచున్నాము.

ఈ శ్లోకము దేశిక కృతము కాదని కొందఱు, దేశికులు వ్రాసినదేనని కొందఱు చెబుతారు.

అందుకే 32 శ్లోకాల హయగ్రీవ స్తోత్రములో దీనిని చేర్చక ఫలశృతి శ్లోకాన్ని చేర్చి చెప్పేవాళ్ళు కొంతమంది అయితే, అలా కాక దీనిని చేర్చి, ఫలశృతి శ్లోకాన్ని వేఱుగా చెప్పేవారు కొంతమంది. ఎలాగయినా, హయగ్రీవ స్తోత్రము ముందు శ్లోకముగా ఈ శ్లోకము బాగా ప్రాచుర్యాన్ని చెందినదే.

***నేను:*** ఈ 32 లెక్క ఏమిటి, ఇక్కడ "మయట్" కి అర్థము ఎలా చెప్పుకోవాలి, అన్ని విద్యలకు ఒకటే ఆధారము అనడం ఎలా సాధ్యము, అసలు అన్ని విద్యలు అప్పటికే నేర్చుకున్న దేశికులు ఆత్మనే పదిలో పరులకు కాక తమ కోసం ధ్యానిస్తున్నట్లు ఉంది కదా, దీనికి విశేషార్థాలు ఏమయినా ఉన్నాయా!

***వదిన:*** ఈ శ్లోకము పరోక్షముగా హయగ్రీవ అవతార ప్రయోజనాన్ని సూచిస్తుంది.

ఏ అవతారానికైనా ఏమిటి ప్రయోజనము. "పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయచ దుష్కృతామ్ ధర్మ సంస్థాపనార్థాయ" అని కదా చెబుతుంది భగవద్గీత.

హయగ్రీవ అవతార సందర్భము ఏమిటి? సాధువైన చతుర్ముఖ బ్రహ్మ వేద జ్ఞానము కోలుపోయి శోకములో ఉన్నాడు, ఆయనకు జ్ఞానాన్నిచ్చి, శోకము పోగొట్టాలి. అందుకు "జ్ఞానానందమయమ్" అన్నారు, హయగ్రీవుల

కృప ఉంటే మఱి అజ్ఞానము, శోకము ఉండవు. ఇంక "వినాశాయచ దుష్కృతామ్" అంటే అనిరుద్ధ వ్యూహము నుండి బయల్వెడలిన హయగ్రీవుడు అనిరుద్ధవ్యూహము నందు ప్రకటమయే తన దివ్యమైన తేజో, శక్తులతో రజస్తమో గుణాలకు ప్రతీకలైన మధుకైటభులను సంహరించేడు, అందుకే "దేవమ్" అన్నారు. తరువాత ధర్మ సంస్థాపనము అంటే వేదవిజ్ఞానము పునః ప్రతిష్ఠాపనము, అందుకే "ఆధారమ్ సర్వ విద్యానామ్". అసలు ఈ ఇబ్బంది ఎందుకు వచ్చింది, చతుర్ముఖ బ్రహ్మ రజస్తమో గుణాల వలన, అంటే నైర్మల్యము లేక. అందువలన శుద్ధ సత్త్వ స్వరూపుడైన "హయగ్రీవ భగవానుడు" నిర్మల స్ఫటికము వలె సత్త్వగుణాన్ని ప్రసాదిస్తాడని చెప్పడానికి "నిర్మల స్ఫటికాకృతిమ్" అని అన్నారు.

ఆయన అనుగ్రహానికి ఏం చెయ్యాలి అంటే "ఉపాస్మహే" అంటే ధ్యానిస్తే చాలు, మఱేమీ అక్కరలేదు.

*నేను:* బాగుంది వదినా,

*వదిన:* 32 శ్లోకాలకు ఏమయినా ప్రత్యేకత ఉన్నదా అని కదా అడిగేవు. దేశికులు చాలా చోట్ల ఈ 32 సంఖ్యకు ప్రాధాన్యత ఇచ్చినట్లు కనబడుతుంది. ఉదాహరణకు

ఆయన రచించిన మహద్గ్రంథము రహత్రయ సారము విభాగాలు 32.

ఆయన రచించిన పాదుకా సహస్ర పద్ధతులు 32

వారు అనుగ్రహించిన రహస్యములు 32

దీనికి ఒక ముఖ్యమైన కారణము బ్రహ్మ విద్యల సంఖ్య 32.

అంతేకాక వేదములు(4), ఉపవేదములు(4), వేదాంగాలు(6), పురాణములు(18) మొత్తము కలిపి 32 అవుతాయి, అదికూడా కారణము కావచ్చునేమో.

దేశికులు మహా పండితులు అవడం వలన ఆయనసమస్త ఉపనిషదర్థాలనూ పొందుపరచి రచనలు చేస్తారు. అన్ని విషయాలూ తెలుసుకుందికి నాకూ, నీకూ కూడా సామర్థ్యము సరిపోదు. కాని వీలయినంత ప్రయత్నము చేద్దాము.

పరమాత్మ జ్ఞాన స్వరూపుడు, జ్ఞాన గుణకుడు కూడా. అంటే జ్ఞానము స్వరూపముగా కలవాడు, జ్ఞానము గుణముగా కలవాడు కూడా. దీపము, కాంతి లా. అందువలన ఇక్కడ జ్ఞానానంద మయమ్ అన్నప్పుడు,

పరమాత్మ జ్ఞానము, ఆనందము స్వరూపముగా కలవాడు, జ్ఞాన, ఆనంద గుణాలతో నిండి యున్నవాడు కూడ అని అర్థము చేసుకోవచ్చును.

కాని "ప్రాచుర్యార్థే మయట్" అనే అర్థములో (అంటే "కూర ఉప్పుమయం" అన్నప్పుడు కూర అంతా ఉప్పు ఉండి కూరకు ఉప్పు గుణముగా ఉన్నట్లు) గుణములుగా అర్థం చేసుకోవడం సమంజసముగా ఉంటుంది.

పరమాత్మ స్వరూపాన్ని నిరూపించే గుణాలను స్వరూప నిరూపక గుణాలు అంటారు. అంటే DNA లా లేదా వేలిముద్ర లా అనుకోవచ్చు. ఇంక పరమాత్మ స్వరూప నిరూపక గుణాలు ఏమిటో చూద్దాము.

ఉపనిషత్ "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" అని సత్యము, జ్ఞానము, అనంతము గుణాలు గా కలిగినది పరబ్రహ్మ అని చెబుతుంది, అలాగే పరబ్రహ్మ అంటే జన్మాద్యస్య యతః" అని ఈ సృష్టి, స్థితి, లయాదులు ఎవరి వలన కలుగుతున్నాయో అది పరబ్రహ్మ అని "బ్రహ్మ సూత్రము" లో చెబుతారు. ఈ విషయమే"యతోవా ఇమాని భూతాని జాయంతి..." అంటూ ఉపనిషత్తు చెబుతుంది.

ఆ పరబ్రహ్మయే ఈ సృష్టికంతటికీ మొదట ఉన్నదనీ,"సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అంటూ ఈ సృష్టి కంతటికీ మూలము ఆయనేనని చెబుతుంది కూడా ఉపనిషత్. "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానమ్" అని ఆ మూల కారణమయిన పరబ్రహ్మను తెలుసుకుంటే దాని వలన జరిగే ఆ కారణము వలన వచ్చే కార్యరూపములైన సమస్త విషయ విజ్ఞానము (మట్టి గురించి తెలిస్తే మట్టి నుండి వచ్చే పదార్థాలు అయిన కుండలు, పాలికలు తెలిసినట్లు) తెలుస్తుందని అందు వలన సమస్త విజ్ఞానాలకూ మూలము ఆ పరబ్రహ్మయే అని ఉపనిషత్ చెబుతుంది.

ఇంతేకాక బ్రహ్మ సూత్రాలలో "ఆనందమయాధికరణము" లో ఆనందమయుడు పరమాత్మ అనిన్నీ,

"ఉభయ లింగాధికరణము" లో పరమాత్మ సమస్త కళ్యాణ గుణములు కలవాడు, హేయగుణములు లేనివాడు అనీ చెబుతారు.

ఆ పరమాత్మ కర్మ సంబంధము లేనివాడని (అనశ్నన్ అన్యః అభిచాకశీతి...ముండకోపనిషత్తు) సత్త్వ, రజ, స్తమో గుణాతీతుడై శుద్ధ సత్త్వ స్వరూపము కలవాడు అని చెబుతారు.

ఆ పరమాత్మ జ్ఞాన, శక్తి, బల, వీర్య, ఐశ్వర్య, తేజస్సులనెడి షడ్గుణములను కలిగి యున్నవాడని కూడా మన శాస్త్రాలు చెబుతాయి.

ఈ విషయాలే ఈ శ్లోకములో వివరిస్తున్నారు.

"జ్ఞానానందమయమ్" అనడం సాక్షాత్ శ్రీమన్నారాయణుని అవతారమున హయగ్రీవ భగవానుడు కళ్యాణ గుణాకరుడు అనీ జ్ఞానాది షడ్గుణములను కలిగి యున్నవాడని సూచిస్తుంది.

నిర్మల శబ్దము పరమాత్మకు హేయగుణములు లేని విషయాన్ని తెలుపుతుంది.

దేవమ్ అను పదము "దివ్" క్రీడాయామ్ అను అర్థమును బట్టి పరమాత్మకు క్రీడ అయిన సృష్టి, స్థితి, లయాదుల నిర్వహించేది ఆయనే అనితెలుపుతోంది. *"తత్వ త్రయమ్"*లో కూడా "ఇతుక్కు(సృష్ట్యాదులకు) ప్రయోజనమ్ కేవల లీలై" అని కదా చెబుతారు.

అంతే కాక ఆయనే దేవాధిదేవుడు, ఆయనకు సమానులు కాని, ఆయన కంటె అధికులు కాని లేరు, ప్రకృతి, జీవులకు విశిష్టమైనవాడు అని తెలుస్తోంది.

*"ఆధారమ్ సర్వ విద్యానామ్"* అన్న పదము అన్ని శబ్దములకు, అక్షరములకు ఆది అయిన "అ" కార వాచ్యుడు ఆపరమాత్మ అన్న విషయాన్ని తెలియ చేస్తుంది. ( అకారేణ అఖిలాధారః పరమాత్మా అభిధీయతే....వామన పురాణము) అకారార్థో విష్ణుః" అని కదా!

"అవ రక్షణే" అను అర్థము ననుసరించి జగత్తుయొక్క రక్షణత్వమును, పరమాత్మను రక్షణకు పురుషకారము చేసే లక్ష్మీ దేవి యొక్క పతిత్వమును కూడా దీనినుండి గ్రహించగలము.

(లక్ష్మ్యా సహ కారుణ్యరూపయా రక్షకః).

ఈ రకంగా జగత్కారణత్వము, రక్షణత్వము, లక్ష్మీ పతిత్వము "అ" కారము నకు అర్థమని మనము తిరుమంత్రార్థములో చదువుకున్నాము.

"అ" కార శబ్ద వాచ్యుడైన విష్ణువు పదానికి "విష్ వ్యాప్తౌ" అను అర్థము ననుసరించి అంతటా వ్యాపించి ఉండేవాడు  అని అర్థము కనుక "అంతః బహిశ్చ తత్సర్వమ్" అన్నట్లు పరమాత్మ సర్వ వ్యాపకత్వము, అనంతత్వము తెలుస్తోంది.

"సత్ ఏవ సోమ్య ఇదమ్ అగ్ర ఆసీత్" అనగా ఈ అంతటికీ ముందు సత్ మాత్రమే ఉన్నది, అనగా అదే దీనికంతటికీ ఆధారము అని చెప్పడం వలన ఆ "సత్" ఈ హయగ్రీవ భగవానుడే అని తెలుస్తోంది.

పైన చెప్పబడినట్లు సత్యత్వము, జ్ఞానత్వము, అనంతత్వము అనే గుణాలు కలిగిన వానిగా సూచించడం వలన " సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" అన్న ఉపనిషత్ అర్థం ఇక్కడ స్ఫురిస్తోంది.

సర్వ విద్యానామ్ అనడం వలన ముండకోపనిషత్ లో "పరాచ అపరాచ.." అని చెప్పినట్లు మోక్షమునకు కావలసిన పర(బ్రహ్మ) విద్యలకూ, లౌకిక ప్రయోజనములకై నేర్చుకొనబడెడి వేద, వేదాంగాదులు అపర విద్యలకూ ఆయనే మూలము కనుక ఆయనను ధ్యానించడం వలన అన్ని రకాల విద్యలూ లభ్యములవుతాయి అని తెలుస్తోంది. ఇందువలన "మోక్ష ప్రదత్వము" కూడ హయగ్రీవ భగవానుడి గుణముగా తెలుస్తోంది.

"నిర్మల స్ఫటికాకృతిమ్" అన్న పదము శుద్ధ సత్త్వ తత్త్వమును, అపహత పాప్మత్వము, అఖిల హేయ ప్రత్యనీకతను తెలియచేస్తోంది. స్ఫటిక పద ప్రయోగము "తస్య భాసా సర్వమిదమ్ విభాతి" అన్నట్లు పరమాత్మ ఔజ్జ్వల్య, లావణ్యాది గుణాలను సూచిస్తుంది.

"ఉపాస్మహే" అను పదము "కారణమ్ తు ధ్యేయః" అను బ్రహ్మసూత్రమున చెప్పినట్లు ఈ సమస్తమునకూ మూల కారణమైన వాడు ధ్యానింప బడ వలెను అను విషయము తెలియచేస్తోంది.

ఉపాస్మహే అని బహువచనం వాడడం వలన "బోధయంతి పరస్పరమ్" అని భగవద్గీతలో చెప్పినట్లు "ఏకః స్వాదు న భుఞ్జీత" అను ఆర్యోక్తి ని అనుసరించి మన సహ చర వర్గములో బాటు కలసి ధ్యానము, ఒలక పారాయణము వలన మన బంధు, మిత్రాదులకు కూడా హయగ్రీవ కృప లభిస్తుంది అని చెబుతున్నారు. దేశికులు ఆత్మనేపది వాడడానికి కారణము ఆ శ్లోకాన్ని మనలాంటి వాళ్ళు చదువుకొంటున్నప్పుడు మనకు ఆ హయగ్రీవుని కృప లభించాలనే మహోన్నతమైన ఉద్దేశ్యము

ఈ రకంగా దేశికులు హయగ్రీవులు సమస్త జగత్కారణులైన శ్రీమన్నారాయణ పరబ్రహ్మ అవతారమని, లౌకిక విద్యలకయినా, మోక్షమునకైన "ఛందోమయః మఖమయః అఖిల దేవతాత్మా" అనినట్లు, "పితాహమ్ వేద్యమ్ ...ఋక్సామయజురేవచ" అనినట్లు ఆయనే మూల కందమనీ ఆయనను ధ్యానించడం వలన మనము మోక్షమైనా, లౌకిక విద్యలైనా పొందగలమనీ ఈ శ్లోకంలో వివరించేరు.

*నేను:* తరువాతి శ్లోకము!

***వదిన:*** ఇప్పుడు హయగ్రీవ భగవానుడు ప్రత్యక్షము అయినప్పుడు ముందు ఆయన తేజస్సు కనపడ్డది, ఆయన నోటినుండి శబ్దములు వినపడ్డాయి. ఆ తేజస్సు వెలుగులో హయగ్రీవులు ఇంకా పూర్తిగా దర్శనము కాలేదు, ఆ స్థితిలో బయల్వెడలిన శ్లోకము.

**2."స్వతస్సిద్ధమ్ శుద్ధ స్ఫటిక మణి భూభృత్ ప్రతి భటమ్**

**సుధాసధ్రీచీభిః ద్యుతిభిః అవదాత/ అపతాప త్రిభువనమ్**

**అనంతైః త్రయ్యంతైః అనువిహిత హేషాహలహలమ్**

**హతాశేషావద్యమ్ హయవదనమ్ ఈడీమహి మహః**

*స్వతః సిద్ధమ్: కర్మ కారణము లేక సహజముగా అవతరించినది*

*శుద్ధ: పరిశుద్ధమైన*

*స్ఫటికమణి: స్ఫటికమను మణి విశేషమే స్వరూపమైన*

*భూభృత్: పర్వతముతో*

*ప్రతిభటమ్: పోటీ పడేది(పోలినది/ అతిశయించినది)*

*సుధా సధ్రీచిభిః: అమృతముతో పోలిన*

*ద్యుతిభిః : కాంతులచేత*

*అవదాత/ అపతాప: తెల్లగాచేయబడిన/ తాపములు పోగొట్టబడిన*

*త్రిభువనమ్: ముల్లోకములను కలిగినది*

*అనంతైః : అంతు/ అవధి లేని*

*త్రయ్యంతైః : శ్రుతులచేత*

*అనువిహిత: అనువదింప బడిన/ అనుకూలముగా పలుక బడిన/ అనుసరింపబడిన*

*హేషాహలహలమ్ : హలహలమను హేషారవము(గుఱ్ఱపు సకిలింపు శబ్దము) కలది*

*హత: నశించిన*

*అశేష: సంపూర్ణమైన*

*అవద్యమ్: దోషములు కలది అగు*

*హయవదనమ్: హయగ్రీవ భగవానుని*

*మహః: గొప్ప కాంతిని*

*ఈడీమహి: స్తుతింతుము.*

కర్మ హేతువుగా కాక సహజముగా అవతరించినది, పరిశుద్ధమైన స్ఫటికమణి పర్వతమును అతిశయించినది, అమృతసమానమైన తన తెల్లని గొప్ప కాంతితో ముల్లోకములను తెల్లగా, తాప రహితముగా చేయునది, తన సకిలింపు శబ్దముచే అనుసరించబడిన వేదములు కలిగినది, అఖిల దోష ప్రత్యనీకమైనది అయిన హయగ్రీవ భగవానుని గొప్ప కాంతిని స్తోత్రము చేయుదుము.

***నేను:*** దీనికి విశేషార్థాలు చెబుతావా!

***వదిన:*** జీవుళ్ళమైన మనమందరమూ మన మన పూర్వ కర్మలననుసరించి తత్ఫలితముగా ఆయా అనుభవాలను పొందడానికి వేవ్వేలు జన్మలనెత్తుతుంటాము. కాని పరమాత్మ అలాకాదు. **"నమామ్ కర్మాణి లింపంతి న మే కర్మ ఫలే స్పృహా"** అని భగవద్గీత లో చెప్పినట్లు ఆయనకు కర్మల తోటి కర్మ ఫలాలతోటి సంబంధము లేదు. కాని సమంగా నడవక పాడు నూతిలో పడి పోయిన తన పిల్లవాడిని పైకి తీసుకొని వెళ్ళి రక్షించడానికి తానూ బావిలో దిగిన తండ్రిలా తాను కూడా ఈ లీలా విభూతిలో అవతరిస్తూంటాడు పరమాత్మ. **"అజాయమానో బహుధా విజాయతే"** అనినట్లు జన్మలేని వాడయినా నిర్హేతుకమైన కృప వలన కర్మ సంబంధములేకపోయినా, వేరొక సహాయము గాని సాధనము గాని అక్కర లేకుండా తనకు తానుగా దిగి వచ్చినవాడు హయగ్రీవ భగవానుడు, ముఖ్యంగా సాధు పరిత్రాణము కోసం. ఇక్కడ సాధుపుంగవుడైన దేశికులను కరుణించడం కోసం హయగ్రీవుడు ప్రత్యక్షమైనాడు. ఆయన

అవతారమునకు కారణాంతరము గాని, వేరొక సాధనము, ఉపాధి గాని అవసరము లేదు. అందు వలననే "స్వతః సిద్ధమ్" అంటున్నారు.

ఉభయ విభూతులలో కూడా ప్రకృతి అయినా, జీవుళ్ళయినా అంటే లక్ష్మీ దేవి, సమస్త నిత్య సూరులతో సహా అందరూ పరమాత్మకు విశిష్టమై, పరమాత్మ ఆధారమయితే ఆధేయములై ఉండును కదా, పరమాత్మ లేకుండా వాటి వేటికీ స్వతః సిద్ధమైన అస్తిత్వము లేదు. "స్వతఃసిద్ధమ్" అన్న పదము పరమాత్మ అయిన హయగ్రీవ భగవానుడికే చెందుతుంది. ఇంతకు ముందు "ఆధారమ్ సర్వ విద్యానామ్" అని, ఇప్పుడు సమస్తానికి ఆయనే ఆధారము అన్న విషయాన్ని కూడా తెలియ జేస్తున్నారు. వేదములు ఆయన అనాది పురుషుడు, అనిన్నీ, పుట్టుక, నాశనము లేని ఉచ్ఛిష్ఠ పరబ్రహ్మ అనిన్నీ చెబుతుంది

"ఋక్సామ యజుః ఉచ్ఛిష్ఠ ఉద్గీథఃప్రస్తుతమ్ స్తుతమ్

హింకార ఉచ్ఛిష్ఠే స్వరః సామ్నో

మేదిశ్చ తన్మయి.....అథర్వ వేదము(11-7-5)

ఉచ్ఛిష్ఠ బ్రహ్మము ఋక్యజుస్సామ, ఉద్గీథ, హింకార, స్వర, సామ ఛందస్సులన్నిటినీ కూడా పొంది కీర్తించ బడి యున్నది.

ఆ ఉచ్ఛిష్ఠ బ్రహ్మము నాశము లేనిది, ఈ నామ, రూపాలతో నున్న సమస్త జగత్తు నంతటినీ ఆయన కలిగి యున్నాడు. అంటే ఈ జగత్తంతా ఆయనకు శరీరమై ఆయనపై ఆధారపడి యున్నది( ఉచ్ఛిష్ఠే నామ రూపమ్ చ ఉచ్ఛిష్ఠే....అథర్వ వేదము (11-7-1)

వేదములలో నున్న ఈ విషయాన్నే దేశికులు "స్వతః సిద్ధమ్" అన్న పదముతో మనకు చెబుతున్నారు.

"స్వతః సిద్ధమ్" అనుట వలన స్వయం ప్రకాశకత్వము, నిరుపాధికమైన చైతన్యము, శుద్ధ సత్త్వమయత్వము కూడ సూచితములవుతున్నాయి."సిద్ధి" శబ్దము జ్ఞాన వాచి కదా! అంటే నిత్యులైనా కూడా నిరుపాధికముగా కాక స్వామి వలననే నిత్యత్వము కలిగి శుద్ధసత్త్వ తత్త్వము తో ఉంటారు. కాని స్వామి నిరుపాధికుడు, అంటే ఆయన సహజముగా తనకు తానే నిత్యుడు, పరిశుద్ధుడు, శుద్ధసత్త్వమయుడు.

"శుద్ధ స్ఫటిక మణి భూభృత్ ప్రతిభటమ్"-అనుట వలన ఔజ్జ్వల్యము, ధావళ్యము(శుద్ధ స్ఫటిక), ఔన్నత్యము, విస్తృతి(భూభృత్-పర్వతము) సూచితములు.

సుధాసధ్రీచీభిః ...త్రిభువనమ్- ఆచార్యుని చంద్రుని తోను, చంద్రుని అమృత కిరణములను ఆచార్యుల ఉపదేశములతోను పోల్చి మన పెద్దలు చెబుతారు. అంటే తీక్ష్ణమైన సూర్య కిరణముల వలె మనము భరించలేని శాస్త్ర విషయాలను చంద్ర కిరణముల వలె అమృతోపములుగా అనువదించి ఆచార్యులు మనకందిస్తారని అర్థము. హయగ్రీవ భగవానుడు జగదాచార్యులు. అందుచేత ఆయన కాంతిని అమృత కిరణములు అని చెబుతున్నారు. ఇలా చెప్పడం వలన శైత్యము, భోగ్యత్వము, ధావళ్యము సూచితమవుతున్నాయి.

"అపతాప త్రిభువనమ్" అను పాఠాంతరము వలన ఆయన కాంతి ముల్లోకములలో సమస్త జగజ్జీవుల తాపములనుపశమింప జేయునని తెలియుచున్నది.

అనంతైః....హలహలమ్-

"అనంతా వై వేదాః" అని అన్నట్లు సమస్త వేద విజ్ఞానము ఆయన నోటి నుండి బయల్వెడలిన "హలహల" అను శబ్దము ననుసరించి వచ్చినదే. బ్రహ్మకు వేదములను ఈయడం అంటే ఉపదేశము చేయడమే కదా, హయవదనుడు ఉపదేశము చేయడం అంటే "హలహల" అని సకిలించేడుట. "హల్ + అహల్" అనగా "హల్" అంటే హల్లులు. "అహల్" అంటే అచ్చులు. ఇలా సమస్త శబ్ద విజ్ఞానము ఆయన "హల హల" మనడం వలన వచ్చినదే అంటున్నారు చమత్కారంగా దేశికులు.

హతాశేషావద్యమ్-ఆ హయ హేషారవము వింటే సమస్త పాపములు నిశ్శేషంగా నశిస్తాయి అంటున్నారు దేశికులు. అఖిల హేయ ప్రత్యనీకుడైన హయగ్రీవ భగవానుని నోటి శబ్దముతో అన్ని పాపాలూ పటాపంచలైపోతాయి.

ఇట్లు నిత్యమైనది, నిర్మల తేజోమయమైనది, సమస్త లోకములకు భోగ్యమైనది, వేద ప్రతి రూపమైన హయ హేషా రవము చేయునది, సమస్త పాప హరణమైనది, అమృతమువలె ఉజ్జీవింప చేసి సకల తాపములు పోగొట్టునది అగు హయగ్రీవ తేజస్సును సకల విధములైన ప్రతి బంధకముల నివారణకు, సమస్త శ్రేయస్సులను పొందుటకు స్తుతించెదమని ఈ శ్లోకము సారాంశము.

ఈ శ్లోకాన్ని "శిఖరిణి" వృత్తంలో "స్వభావోక్తి",రూపకాలంకారము" మున్నగు అలంకారాలతో దేశికులు మనకు అందించేరు.

***నేను:*** బాగుంది, కళ్ళకు కట్టినట్లుంది

***వదిన:*** తరువాత శ్లోకములో భగవానుడి తేజఃకాంతి అనంతరము తనకిప్పుడు స్పష్టముగా వినిపిస్తున్న (శబ్ద వేగము కాంతి వేగము కంటే తక్కువ కదా) హయగ్రీవ భగవానుని "హేషా హలహలమ్మ"ను శబ్దమును ప్రస్తుతిస్తున్నారు తరువాతి శ్లోకములో.

**3."సమాహారః సామ్నాం ప్రతిపద మృచాం ధామ యజుషాం**

**లయః ప్రత్యూహానాం లహరి వితతిః బోధ జలధేః**

**కథా దర్పక్షుభ్యత్కథకకుల కోలాహల భవం**

**హరత్వంతర్ధ్వాంతం హయవదన హేషాహలహలః**

*సామ్నాం: సామ వేదము యొక్క*

*సమాహారః: సమూహము*

*ఋచాం: ఋగ్వేదము యొక్క*

*ప్రతిపదం: ప్రతిరూపము*

*యజుషాం: యజుర్వేదము యొక్క*

*ధామ: నివాస స్థానము*

*ప్రత్యూహానాం: ప్రతి బంధకములయొక్క*

*లయః: నాశనము (చేయునది)*

*బోధ జలధేః: జ్ఞాన సముద్రము యొక్క*

*లహరి వితతిః: కెరటముల యొక్క సముదాయమును అయిన*

*హయ వదన: హయగ్రీవ భగవానుని యొక్క*

*హేషా హలహలః: హలహలమని శబ్దమును చేయు హయ హేషారవము*

*కథాదర్ప: వాద గర్వముచే*

*క్షుభ్యత్: అహంకరించు*

*కథకకుల: ప్రతివాదుల సమూహము యొక్క*

*కోలాహల: కలకలముచేత*

*భవమ్: జనించిన*

*అంతః ధ్వాంతమ్: మనలో అజ్ఞానమును*

*హరతు: పోగొట్టును గాక.*

హయగ్రీవ స్వామి నుండి బయల్వెడలిన హలహలమను హయ హేషా రవము సామవేదముల సమాహారము వంటిది, ఋగ్వేద మంత్రముల ప్రతిరూపమైనది, యజుర్వేదము యొక్క స్థానమైనది, సమస్త ప్రతి బంధకములను ధ్వంసము చేయునది, సాగరపు కెరటాలు ఆ సాగర జలాన్ని మనకు మాటి మాటికీ అందించినట్లు జ్ఞాన సముద్రమునుండి విజ్ఞానాన్ని మనకు ఎల్లప్పుడూ అందించే విజ్ఞాన సాగర తరంగముల సమూహము వంటిది. తమ వాద గర్వముచే అహంకరించు ప్రతివాది సమూహాల కలకలముచే పుట్టిన అజ్ఞానమును ఆ హయగ్రీవ హలహల హేషారవము పోగొట్టును గాక!

***నేను:*** "హల హలమ్" అని మళ్ళీ వాడుతున్నారు. నిజంగా ఇది గుఱ్ఱము సకిలింపు చెప్పడానికేనా, ఇంకేమయినా కారణమా. ఈ శ్లోకానికి విశేషార్థాలు చెబుతావా!

***వదిన:*** బాగా గ్రహించేవు. ఇలాంటివి గురుముఖముగా తెలుసు కోవాలి కనుక ఇంతకు ముందు చెప్పలేదు.

"అ" కార, "ఉ" కార "మ" కారములతో కూడిన ప్రణవము "మ" కార వాచ్యుడైన ఈ జీవాత్మ "అ" కార వాచ్యుడైన లక్ష్మీసమేతముగానున్న శ్రీమన్నారాయణునికే శేషము అని ఎలా చెబుతుందో అలాగే "హ" కార, "ల" కార, "మ" కారములతో కూడి యుండు లక్ష్మీ హయగ్రీవ మంత్రము (హ్లౌమ్) "మ" కార వాచ్యుడనైన నేను(అనెడు జీవాత్మ) "ల" కార వాచ్యమైన లక్ష్మీ దేవితో కూడియున్న "హ" కార వాచ్యుడైన హయగ్రీవ స్వామికే చెందిన వాడను అన్న విషయము తెలియ జేస్తుంది. ఇది బీజాక్షర సహితమైన మహా

మహిమాన్వితమైన లక్ష్మీ హయగ్రీవ ఏకాక్షర మంత్రము. ఈ మంత్రమును గురుముఖముగా ఉపదేశము పొంది విధి పూర్వకముగా జప, తర్పణ, హోమాదులతో సాధన చేసిన వారికి సమస్త విద్యలూ లభిస్తాయని పెద్దలు చెబుతారు. దేశికులు స్తోత్ర రూపములో బీజాక్షర యుతమైన మంత్రోపదేశము సాక్షాత్తూ ఆ "హయగ్రీవ భగవానుని" చేత మనకు తెలియ కుండా మనకు చేయిస్తున్నారు. "హలహలమ్" అని పలుకుతున్నది హయగ్రీవ భగవానుడే కదా.

ఈ శ్లోకములో అంతకు ముందు శ్లోకములో చెప్పిన "అనంతైః త్రయ్యంతైః....హతాశేషావద్యమ్" అనే ఇంతకు ముందు శ్లోకానికి వివరణ అని అనుకోవచ్చు. అంటే అప్పుడు కొలదిగా వినబడిన హయహేషా హలహల శబ్దము ఇప్పుడు స్పష్టంగా వినబడినదన్నమాట.

ఈ ధ్వని గురించి మూడు విషయాలు చెబుతున్నారు

1. ఇది సర్వ వేద సారము

2.ఇది మన సమస్త ప్రతి బంధకములను ఎల్లప్పుడూ హరించుచునే యుండును.

3. ఇది మన లోపలనున్న అజ్ఞానమును, బయటనుండి వచ్చు అన్యథా, విపరీత జ్ఞానములను పోగొట్టును.

ఇందులో మొదటిది.

ముముక్షుప్పడిలో పిళ్ళై లోకాచార్యుల వారు మూడు కుండలలో పెరుగును నింపి తరచి వెన్న తీసినట్లు మూడు వేదముల నుండి తరచి తీయబడిన "అ" కార, "ఉ" కార, "మ" కారములతో ప్రణవము వచ్చినదనీ అది మూడు వేదముల సారమనీ చెబుతారు. ఇక్కడ కూడా "హలహలమ్" అను శబ్దము హయగ్రీవ మంత్ర ప్రతి రూపమే కనుక దేశికులు ఇది కూడా సకల వేద సారమన్నమాట చెబుతున్నారు.

"సమాహారః సామ్నామ్..." వేదానామ్ సామవేదోస్మి అని భగవద్గీతలో భగవానుడు సామవేద ప్రశస్తి వివరించేడు. స్వామి నమ్మాళ్వార్లు పాడిన తిరువాయ్ మొళిని "ద్రావిడ భాషనందున్న సామవేదమని" కీర్తిస్తారు. అందువలన ముందుగా ఋగ్వేదము కాక సామవేదము ప్రస్తావిస్తున్నారు. ఇందులో లభ్యమవుతున్నవి సుమారు 75 ప్రత్యేకమైన సామములున్ననూ తక్కిన సుమారు 1800 సామములు ఋగ్వేదము నుండి తీసుకొనబడినవే అని అంటారు. వీటి యందు ఏ దేవత గురించి చెప్పినట్లున్ననూ ఆ దేవత అంతర్యామి అయిన పరమాత్మకే అవి వర్తిస్తాయి. అలాగే ఏ వ్యక్తి అయినా వస్తువయినా దాని అస్తిత్వము తదంతర్యామి అయిన పరమాత్మ వలననే కదా. "వేదైః సర్వైః అహమేవ వేద్యః" అనికదా పరమాత్మ

చెప్పేడు. అందువలన సామవేదమంతయూ భగవానుని గురించి చెప్పేదే అన్న విషయము ఇక్కడ చెబుతున్నారు. అలాగే ఋగ్వేదములో ప్రతి పదము హయగ్రీవ భగవానుని చెప్పేదే. ఇది ఋతము, ధీ(ఆలోచనా సామర్థ్యము), రాయే(ఆధ్యాత్మిక జ్ఞానము), వాజ(సంపూర్ణ సమన్వయా చాతుర్యము), ఘృతము(మనస్సు), అశ్వ(వీర్య శక్తులు), అమృతము మొదలగు జ్ఞానములకు సంబంధించినది. ఇవి అన్నియూ పరమాత్మ సంబంధితములే కదా!

అందులో వాజ, అశ్వ లాంటి పదాలు హయగ్రీవుల పేరులోనే ఉన్నవి కూడా."ధామ యజుషామ్" ఈ వేదాలకు ఇల్లు పరమాత్మయే అని చెబుతున్నారు. చతుర్ముఖ బ్రహ్మకయినా పరమాత్మ నుండి వచ్చినవే.

యజుర్వేదము కర్మ కాండ ప్రధానముగా గలది. అందుకే హయగ్రీవ సహస్రనామము లో

**"పదమ్ క్రియా కారకశ్చ నిపాతో గతిరవ్యయః**

**సర్వకర్మ సమారాధ్యః సర్వ వేద మయో విభుః**

**నిరంతర నమోవాక శుద్ధయా హృదయాశ్రయః"**

అంటూ హయగ్రీవ భగవానుడే సమస్త కర్మ కాండలకు ప్రభువు, గతి అని చెబతారు. భగవద్గీతలో కూడా తానే యజ్ఞములకు ప్రభువునని చెప్పుకున్నాడు పరమాత్మ. "యజ్ఞో వై విష్ణుః" అని కదా. విష్ణు సహస్రనామాలలో"యజ్ఞో యజ్ఞపతిః..." అంటూ చదువుతాము కద. అందువలన యజుర్వేదమునకు నిలయంగా హయగ్రీవుల నోటి నుండి వెల్వెడలిన "హలహలమ"ను శబ్దాన్ని ప్రస్తుతిస్తున్నారు.

"ప్రత్యూహానామ్ లయః" అన్న పదము  అథర్వ వేదాన్ని సూచిస్తుందని కొందరి అభిప్రాయము. ఎందుకంటే అథర్వ వేదము అనిష్ట నివృత్తి, ఇష్ట ప్రాప్తికి సంబంధించిన కర్మలూ, మంత్రాలూ అవి తెలుపుతుంది కదా. మన అవరోధాలను ధ్వంసము చేసేది ఆ శబ్దము.

ఇంక "హలహలమ"ను శబ్దము విజ్ఞాన సాగరపు కెరటాలలా ఎల్లప్పుడూ ఏ విద్య కావాలంటే ఆ విద్య-ఇంతకు చెప్పుకున్నాము కదా ఇహానికి "అపర విద్య", పరానికి(పరమ పదానికి) "పర విద్య" కావాలని- ఇస్తూంటుందన్న మాట. కెరటాలు ఒకసారి వచ్చి ఆగిపోవు కద. అలా వస్తూనే ఉంటాయి. అలాగన్న మాట.మనం ఎన్ని సార్లు తప్పించుకుంటున్నా మళ్ళీ మళ్ళీ అలా మనకు మంచి జ్ఞానము ఇస్తూనే ఉంటుంది ఆ హయగ్రీవ మంత్రము.

ఇలా మంచి జ్ఞానానికి ఈయడానికి కావలసిన మంచి ఆచార్యుడు హయగ్రీవుడు, సంపూర్ణ జ్ఞానము ఆయన నోటి పలుకులు, మంత్రము.

ఎంత జ్ఞానము ఇచ్చినా, నాకు కావలసినంత అజ్ఞానము ఉందికదా ఆ అజ్ఞానం మాట ఏమిటి అంటే

లోపల ఉన్న అజ్ఞానమునూ(అంతః ధ్వాంతమ్) పోగొడుతుందట. ఇంక పైనుండి ప్రత్యర్థుల వలన ఇతరముల వలనా వచ్చే అన్యథా జ్ఞానాన్ని, విపరీత జ్ఞానాన్ని కూడా పోగొడుతుందట "హలహలమ"ను శబ్దము.

ముముక్షుప్పడిలో చెబుతారు తిరుమంత్రము ఆఱు రకాలైన ప్రత్యర్థులనుండి రక్షిస్తుందట.

1. దేహమే ఆత్మ అనుకోవడం

2.తాను స్వతంత్రుడననుకోవడం

3. అన్యులకు శేషభూతుడననుకోవడం

4. తనకు తానే రక్షకుడనుకోవడం

5.అబంధు సాంగత్యము

6. అన్య విషయ ప్రావణ్యము

"హలహలమ"ను శబ్దము ఇలాగే మన ప్రత్యర్థులను దూరం చేస్తుందన్న మాట.

ఈ రకంగా మంత్రాన్నీ, మంత్ర వైభవాన్నీ, మంత్రము వలన కలిగే ఫలము అంటే మనకు కావలసిన సమస్త జ్ఞానము కలుగజేసి, మన మనస్సులో అజ్ఞానము, బయట నుండి వచ్చే విపరీత, అన్యథా జ్ఞానాలు పోగొట్టడం చేస్తూ ఉండడం అన్న ఈ అన్ని విషయాలూ రహస్యంగా దేశికులు ఈ శ్లోకంలో అందించేరు. ఇది గొప్ప శ్లోకము అని తెలియడానికి దేశికులు **"శిఖరిణీ వృత్తము"**లో నిర్మించి పరికరాలంకారము, రూపకాలంకారము, రూపక అతిశయోక్తి మొదలైన అలంకారాలతో రూపకల్పన చేసేరు.

*నేను:* అంటే రహస్యంగా శ్లోకంలో దాచి మంత్రాన్ని ఇచ్చేరన్న మాట. తరువాతి శ్లోకము?

*వదిన:* ఇలా అంతరార్థాలతో రచనలు చేయడం దేశికులకు కొత్తేమీ కాదు. ఒక్కొక్క శ్లోకములో 20 అర్థాలతో ఆయన ఒక గ్రంథము రచించేరు.

ఉదాహరణకు పాదుకా సహస్రములో ఱెండు శ్లోకాలు ఒక శ్లోకములో అక్షర క్రమాన్ని మారిస్తే వేఱు అర్థంతో మరొక శ్లోకము వచ్చేటట్టు ఱెండు శ్లోకాలూ ఆ రంగనాథ పాదుకను కీర్తిస్తూ ఉండడం మాత్రమే కాక ఆ శ్లోకాక్షర గమనము చదరంగంలో గుఱ్ఱము ఎలాగయితే తన నడకతో అన్ని గదులూ,ఏ గదికీ రెండు సార్లు వెళ్ళ కుండా, వెళ్ళగలదో ఆ క్రమంలో ఉండేటట్టు (ఈ సమస్యకు సమాధానము Euler 18 వ శతాబ్దము లో కనుగొన్నాడు, అంటే దేశికులు వ్రాసిన 400 ఏళ్ళ తరువాత) వ్రాసేరు. ఆయన గొప్పదనము గురించి ఎంత చెప్పినా తక్కువే కాని, తరువాత శ్లోకము చూద్దాము.

ఆ కాంతి వలన, శబ్దము వలన హయగ్రీవ మూర్తి ప్రత్యక్షమైనట్లు తెలిసింది, కాని ప్రాకృతమైన కళ్ళకు ఇంకా కనబడలేదు. తనకు హయగ్రీవ మూర్తి దర్శనము కావలెనని ఈ శ్లోకములో ప్రార్థించుచున్నారు.

4.ప్రాచీ సంధ్యా కాచిదంతర్నిశాయాః

ప్రజ్ఞా దృష్టేః అంజన శ్రీః అపూర్వా

వక్తీ వేదాన్ భాతు మే వాజి వక్త్రా

వాగీశాఖ్యా వాసుదేవస్య మూర్తిః

*అంతః నిశాయాః: (తన) లోపలఅజ్ఞానము అను రాత్రి యొక్క*

*కాచిత్: చెప్పలేని, అనిర్వచనీయమైన*

*ప్రాచీ సంధ్యా: ప్రాతః కాలపు సంధ్య*

*ప్రజ్ఞా దృష్టేః: ప్రతిభ అను నేత్రమునకు*

*అపూర్వా: అపూర్వమైన (గొప్పదైన)*

*అంజనశ్రీః : అంజనమనెడు సిరియు(గొప్పదనమును)*

*వేదాన్ వక్తీ: వేదములను పలుకునదియూ*

*వాజి వక్త్రా: హయ వదనము కలిగినదియూ*

*వాక్+ఈశ+ఆఖ్యా: వాగీశులు(హయగ్రీవులు) అను పేరు కలిగినదియూ(అయిన)*

*వాసుదేవస్య: వాసుదేవుడగు పరమాత్మ యొక్క*

*మూర్తిః: రూపము*

*మే: నాకు*

*భాతు: ప్రకాశించును గాక!*

తమ కన్నుల ముందు ప్రత్యక్షమైన హయగ్రీవ భగవానులను తనకు గోచరమగునట్లు ప్రార్థించుచున్నారు,

అజ్ఞానమను రాత్రిని అంతము చేయు అనిర్వచనీయమైన(వర్ణనాతీతమైన) ప్రాతః సంధ్యయు, త్రైకాలికజ్ఞానరూపమైన ప్రజ్ఞ అను నేత్రమునకు అంజన సౌభాగ్యమును, వేదములను ఉపదేశించునదియు(పల్కునదియు), హయవదనము కలిగినదియు, వాగీశులు(హయగ్రీవులు) అన్న పేరు కలిగినదియు అయిన వాసుదేవుడగు పరమాత్మ యొక్క హయగ్రీవమూర్తి నాకు భాసించును గాక!

***నేను:*** కళ్ళ ముందు ప్రత్యక్షమైన తరువాత ఇంకా గోచరమవడానికి ప్రార్థించడమేమిటి!

***వదిన:*** భగవద్గీత లో అర్జునుడు "విశ్వరూప సందర్శనం సందర్భములో **"మన్యసే యది తచ్ఛక్యమ్ మయా ద్రష్టుమ్ ...తతో మే త్వమ్ దర్శయ"** అంటాడు. అంటే "నీ విశ్వరూపం నాకు చూడడం సాధ్యమని ఒక వేళ నువ్వు తలుస్తే అప్పుడు నీవు నాకు దానిని చూపించు" అని అంటాడు. అంతే తప్ప "నేను చూస్తాను" అనడు. అప్పుడు కృష్ణ భగవానుడు "న తు మామ్ శక్యసే ద్రష్టుమ్" అని "దివ్యమ్ దదామి తే చక్షుః" అంటాడు. "నువ్వు నీ కళ్ళతో చూడలేవు, అందుకని నీకు దివ్య దృష్టిని ప్రసాదిస్తాను, అప్పుడు చూడు" అని. అందువలన ఆయనను చూడగలిగే శక్తి, అవకాశము ఆయనే ఇవ్వాలి కాని నేనే చూసేస్తాను అంటే కుదరదు. అందుకే ఇక్కడ కూడా దేశికులు తను చూసేస్తాను అనకుండా తనకు భాసించమని ప్రార్థిస్తున్నారు.

పరమాత్మ మీద ప్రేమ, విశ్వాసాల వలన ఆయనను ధ్యానము చేయడం, అందువలన ఆయన మంత్రాన్ని పొందడం, తదనంతరము ఆయన రూపము మనస్సులోనో కళ్ళముందో నిలవడం ఇదీ క్రమము. ఇలా తైలధార

వలె అవిచ్ఛిన్నమైన భావనయే భక్తి. ఇలా నిరంతర ధ్యానము వలన పరభక్తి, తన్మూలముగా నిత్యము మనస్సున భగవానుని సాక్షాత్కార రూపమైన స్థితి పరజ్ఞానము, దాని వలన పునర్విశ్లేష భీరుత్వ రూపమైన స్థితి పరమ భక్తి అని కదా. దేశికులు "తనకు ఈ స్థితులు కలుగవలెనని ప్రార్థిస్తున్నాను" అని అంటున్నారు అని కూడా దీనికి అర్థము చెబుతారు పెద్దలు.

అజ్ఞానమను రాత్రిని అంతము చేయునది అంటే మన మనస్సులో ఉండే అజ్ఞానాన్ని పోగొట్టేది అంటే హయగ్రీవ మూర్తి తెల్లనిది కదా, తెల్లని వెలుగులో మఱి రాత్రి, చీకటి ఉండవు కదా!

ప్రాతః సంధ్యా సమయంలో "సవితృమండల మధ్యవర్తీ" అని శ్రీమన్నారాయణుడినే కదా స్తుతిస్తాము, అందుచేత ఆదిత్యమండలములోనున్న వాసుదేవమూర్తిని కూడా ఇక్కడ ప్రస్తుతించడం అవుతోంది. ఆ చీకటి చెప్పడానికి కుదరనిది అని అనడానికి "కాచిత్" అని సర్వనామము వాడుతున్నారు.

"ప్రజ్ఞాదృష్టేః ..." త్రైకాలిక బుద్ధిని "ప్రజ్ఞ" అని అంటారు. అలాంటి ప్రజ్ఞ అనే నేత్రమునకు అపూర్వమైన అంజన విశేషము హయగ్రీవులు. సామాన్యంగా కనపడని వస్తువులు కనిపించడానికి వేసే అంజనము నల్లగా ఉంటుంది. కాని హయగ్రీవులు తెల్లని సిద్ధాంజనము. అందుకే అపూర్వము అని అంటున్నారు.

సామాన్యమైన అంజనము బాహ్య నేత్రమునకే కాని" ప్రజ్ఞ" అనే నేత్రానికి సహాయపడలేదు కదా. అంతేకాదు. అంజనము మనకు తెలియ చేసేది ప్రాపంచిక పదార్థాలు, గుప్తములైన వస్తువులను గూర్చి. కాని ఈ అపూర్వమైన అంజనశ్రీ సామాన్యులకు గోచరించని తత్త్వ, హిత, పురుషార్థాలని తెలియచేస్తుంది.

"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితమ్ ముఖమ్

తత్త్వమ్ పూషన్ అపావృణు సత్యధర్మాయ దృష్టయే"

అని కదా ఈశావాస్యోపనిషత్. అంటే హిరణ్మయ పాత్రము అనబడు మాయచే సత్యము కప్పబడినది, ఆ సత్యమును తెలుసుకొనుటకు ఆ హిరణ్మయ పాత్రమును తొలగించగలిగినవాడు భగవానుడే.

"మామ్ ఏవ యే ప్రపద్యంతే మాయామ్ ఏతామ్ తరంతి తే" అని కదా భగవద్గీత.

అయితే ఇలా తొలగించడం ఎలా చేస్తాడు అంటే జ్ఞానమును ప్రసాదించి అని చెప్పడానికి "వక్తీ వేదాన్" అంటున్నారు. చతుర్ముఖ బ్రహ్మకు జ్ఞానరూపమగు వేదములను ఉపదేశించినది హయగ్రీవులే కదా.

***నేను:*** "వేదానామ్ వక్త్రీ" అని షష్టీ విభక్తి కాక "వేదాన్" అని ద్వితీయా విభక్తి ఉండవచ్చునా!

***వదిన:*** శరణాగతి గద్య చదువుతావు కదా, దానిలో "సదైవ మామ్ వక్తా" అని అంటారు భగవద్రామానుజులు. అక్కడ కూడా "మామ్" ద్వితీయా విభక్తియే. "ఋచః సామాని జజ్ఞిరే ..." అని కూడా విన్నావు కదా. అందువలన తప్పులేదు.

వాగీశాఖ్యా అనడం వలన హయగ్రీవావతారము అంశావతారము మాత్రమే కాక పూర్ణావతారమేనని కేవలము పేరు మాత్రమే భిన్నమని "ఉత్తమూర్ వీరరాఘవాచార్యులు గారు" చెబుతారు.

"వాసుదేవస్య మూర్తిః" అనడం వలన కూడా హయగ్రీవులు పరవాసుదేవుల సంపూర్ణ అవతారమే అని తెలుస్తోంది. ఈ శ్లోకాన్ని శాలినీ వృత్తములో అందించేరు దేశికులు. "శాలతే అంటే ప్రకాశతే" అంటే వ్యక్తమవడం కదా, అందువలన హయగ్రీవుల సాక్షాత్కార సన్నివేశము శాలినీ వృత్తములో రూపకాది అలంకారాలతో దేశికులు ప్రసాదించేరు.

***నేను:*** ఇందాకా "హిరణ్మయేన..." అని ఈశావాస్యోపనిషత్ మంత్రము చెప్పేవు కదా, అక్కడ సత్యమ్ అంటే యథార్థమైనది అనియా, జీవుడనా లేక పరమాత్మ అనా, ఎందుకంటే ఈ పదాలు నన్నెప్పుడూ సందిగ్ధంలో పడేస్తూంటాయి.

***వదిన:*** ఇక్కడ "సత్యమ్" అంటే జీవుడే.

*"హిరణ్మయేణ పాత్రేణ" -ప్రాపంచిక విషయ సముదాయము చేత,*

*"అపిహితమ్" -ఆచ్ఛాదితమైన*

*"సత్యస్య" -జీవునియొక్క*

*"ముఖమ్" -మనస్సుకు(విషయాలకు ముఖ ద్వారము మనస్సే కదా!)*

*"పూషన్"- సూర్యమండలాంతర్వర్తి అయిన నారాయణుడా*

*"త్వమ్"- నీవు*

*"సత్య ధర్మాయ దృష్టయే"- జీవుని ధర్మమైన పరమాత్మ దర్శనము కొఱకు*

*"అపావృణు"-ఆ ఆచ్ఛాదనను తొలగించుము*

**అని ఇందులో ఆ ఆచ్చాదన తొలగింపబడడానికి పరమాత్మను ప్రార్థిస్తున్నారన్న మాట. ఎందుకంటే దానిని మనము తొలగించుకుందామంటే అవదు కదా!**

***నేను:*** **తరువాత**

***వదిన:*** **తరువాత ఇంకేముంది, శరణాగతి చేస్తున్నారు హయగ్రీవ భగవానులకు. ఈ శ్లోకాన్ని చదివే మనచేత కూడా చేయిస్తున్నారు దేశికులు.**

**5."విశుద్ధ విజ్ఞాన ఘన స్వరూపమ్**

**విజ్ఞాన విశ్రాణన బద్ధ దీక్షమ్**

**దయానిధిమ్ దేహభృతామ్ శరణ్యమ్  దేవమ్ హయగ్రీవమ్ అహమ్ ప్రపద్యే"**

*విశుద్ధ: నిర్మలమైన*

*విజ్ఞాన ఘన: విజ్ఞాన నిబిడీతమైన*

*స్వరూపమ్: స్వరూపముగా గలవాడును*

*విజ్ఞాన: అట్టి విజ్ఞానమును*

*విశ్రాణన:ప్రసాదించుట (అను)*

*బద్ధ దీక్షమ్: దీక్షకు కట్టు బడినవాడును*

*దయానిధిమ్: దయకు నిధి అయిన వాడును*

*దేహభృతామ్: ప్రాణులకు*

*శరణ్యమ్: శరణమును అగు*

*హయగ్రీవ దేవమ్: హయగ్రీవ భగవానుని*

*అహమ్: నేను*

*ప్రపద్యే: శరణు పొందుచున్నాను.*

నిర్మలమైన విజ్ఞాన నిబిడిత స్వరూపుడును, అట్టి విజ్ఞానమును అనుగ్రహించుటయే దీక్షగా కలవాడును, దయకు నిధి అయినవాడును, ప్రాణులకు గొప్ప శరణమును అగు హయగ్రీవ భగవానుని నేను శరణు పొందుతున్నాను.

***నేను:*** విశేషార్థాలు చెబుతావా!

***వదిన:*** విశుద్ధ స్వరూపము, విజ్ఞాన విబిడిత స్వరూపము, విశుద్ధ విజ్ఞాన నిబిడిత స్వరూపము పరమాత్మ. అంటే పరమాత్మ నిర్మలుడు. నిబిడమైన జ్ఞానమే స్వరూపముగా కలవాడు. "విజ్ఞాన ఘన ఏవ" అని కదా బృహదారణ్యకోపనిషత్తు. అలా అని విజ్ఞానమే పరమాత్మ అని అనుకోకూడదు, ఎందుకంటే "పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలా క్రియాచ" అనగా "(ఆ పరమాత్మకు) గొప్పదియును, అనేక విధములును అగు శక్తి కలదు. స్వభావ సిద్ధములైన జ్ఞానమును, బలమును, క్రియయును కలదు" అని శ్రుతి వాక్యము. అంటే జ్ఞానమునకు ఆయన ఆశ్రయమైన వాడు కూడా. అందువలన సూర్యుడు, దీపము ఇలాంటివి తాము తేజో ద్రవ్యాలవుతూనే తమ "ప్రభ" / "కాంతి" అనే తేజో ద్రవ్యానికి ఆశ్రయమైనట్లు పరమాత్మ జ్ఞాన స్వరూపుడు, జ్ఞాన గుణకుడూ కూడా అని తెలుసుకోవాలి. రజస్తమో గుణదృష్టము కాని శుద్ధ సత్త్వము వలన కలిగిన నిర్మల తత్త్వ విజ్ఞానము అని చెప్పడానికి విశుద్ధ విజ్ఞానము అని అన్నారు. అట్టి జ్ఞానాన్ని మనకు అనుగ్రహించడానికి బద్ధ కంకణుడు అని చెబుతున్నారు తరువాతి పాదములో.

భగవద్గీతలో "జ్ఞానమ్ తే అహమ్ సవిజ్ఞానమ్ ఇదమ్ వక్ష్యామి అశేషతః

యత్ జ్ఞాత్వా నేహ భూయోన్యత్జ్ఞాతవ్యమవశిష్యతే" (అ 7-శ్లో2))అంటాడు, కృష్ణ పరమాత్మ. అంటే "ఏది తెలుసుకుంటే ఇక(ఈ విషయమై) తిరిగి తెలియ వలసినది ఉండదో ఆ విజ్ఞానముతో కూడా (భగవంతుడు చేతనా చేతన విశిష్టుడు అను జ్ఞానము) నీకు నేను నీ స్వరూప జ్ఞానమును చెప్పెదను" అని. అలాగే "తేషామ్ సతత యుక్తానామ్ భజతామ్ ప్రీతి పూర్వకమ్ దదామి

బుద్ధి యోగమ్ తమ్ యేన మాముపయాంతి తే" (అ 10-శ్లో 10) అని "తనను ప్రీతి పూర్వకముగా కొలుచు వారికి విజ్ఞాన యోగమును భగవానుడు తానే అనుగ్రహిస్తానని" భగవద్గీతలో చెప్పుకున్నాడు. ఈ రకంగా విజ్ఞాన ప్రదానమునందు దీక్షాబద్ధుడు స్వామి.

లోకమున సమస్త వాఙ్మయము వేదములనుండి లౌకికమైన విద్యల దాకా పరమాత్మ నుండి సద్వారకముగానో అంటే పరోక్షముగా అనగా తననుండి సంక్రమించిన వారినుండి వేరొకరు పొందడం అన్నమాట లేదా అద్వారకముగానో అంటే తననుండి నేరుగా చతుర్ముఖ బ్రహ్మకు సంక్రమించినట్లు గానో వచ్చినవే కదా.

"శక్తత్వే సతి దయావత్త్వమ్ శరణ్యత్వమ్" అనునది శరణ్యత్వ లక్షణము. అంటే ఆయనకు దయ ఉంటేనే శరణాగతి చేయగలము. జ్ఞానము ఆయన సర్వజ్ఞుడు, సర్వశక్తి మంతుడు, మొదలగు గుణాలతో ఆయన రక్షణా కార్యము నిర్వహించుటకు కలిగిన సామర్థ్యమును తెలియ చేస్తుంది.

దేవమ్ అను పదము ఆయన పరత్వము, స్వామిత్వము తెలుపుతూ ఆయనే ప్రాప్యము అని చెబుతుంది. దయానిధి, దేహ భృతామ్ శరణ్యుడు అనుట వలన ఆయన అంత గొప్పవాడైనా కారుణ్య, వాత్సల్య, సౌలభ్య, సౌశీల్యాది గుణాలు కలవాడని తెలుపుతూ మనకు అందుబాటులో ఉండేవాడే, "సుహృదమ్ సర్వ భూతానామ్" (భ.గీ. అ5-శ్లో28) అన్నట్లు మనకు ఆయనే

రక్షకుడు, శరణాగత వత్సలుడు అన్న విషయము తెలియజేస్తూ ఆయనే ప్రాపకము, ఉపాయము అన్న విషయము కూడా చెబుతుంది. "సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే అభయమ్

సర్వ భూతేభ్యః దదామి ఏతత్ వ్రతమ్ మమ" (రా. యు.కాం.)అని ఒక్కసారి నీవాడిని అంటే అన్న ఏ ప్రాణికి అయినా అభయము ఈయడం ఆయన వ్రతము కదా.

"అహమ్" అన్న పదము "ఆకించన్యత్వమూ(అంటే కర్మ, జ్ఞాన, భక్తుల యందు వానికి కారణమైన ఆత్మ గుణములయందు సంబంధములేక వాటికి వ్యతిరేకమైన గుణములతో కూడి యున్న తాను తన స్వరూపము సర్వ విధముల సర్వేశ్వరునికి పరతంత్రమన్న స్థితి తెలుసుకొని తాను నన్ను నేను ఉద్ధరించుకొనుటకు సమర్థుడను కాను అని తెలుసుకొని ఉండడము), అనన్య గతిత్వమూ(అంటే నువ్వు తప్ప నేను రక్షింపబడడానికి మరొక గతి లేదు) అన్న విషయాలు చెబుతుంది.

"ప్రపద్యే" అను వర్తమాన కాల క్రియను వాడడానికి కారణము "ప్రకృతితో కూడి యుండునట్టి రజస్తమో గుణాల వలన మనస్సు చలించి ఉపాయాంతరాల ప్రక్కకు దారి మళ్ళ కుండా ఒకసారి చేసిన ప్రపత్తిని మరల అనుసంధించుకొనుటకు అనువర్తిస్తుందని" ముముక్షుప్పడి లో చెబుతారు.

అంతేకాక వర్తమాన కాల క్రియకు ఈ ప్రపత్తి యందుగల భోగ్యత చేత విడనాడ లేకపోవడం, ఆ ప్రపత్తి తోటే కాలక్షేపము చేయడానికి అవకాశం కలగడం కూడా కారణాలే. అంతే కాని ఒకసారి ప్రపత్తి చేసిన తరువాత నమ్మకము లేక మళ్ళీ చేయడమని అనుకోకూడదు. ఫలసిద్ధి కోసం ప్రపత్తి మళ్ళీ చేస్తామంటే "సకృదేవ ప్రపన్నాయ..." అని అన్న శ్రీరామ చంద్రుని ప్రతిజ్ఞ మీద నమ్మకం లేనట్టు కదా. నమ్మకము లేనిచోట ఫలితముండదు. అందువలన సంపూర్ణ విశ్వాసం తోటే దేశికులు "హయగ్రీవుల వద్ద ప్రపత్తి చేస్తున్నారు. అంటే ఆశ్రయిస్తున్నారు అన్న మాట. "ఈ ఆశ్రయించడం వాచికంగా చేసినా, కాయికంగా చేసినాకూడా ఫలసిద్ధికి లోటు లేకపోయినా "జ్ఞానాన్మోక్షః" అనినట్లు మానసికంగా చేయవలెనని, అధికార పూర్తికి త్రికరణములతో చేయవలెనని" ముముక్షుప్పడిలో చెప్పినట్లు ఇక్కడ కూడా దేశికులు త్రికరణములతో శరణాగతి చేస్తున్నారు.

*నేను:* "అహమ్" అన్నప్పుడు "ఆకించన్యత్వము", "అనన్య గతిత్వము" అన్న విషయాలు అంతర్లీనమై ఉన్నాయేమో కాని స్పష్టంగా తెలియడం లేదే.

*వదిన:* తరువాత శ్లోకములో ఇంకా స్పష్టంగా ఆ విషయము చెబుతున్నారు.

*నేను:* ఏమిటి ఆ శ్లోకము?

***వదిన:*** ఎవరి వద్ద శరణాగతి చేయాలో వారికి కావలసిన గుణాలు అంటే పరత్వ, సౌలభ్యాలు పరమాత్మలో ఉన్నాయని ముందు శ్లోకములో చెప్పేరు కాని శరణాగతి చేస్తున్న తన ఆకించన్యత్వము, అనన్యగతిత్వము స్పష్టంగా చెప్పలేదని కదా నీ ప్రశ్న.

అసలు మన పూర్వాచార్యులు తమ తమ స్తోత్రాలలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూనే ఉంటారు. ఉదాహరణకు స్తోత్ర రత్నములో స్వామి యామునులు

"న ధర్మ నిష్ఠోస్మి న చ ఆత్మవేదీ

న భక్తిమాన్ త్వచ్చరణారవిందే

**అకిఞ్చనః అనన్యగతిః శరణ్య!**

**త్వత్పాదమూలమ్ శరణమ్ ప్రపద్యే!"**

**అని స్పష్టంగా పరమాత్మ అకిఞ్చన, అనన్యగతి శరణ్యుడని, తాను ధర్మ నిష్ఠుడు, ఆత్మ స్వరూపమును ఎఱిగినవాడు, భక్తియుతుడు కానని, భగవత్పాదారవిందములు తప్ప వేరొక గతి లేని తాను ఆ పాదమూలమును ఆశ్రయిస్తున్నానని చెబుతారు.**

**అలాగే దేశికులు కూడా ఇదే విషయాన్ని తరువాతి శ్లోకములో ప్రస్తావిస్తున్నారు.**

**6."అపౌరుషేయైః అపి వాక్ప్రపంచైః**

**అద్యాపి తే భూతిమ్ అదృష్టసారామ్**

**స్తువన్ అహమ్ ముగ్ధ ఇతి త్వయైవ**

**కారుణ్యతః నాథ కటాక్షణీయః"**

*నాథ: (నాకు) స్వామీ!*

*అపౌరుషేయైః: మానుషకృతములు కాని వేదములనెడి*

*వాక్ప్రపంచైః: (విస్తృతములైన) వాక్ సమూహములచే*

*అపి: కూడ*

*అద్య అపి: ఇప్పటికీ*

*అదృష్ట సారామ్: చూడబడని విశేషములు గల*

*తే: నీయొక్క*

*భూతిమ్: సంపదను, గొప్పదనమును*

*స్తువన్: స్తోత్రము చేయుచున్న*

*అహమ్: నేను*

*ముగ్ధ ఇతి: మూర్ఖుడను, వివేక హీనుడను అనియు*

*త్వయా ఏవ: నీచేత మాత్రమే(అనగా నాకు వేరొక రక్షణ లేదు అని భావము, నన్ను నేను ఉద్ధరించుకొనుటకు సమర్థుడను కాను, నాకు నీవు తప్ప ఉపాయాంతరములు ఏవియు లేవు అని భావము)*

*కారుణ్యతః ఏవ: (దేహలీ దత్త దీప న్యాయమున "ఏవ" కారము ఇఋువైపుల వర్తించును) నిర్హేతుకమైన కారుణ్యము చేత మాత్రమే( అనగా నాకు వేఱొక అర్హత లేదు అని భావము)*

*కటాక్షణీయః : కరుణింప బడ వలసిన వాడను.*

***నేను:*** దీనికి విశేషార్థాలు చెబుతావా!

***వదిన:*** వేదములు మానుష కృతములు కాదు, సాక్షాత్తూ భగవానుని చేత చతుర్ముఖ బ్రహ్మకు ఈయబడినవి. అట్టి వేదములే పరమాత్మ గుణాలలో ఆనందమనే ఒక గుణాన్నే గణించడం ప్రారంభించి అశక్యమని వెనుకకు మరలి పోయినాయి. "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని కదా. ఆ పరమాత్మ గుణ, విభూత్యాదులను వర్ణించడం అత్యంత విస్తృతములైన ఆ వేదములకే చేత కాలేదు, వివేక హీనుడనైన నాచేత ఎలా అవుతుంది అంటున్నారు.

ఎవరినయినా స్తోత్రము చేయాలంటే ఆయనలో లేని గొప్ప గుణాలేనా ఆపాదించి స్తుతించాలి, లేదా ఉన్న గుణాలను ఉన్నట్లు చెప్పాలి. పరమాత్మ విషయంలో ఈ రెండూ కూడా కుదరవు. ఎందుకంటే ఆయనలో లేని గొప్ప గుణాలు అంటూ ఏమీ ఉండవు, ఇంక ఆయనలో గుణాలనే యథాతథముగా వర్ణించుదామన్నా వాటి అవధులు చెప్పడానికి తనకు సామర్థ్యమూ లేదు, విజ్ఞానానికి ప్రమాణాలైన వేదాలకు కూడా చేతనవలేదు కనుక వాఙ్మయమూ దుర్లభమే.

అయితే తను స్తోత్రము చేయడానికి ఎందుకు తయారవడం అంటే తనకు వివేకము లేక అంటున్నారు. "భగవద్గీత లో కృష్ణ పరమాత్మ చెప్పినట్లు "నాంతః అస్తి మమ దివ్యానామ్ విభూతీనామ్ పరంతప" అని అన్నట్లు ఆయన విభూతులకు అంతు, అవధి ఉండవు కదా! (ఈ సందర్భమున "యస్యామతమ్ తస్యమతమ్" అనగా పరమాత్మను ఎవరు పూర్తిగా తెలుసుకోవడం సాధ్యము కాదని తెలుసుకుంటారో వారు తెలుసుకున్నవారు అన్నమాట" అను శ్రుతి వాక్యము స్మరణీయము)

మన పూర్వాచార్యులు కూడా ఎంతో మంది ఇలా నైచ్యానుసంధానము చేసినవారే. "మహ్యమ్ నమోస్తు కవయే నిరపత్రపాయ" అని (నిన్ను స్తుతించడానికి చేతకాక పోయినా సిద్ధపడిన )లజ్జ లేని నాలో కవికి నమస్కారము అని అంటారు యామునులు తన స్తోత్ర రత్నములో. కాని "కో మజ్జతో రణు కులాచలయోః విశేషః" అని, పూర్తిగా (గుణ సాగరములో) మునిగి పోయేదానికి పరమాణువు అయితేనేమి, కుల పర్వతమయితేనేమి, అని తృప్తి పడతారు.

ఇలాగే కూరత్తాళ్వాన్, భట్టర్ మొదలైన వారి స్తోత్రాలలో ఇలాంటి అనుసంధానాన్ని చూస్తాము. దేశికులు ఆ పూర్వాచార్యులననుసరించి తాను కూడాఅలాగే నైచ్యాను సంధానము చేస్తున్నారు, మనచేత చేయిస్తున్నారు.

వేదములు "అనంతా వై వేదాః " అన్నట్లు బహు విస్తృతములు, అపౌరుషేయములవడం వలన వాటికి మానవ మాత్రులకు ఉండే భ్రమ, ప్రమాదము, అజ్ఞానము, అశక్తి వంటి దోషములు ఉండవు. అట్టి వేదములకే చేత కాలేదు, నిన్ను స్తోత్రము చేయడం, వివేక హీనుడనైన నాకు తరమా, అంటున్నారు. అయితే నిన్నెందుకు రక్షించాలి అంటే, అంటే నేను వివేక హీనుడనవడం వలన ఏది సాధ్యమో, ఏది అసాధ్యమో కూడా తెలియని వాడిని. అందువలన నన్ను నేను ఉద్ధరించుకొనగల సామర్థ్యము లేనివాడను, వేరొక ఉపాయము లేని వాడను, కనుక.

పోనీ మరొకరెవరూ నీకు రక్షకులు లేరా, అంటే అలా కాదు నేను నీ చేత మాత్రమే రక్షింప బడాలి, ఎందుకంటే నువ్వే నాకు "నాథుడివి", అంటే నేను నీ సొత్తుని, అందు వలన తన సొత్తును కాపాడుకొనడం దాని స్వామికి బాధ్యత అయినట్లు, నన్ను రక్షించు బాధ్యత నీదే అంటున్నారు.

సొత్తయితే కనీసము ప్రతికూల ప్రయత్నము చేయకూడదు కదా, రక్షిద్దామంటే, అంటే, అందుకేగా నీ కారుణ్యము, నేను ప్రతికూలముగా ప్రవర్తించినా నిర్హేతుకమైన నీ కారుణ్యము నన్ను వదలివేయక, కంటి కొసలలోంచి (కటాక్షములు) ప్రసరించి నన్ను రక్షిస్తుంది అని దేశికుల భావన.

"కారుణ్య" అని అనడం వలన "దేవ్యా కారుణ్య రూపయా" అన్నట్లు అమ్మ పరమాత్మ తోడనే ఉన్నట్లు, తాను లక్ష్మీ సమేతుడైన హయగ్రీవ స్వామి వద్దనే ప్రపత్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. "కార్యమ్ కరుణమ్" అని కదా సీతమ్మ హనుమకు చెప్పినది.

"కటాక్షాన్" అనడం వలన "లక్ష్మీ కల్పవల్లీ కటాక్షాన్" అని భట్టర్ తన "శ్రీగుణ రత్న కోశము" లో అన్నట్లు అమ్మ క్రీగంటి చూపులతో కరుణించడం గుర్తుకు వస్తుంది.

మందలోంచి తప్పిపోయి తప్పు మార్గములో వెళ్ళిపోయిన లేగ దూడను ఆవు మళ్ళీ దాని వెనుక వెళ్ళి తీసుకొని వచ్చినట్లు మనలను ఉద్ధరిస్తుంది కారుణ్యము, కారుణ్య రూపిణి అయిన అమ్మ. ఆమ్మ పరమాత్మతో ఎప్పుడు చేరి యుండి, పరమాత్మ ఎప్పుడయినా "క్షిపామి", "నక్షమామి" అని మనపై కోపగించినపుడు "న కశ్చిత్ నాపరాధ్యతి" అని చిన్న అపరాధమైనా చేయని వారెవరు అనుచు పరమాత్మను సుముఖుని చేసి మనలను ఉద్ధరింప పురుషకారము చేయునది అని "ముముక్షుప్పడి లో చెబుతారు కదా!

***నేను:*** మఱి చదువులకు "సరస్వతి దేవి" ని పూజించాలంటారు కదా!

***వదిన:*** ఆ "సరస్వతీ దేవి" కూడా పూజించేది హయగ్రీవ భగవానుడినే కదా! తాను పూజించుకొనే హయగ్రీవ అర్చామూర్తినే "సరస్వతీ దేవి" శ్రీభాష్యాన్ని ప్రశంసించిన తరువాత భగవద్రామానుజులకు ప్రసాదించినది, ఇప్పుడు మైసూర్ పరకాల మఠములో వేంచేసి యున్నదీ ఈ మూర్తియే కదా.

అయినా నీ సందేహము తీర్చడానికే అన్నట్లు తరువాత శ్లోకము చెబుతున్నారు దేశికులు.

7."దాక్షిణ్య రమ్యా గిరిశస్య మూర్తిః

దేవీ సరోజాసన ధర్మ పత్నీ

వ్యాసాదయః అపి వ్యపదేశ్య వాచః

స్ఫురంతి సర్వే తవ శక్తి లేశైః"

*దాక్షిణ్య రమ్యా: విద్యా ప్రదానము చేత రమ్యమైన*

*గిరిశస్య : పార్వతీ పతి (రుద్రుని) యొక్క*

*మూర్తిః: రూపమును*

*సరోజాసన ధర్మపత్నీ : చతుర్ముఖ బ్రహ్మ యొక్క ధర్మపత్ని యగు*

*దేవీ: సరస్వతీ దేవియు*

*వ్యపదేశ్య వాచః: ప్రసిద్ధి పొందిన విద్వత్కవులయిన*

*వ్యాసాదయః: వ్యాసుడు మొదలగు వారు*

*అపి: కూడా*

*సర్వే: అందఱును*

*తవ: (నీచే ప్రసాదింపబడిన) నీయొక్క*

*శక్తి లేశైః: అత్యంత స్వల్పమైన శక్త్యంశము చేత*

*స్ఫురంతి : ప్రకాశించుచున్నారు*

***నేను:*** దీనికి విశేషార్థాలు చెబుతావా!

***వదిన:*** "శంకరాత్ జ్ఞానమన్విచ్ఛేత్" అని అన్నట్లు రుద్రుని జ్ఞాన ప్రదాత యనీ, విద్యా ప్రదానములో ప్రసిద్ధి చెందిన దక్షిణామూర్తిని విద్యార్థులు పూజించాలని కొందరు అంటారు. "దక్షిణామూర్తి" అంటే తెలుసును కదా, చిన్ముద్రతో ఒక వట వృక్షము క్రింద ధ్యానము చేస్తున్నట్లు దక్షిణముఖంగా కూర్చుని ఉన్న పతాలూ అవీ చూసి ఉంటావు. ఆయనకు ఎదురుగా నలుగురు శిష్యులు కూడా క్రింద కూర్చుని ఉంటారు. వారు అగస్త్యుడు, పులస్త్యుడు, దక్షుడు, మార్కండేయుడు.

"చిత్రమ్ వటతరోః మూలే వృద్ధాః శిష్యాః గురుః యువా

గురోః చ మౌనమ్ వ్యాఖ్యానమ్ శిష్యాస్తు ఛిన్న సంశయాః"

అన్న శ్లోకము కూడా విని ఉంటావు. అంటే వట వృక్ష మూలమున నున్న శిష్యులు వృద్ధులు, గురువు గారు యువకుడు. గురువుగారు మౌనము తో శిష్యులకు పాఠము విశదీకరిస్తున్నారు. (అందుచే) శిష్యులకు తమ సందేహములు పోయినవి. చిత్రము (కదా!). అని ఆ శ్లోకానికి అర్థము.

రుద్రుని అపర రూపమైన ఈ దక్షిణామూర్తికి విజ్ఞానము హయగ్రీవ భగవానుల స్వల్పమైన శక్తి ప్రభావము వలన వచ్చినది.

అలాగే బ్రహ్మ మానస పుత్రి, చతుర్ముఖ బ్రహ్మ నాలుకపైనుండెడిదీ, ఆయన సహధర్మ పత్ని అయిన "సరస్వతీ దేవి" కూడా చదువుల తల్లి గా ప్రసిద్ధి పొందడం ఆమె పూజించే హయగ్రీవుల కృపాలేశముల వలననే.

వ్యాస, వాల్మీకి, పరాశరాది మహర్షులు, కవులు భారత, రామాయణ, విష్ణు పురాణాది గ్రంథములు రచించడానికి జ్ఞానము కలుగుటకు కారణము హయగ్రీవ భగవానుల శక్త్యంశము హయగ్రీవుల అనుగ్రహము వలన వారు పొందుటయే.

"శ్రీమన్మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మేంద్ర గంగాధరామ్" అని అమ్మ కడ గంటి చూపు కొంచెం పడడం వలన బ్రహ్మేంద్ర గంగాధరులు వారి స్థానాలు పొంది నట్లు, దక్షిణామూర్తి, సరస్వతీ దేవి, వ్యాస, వాల్మీక, పరాశరాదులకు కూడా వారి గొప్పదనమునకు కారణము హయగ్రీవుల చే వారికి అనుగ్రహింపబడిన ఆయన అనుగ్రహ పూర్వకమైన శక్త్యంశమే.

ఈ సందర్భమున భగవద్గీత యందలి "యద్య ద్విభూతిమత్ సత్వమ్ శ్రీను దూర్జిత మేవ వా

తత్త దేవావగచ్ఛధ్వమ్ మమ తేజోంశ సంభవమ్" అను

శ్లోకమున భగవానుడు ఈ విభూతి అంతయు తన తేజము యొక్క అంశము నుండి సంభవించినదనిన విషయము, "రుద్రాణామ్ శంకరః చాస్మి" అను శ్లోకమున శంకరుడు తన అంశమే అన్న విషయము( అధ్యాయము 10), కఠోపనిషత్ యందు "స తత్ర సూర్యో భాతి ....తస్య భాసా సర్వమిదమ్ విభాతి" అని లోకము సర్వము భగవానుని దివ్య తేజస్సు చే ప్రకాశించుచునన్న విషయమూ కూడా స్మరణీయములు.

***నేను:*** దేశికులు వైష్ణవ పక్షపాతముతో శివుడు కూడా హయగ్రీవుని ప్రభావము వలననే విద్యలకు గురువు అయినాడని అంటున్నారా, లేక ....

***వదిన:*** దేశికులు ప్రమాణము లేకుండా ఏదీ పలుకరు.

ఈ విషయాన్నే ఈ క్రింద ఋగ్వేద మంత్రము (మండలము 5, సూక్తము 3, మంత్రము 3) కూడా చెబుతున్నది.

"తవ శ్రియే మరుతో మర్జయంత రుద్ర యత్తే జనిమ చారు చిత్రమ్

పదమ్ యద్విష్ణోః ఉపమమ్ నిధాయ తేన పాసి గుహ్యమ్ నామ గోనామ్"

*రుద్ర: ఓ రుద్రా!*

*యత్: ఏ కారణము వలన*

*తే: నీ యొక్క*

*జనిమ: జన్మ*

*చారు: అందమైనదిగా*

*చిత్రమ్: ఆశ్చర్యకరమైనదిగా(అయినదో అందువలననే)*

*తవ: నీయొక్క*

*శ్రియే: సంపదను(పొందడానికి)*

*యత్ విష్ణోః ఉపమమ్ పదమ్: విష్ణువు యొక్క తనకు తానే సాటి అయిన పాదము*

*నిధాయి: పెట్టబడినదో(దానిని)*

*మరుతః: దేవతలు*

*మర్జయంత: అభిషేకము చేస్తున్నారు*

*తేన: ఆ విష్ణువు అనుగ్రహము కలగడం చేత*

*గోనామ్: విష్ణువును తెలుపు నామములయందు*

*గుహ్యామ్: అతి రహస్యమైన*

*నామ: నామమును*

*పాసి: పొంది (నీవు జపించుచుందువు).*

**అంటే రుద్రునికి శ్రీమన్నారాయణుని కృప వలన ఆయన నామము లభించి ఆ నామ జపము చేయడం చేయుచుండడము వలన నీ జన్మ రమ్యమైనది, ఆశ్చర్య కరమైనది అయినది. అట్టి నీలాగే ఐశ్వర్యము (తరువాత జన్మలలో) పొందడానికి దేవతలు కూడా (త్రివిక్రమావతార సందర్భంలో) నిరుపమాన మైన ఆవిష్ణు మూర్తి పాదమునకు అభిషేకము చేయుచున్నారు అని అర్థము.**

**ఇక్కడ "చారు" అన్న పదానికే మన దేశికులు "రమ్యా" అని వాడేరు. ఇంతకుముందు "చిత్రమ్ వటతరోః మూలమ్" అన్నట్లు**

చిత్రమైన, రమ్యమైన దక్షిణామూర్తిగా జ్ఞాన ప్రద స్థానము రుద్రునికి రావడానికి కారణము పరమాత్మానుగ్రహమే అని తెలుస్తోంది.

ఇక్కడ "తరోః మూలే" అంటే వృక్షము మూలము నందు ఉన్నాడు ఈయన. "వృక్ష ఇవ" అంటూ వృక్షంగా చెప్పబడే విష్ణువునకు "వయాః" శాఖ వంటివాడు రుద్రుడనీ, ఆయన తాను విష్ణువును తపస్సు చేసి తన పదవిని పొందేడనీ ఋగ్వేదము మండలము 7, సూక్తము 41, మంత్రము 5 చెబుతుంది.

అందువలన దక్షిణామూర్తికి ఆయన స్థానము పరమాత్మ ప్రసాదమే.

అయినా, సృష్టికి ముందు పరమాత్మే ఉండి, తాను చతుర్ముఖ బ్రహ్మను సృష్టించగా, ఆయన వలన కదా సరస్వతీ దేవి అయినా, రుద్రుడైనా, మిగిలిన మహర్షులైనా సృష్టింప బడినారు. అలాంటప్పుడు, వాళ్ళందరికీ జ్ఞానం ఆదిమూర్తి అయిన ఆ పరమాత్మ నుండి రావలసినదే కదా, అందులో సందేహమేమున్నది.

అంతేకాక, నువ్వు శ్రీభాష్యంలో "అంతర్యామ్యధికరణము లోను అక్కడా చదువుకొనే ఉంటావు, భగవద్గీతలో కృష్ణ పరమాత్మ చెప్పనే చెప్పేడు. రుద్రుడైనా, సరస్వతి, వ్యాసాదులయినా అయినా ఆయా దేవతలలో అంతర్యామిగా  ఉండి ఆయా కార్య నిర్వహణ చేయించువాడు కూడా పరమాత్మయే కదా. (వ్యాసాయ విష్ణు రూపాయ అని చదువుకుంటాము కదా, వ్యాసుడు కూడా ఆ పరమాత్మ అంశావతారమే) అందువలన ఆయా రూపాలలో జ్ఞాన ప్రదాన కార్య నిర్వహణకు కూడా మూల కారణము హయగ్రీవ భగవానుడే.

మరొక విషయము, పార్వతీదేవికి హయగ్రీవ కవచాన్ని ఉపదేశించినది రుద్రుడే.

"పుత్ర వాత్సల్యతో మహ్యామ్ విరించిః ఉపదిష్టవాన్

హయాస్య కవచస్యాస్య ఋషిః బ్రహ్మ ప్రకీర్తితః "

అంటూ తనకు తన తండ్రి అయిన చతుర్ముఖ బ్రహ్మ పుత్ర వాత్సల్యముతో "హయగ్రీవ కవచాన్ని" తనకు ఉపదేశించేడని,

పరమశివుడు పార్వతీదేవికి చెబుతాడు. అందుచేత హయగ్రీవ భగవానుడు ఆయనకూ ఉపాస్యుడే.

*నేను:* అంటే రుద్రునికి ఉపదేశించినవాడు, సరస్వతికి భర్త అయినవాడు అయిన చతుర్ముఖ బ్రహ్మ నే ప్రార్థించవచ్చు కదా! మన ఇబ్బంది ముందుగా మన ఊర్లో ప్రెసిడెంట్ కో, మేయర్ కో చెప్పుకోకుండా ముందు

PM గారి దగ్గరకు వెళ్ళాలా, చతుర్ముఖ బ్రహ్మ అయితే మన లీలా విభూతిలో ఉంటాడు, సులభంగా వరాలూ అవీ ఇస్తూఉంటాడు కదా!

***వదిన:*** నిజమే, కాని ఎప్పుడు, ఆ ప్రెసిడెంటో, మేయరో సమర్థుడయి, ఆ PM అందుబాటు లో లేకపోతే అంటే సులభుడు కాకపోతే. కాని చతుర్ముఖ బ్రహ్మ, హయగ్రీవ స్వామి విషయంలోఅలా కాదు కదా.

ముందు ఆ చతుర్ముఖ సమర్థత ఎంతో చెబుతున్నారు తరువాతి శ్లోకములో.

8"మందః అభవిష్యత్ నియతమ్ విరించిః

వాచామ్ నిధే! వంచిత భాగధేయః

దైత్యాపనీతాన్ దయయైవ భూయః అపి

అధ్యాపయిష్యః నిగమాన్ నచేత్ త్వమ్"

*వాచామ్ నిధే: వాక్కులకు నిధి అయిన ఓ హయగ్రీవ స్వామీ!*

*త్వమ్: నీవు*

*దైత్య: మధు కైటభులను రాక్షసులచే*

*అపనీతాన్: అపహరింపబడిన*

*నిగమాన్: వేదములను*

*దయయా ఏవ: నిర్హేతుక కృప చేతనే*

*భూయః అపి: మరల కూడా*

*న అధ్యాపయిష్యః చేత్: ఉపదేశింపక పోయినచో*

*విరించిః: చతుర్ముఖ బ్రహ్మ*

*వంచిత: మోసగింపబడిన(అపహరింపబడిన)*

*భాగధేయః : (వేదమను) భాగ్యము కలవాడై*

*నియతమ్: తప్పక*

*మందః: అజ్ఞుడు*

*అభవిష్యత్: అయి యుండును*

వాక్కులకు నిధి అయిన హయగ్రీవ ప్రభూ! (మధు కైటభులను) దైత్యులు వేదములను అపహరించినపుడు నీవు నిర్హేతుక కృపతో హయగ్రీవ రూపమును దాల్చి వారిని దునుమాడి తిరిగి వేదములను చతుర్ముఖునకు అనుగ్రహించి యుండనిచో ఆతడు కూడ తన పని అయిన సృష్టి కార్యమునకవసరమైన జ్ఞానము లేక మంద బుద్ధియై వేదవిజ్ఞానము లేని అభాగ్యుడై యుండెడి వాడు కదా!

***నేను:*** ఈ శ్లోకానికి కూడా విశేషార్థాలేమైనా ఉన్నాయా!

***వదిన:*** ఉన్నాయా అని అడగకు, నీకు తెలుసా అని అడుగు, ఎందుకంటే దేశికుల పలుకులలో విశేషార్థాలు అనేకాలు. అందులో మనకు తెలిసినవి అతి స్వల్పము.

నువ్వడిగేవే, చతుర్ముఖుడినే ఎందుకు ప్రార్థించకూడదు అన్న ప్రశ్నకు ఈ శ్లోకములో సమాధానము చెబుతున్నారు.

"స భూః ఇతి వ్యాహరత్, స భూమిమ్ అసృజత" అనగా "అతడు భూః అని వ్యాహృతి అభ్యాసము చేసెను, భూమిని సృజించెను" అని అన్నట్లుగా శ్రుతిని బట్టి వేదోచ్చారణ వలన బ్రహ్మకు సృష్టి కార్యోపయోగమైన జ్ఞానము కలుగుతుంది. "వేదా మే పరమమ్ చక్షుః వేదా మే పరమమ్ ధనమ్" అని ఆ చతుర్ముఖుడే అన్నట్లుగా దృష్టియు, సంపదయు ఆయనకు వేదములే కదా, ఆ వేద జ్ఞానమే లేకపోతే ఆయన మంద బుద్ధియు, అపహరిత భాగ్యుడును అవుతాడు. విరించి అంటే "విరచయతి సృష్టిః ఇతి విరించిః" అని సృష్టి చేసేవాడని కదా అర్థము. వేద జ్ఞానమే లేకున్ననాడు ఆయన సృష్టి చేయలేనివాడవుతాడు. చతుర్ముఖునికి అట్టి పరిస్థితి ఒకసారి కాదు, ఱెండు సార్లు కలిగింది, ఒక సారి మధు కైటభుల వలన, మఱియొక సారి సోమకాసురుని వలన. అప్పుడు ఆయనకు "వేదమధ్యాపయత్ విధిమ్" అనియు "యో బ్రహ్మాణామ్ విదధాతి పూర్వమ్ యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై" అనినట్లు మళ్ళీ మళ్ళీ పరమాత్మ అనుగ్రహించి యుండనిచో ఆ చతుర్ముఖుడు బిక్క ముఖం వేయాల్సి ఉండేదే కదా!.ఆ చతుర్ముఖ బ్రహ్మ "బ్రహ్మైతు

మామ్ మధుమేతుమామ్ బ్రహ్మేవ మధుమేతు మామ్ యాస్తే సోమ ప్రజావత్స్యోపి సః అహమ్" అంటూ తనను రక్షించమని ప్రార్థిస్తే అప్పుడు పరమాత్మ ఆయనకు మళ్ళీ ఉపదేశము చేసేడుట.

ఈ రకంగా భ్రమ, ప్రమాదము, అశక్తి మొదలైన లోపములతో ఉండే మరియొక జీవుడైన చతుర్ముఖ బ్రహ్మ కంటే అఖిల దోష ప్రత్యనీకుడు, సమస్త విజ్ఞాన ప్రదాత, భక్త సులభుడు అయిన హయగ్రీవ భగవానుడినే ఆశ్రయించడం మనకు యోగ్యమైనది కదా!

ఇక్కడ మళ్ళీ మళ్ళీ అని సూచించడానికి "భూయః అపి" అని అన్నారు.

"వాచామ్ నిధే" అనడం వలన మన దగ్గర ఎప్పుడు జ్ఞాన సంపద (తరిగి) పోతే అప్పుడు మనము ఆ చతుర్ముఖ బ్రహ్మ లాగే ఆశ్రయించడానికి తగిన వాడు అని తెలుస్తోంది.

***నేను:*** మరి దేవతల గురువైన బృహస్పతి మాటేమిటి?

***వదిన:*** ఆయన గురించి కూడా తరువాతి శ్లోకంలో చెబుతున్నారు.

***నేను:*** ఏమిటి ఆ శ్లోకము

***వదిన:*** బుద్ధికి బృహస్పతి అంటారు కదా, ఆయనను ఆశ్రయించకూడదా అంటే చెబుతున్నారు.

9."వితర్క డోలామ్ వ్యవధూయ సత్త్వే

బృహస్పతిమ్ వర్తయసే యతః త్వమ్

తేనైవ దేవ త్రిదశేశ్వరాణామ్

అస్పృష్ట డోలాయతమ్ ఆధిరాజ్యమ్"

*దేవ: హయగ్రీవ స్వామీ!*

*యతః: ఎందువలన*

*త్వమ్: నీవు*

*బృహస్పతిమ్: (దేవతల గురువైన) బృహస్పతిని*

*వితర్కడోలామ్: దుస్తర్కముల చేత కలిగిన మనో చాంచల్యము నుండి*

*వ్యవధూయ: నివారించి*

*సత్త్వే: సత్త్వ(గుణ) మార్గమున*

*వర్తయసే: ప్రవర్తించునట్లు చేయుచున్నావో*

*తేన ఏవ: ఆ కారణము చేతనే*

*త్రిదశేశ్వరాణామ్: దేవేంద్రాదులయొక్క*

*ఆధిరాజ్యమ్: ఆధిపత్యము*

*అస్పృష్ట డోలాయితమ్: ఊగిసలాటను లేనిదిగా*

*(అగుచున్నది)*

ఓ హయగ్రీవ స్వామీ! నీవు దేవగురువైన బృహస్పతిని దుస్తర్కముల వలన కలిగిన మనో చాంచల్యము నుండి నివారించి సత్త్వ గుణ మార్గమున నడచుకొను నట్లు చేయుట వలననే దేవేంద్రాదుల ఆధిపత్యము స్థిరముగా కొనసాగు చున్నది కదా!

***నేను:*** బృహస్పతికి మనో చాంచల్యము కలిగిందా, అదెప్పుడు. ఆయన మనో చాంచల్యము పోతే దేవేంద్రాదులకు స్థిరత్వము వచ్చినదా!

***వదిన:*** మనో చాంచల్యము ఎప్పుడు కలుగుతుంది, రజ, స్తమో గుణాలు ప్రకోపించి నప్పుడు. మనము ఇంతకు ముందు అనుకున్నట్లు లీలా విభూతి లో ఉన్న ఏ జీవుడికైనా రజ, స్తమో గుణ ప్రభావముంటుంది కదా.

భగవద్గీతలో చెబుతారు

"అజ్ఞశ్చ అశ్రద్ధధానశ్చ సంశయాత్మా వినశ్యతి

నాయమ్ లోకోస్తి న పరః న సుఖమ్ సంశయాత్మనః"(అధ్యాయము 4, శ్లోకము 40)

"ఉపదేశము వలన జ్ఞానము లభింపని వాడును, ఉపదేశింపబడినను దాని వృద్ధియందు త్వర/ శ్రద్ధ లేని వాడును, దానియందు సంశయము కలవాడును నశింతురు" అని కదా గీతాచార్యుడు పలికేడు.

అలాగే బృహస్పతికీ రజ,స్తమో ప్రభావము కలిగింది. కలిగి, చార్వాకమనే నాస్తిక మతాన్ని ప్రతిపాదించేడాయన.

అసలు బృహస్పతి చతుర్ముఖ బ్రహ్మ మానస పుత్రుడైన అంగీరసుని కుమారుడు. అంగీరసునికీ, ఆయన భార్య శ్రద్ధా దేవికీ నలుగురు పుత్రులు, వారు అగ్ని, సమవర్తుడు, ఉతథ్యుడు, బృహస్పతి. బ్రహ్మ విద్యా పారంగతుడైన అంగీరసుని లాగే, బృహస్పతి కూడా సర్వ విద్యా ప్రవీణుడై దేవగురు స్థానాన్ని పొందేడు. మహర్షి భరద్వాజుడు ఈయన కుమారుడే. ఈయన దర్శించిన మంత్రములు మనకు ఋగ్వేదములో మం. 10, సూ.72 లో కనబడతాయి. జ్యోతిర్విజ్ఞానానికి(అంతరిక్ష విజ్ఞానానికి) ఈయనే దార్శనికుడు. ఈయన పేరుమీద "బృహస్పతి సంహిత" అని సంహిత కూడా ఉన్నది. అంత గొప్పవాడైనా కూడా అజ్ఞాన, సంశయ, విపర్యయాదులకు లోనై దైవమే లేదని చెప్పే చార్వాక మతాన్ని ఒక సందర్భంలో ప్రతిపాదించేడీయన.

"సత్త్వే సంజాయతే జ్ఞానమ్" (భ.గీ. అ. 14, శ్లో. 17) అని కదా,అంటే సత్త్వ గుణము వలన జ్ఞానము కలుగుతుంది. అలా కాక సత్త్వ గుణము తగ్గి తక్కిన గుణాలు విజృంభస్తే "రజో రాగాత్మకమ్ విద్ధి తృష్ణా సంగ సముద్భవమ్" (భ.గీ. అ 14, శ్లో 7)అని భగవద్గీత లో చెప్పినట్లు రజో గుణమువలన స్త్రీ పురుషుల మధ్య పరస్పరము ప్రేమ, కామము పుట్టడం, విషయ భోగములననుభవించాలనే కోరిక కలగడం, ఇలా విషయానుభవాల ప్రక్కకు మనస్సు మళ్ళుతుంది. ఇదే పరిస్థితి బృహస్పతికి కూడా కలిగింది. అప్పుడు విషయానుభవమే జీవిత పరమార్థమనే చార్వాకమతాన్ని బృహస్పతి ప్రచారము చేసేడు. తరువాత హయగ్రీవ భగవానుల అనుగ్రహము వలన సత్త్వగుణ మార్గమున ప్రవర్తించి దేవేంద్రాదులకు గురువుగా కొనసాగేడు. గురువులేని దేవతలు దైత్యుల చేతిలో పరాభవము పొందడమూ జరిగింది. తరువాత పరమాత్మ కృప వలన అన్నీ సర్దుకున్నాయి అనుకో.

దేవగురువైన బృహస్పతికీ తిప్పలు తప్పలేదు అని అంటున్నారు దేశికులు ఈ శ్లోకములో.

*నేను:* మఱి యజ్ఞాలూ అవీ వివిధ దేవతలకు చేస్తారు కదా వేఱు వేఱు ఫలాలకోసం. ఉదాహరణకు నీరు కావాలని యజ్ఞం చేసినప్పుడు "వరుణాయ స్వాహా వరుణాయ ఇదమ్ నమమ",  అని అంటూ ఆయా

దేవతలకు హవిస్సు అర్పించడం, పూజలు చేయడం చేస్తారు ఆయా ఫలాలు పొందడానికి. అలాగే విద్యకు, విజ్ఞానానికి ఎవరైనా దేవతలకు యజ్ఞం  చేయడం, ఆశ్రయించడం చేయకూడదా?

***వదిన:*** వారెవరైనా కూడా స్వతంత్రులు కారు, పరమాత్మ నియమించిన ప్రకారము ఆయా దేవతలు తమ తమ విధులను నిర్వహిస్తూంటారు, అంతే. నిజంగా హవిర్భాగాలను స్వీకరించేది, ఆ యజ్ఞాల ఫలితాలను ప్రసాదించేది ఆయా దేవతల అంతర్యామిగా నున్న పరమాత్మే. ఆ విషయాన్నే తరువాత శ్లోకములో చెబుతున్నారు.

10."అగ్నౌ సమిద్ధార్చిషి సప్త తంతోః

ఆతస్థివాన్ మంత్రమయమ్ శరీరమ్

అఖండసారైః హవిషామ్ ప్రధానైః

ఆప్యాయనమ్ వ్యోమసదామ్ విధత్సే"

*సమిద్ధార్చిషి:దీప్త జ్వాలలను కల*

*సప్త తంతోః: సప్త తంతు అనబడు*

*అగ్నౌ : అగ్ని యందు*

*మంత్రమయమ్: వేదమంత్ర రూపమైన*

*శరీరమ్: శరీరమును*

*ఆతస్థివాన్: పొందినవాడవై*

*అఖండ సారైః: సమగ్రమైన సారమును గల*

*ప్రధానైః: పురోడాశయము మొదలగు ప్రధానములైన*

*హవిషామ్: హవిస్సులతో*

*వ్యోమసదామ్: దేవతలకు*

*ఆప్యాయనమ్: తృప్తిని*

*విధత్సే:కల్గించు చున్నా వు*

బాగుగా వెలుగొందు జ్వాలలను కలిగిన యజ్ఞాగ్ని యందు వేద మంత్ర మయమైన శరీరమును కలవాడవై ఆ యజ్ఞములయందు సమర్పింపబడిన హవిస్సులను నీవు గ్రహించి దేవతలకు తృప్తిని కల్గించుచున్నావు.

***నేను:*** ఇదేమిటి, అగ్ని హోత్రములో "వరుణాయ స్వాహా" అనీ "సోమాయ స్వాహా" అని హవిస్సు అర్పిస్తే దానిని స్వీకరించే వాడు భగవానుడా, ఆయన స్వీకరిస్తే ఆయా దేవతలు తృప్తి చెందుతారా, ఇదెలా? నేను తింటే నీకు ఆకలి తీరినట్లు.

***వదిన:*** అగ్ని హోత్రము ఏడు జ్వాలలు కలిగి ఉంటుందట.

"కాళీ కరాళీ చ మనోజవా చ

సులోహితా యా చ సుధూమ్రవర్ణా

స్ఫులింగినీ విశ్వరూపీ చ దేవీ

లేలాయమానా ఇతి సప్త జిహ్వాః"

(ముండకోపనిషత్, ఖండము 2, మంత్రము 4)

అని నట్లు హోమ సమయమున పైకి ఎగయునవి ఏడు అగ్ని జ్వాలలు కాళీ, కరాళీ, మనోజవా, సులోహితా, సుధూమ్రవర్ణా, స్ఫులింగినీ, విశ్వరూపీ అని వాటి పేర్లు. ఇలా నిర్వహించబడే యజ్ఞములకు అధిపతి పరమాత్మే.

"అహమ్ క్రతుః అహమ్ యజ్ఞః స్వధా అహమ్ అహమౌషధమ్

మంత్రోహమ్ అహమేవాజ్యమ్ అగ్నిరహమ్ హుతః" (భ.గీ. 9-16) అని భగవానుడే అన్నట్లు యజ్ఞమును, యజ్ఞాధిపతియు పరమాత్మయే. "యజ్ఞో యజ్ఞపతిః యజ్వా..." అని విష్ణు సహస్రనామాలలో 18 నామాలు చదువుతాము కదా. ఈ విషయమే దేవతలకు తెలియచెప్పడానికి ఒకసారి చతుర్ముఖ బ్రహ్మ

నిర్వహించిన అశ్వమేథ యాగములో స్వామి వేంచేసి యజ్ఞ స్వరూపుడై వివిధ దేవతా నామములతో నీయబడిన హవిస్సులను తానే స్వీకరించేడుట

("తత్తత్పదైః ఉపహితేపి తురంగమేధే శక్రాదయః

వరద! పూర్వమలబ్ధ భాగాః అధ్యక్షితే మఖపతౌ...."(వరదరాజ పంచాశత్)

అప్పుడు దేవతలు తమకు హవిర్భాగములు అందలేదని విచారించి చతుర్ముఖుని ప్రార్థింపగా అతడు స్వామియే సర్వ హవిర్భోక్త అనీ, ఆయనే యజ్ఞ ఫల ప్రదాత యనీ ఆయన అనుగ్రహము లేనిదే తమకెవ్వరికీ అస్తిత్వము లేదనీ, తాము స్వీకరించుతున్నామనుకున్నా కూడా అంతర్యామిగానున్న ఆయనే నిజానికి స్వీకరించి ఆయనే యజ్ఞ ఫలప్రదానము చేస్తాడనీ వారికి తెలిపేడుట. అప్పుడు వారు తమ స్వరూపమును, తమకు, పరమాత్మకు గల శరీర, శరీరి భావమును తెలిసికొని సంతోషించేరుట.

"భోక్తారమ్ యజ్ఞ తపసామ్" (భ.గీ. 5-28) అని తానే యజ్ఞ తపస్సులకు భోక్తను అనిన్నీ ""అహమ్ హి సర్వ యజ్ఞానామ్ భోక్తాచ ప్రభురేవ చ"(భ.గీ.-9-24) తానే భోక్త, ప్రభువు కూడా అనిన్నీ భగవద్గీత లో ఆయనే చెప్పుకున్నాడు కదా. అంతే కాకుండా "బ్రహ్మార్పణమ్ బ్రహ్మ హవిః బ్రహాగ్నౌ బ్రహ్మణా హుతమ్ బ్రహ్మైవ తేన గంతవ్యమ్.." (భ.గీ. 4-24) అని భగవద్గీతలో ఆయనే యజ్ఞము, సాధనము, ఫలము అని కూడా తెలిపేడు.

అందుకే భగవానుడు భగవద్గీతలో ఏ దేవతనైనా ఏదయినా కోరికతో పూజిస్తే ఆ దేవత అంతర్యామిగా నుండి ఆ కోరికను తానే ఆ దేవతద్వారా తీరుస్తాను కాని అలా మరొకళ్ళను పూజించే పద్ధతి "అవిధి పూర్వకమ్" (యజంతి అవిధి పూర్వకమ్-భ.గీ. 9-23)అని చెప్పేడు. భగవద్గీతలో "యోయో యామ్ యామ్ తనుమ్ భక్తః..తామేవ విదధామ్యహమ్". 7-21).అంటే తానే ఆ ఫలప్రదానము చేస్తాడు అన్నమాట.

అంతేకాక వారి ద్వారా పొందబడే ఫలములు పరిమితములు

"అంతవత్తు ఫలమ్ తేషామ్.."7-23 అని కూడా ఆయన చెప్పేడు.

అందు వలన ఇతర దేవతలను ఆశ్రయించడం కాక మోక్ష విద్యతో బాటు సమస్త విద్యలనూ ప్రసాదించగల హయగ్రీవ భగవానుని ఆశ్రయించడమే ఉత్తమము కదా!

**నేను:** ఈ శ్లోకములో "అగ్నౌ మంత్రమయమ్ శరీరమ్ ఆతస్థివాన్" అంటే పూర్తిగా అర్ధం కాలేదు. అలాగే హవిర్భాగాలు ముందు పరమాత్మ స్వీకరించి తరువాత మిగిలిన దేవతలు స్వీకరిస్తారు అన్నావు, కానీ "అగ్నిమీడే పురోహితమ్ యజ్ఞస్య దేవమ్ ఋత్విజమ్ హోతారమ్ రత్నధాతమమ్" అని అగ్ని ఆయా హవిర్భాగాలను వివిధ దేవతలకు అంద చేస్తాడని విన్నానే!

***వదిన:*** మనము ఇంతకు ముందు అనుకున్నట్లుగా ఆ అగ్నికి కూడా అంతర్యామిగా నున్న వాడు పరమాత్మే. మంత్రమయమ్ శరీరమ్ అన్నప్పుడు "మంత్ర పూరితమైన శరీరము కలవాడు"అని అర్థం చేసుకోవాలి.

నువ్వు చెప్పిన ఋగ్వేద మంత్రములో పదాలన్నీ పరమాత్మకూ వర్తిస్తాయి. "అగ్ని" అంటే "అగ్రే నయతి ఇతి" అను అర్థము వలన సన్మార్గములో పరమపదానికి తీసుకొని వెళ్ళేవాడనీ, "(యజ్ఞస్య) పురోహితమ్" అంటే హితకరముగా యజ్ఞ నిర్వహణమును నడిపించువాడనీ, "(యజ్ఞస్య) దేవమ్" అంటే యజ్ఞమునకు అధిపతి అనీ, "ఋత్విజమ్"అంటే సరి యగు రీతి లో జరిపించువాడనీ, "హోతారమ్" అంటే దేవతలకు హవిస్సులను ఇప్పించువాడనీ, "రత్నధాతమమ్ " అంటే మిక్కిలి ప్రకాశవంతమైన, ఆనంద దాయకమైన వాడనీ ఈ విశేషణాలన్నీ పరమాత్మకూ వర్తిస్తాయి. ఇంతేకాదు, తరువాత మంత్రాలలో కూడా పావక, జాతవేద, వైశ్వానర మొదలైన పదాలన్నీ పరమాత్మకు కూడా వర్తించేవే అని పెద్దలు చెబుతారు. ఆ అగ్నికి అంతర్యామిగా ఉండి హవిస్సులను ముందు స్వీకరించేది, తరువాత మిగిలిన దేవతలకు ప్రసాదించేదీ పరమాత్మేనని అందువలననే తమకు శరీరి, అంతర్యామి అయిన పరమాత్మ స్వీకారముతోటే దేవతలకు తృప్తి కలుగుతుందని చెబుతారు.

అంతేకాక మనము ఇంతకుముందు అనుకున్నట్లు ఇంద్రాది దేవతలు కూడా రజ,స్తమో గుణోపేతులే. అందుకే యాదవులు తనను పూజించ లేదని తనకు చేయవలసిన పూజ గోవర్ధనగిరికి చేసేరని ఇంద్రుడు కోపగించి ఊళ్ళ వాన కురిపించేడు. ఆయనకు తెలియలేదు, తనకూ, గోవర్ధన గిరికీ కూడా ఆధారము, అంతర్యామి ఆ పరమాత్మే అని, ఆయన వలననే తానూ తన పని నిర్వహిస్తున్నాననీ. ఆ గోపాలుడు గోవర్ధన గిరి చేతనే వాళ్ళను రక్షించిన తరువాత ఆయనకు బుద్ధి వచ్చిందనుకో. ఎందుకంటున్నానంటే ఆ దేవతలెవ్వరూ స్వతంత్రులు కారు. పరమాత్మ నిర్దేశముననుసరించే కార్యనిర్వహణ జరుగుతుంది. అందువలన యజ్ఞ స్వరూపుడైన పరమాత్మ స్వీకరించిన పిదపనే ఆ చతుర్ముఖుని అశ్వమేథ యాగములో మిగిలిన దేవతలు ఆయన ప్రసాదమును మహద్భాగ్యముగా స్వీకరించేరు.మన మన ఇళ్ళల్లో చూడు పెరుమాళ్ళకు ఆరగింపు చేసిన ప్రసాదమే ఆబ్దికాలలో పితృదేవతలకూ సమర్పిస్తాము.

**నేను:** పోనీ, కనపడని దేవతలూ వాళ్ళూ ఎందుకు, వారికి కూడా రజో గుణమూ, అహంకారమూ అవీ ఉండడం చేత ఆశ్రయించడానికి అనర్హులనుకో. కృష్ణుడు గోవర్ధనగిరిని పూజించమని చెప్పినట్లు, మనం కూడా ఈ కనపడుతున్న ప్రపంచములో ప్రకృతి తత్త్వాలను వేటిని అయినా విద్యా, విజ్ఞానాల కొఱకు పూజించ కూడదా,  నదులను, వృక్షాలనూ కూడా కొంతమంది పూజిస్తూంటారు కదా తమ తమ కోరికలు తీరడం కోసం. అలాగే కొంత మంది వేదాలకూ, పుస్తకాలకు పూజ చేయడం, ఓంకారోపాసన చేయడం కూడా...

***వదిన:*** ఆ వివరాలనే తరువాతి శ్లోకములో చెబుతున్నారు,

ఈ సందర్భములో నీకొక విషయం గుర్తు చేయాలి, నీకు తెలిసే ఉంటుంది అనుకో, కాని నువ్వు వృక్షాలూ, నదులూ అని ప్రకృతి తత్త్వాలు అన్నావు. మన సిద్ధాంతములో మూడు తత్త్వాలు ఉన్నాయని చెబుతారు కదా. అవు ప్రకృతి, జీవుళ్ళు, ఈశ్వరుడు. అందులో ప్రకృతి చైతన్యము లేనిది, జడము. జీవుళ్ళు, ఈశ్వరుడు (అంటే పరమాత్మ) చైతన్యము కలవి. వృక్షాల శరీరము, వృక్షాలేమిటి సుర, నర, తిర్యక్, స్థావర జీవ సమూహాల కన్నిటికీ శరీరము ప్రకృతి నుండి వచ్చినదే, అందువలన అది జడము, చైతన్యము లేనిది, కాని వాటిలోపల ఉండే జీవుడు అజడము, చైతన్య స్వభావము కలది. అంటే సురులు, నరులు లాగే తిర్యక్ అంటే కదిలే పశు, పక్ష్యాదులు, స్థావరాలు అంటే కదలని వృక్షాలూ అవీ, వీట్లలో కూడా చైతన్యమున్న జీవుళ్ళు ఉంటారు. చరము అంటే కదలడం అన్న పదాన్ని చైతన్యము గా అర్థం చేసుకోకూడదు. వృక్షాలు చరాలు కాకపోయినా చైతన్యమున్న జీవుళ్ళు ఉన్నవే. అలాగే గాలి, నీరు కదిలేవే అయినా చైతన్యము లేనిదే. జీవుళ్ళకు వారి వారి కర్మ ఫలాలను అనుసరించి సుర, నర, తిర్యక్, స్థావర శరీరాలు వస్తాయి. ఈ శరీరాలన్నీ ప్రకృతి తత్త్వాలే.

సృష్టి ప్రారంభములో అవిభక్త తమో రూపమైన ప్రకృతి నుండి విభక్త తమస్సు, దాని నుండి వరుసగా అక్షరము, అవ్యక్తము, మూల ప్రకృతి, మహత్తు, అహంకారము దాని నుండి వైకారికము, భూతాది, తైజసము, అందులో వైకారికము నుండి ఇంద్రియాలు, మనస్సు, అలాగే భూతాది నుండి పంచ తన్మాత్రలు, వాటి నుండి పంచ భూతాలు వచ్చి వాటి పంచీకరణమనే ప్రక్రియ వలన ఈ సుర, నర, తిర్యక్, స్థావర శరీరాలు తయారయి వాటికి ఇంద్రియాలు, మనస్సు తోడవుతాయి.

అందువలన ఈ శరీరాలన్నీ ప్రకృతి తత్త్వాలన్న మాట. ఆ పంచ భూతాల కలయిక వలననే మనకు ఈ కనపడే ప్రకృతి కూడా తయారవుతుంది. నువ్వు ఇంతకుముందు వినే ఉంటావు. ఊరికే గుర్తు చేసేను, సందర్భము వచ్చింది కనుక.

ఇంక శ్లోకాన్ని చూద్దాము.

**11."యన్మూల మీదృక్ ప్రతిభాతి తత్త్వమ్**

**యా మూల మామ్నాయ మహాద్రుమాణామ్**

**తత్త్వేన జానంతి విశుద్ధ సత్త్వాః**

**త్వామ్ అక్షరామ్ అక్షరమాతృకామ్ తే"**

*ఈదృక్: ఇలా కనబడేటటువంటి*

*తత్త్వమ్: (ఆకాశాది ) తత్త్వ సముదాయము*

*యత్: దేనిని*

*మూలమ్: కారణముగా కల్గినదై*

*ప్రతిభాతి: (ఏది) ప్రకాశించుచున్నదో*

*ఆమ్నాయ: వేదములనెడి*

*మహాద్రుమాణామ్: మహా వృక్షములయొక్క*

*యా: (ఏ) అక్షర మాతృక*

*మూలమ్: మొదటి భాగమో(అట్టి)*

*అక్షరామ్: నశింపని*

*తామ్: ఆ*

*అక్షర మాతృకామ్: అకారాది అక్షర మాతృకను*

*తే: నీ యొక్క*

*తత్త్వేన: యథార్థ తత్త్వముగా*

*విశుద్ధ సత్త్వాః: నిర్మలమైన సత్త్వ గుణము కలవారు*

*జానంతి: తెలిసికొను చున్నారు.*

ఈ కనపడునంటి పాంచ భౌతికమైన సమస్త ప్రపంచము కాని,

వేదములనెడి మహా వృక్షములకు మూలమైన అకారాది అక్షర మాతృక కాని నీవే మూలము గా కలిగి నీకు శేషమైనదే అని నిర్మల సత్త్వ స్వభావము కలవారు తెలుసుకొనుచున్నారు.

*నేను:* విశేషార్థాలు?

***వదిన:*** ఈ "హయగ్రీవ స్తోత్రము" అందులో ముఖ్యంగా ఈ శ్లోకము లోతులు తెలుసుకోవాలంటే మంత్రశాస్త్రము బాగా తెలియాలి అని పెద్దలు చెబుతారు. మనకు మంత్ర శాస్త్రము తెలియదు కనుక మనకు ఆ విశేషార్థాలు తెలియవు.

ఇంతకు ముందు అనుకున్నట్లు మహత్తు మొదలైన తత్త్వాలు 24 ఉన్నాయి కదా. (అవి పంచ భూతములు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచ కర్మేంద్రియాలు, ప్రకృతి, మహత్తు, మనస్సు, అహంకారము). ఇవన్నీ కూడ పరమాత్మ నుండి వచ్చినవే, పరమాత్మ శరీరమై పరమాత్మకు శేషముగా నుండేవే. అందుకే శ్రీమన్నారాయణుడు సర్వ శబ్ద వాచ్యుడు అని చెబుతాము. ఈ జీవుళ్ళ శరీరాలు కాని ఈ కనపడే ప్రకృతి సమస్తము వీటితో తయారయినదే.

కనుక దీనికి మూలము, ఆధారము, శేషి పరమాత్మే కనుక అచైతన్యములైన ఈ ప్రకృతి తత్త్వములు కాక తదాధారభూతుడైన హయగ్రీవ భగవానుడినే ఆశ్రయించడం యుక్తము కదా!

ఇంక ఈ శ్లోకములో అక్షర మాతృక అంటే "ప్రణవము" అనీ ప్రణవములో మొదటి వ్యాహృతి అయిన "అ కారము" అనీ చెప్పవచ్చును.  పాణిని అష్టాధ్యాయి కూడా "అ ఇ ఉణ్" అను సూత్రముతో ప్రారంభమవుతుంది కదా!

"వేదేన రూపే వ్యకరోత్..." అనినట్లు సమస్త సృష్టికి వేదము మూలము అని చెబుతారు. ఆ వేదమునకు ప్రణవము మూలము. సర్వ శబ్దములకు మూలమైన ప్రణవము కూడా పరబ్రహ్మ వాచ్యమే.
"ఓమిత్యేకాక్షరమ్ బ్రహ్మ" (భగవద్గీత 8-13) అని కదా భగవద్గీత చెబుతుంది. "తైత్తిరీయ ఉపనిషత్ కూడా

"ఓమితి బ్రహ్మ" అని చెబుతుంది. "ఓంకార ప్రభవో వేదాః" అని వేదములు ఓంకారము నుండి ఉద్భవించేయని, ఆ ఓంకారాత్మకుడే పరబ్రహ్మ అయిన హయగ్రీవ భగవానుడనీ తెలుస్తోంది కదా.

అలాగే ఓంకారానికి ప్రథమ వ్యాహృతి అయిన "ఆకార శబ్ద వాచ్యుడు కూడా శ్రీమన్నారాయణుడే. "అకారార్థో విష్ణుః జగదుదయ రక్షా ప్రళయకృత్" అని పరాశర భట్టర్ తెలిపేరు. భగవద్గీత లో శ్రీకృష్ణ భగవానుడు "అక్షరాణామ్ అకారోస్మి" అని చెబుతాడు. అందుకే "జన్మాద్యస్య యతః" అని బ్రహ్మ సూత్రము బ్రహ్మను జన్మాదులు ఎవరి వలన కలుగుతున్నాయో అతడే బ్రహ్మ అని నిర్వచిస్తుంది. తైత్తిరీయ ఉపనిషత్ "యతో వా ఇమాని భూతాని జాయంతే.." అని"ఎవని నుండి ఈ భూతములన్నియు ఉద్భవిస్తున్నాయో... " ఆయన పరబ్రహ్మ అని వివరిస్తుంది.

దీని వలన ఈ సమస్త తత్త్వములకు మూలము, శరీరి పరమాత్మే. ఈ జగత్తంతా ఆయన శరీరమే. అంటే ఆయనే ఆధారముగా, ఆయనకు శేషముగా ఉంటుందన్నమాట. అందుకే "జగత్సర్వమ్ శరీరమ్ తే" అని శ్రీమద్రామాయణము లో చతుర్ముఖుడు శ్రీరాముడిని వర్ణిస్తాడు.

అందువలన ఈ కనిపించే మహదాది ప్రకృతి తత్త్వములూ, సమస్త శబ్ద వాఙ్మయమూ, ఆ అక్షర మాతృక అయిన ప్రణవమూ అన్నీ కూడా పరబ్రహ్మాత్మకమనీ, ఈ సమస్తమూ పరమాత్మకు శేషమనీ నిర్మలమైన సత్త్వగుణము కలవారు తెలుసుకొని ఆ ఆది మూర్తి అయిన హయగ్రీవ భగవానుడినే ఆశ్రయిస్తారు. ఎంత మహాద్రుమము అదే, పెద్ద చెట్టయినా, మనం నీళ్ళు పోసేది, ఆశ్రయించేది దాని మూలము అదే వ్రేళ్ళ దగ్గరే కదా, అప్పుడే ఫలము దక్కేది. ఇక్కడా అలాగే మహదాది తత్త్వాలకైనా, శ్రుత్యాది వాఙ్మయానికైనా మూలము హయగ్రీవుడే అని, ఆయనే ఆశ్రయణీయుడు, ప్రాప్యుడు అనీ చెబుతున్నారు.

*నేను:* అంటే జీవుళ్ళకైనా, అచేతనమైన ప్రకృతి తత్త్వములకైనా అస్థిత్వము కలిగేది పరబ్రహ్మ వలననే కనుక ఆయనే వీటికన్నిటికీ అంతర్యామి , మూల నిర్వాహకుడు కనుక ఆయననే ఆశ్రయించాలి అని అంటున్నారు. మఱి, వీటికి అంతర్యామిగా ఎప్పుడు ఎలా లోపల ప్రవేశిస్తాడో, చివరకు ఇవన్నీ ఏమిటవుతాయో!

*వదిన:* ఆ వివరాలు తరువాతి శ్లోకములో చెబుతున్నారు.

12."అవ్యాకృతాత్ వ్యాకృతవాన్ అసి త్వమ్

నామాని రూపాణి చ యాని పూర్వమ్

**శంసంతి తేషామ్ చరమామ్ ప్రతిష్ఠామ్**

**వాగీశ్వర త్వామ్ త్వదుపజ్ఞవాచః"**

*వాగీశ్వర: (జీవ, ప్రకృతి తత్త్వములకు విలక్షణుడివై, వాటికి ఈశ్వరునిగా చెప్పబడుచున్న ) ఓ హయగ్రీవ స్వామీ!*

*త్వమ్: నీవు(ఇంతకు ముందు)*

*పూర్వమ్: సృష్టి సమయమున*

*అవ్యాకృతాత్: నామ, రూపములు లేని*

*జగత్తునందు ప్రవేశించి, ఆయా వస్తువుల యొక్క*

*యాని: ఏ*

*నామాని: పేర్లను*

*చ: మఱియు*

*రూపాణి: రూపములను(స్వభావములను)*

*వ్యాకృతవాన్: విభాగము చేసిన వాడవై*

*అసి: ఉన్నావు*

*తేషామ్: ఆ నామ రూపముల యొక్క*

*చరమామ్ ప్రతిష్ఠామ్: చివరకు పరమావధి గా*

*త్వామ్: నిన్ను*

*త్వత్+ఉపజ్ఞవాచః: నీ అనుగ్రహము వలన జ్ఞానము పొందిన మహనీయులు(నీ అనుగ్రహము వలన బయల్వెడలిన శ్రుత్యాదులు*

*శంసంతి: కీర్తించుచున్నారు(కీర్తించుచున్నవి)*

ఓ వాగీశ్వరుడివైన హయగ్రీవ స్వామీ! నామ రూప రహితముగా సూక్ష్మావస్థలోనున్న జగత్తున

సృష్టికి ప్రారంభమున నీవు అను ప్రవేశము చేసి నామ రూప విభాగము చేసితివి. వాటికన్నిటికి పరమావధియు, ఆయా జీవుళ్ళు చివరకు పొందవలసిన గమ్యమును నీవేనని నీచే ననుగ్రహింప బడిన జ్ఞానులు, (నీవనుగ్రహించిన శాస్త్రములు ) స్తుతించుచున్నారు (స్తుతించుచున్నవి).

*నేను:* అంటే దీనిలో రెండు విషయాలు చెబుతున్నారు. ఆ భగవానుడే ఈ సృష్టి ప్రారంభములో సృష్టి పదార్థములలో అనుప్రవేశము చేసి నామ, రూప విభాగము చేసేడని, ఆయనే చివరికి దీనికంతటికీ గమ్యమనీ అంతేనా. ఇందులో మొదటి విషయాన్నే కదా "ఇమాః తిస్రో దేవతా అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి" అని ఛాందోగ్యోపనిషత్(6-3-2) లో సద్విద్యా ప్రకరణంలో "భగవానుడు అను ప్రవేశము చేసి నామ, రూప వ్యాకరణము అదే విభాగము చేసేడు" అని చెబుతారు. మరి అంతకు ముందు ఇదంతా నామ రూప రహితంగా ఉండేదన్న మాట.

*వదిన:* ఛాందోగ్యోపనిషత్ లోనే కాదు బృహదారణ్యఉపనిషత్తు లో అంతర్యామి బ్రాహ్మణములోను, కౌషీతకి లోను, సుబాలోపనిషత్ లోను ఇలా చాలా చోట్ల భగవానుడి అంతః ప్రవేశ పూర్వ నియమనము చెప్పబడ్డది. "తత్ సృష్ట్వా తదేవ అనుప్రావిశత్ తదను ప్రవిశ్య సత్ చ త్యత్ చ అభవత్" అంటే జగత్తుని సృష్టించి దానిలో ప్రవేశించి చేతనములు, అచేతనములుగా ఆయెను అని. అంటే అంతకు ముందు నామ, రూపములు లేక తనలో సూక్ష్మావస్థలో పడియున్న జీవ సముదాయముపై దయ కలిగిన పరమాత్మ వాటికి తనతో సమానమైన స్థితిని కలిగించి పరమపదమున తనతో చేర్చుకోవాలని చిదచిత్తులను సృష్టించి తాను వాటికి అంతర్యామిగా ప్రవేశించేడుట. "యస్య పృథివీ శరీరమ్...యస్య ఆత్మా శరీరమ్...అంటూ విన్నావు కదా, అంటే పృథివ్యాదుల వలె జీవాత్మలు కూడా భగవానునికి శరీరములన్నమాట.

*నేను:* కాని, "అనేన జీవేన ఆత్మనా" అంటే బ్రహ్మమే జీవరూపముతో అను ప్రవేశము చేస్తున్నాడని కాదా, ఎందుకంటే చూడు "జీవేన ఆత్మనా" అని రెండూ ఒకే విభక్తిలో ఉన్నాయి. అందు వలన అవి రెండూ ఒకటే అవాలి కదా!

*వదిన:* మరి అలాగయితే *"య ఆత్మని తిష్ఠన్ యస్య ఆత్మా శరీరమ్"* మొదలైన శ్రుతులకు అర్థం ఎలాచెబుతావు, దానికర్థం ఈ అచేతన జగత్తు, జీవ సముదాయము కూడా బ్రహ్మాత్మకమని చెప్పక తప్పదు.

ఈ శరీర, శరీరి భావము వలననే ఆ శ్రుతికి "జీవునిలో అంతర్యామిగా నేను ఆ జీవునితో బాటు అనుప్రవేశము చేసి నామ రూప విభాగము చేసేను" అనే చెప్పుకోవాలి.

**నేను:** "నేను" అను ప్రవేశము చేసేను అనడానికి బదులుగా "ఆత్మనా" అని "మయా" అన్నట్లు అంటే "నాచేత" అని తృతీయా విభక్తిలో ఎందుకుంది?

***వదిన:*** "సింహేన భూత్వా బహవః మయా అత్తాః" అని ఉపయోగిస్తారు కదా, అంటే "సింహము అయిన నాచేత చాలా తినబడ్డాయి" అని అర్థము. అందుచేత ఇలాంటి ప్రయోగము తప్పులేదు. అక్కడ సింహ శరీరకుడు అన్నట్లు ఇక్కడ జీవ శరీరకుడు అని అంతే.

***నేను:*** మా అమ్మ నాకు రూపాన్నిచ్చింది, నాన్న గారు నాకు పేరు పెట్టేరు అనుకో ఉదాహరణకు. నేనూ మానాన్నగారూ ఒకటెలా అవుతాము, ఇక్కడ కూడా అంతే కదా! భగవానుడు పేరు, రూపము ఇస్తే ఆయనే ఈ పేరు, రూపము ఈయబడిన వస్తువు అవుతాడా!

***వదిన:*** ఇలాగే నామ రూప వ్యాకరణము చెప్పిన మరొక శ్రుతి వాక్యము చూడు. "తద్ధేదమ్ తర్హి అవ్యాకృతమాసీత్ తత్ నామ రూపాభ్యామ్ వ్యాక్రియత" అంటే

*తర్హి: సృష్టికి పూర్వమున నున్న ఆ సమయమునందు*

*ఇదమ్ తత్:ఇప్పుడు జగద్రూపముగా నున్న ఆబ్రహ్మము*

*అవ్యాకృతమాసీత్: నామ రూపములు లేక(సూక్ష్మావస్థలో) యుండెను*

*తత్: అదే బ్రహ్మము(ఇపుడు)*

*నామరూపాభ్యామ్: నామరూపములతో*

*వ్యాక్రియత: విశిష్టమగునట్లు చేయబడెను*

దీనిని బట్టి నామ వ్యాకరణమంటే మంచి పేరు ఒకటి చూసి పెట్టడం కాదు, తత్తన్నామ విశిష్టత్వము, అంటే తత్తన్నామములచే వాచ్యుడగుట అని అర్థము. ఇచట "వ్యాక్రియత" అనే కర్మణి ప్రయోగం తానే ఆయా నామ వాచకములను సృష్టించేడని తద్వాచ్యుడు కూడా తానే అని అలా అవడానికి కారణము తన అనుప్రవే శమనీ చెబుతోంది.

***నేను:*** అంటే "ఆ పిల్లడు సింహము రా" అన్నప్పుడు సింహము అన్న పదము లాగా ఇందులో పరమాత్మ పదము లాక్షణికార్థమును బోధించదా!

***వదిన:*** అలా కాదు, అక్కడ ముఖ్యార్థమే, అంటే ఈ నామము పరమాత్మకూ వర్తిస్తుంది.

***నేను:*** మామూలుగా రూపము దృశ్యత్వాన్నీ, నామము శాబ్దికంగానూ ఆ వస్తువును సూచించడానికీ వాడుతాము. ఇక్కడ కూడా..

***వదిన:*** ఇక్కడ నామ వ్యాకరణమంటే కేవలము శబ్ద సృష్టి కాదు, రూప వ్యాకరణముచే సృష్టింపబడిన ఆయా పదార్థములకు తదనుగుణంగా శబ్దములు సృష్టించడం అన్నమాట.

***నేను:*** అంటే ఈ నామాలన్నీ పరమాత్మకు సంబంధించినవేనా, లేక....

***వదిన:*** "బహుస్యామ్" అని తానే అనేకముగా అగుదును అని కదా భగవానుడు సంకల్పించేడు, అంటే ఈ నామాలన్నీ ఆయనకీ వర్తిస్తాయి. ఈ చిదచిత్తులు ఆయన విశేషణాలన్నమాట. "వచసామ్ వాచ్యముత్తమమ్" అనగా "సర్వ శబ్దములకు పర్యవసానమందు సాక్షాద్వాచ్యమైన వాడు " అనిన్నీ, "హరిః అఖిలాభిః ఉదీర్యతే తదైకః" అనగా "పరమాత్మయే సర్వ శబ్దముల చేత వాచ్యమైన వాడు" అనీ "నతాః స్మః సర్వ శబ్దైః ప్రతిష్ఠా.." అని "సర్వ శబ్దములచేత ఏ పరమాత్మ బోధింపబడుచున్నాడో అతనికి నమస్కరింతుము" అనిన్నీ అనేక మైన వాక్యాలు ఈ విషయాన్నే చెబుతున్నాయి.

***నేను:*** అయితే ఈయన లోపల ఉండి ఏమి చేస్తాడుట!

***వదిన:*** "అంతః ప్రవిష్టః శాస్తా" అని "ఆ అంతః ప్రవేశము శాసించడం కోసమే అనిన్నీ, అలా అంతః ప్రవిష్టుడై శాసించేవాడు ఆత్మ కనుక ఈ జగత్తులో ప్రతి వస్తువుకీ ఆయన ఆత్మ అంటే ఈ చిదచిత్తులు ఆయనకు శరీరమనీ, ఈ శరీర, శరీరి భావ సంబంధమును బట్టి శరీర వాచకములన్నీ శరీరాంతర్వర్తి అయిన ఆత్మ పర్యంతము వాచకములనిన్నీ ఈ విషయమే శాస్త్రాలన్నీ ముక్త కంఠంతో ఘోషిస్తున్నాయనీ తెలుస్తోంది.

***నేను:*** కాని ఈ పరబ్రహ్మ ప్రత్యక్ష గోచరము కాదాయె. ఇలా కనబడని దానితో ఈ కనపడే వస్తువు యొక్క తాదాత్మ్యం ఎలా చెబుతాము.

వదిన: నువ్వంటే ఎవరు?

***నేను:*** నేను అంటే నా ఆత్మ

వదిన: మఱి "నేను మనుష్యుడను" అన్నప్పుడు మనుష్యత్వము శరీరానికి కాని ఆత్మకు కాదే. కనపడే శరీరంతో కనపడని ఆత్మకు తాదాత్మ్యం చెబుతున్నావు కదా, అలాగే ఇక్కడ కూడా.

***నేను***: "వాగీశ్వర" అన్నారు అందుకే కాబోలు, ఈశ్వర అంటే అంతర్యామిగా ఉండి నియమించు వాడని కదా అర్థము. ఏ వాచకానికైనా ఈశ్వరుడాయనే కదా!

***వదిన:*** అందువలన ఈ చిదచిత్తులకు గమ్యమూ ఆయనే. ఈ విషయం శాస్త్రాలనుండి తెలుస్తుంది. ఆ శాస్త్ర జ్ఞానము ఉన్న వారినుండి మనము తెలుసుకోవాలి

***నేను:*** గమ్యము అంటే మళ్ళీ కల్పాంతములో ఆయనలో సూక్ష్మావస్థలో పడి ఉండడమనియా, లేక పునరావృత్తి లేని స్థితిలో పరమపదాన్ని చేరి ఆయనతో కూడి ఉండడమని అర్థమా?

***వదిన:*** ఏరకంగా అయినా ఆయన వద్దకే కదా, ఆయన యొక్క పరిపూర్ణమైన అనుగ్రహం కలిగే దాకా కల్పాంతములో సూక్ష్మ దశలో ఆయనతో ఉండడం, (మళ్ళీ ఈ లీలా విభూతికి వస్తూ, పోతూ) అనుగ్రహం కలిగితే ఇంకేముంది, పరమపదములో నిత్య సూరులతో కూడిన ఆయన కైంకర్య భాగ్యం. ఆ భాగ్యం కలగడానికీ ఆయనే సాధనము.

***నేను:*** అది సరే, ఆయనే గమ్యము, ఆయనను చేరాలి అంటే ఎలా ధ్యానించాలో చెప్పాలి కద!

***వదిన:*** అదే తరువాత శ్లోకములో చెబుతున్నారు.

**13."ముగ్ధేందు నిష్యందవిలోభనీయామ్**

**మూర్తిమ్ తవానంద సుధాప్రసూతిమ్**

**విపశ్చితః చేతసి భావయంతే**

**వేలాముదారామివ దుగ్ధ సింధోః"**

*ముగ్ధ ఇందు: బాల చంద్రుని యొక్క*

*నిష్యంద: వెన్నె లవలె*

*విలోభనీయామ్: మనోహరమైనది*

*ఆనంద: ఆనందమనెడు*

*సుధా: అమృతము యొక్క*

*ప్రసూతిమ్: జన్మ స్థానమును (కనుక)*

*దుగ్ధ సింధోః: పాల సముద్రముయొక్క*

*ఉదారామ్: గొప్పదైన*

*వేలామ్: సేతువును వలె(తీరమును వలె) ఉన్న*

*తవ: నీ యొక్క*

*మూర్తిమ్: రూపమును*

*విపశ్చితః: విద్వాంసులు*

*చేతసి: మనస్సునందు*

*భావయంతే: ధ్యానించుచున్నారు.*

**జ్ఞానులు బాల చంద్రుని వెన్నెల వలె మనోహరముగా నుండెడిది, ఆనంద ప్రవాహమును ప్రవహింపజేయునది, (నిర్మలమైన) పాల సముద్రముయొక్క అవధి వలె నున్నదగు నీ రూపమును తమ మనస్సున నిలుపుకొని ధ్యానము చేయుచున్నారు.**

**ఇంతకు ముందు శ్లోకములో స్వామి అంతర్యామి గా చిదచిత్తులలో వేంచేసి యుంటాడు అని చెప్పిన తరువాత ఆ స్వామిని ధ్యానించడం ఎలా అంటే ఈ శ్లోకములో అనుగ్రహిస్తున్నారు.**

కళ్యాణ గుణములతో పరిపూర్ణుడైన స్వామి యొక్క దివ్య మంగళ విగ్రహాన్ని ధ్యానించాలి అంటూ ఆయన కళ్యాణగుణాలలో ఆనందమనే గుణాన్ని ఉదాహరిస్తున్నారు. ఉపనిషత్తు కూడా ఆయన గుణాలలో ఒక గుణమైన "ఆనందము" ను గణించడానికి ప్రారంభించి "యతో వాచో నివర్తంతే" అనినట్లు వెనుదిరిగింది కదా.

ఆయన మూర్తి బాలచంద్రుని వెన్నెల వలె మనోహరమైనది. వెన్నెల మనస్సుకీ, శరీరానికీ కూడా ఆహ్లాదాన్ని ఇస్తుంది.

ఆయన మూర్తి ఆనందాది కళ్యాణ గుణములను ఎల్లప్పుడూ ప్రవహింప చేస్తూండేది. ఈ ప్రవాహములో ఎవరయినా ఆ గుణాలను ఎప్పుడయినా అనుభవించి తరించ వచ్చును. కూరత్తాళ్వాన్ శ్రీస్తవములో అనుగ్రహించినట్లు గంగా ప్రవాహంలో సాధు, సజ్జనులే కాక శునకాలూ ఆనందాన్ని అనుభవిస్తాయి కదా.

ఆయన మూర్తి పాల సముద్రము వలె నిర్మలత్వమునకు అవధి వంటిది. అంటే ఆయన ఆనందాది సమస్త కళ్యాణ గుణ పరిపూర్ణుడే కాక ఏ మాలిన్యము లేని అఖిల హేయ ప్రత్యనీకుడు.

ఎప్పుడయినా ఒక పనిని చేసిన తరువాత మనకు దాని ఫలము వలన సంతోషము కలుగుతుంది, ఒక చెట్టు నాటి నీరు పోసి పెంచిన తరువాత ఫలములు వచ్చినట్లు. కాని పరమాత్మ విషయములో ఆయన మనోహరుడవడంవలన, ఆయన యొక్క ఆనందాది గుణ ప్రవాహము సతతమూ మనకోసం ప్రసరిస్తూండడం వలన ఆయనను ధ్యానించడమే అత్యంత ఆనందదాయకము. అట్టి మూర్తిని జ్ఞానులు ధ్యానిస్తూంటారట.

"రసో వై సః"(తైత్తిరీయోపనిషత్),

"మహాత్మానస్తు మామ్ పార్థ ....భజంతి అనన్య మనసః(భ.గీ. 9-13), అనన్యాః చింతయంతో మామ్...(భ.గీ. 9-22) మొదలగు వాక్యములు మనమిక్కడ గుర్తు తెచ్చుకొనవచ్చును.

*నేను:* అంటే అలా ధ్యానం చేయడమే ఫలమా!

*వదిన:* అదే తరువాత శ్లోకంలో చెబుతున్నారు

*నేను:* అంతర్యామిగా ఉంటాడని చెప్పి, వెంటనే అఖిల హేయ ప్రత్యనీకుడు అంటే మన దోషాలేవీ ఆయనకు అంటవా?

***వదిన:*** మన జన్మ మన పూర్వ పుణ్య, పాప కర్మ సంబంధితమైనది, ఆయనకు కర్మలతో సంబంధము లేదు. ఆయన అంతర్యామిగా ఉండేది ఒక  నూతిలో పడిపోయిన తన పిల్లవాడిని తీయడానికి తానూ నూతిలో దిగిన తండ్రిలాగని మనము చెప్పుకుంటాము. అందువలన ఆయనకు హేయగుణములు కానీ పాపములు కాని అంటవు. ఈ విషయాన్నే శ్రీభాష్యములో "ఉభయ లింగాధికరణము" లో వివరిస్తారు. ఉభయలింగాలు అంటే కల్యాణ గుణ పూర్ణత్వము, అఖిల హేయ ప్రత్యనీకత్వము అన్నమాట. అది చదువుకున్నప్పుడు ఇంకా స్పష్టంగా తెలుసుకోవచ్చును. ఇంక తరువాత శ్లోకము.

14."మనోగతమ్ పశ్యతి యః సదా త్వామ్

మనీషిణామ్ మానసరాజ హంసమ్

స్వయమ్ పురోభావ వివాద భాజః

కిమ్ కుర్వతే తస్య గిరో యథార్థమ్"

*మనీషిణామ్: బుద్ధిమంతులయొక్క*

*మానసరాజహంసమ్: మనస్సు అనెడు సరస్సులో క్రీడించు రాజహంస యగు*

*త్వామ్: నీవు*

*యః: ఎవడు*

*సదా: ఎల్లప్పుడు*

*మనోగతమ్: మనస్సున నిలచిన వానినిగా*

*పశ్యతి: తెలుసు కొను చున్నాడో(చూచుచున్నాడో)*

*తస్య: ఆ వ్యక్తి యొక్క*

*గిరః: వాక్కులు*

*స్వయమ్: స్వయముగా*

*పురోభావ: నేను అంటే నేను అనుచూ, అహమహమికతో ముందుకురుకు భావనతో*

*వివాద భాజః: వివాదమును కలిగినవై*

*యథార్హమ్: తమ తమ యోగ్యతను బట్టి (ఆ వ్యక్తికి)*

*కిమ్ కుర్వతే: కైంకర్యము చేయుచున్న వి*

నిన్ను ఎల్లప్పుడు మనస్సున ధ్యానించు వారి హృదయమున నీవు స్థిరముగా నుండెదవు. అట్టి వారికి వాక్కులు అమోఘములై తడవు చేయక అహమహమికతో స్ఫురించి తాము ఏమి చేయవలెను అని అడుగుచున్నట్లు వారికి కైంకర్యము చేయును, అనగా వారికి వాక్సిద్ధి కలుగును అని భావము.

***నేను:*** మానసరాజ హంస అంటే?

***వదిన:*** హంస శబ్దానికి అశ్వము అని కూడా అర్థమున్నది. రాజ హంస అంటే గొప్ప అశ్వము అని ఆ పదము హయగ్రీవ భగవానుడిని సూచిస్తుంది.

హంసావతారము హయగ్రీవుల అపరావతారమే, హంస రూపములో సమస్త వేద విజ్ఞానాన్ని పరమాత్మ చతుర్ముఖునికి ప్రసాదించేడు. అప్పుడు చతుర్ముఖునికి ఒకసారి కనపడి ప్రసాదించేడు. కాని, చతుర్ముఖుడు రజస్తమో గుణ ప్రభావము వలన ఆ విజ్ఞానాన్ని కోలుపోయేడు. కాని, తమ మనస్సులో ధ్యానించేవారికి ఆయన రాజహంసలా మనస్సులో ఎప్పుడూ వేంచేసి ఉంటాడు. అందువలన మఱి కోలుపోయే సమస్యలేదు.

ఈ రజస్తమోగుణాల వలన ప్రభావితమయేది మనస్సే. ఏమిటవుతుందంటే మనము సాధారణ పరిస్థితులలో, మసిబారిన గాజు బుడ్డీలోంచి దీపపు వెలుగులా మన జీవాత్మ నుండి ప్రసరించే ధర్మ భూత జ్ఞానము ఈ రజస్తమో ప్రభావితమైన మనస్సుద్వారా బయటకు ప్రసారమయినప్పుడు కలుషితమై యథార్థ విజ్ఞానము తెలుసుకోలేకపోతాము. అంటే సత్యా సత్య వివేకము, ధర్మాధర్మ విచక్షణ లేకుండా పోతుందన్నమాట. అప్పుడు మన ఆలోచన దానిని అనుసరించి వచ్చే వాక్కు కూడా వివేకము లేనిదవుతుంది.

కాని మన మనస్సునందు హయగ్రీవ భగవానుడు ఎల్లప్పుడూ వేంచేసి ఉంటే మఱి ఈ బాధ ఉండదు.

***నేను:*** మన మనస్సే కాక ఈ ప్రకృతి అంతా త్రిగుణాత్మకమే కదా, మంచీ, చెడూ అన్నీ ఉంటాయి. దాని ప్రభావము ఉండదా!

***వదిన:*** హంస "వివేకానికి ప్రతీక". పాలూ, నీరూ కలసి యున్నప్పుడు పాలను మాత్రమే గ్రహించగలిగినది. అలాగే మంచి, చెడు కలగలిసి ఉన్న ప్రకృతి వస్తు, విషయాలనుండి మంచిని మాత్రమే గ్రహించగలచిన సామర్థ్యాన్ని ఇచ్చేది ఈ మానస రాజ హంసము.

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు *"మమ మాయా దురత్యయా"* అని ఆ ప్రకృతి వైచిత్రి నా నియమనములో ఉంటుంది, నువ్వు దానిని నియంత్రించలేవు, నన్ను ఆశ్రయిస్తే నేను దానిని నియంత్రిస్తాను అంటాడు. సర్కసు లో సింహములు ఆ రింగ్ మాస్టరు మాట వింటాయి, నేనంటే నేను అని ఆతను చెప్పినట్లు చేస్తాయి కాని నువ్వు వెళితే నిన్ను అవి మాట వినవు సరికదా, చంపేయవచ్చు కూడ.

అందువలన ఆ హయగ్రీవ భగవానుడే మన మనస్సులో ఉంటే ఆయన నియంత్రణలో ఉండే వాక్కులు కూడా నేనంటే నేను అంటూ మనకు అవసరమయినట్లు పని అదే కైంకర్యము చేస్తాయి. నీకు గుర్తుందా, రామచంద్రునికి విశ్వామిత్రుడు దివ్యాయుధాలను, వాటి ప్రయోగ ఉపసంహారాలతో బాటు ఉపదేశించిన తరువాత అవి రామచంద్రుని వద్దకు వచ్చి *"ఇమే స్మ కింకరాః"* అని స్వాధీనములై *"కిమ్ కరవామతే"* అని నీకు మేమేమి కైంకర్యము చేయవలెను అంటూ ఆయత్తమైనట్లన్న మాట.

ఈ శ్లోకము శ్రీస్తుతి లోని

"యస్యామ్ యస్యామ్ దిశి విహరతే దేవి దృష్టిః త్వదీయా

తస్యామ్ తస్యామ్ అహమహమికామ్ తన్వతే సంపదోఘాః" (శ్రీస్తుతి-15)

అన్న శ్లోకాన్ని గుర్తు చేస్తుంది.

ఆ లక్ష్మీదేవి కటాక్షము కలిగితే సమస్త సంపదలూ అహమహమికతో పోటీ పడుతూ సేవ చేస్తాయట కదా!

***నేను:*** జీవాత్మ నుండి ధర్మ భూత జ్ఞానము మనస్సు ద్వారా ప్రసరించడం అంటే...

***వదిన:*** జీవాత్మ జ్ఞాన స్వరూపుడు, జ్ఞాన గుణకుడు కూడా కదా, అంటే తేజోద్రవ్యాలు తాము ప్రకాశమూ అవుతాయి, ఇతరములను ప్రకాశింపచేసేవీ అవుతాయి. దీపము తాను ప్రకాశిస్తూ, తన కాంతి ప్రసరణము

వలన ఇతరములను ప్రకాశింప చేస్తుంది. అలా స్వప్రశాకమైన జ్ఞానమును ధర్మి జ్ఞానమనీ, కాంతిలా బయటకు ప్రసరించి ఇతరములను ప్రకాశింపచేసే జ్ఞానాన్ని ధర్మభూత జ్ఞానమనీ అంటారు కదా. ఆ ధర్మ భూత జ్ఞానము మనస్సు ద్వారా ఇంద్రియాల ద్వారా బయటకు ప్రసరిస్తుంది. మనస్సు మసి పట్టిన గాజు కుప్పెలా ఉంటే ఆ ధర్మ భూతజ్ఞానము ప్రభావితమై యథార్థ జ్ఞానము లోపిస్తుంది కదా. ఆ విషయమే ఇప్పుడు చెప్పుకున్నాము.

***నేను:*** సరే, అలా ఎల్లప్పుడూ ధ్యానించిన వారికి వాక్సిద్ధి కలిగి బాగుగా మాట్లాడ గలరు అనా!

***వదిన:*** మాటలాడడమే కాదు అరక్షణం ధ్యానిస్తే చాలు అమితమైన రచనా శక్తి కూడా కలుగుతుంది అంటున్నారు తరువాతి శ్లోకములో.

15."అపి క్షణార్థమ్ కలయంతి యే త్వామ్

ఆప్లావయంతమ్ విశదైః మయూఖైః

వాచామ్ ప్రవాహైః అనివారితైః తే

మందాకినీ మందయితుమ్ క్షమమ్ తే"

*విశదైః: నిర్మలమైన, స్వచ్ఛమైన*

*మయూఖైః: కిరణములచే*

*ఆప్లావయంతమ్: (అమృతపు ధారలవలె) చల్లపరచునట్టి, ఆర్ద్రము చేయునట్టి*

*త్వామ్: నిన్ను*

*యే: ఎవరు*

*క్షణార్థమ్ అపి: అర క్షణమైనను*

*కలయంతి: ధ్యానింతురో*

*తే: వారు*

*అనివారితైః: అడ్డులేని*

*వాచామ్ ప్రవాహైః: వాక్ప్రవాహములచేత*

*మందాకనీమ్: గంగానదిని కూడా*

*మందయితుమ్: అల్పవేగము కలదియా అన్నట్లు*

*క్షమంతే: (చేయుటకు) సమర్థులగుచున్నారు.*

నీ స్వచ్ఛమైన, నిర్మలమైన కిరణములతో నీ భక్తులను సంపూర్ణముగా సేదదీర్చి చల్లబరచు నిన్ను అరక్షణకాలమైనను ధ్యానింతురో వారు గంగనదీ ప్రవాహము కంటె మిక్కిలి వేగవంతమును, పవిత్రమును అయిన వాక్ప్రవాహమును కలిగి యుందురు.

***నేను:*** "మందయితుమ్" అంటూ గంగా ప్రవాహపు జోరు తగ్గించడానికి సామర్థ్యము కలవి ఆ వాక్ప్రవాహాలు అంటే, వీళ్ళ వాగ్వేగము వలన గంగ ప్రవాహము ఎలా మందగిస్తుంది?

***వదిన:*** సాపేక్ష సిద్ధాంతము విన్నావు కదా, అంటే నువ్వు నడిచి వెడుతున్నప్పుడు మరొకడు సైకిలు మీద వెళితే నీ నడక వాడి దృష్టిలో మందగించినట్లుంటుంది. వాడి ప్రక్కన మరొకడు కారు మీద వెళితే ఆ సైకిలు వేగము తక్కువగా కనబడుతుంది కదా. "మందాకినీ వియద్గంగా" అని ఆకాశగంగకు మందాకినీ అని పేరు. దాని వేగానికి భూమికాని, వేరొకటి ఏమయినా కాని తట్టుకోలేవని సాక్షాత్తూ పరమ శివుడు తన జటాజూటాన్ని ఆ గంగా ప్రవాహ వేగాన్ని అడ్డుకోవడానికి ఉపయోగించవలసి వచ్చింది. అట్టి గంగా ప్రవాహ వేగము కూడ హయగ్రీవ మూర్తిని అరక్షణము ధ్యానించిన వారి వాగ్వేగము వద్ద దిగతుడుపే నని చెబుతున్నారన్నమాట. "యోగో జ్ఞానమ్ తథా సాంఖ్యమ్ విద్యాః శిల్పాది కర్మచ వేదాః శాస్త్రాణి విజ్ఞానమ్ ఏతత్ సర్వమ్ జనార్దనాత్" అనినట్లు సమస్త వాఙ్మయము, కళలు, విజ్ఞానము పరమాత్మ అనుగ్రహము వలననే కలుగునని మనము విష్ణు సహస్రనామ స్తోత్రము చదువుతున్నప్పుడు చదువుతాము కదా!

క్షణము అంటే సెకనులో 4/5 భాగము. అరక్షణము అంటే సెకనులో 2/5 భాగము. నువ్వన్నట్లు ఎల్లప్పుడూ కాకపోయినా కనీసము 2/5 సెకను తన మూర్తి నుండి బయల్వెడలు తెల్లని, స్వచ్ఛమైన కిరణాలతో చల్లబరచే ఆయనను ధ్యానిస్తే చాలును అంటున్నారు.

ఈ శ్లోకాలు నిత్యము ఆ హయగ్రీవ స్వామిని ధ్యానిస్తూ పఠించేవారికి అతులిత వాగ్వైభవము, అఖండ రచనా సామర్థ్యము కలగునని పెద్దలు చెబుతారు.

***నేను:*** వదినా, అలా ఎవరైనా మనఃపూర్వకంగా ధ్యానం చేస్తున్నట్లు మనకు పైకి ఏమయినా తెలుస్తుందా, అంటే గుర్తు పట్టడానికి!

***వదిన:*** అదే తరువాత శ్లోకాలలో తెలియజేస్తున్నారు.

**16."స్వామిన్! భవద్ధ్యాన సుధాభిషేకాత్**

**వహంతి ధన్యాః పులకానుబంధమ్**

**అలక్షితే క్వాఽపి నిరూఢమూలమ్**

**అంగేషు ఇవానందధుమ్ అంకురంతమ్"**

*స్వామిన్: ఓ హయగ్రీవ స్వామీ!*

*ధన్యాః: అదృష్టవంతులు*

*భవత్: నీయొక్క*

*ధ్యాన: ధ్యానము అనెడు*

*సుధా: అమృతముయొక్క*

*అభిషేకాత్: అభిషేకము వలన*

*అలక్షితే అపి: కనుపించనిది అయినను*

*క్వ: ఒక చోట*

*నిరూఢమూలమ్: స్థిరమైన మూలములు కలిగినదియు*

*అంగేషు: అవయవములందు*

*అంకురంతమ్: ఉద్భవించునదియు*

*ఆనందధుమ్ ఇవ: ఆనందమువలె (ఉన్న దియును అయిన)*

*పులక అనుబంధమ్: పులకరింతను*

*వహంతి: పొందుచున్నా రు*

ఓ హయగ్రీవ స్వామీ! నీ ధ్యానమనెడు అమృతాభిషేకము వలన ధన్యులు ఒక చోట స్థిరమైన మూలములు కలిగి, అవయవములంతటనూ ఉద్భవించి, వ్యాపించు ఆనందమువలన తమ శరీరమంతటను పులకాంకితులవుతున్నారు.

*నేను:* ధన్యులు అంటే

*వదిన:* "ధనమ్ పుణ్యమ్ అస్య అస్తి ఇతి ధన్యః" అనిన్నీ, "సుకృతీ పుణ్యవాన్ ధన్యః" అనిన్నీ ధన్యః అంటే అర్థం చెబుతారు. అంటే సంపదయు, పుణ్యమును కలిగిన వారు ధన్యులు. ఇక్కడ సంపద అంటే లౌకికమైన కనక, వస్తు, వాహనాదులే కాక పరమాత్మ కైంకర్య సంపద అని తెలుసుకోవాలి. "అంతరిక్ష గతః శ్రీమాన్" అని లంకను వదలి రాముని చెంతకు బయలుదేరిన విభీషణుడిని వాల్మీకి, "సతు నాగవరః శ్రీమాన్" అని జవ సత్వాలు ఉడిగి, నీరసుడై పరమాత్మను గుర్తు చేసుకున్న గజేంద్రుడిని పరాశరుడు "శ్రీమాన్" అని చెబుతారు కదా! అలాగే అన్నీ వదలివేసి అడవులకు అన్నగారి వెంటవచ్చిన లక్ష్మణుడిని "లక్ష్మి సంపన్నః" అంటారు. అలాగే హయగ్రీవ స్వామిని ధ్యానము చేయడం వలన వారు ధన్యులయినారన్న మాట. మరి వారి సంపద, పుణ్యము ఏమిటి అంటే "య తత్ ప్రియమ్ తదిహ పుణ్యమ్ అపుణ్యమన్యత్" అన్నట్లు భగవన్ముఖ వికాసమునకు వారు చేయు కైంకర్యమే.

అలాంటి కైంకర్యాన్నే ఆళ్వార్లు, ఆచార్యులు కూడా గొప్ప సంపదగా చెప్పేరు. "నమ్మాల్ పోత్తప్పట్టై తరుమ్ పుణ్ణియమ్" అనిన్నీ, "పైత్త మానిది" అనిన్నీ చెప్పినట్లు భక్తులకు పుణ్యము భగవానుడే. ఆయన కైంకర్యమే.

*నేను:* ఒక చోట స్థిరమైన మూలములు కలది అంటే

*వదిన:* ఇక్కడ పైకి కనుపించనిది, స్థిరమైన మూలములు గలది, సమస్త అవయవములయందు ఉద్భవించేది అనే ఈ విశేషణాలు వారి ధ్యానానికి, మనస్సులో వారు అనుభవించే ఆనందానికి కూడా వర్తిస్తాయి.

మనకు ఒంటిమీద చల్లటి నీళ్ళు పడితే ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకుంటాయి కదా. అలాగే హయగ్రీవ మూర్తి ధ్యానమనే మనకు కంటికి కనుపించని చల్లటి అమృతములో అభిషేకమయినవారికి కూడా రోమాంచము కలుగుతుందట.

"నిరూఢమూలమ్" అంటే భూగర్భంలో ఎక్కడో కనుపించకుండా స్థిరమైన వృక్ష బీజమునకు అంకురము పుట్టి బయటకు వచ్చి నట్లు మనస్సులోతులలో హయగ్రీవ మూర్తి ధ్యానము వలన కలిగిన కనబడని ఆనందము శరీరమంతటా రోమాంచమై మైపులకల ద్వారా బయటకు భాసిస్తోంది అని అర్థము.

వరదరాజ పంచాశత్ లో "భూయో భూయః పులక నిచితైః అంగకైః ఏధమానాః స్థూల స్థూలాన్ నయన ముకులైః బిభ్రతో బాష్పబిందూన్

ధన్యాః కేచిత్ వరద! భవతః సంపదమ్ భూషయంతః స్వాంతైః అంతర్వినయ నిభృతైః స్వాదయంతే పదంతే" అంటూ భక్తి వలన పులకాంకితులయినట్లు చెప్పే శ్లోకము ఇక్కడ గుర్తుకు వస్తుంది.

***నేను:*** అంటే మనకు సంపద అంటే ఆయనకు కైంకర్యము, పుణ్యము అంటే ఆయనను పొందడమూ అన్న మాట!

ఈ "వరదరాజ పంచాశత్" శ్లోకములో "నయన ముకులైః బిభ్రతో బాష్పబిందూన్" అని కళ్ళలో బాష్పబిందువులు స్రవించడం కూడా చెప్పేరు కదా!

***వదిన:*** తరువాత శ్లోకములో ఆ విషయమే ప్రస్తావిస్తున్నారు.

17."స్వామిన్ ప్రతీచా హృదయేన ధన్యాః

త్వత్ ధ్యాన చంద్రోదయ వర్ధమానమ్

అమాంతమానంద పయోధిమ్ అంతః

పయోభిః అక్ష్ణామ్ పరివాహయంతి"

*స్వామిన్: ఓ హయగ్రీవ స్వామీ!*

*ధన్యాః: భాగ్యవంతులు, పుణ్యవంతులును*

*ప్రతీచా: అంతర్ముఖమైన*

*హృదయేన: మనస్సునందు*

*త్వత్: నీయొక్క*

*ధ్యాన: ధ్యానము అనెడు*

*చంద్ర: చంద్రుని యొక్క*

*ఉదయ: ఉదయించుట వలన*

*వర్ధమానమ్: పెంపొందుచున్న*

*అంతః: మనస్సునందు*

*అమాంతమ్: అవధిలేని*

*ఆనంద: ఆనందమనెడి*

*పయోధిమ్: (క్షీర) సముద్రమును*

*అక్ష్ణామ్: కన్నుల యొక్క*

*పయోభిః: నీటిచే*

*పరివాహయంతి: ప్రవాహమును కల్గిన దానినిగా చేయుచున్నారు.*

**స్వామీ! అంతర్ముఖులై నిన్ను చేయు ధ్యానము చేయు ధన్యుల మనస్సులో వలె నీ మూర్తి ధ్యానము ఆనందము కల్గించును. నీ మూర్తి ధ్యాన చంద్రోదయము వలన వృద్ధి చెందిన నిరవధికమైన ఆ ఆనంద సాగరము కన్నుల వెంట ప్రవాహముగా బయల్వెడలు చుండును. అనగా వారి కళ్ళ వెంట అశ్రుధారలు వెడలు చుండునని అర్థము.**

***నేను:*** "అంతర్ముఖులై" అంటే!

***వదిన:*** మనం ఇంతకు ముందు "హిరణ్మయేన పాత్రేణ సత్యసాపిహితమ్ ముఖమ్

తత్త్వమ్ పూషన్ అపావృణు సత్య ధర్మాయ దృష్టయే"

అన్న "ఈశావాస్యోపనిషత్" మంత్రానికి అర్థం చెప్పుకుంటూ విషయాలనుండి జీవాత్మ జ్ఞాన ప్రసరణం మరలించమని పరమాత్మను ప్రార్థించడం చెప్పుకున్నాము కదా.

మనం చెప్పుకున్నామే ధర్మభూత జ్ఞానము మనస్సు ద్వారా బయటకు ప్రసరిస్తుందని. ఇలా బాహ్య విషయాలపై ప్రసరించకుండా క్రమంగా మరలిస్తూ బాహ్య వ్యాపారాల పై కాక ఈ జ్ఞాన ప్రసారాన్ని వెనుకకు మళ్ళించి అంటే ఆత్మ సహజ లక్షణములైన భగవచ్ఛేషత్వ, పారతంత్ర్యములు తెలుసుకొని, ఆ భగవానునితో మనకు గల అవినాభావ సంబంధము తెలుసుకొని, ఆయనే ప్రాపకము, ప్రాప్యము కూడా అని ఆ భగవానుని కళ్యాణ గుణాలను అనుభవించడం అన్నమాట.

భగవద్గీతలో "స్థిత ప్రజ్ఞావస్థ" నాలుగు దశలలో ఉంటుందని చెబుతూ, ఇంద్రియాలను తాబేలులా వెనుకకు తీసుకొని, బాహ్యవ్యాపారాలు ఆపి జ్ఞాన ప్రసరణం ఆత్మ యందు నిలిపే ప్రయత్నము "యతమానావస్థ" అనీ, అయితే బలాత్కారముగా ఇంద్రియాలను మరల్చలేము కనుక ఉదాసీనముగా ఉంటూ ఆ విషయ సంగమును మనస్సులో నిలుపుకోకుండా ఎవరినీ/ దేనినీ అభినందించకపోవడం, ద్వేషించక పోవడం చేస్తూ ఉండడం "వ్యతిరేకావస్థ" అనీ ఇలా క్రమంగా ద్వేషాన్ని, విషయ అభిరుచినీ తొలగించుకొని ఆత్మ యందు ఎక్కువగా లగ్నము చేసే స్థితికి "ఏకేంద్రియావస్థ" అనీన్నీ చివరకు ఆత్మానందానికి అలవాటు పడిపోయి అనుభవించే స్థితికి "వశీకారావస్థ" అనీ చెబుతూ బాహ్య విషయాలనుండి పూర్తిగా దృష్టి మరల్చినా, మనస్సులో పాత జన్మ వాసనలు మడ్డిలా ఉండి పోవడం వలన వాటిని మనంతట మనం తొలగించుకోలేము కనుక పరమాత్మను ఆశ్రయించడం అవసరము అని వివరిస్తాడు కృష్ణ భగవానుడు.(భ.గీ. అ.2, శ్లో 55-59).

అలా అంతర్ముఖులై పరమాత్మ ధ్యాన నిమగ్నులై ఉన్న వాళ్ళు ముందు శ్లోకంలో చెప్పినట్లు ధన్యులు అంటే భాగ్య శాలురు, పుణ్య శీలులు అని చెబుతున్నారు.

పూర్ణ చంద్రోదయము అయితే సముద్రము పొంగి కెరటాలు పెద్దవవుతాయట. ఇంతకు ముందు చెప్పినట్లు చంద్రుని వలె చల్లని హయగ్రీవ మూర్తి వారి మనస్సులో ఉదయిస్తే వారి మనస్సులో ఆనంద సాగరము కూడా

పొంగుతుంది. ఆ నీరు వారి కళ్ళనుండి బాష్ప ధారలుగా ప్రవహిస్తుందిట. అంటే అట్టి వారి కళ్ళు చెమర్చి కళ్ళవెంబడి నీరు స్రవిస్తుందని అర్థము.

**నేను:** అలా ధ్యానము చేయడం వలన పులకలు కలుగడం, ఆనంద బాష్పాలు రావడం సంగతి సరే కాని, ఈ సంసారం సంగతి ఏమిటి! దాని నుండి మోక్షం ఎలా!

**వదిన:** ఆ విషయమే తరువాత శ్లోకములో చెబుతున్నారు.

**18."స్వైరానుభావాః త్వదధీన భావాః**

**సమృద్ధ వీర్యాః త్వదనుగ్రహేణ**

**విపశ్చితః నాథ! తరంతి మాయామ్**

**వైహారికీమ్ మోహనపింఛికామ్ తే"**

*నాథ: నా నాథుడవైన ఓ హయగ్రీవస్వామీ!*

*త్వత్: నీయందు/ నీకు*

*అధీన: లగ్నమైన/ అధీనమైన/ లోబడిన*

*భావాః: భావము కలగినటువంటి*

*స్వైర: వేరొకరిచే/ వేరొకదానిచే ప్రభావితము కాని (అతులితమైన)*

*అనుభావాః: అనుభావము/ ప్రభావము కలిగినటువంటి*

*విపశ్చితః: జ్ఞానులు*

*త్వత్: నీయొక్క*

*అనుగ్రహేణ: అనుగ్రహము/ ప్రసాదము చేత*

*సమృద్ధవీర్యాః: మిక్కిలి ఎక్కువైన/ సంపూర్ణమైన ఆనందానుభవము కలిగినవారు (అయి)*

*వైహారికీమ్: నీ లీలకు ఉపకరణమైన*

*మోహన పింఛికామ్: సమస్త లోకములను సమ్మోహన పరచు ఐంద్రజాలిక పింఛము వలెనున్న*

*తే: నీ యొక్క*

*మాయామ్: విచిత్ర రీతి, ప్రవృత్తులు గల ప్రకృతి ప్రభావమును*

*తరంతి: దాటుచున్నారు.*

ఓ హయగ్రీవ స్వామీ! నీకు అధీనమైన భావము కల జ్ఞానులు అనగా నీవు శేషివనీ, తాము శేషులమనీ తలంపుతో నున్న వారు వేరొక (ప్రకృతి సంబంధమైన) ప్రభావములకు లోబడక అడ్డులేని ఆనందానుభవమును అనుభవించుచుందురు.

వారు నీకు ఈ సృష్టి కార్యములో ఉపకరణమైనది, సమస్త జగత్తును మోహింప జేయునది అయి ఇంద్రజాలికుని చేతిలోని పింఛమువలె నుండు ఈ మాయను దాటుచున్నారు.

**నేను:** ఈ "మాయ" అన్న పదము నన్ను సందిగ్ధతలో పడేస్తుంటుంది. "యా మా సా మాయా" అని "ఏది లేనిదో అదే మాయ" అని అంటారు కదా. అంటే "కలలో పులి వస్తే పొరబడి భయపడిన తరువాత తెలివి వచ్చి ఆ పులి లేదని" తెలుసుకున్నట్లు ఈ మాయ కూడా అలాగే

మనకు "ముందు ఉన్నట్లుగా భాసమానమై పిదప యథార్థమైన వస్తు జ్ఞానము వలన నివర్తింపబడేదేనా". అంటే సంసారమూ అదీ అంతా మాయయే, దానిలో మునిగి పోకుండా దాటడం అంటే ఈ సంసారమూ అదీ నిజము కాదు నిజమైనది ఆ బ్రహ్మానుభవమే అన్న విషయము తెలుసుకోవడమేనా, అదేనా ఈ ధ్యానము వలన మనకు కలిగే లాభము!

**వదిన:** "మాయ" అంటే "లేనిది" అని అర్థం కాదు. ఈ విషయం శ్రీభాష్యం చర్చలో కూలంకషంగా నేర్చుకొనే ఉంటావు. అయినా క్లుప్తంగా మరొక సారి గుర్తు తెచ్చుకొనేవప్రయత్నము చేద్దాము.

మనకు మామూలుగా తెలిసిన చతుర్విధ దండ నీతులైన సామ, దాన, భేద దండనీతులే కాక మరొక మూడు కూడా శాస్త్రాలలో చెబుతారు. అవి మాయ, ఇంద్రజాలము, ఉపేక్ష అని. మాయ అంటే ఊహ కందని విచిత్ర రీతి అన్నమాట. ఇంద్రజిత్తు మాయా యుద్ధము చేసేడు అంటే ఆ యుద్ధము అంతా అసత్యము అని కాదు, అసత్యము అయితే రామ, లక్ష్మణులకు, వానర సేనకు దెబ్బలు తగిలి మూర్ఛిల్లి పోకూడదు కదా. అందువలన

మాయ అంటే ఊహించరాని విచిత్ర రీతి అని అర్థము. ఈ ప్రకృతి విధానము విచిత్రమైనది కదా. అందుకే దానిని మాయ అని అంటారు.

నువ్వింతకు ముందు చెప్పినట్లు నిద్రలో విషయాలు అసత్యాలు కాదు. నిద్రలో పులి కనబడితే నీకు భయం వెయ్యడం, స్వేదం ఒంటిమీద కలగడం లాంటివి జరుగుతాయి కదా, అందువలన నిద్రలో విషయాలు కూడా సత్యాలే తప్ప అసత్యాలు కాదు. అసత్యాలు అంటే అసలు ఉండనివి అంటే కుందేటి కొమ్ము, గగన కుసుమము లాంటివి అన్న మాట.

ఇంక మన ప్రస్తుత విషయానికి వస్తే ఇక్కడ చెబుతున్నది ఈ విచిత్ర పోకడలతో మోహింపజేసే ఈ జగద్వ్యాపారాలు, అవి భగవదాధీనములు. మనము భగవానునికి పరతంత్రులమైతే వాటి ప్రభావము తొలగుతుంది అని ఇక్కడ అర్థము.

అందుకే "శ్వేతాశ్వతర ఉపనిషత్" లో "మాయామ్ తు ప్రకృతిమ్ విద్యాత్ మాయినమ్ తు మహేశ్వరమ్" అని మాయ అంటే ఈ విచిత్రమైన ప్రకృతి అనీ, దీనికి ఈశ్వరుడు, నియామకుడు పరమాత్మ అనీ చెప్పేరు. భగవద్గీతలో కూడా "దైవీహ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా" అని త్రిగుణాత్మకమైన దీనిని మనము నియంత్రించలేమని చెబుతూ, "మామేవ యే ప్రపద్యంతే మాయామ్ ఏతామ్ తరంతితే" అని నన్ను మాత్రమే ఆశ్రయించిన వారు దీనిని దాట గలరు అని చెప్పేడు కృష్ణ పరమాత్మ.

***నేను:*** అంటే దీని వలన ఏమి జరుగుతుంది. అసలు దీనిని పరమాత్మ ఎందుకు సృష్టించడం, మనలను పరీక్షించడానికా, లేక తనకు ఒక ఆటగా ఇదంతా చేస్తాడా!

***వదిన:*** భగవద్రామానుజులు శరణాగతి గద్యలో చెప్పిన వాక్యాలు గుర్తు తెచ్చుకో.

"మదీయ అనాది కర్మ ప్రవృత్తామ్ భగవత్ స్వరూప తిరోధాన కరీమ్ విపరీత జ్ఞాన జననీమ్ స్వవిషయాయాశ్చ భోగ్యబుద్ధేః జననీమ్ దేహేంద్రియత్వేన సూక్ష్మ రూపేణ

చ అవస్థితామ్ దేవీమ్ గుణమయీమ్ మాయామ్ దాసభూతః శరణాగతోస్మి తవాస్మి ఇతి వక్తారమ్ మామ్ తారయ" అన్నారు. అందువలన ఇది

"1.అనాది అయిన నా (మనయొక్క) కర్మ పరంపరల వలన ఏర్పడినది.

2.భగవానుడే శేషి, నేను ఆయనకు శేషము అను భగవత్స్వరూపము తెలియకుండా అడ్డుపడునది, భగవత్స్వరూపము తెలుసుకొనకుండా వెనుకకు మరలించునది

3. విపరీత జ్ఞానము అనగా తత్త్వ్యతిరేకమైన జ్ఞానము తోపించునది

4. లౌకిక విషయముల యందు భోగ్య బుద్ధి కల్గించునది

5. దేహేంద్రియములుగా సూక్ష్మరూపమున నుండునది(అనగా మనస్సు కాని ఇంద్రియములు కాని కనుపించవు కదా

6. గొప్ప మహత్త్వము కలది (అందువలన మనము దానిని జయించలేము)

7. త్రిగుణాత్మకమయినది(అనగా లౌకికమై సత్త్వ, రజ, స్తమో గుణ విశిష్టమైనది)

8. మాయ అను పిలువబడునది

అట్టి దానినుండి "దాసభూతుడను, శరణాగతుడను, నీయొక్క దాసుడను" అని పలుకుచున్న నన్ను రక్షింపుము.

అని అంటారు భగవద్రామానుజులు. అంటే ఇది అనేకజన్మలనుండి మనము సంపాదించుకుంటున్నదే. దాని వలననే మనము పరమాత్మకు దూరమవుతున్నాము.

**నేను:** మఱి ఇలా తిరోధాన ప్రవృత్తితో ఉన్న మనలను పరమాత్మ మళ్ళీ మళ్ళీ సృష్టి చేసి అవకాశమిస్తున్నాడా మనము ఆయనను ఆశ్రయించడానికి.

**వదిన:** దీనికి మరొక కారణం కూడా ఉంది. దానిని పరాశర భట్టరు వారు తన శ్రీరంగరాజ స్తవము ఉత్తర శతకములో చెబుతారు.

"వరద! చిదచిదాఖ్యమ్ స్వేచ్ఛయా విస్తృణానః

ఖచితమివ కలాపమ్ చిత్రమాతత్య ధూన్వన్

అనుశిఖిని శిఖీవ క్రీడసి శ్రీ సమక్షమ్"

ఆడు నెమలిని ఆనందింప చేయడానికి మగ నెమలి తనలోనే అపృథక్సిద్ధ విశిష్టమైయున్న పింఛాన్ని విప్పి ఆడి ఆడు నెమలికి ఆనందము కల్గించునట్లు పరమాత్మ దయారూపిణి అయిన అమ్మను ఆనందింప చేయడానికి తనకు అపృథక్సిద్ధమయిన ఈ జగత్తును బయలు పరచి తమ క్రీడలో భాగంగా మనకు మరియొక అవకాశం ఇస్తున్నాడన్న మాట. మనలనుద్ధరిస్తే అమ్మకు ఆనందము కదా!

అందుకే పిళ్ళై లోకా చార్యుల వారు తత్త్వత్రయమున అచిత్ ప్రకరణములో "ఈశ్వరనుక్కు క్రీడా పరికరమాయ్" అని నిర్వచిస్తారు. దానిని వ్యాఖ్యానిస్తూ మణవాళ మహామునులు "అతావతు సర్వేశ్వరునడైయ జగత్సృష్ట్యాది లీలైక్కు ఉపకరణమాయిక్కై" అని "సర్వేశ్వరుని జగత్సృష్ట్యాది లీలకు ఉపకరణమని" ఈ ప్రకృతిని గూర్చి చెబుతారు. ఈ ప్రకృతి సత్త్వరజస్తమో గుణ మిశ్రితమైనందున వేదము ప్రకృతిని "అజామేకామ్ లోహిత శుక్ల కృష్ణామ్" అని వివిధ వర్ణములను కలదిగా చెప్పింది. అందువలన చిత్ర విచిత్ర వర్ణములు గల నెమలి పింఛపు గుత్తిని/ కట్టను ఇక్కడ మన శ్లోకములో దానికి ఉపమానముగా చెబుతున్నారు.

మన శ్లోకములో కూడా ఒక ఇంద్ర జాలికుడు తన చేతిలోనున్న వివిధ వర్ణముల పింఛపు కట్టతో విచిత్రాలు చూపినట్లు, పరమాత్మ త్రిగుణాత్మకమైన జగత్తుతో మనకు విచిత్ర వైఖరులు తోపించునని వర్ణిస్తున్నారు. కాని ఆ విచిత్రములు చూపించేది ఆయనే కనుక ఆయన ఆయా చిత్ర, విచిత్రములకు వశుడై యుండడు. ముండకోపనిషత్ వాక్యము "అనశ్నన్ అభిచాకశీతి" అని మనము ఇంతకు ముందు చెప్పుకున్నాము

కదా. అందువలన మనము ఆయనను ఆశ్రయిస్తే మనను కూడ ఆ మోహ కారకమైన విషయ ప్రవృత్తి భరితమైన ప్రకృతి ప్రభావము నుండి తరింప జేసి తన దరి చేర్చుకొంటాడన్న మాట.

***నేను:*** అలా ఆశ్రయించడం అంటే...మనకు కావలసినది, మనం చేయవలసినది ఏమిటో కూడా చెప్పేరా!

***వదిన:*** అదే తరువాత శ్లోకములో చెబుతున్నారు.

19."ప్రాఙ్నిర్మితానామ్ తపసామ్ విపాకాః
ప్రత్యగ్ర నిఃశ్రేయస సంపదో మే
సమేధిషీరమ్ తవ పాదపద్మే
సంకల్ప చింతామణయః ప్రణామాః"

*ప్రాక్+నిర్మితానామ్: పూర్వము సంపాదించిన*

*తపసామ్: తపస్సులయొక్క*

*విపాకాః: ఫలములును*

*మే: నాకు*

*ప్రత్యగ్ర: నూతనమైన*

*నిఃశ్రేయస సంపదః: మోక్ష సంపదను కల్గించునవియును*

*సంకల్ప: కోరికల విషయమునందు*

*చింతామణయః: చింతామణి వలె ఏమి కావలెనన్న దానినీయగలవియు (అగు)*

*తవ: నీ యొక్క*

*పాద పద్మే: పద్మముల వంటి పాదముల యందు*

*ప్రణామాః: (నా యొక్క) నమస్కారములు*

*సమేధిషీరస్: అభివృద్ధినొందును గాక!*

నీ పాదపద్మముల యందు నా ప్రణామములు పూర్వ జన్మార్జిత తపఃఫలములవంటివి, ఈ జన్మలో నాకు మోక్ష సంపదను సాధించి పెట్టునవి, నా కోరికలనెల్ల సఫలము చేయగల చింతామణి వంటివి. అట్టి నా ప్రణతులు నీ పాద పద్మములయందు ఎల్లప్పుడు వృద్ధి పొందును గాక!

***నేను:*** అంటే మన పూర్వ జన్మ తపః ఫలము కూడా పరమాత్మ పాదాల వద్ద నమస్కారము చేయ గల అవకాశాన్ని పొందడం అంటున్నారా. అదెలాగ,

***వదిన:*** భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు

"బహూనామ్ జన్మనామ్ అంతే జ్ఞానవాన్ మామ్ ప్రపద్యతే

వాసుదేవః సర్వమితి సమహాత్మా సుదుర్లభః"

అంటే ఎన్నో జన్మల పుణ్యఫలము వలన జ్ఞానిగా నన్ను ప్రపత్తి చేస్తారని, సమస్తమూ తనకు వాసుదేవుడే అనే మహాత్ములు గొప్ప దుర్లభులనీ అంటాడు.

అసలు మానవ జన్మ లభించడమే దుర్లభము. ఇంతకు ముందు జన్మ ఫలితముగా స్వర్గమో, నరకమో అనుభవించిన పిదప జీవాత్మ పర్జన్యము ద్వారా, నీటి బిందువులతో ఈ లోకానికి చేరి నప్పుడు, అది ఏ ఊయిమీదనో పడి ఎన్నాళ్ళు మగ్గాలో. ఎప్పుడో ఒకప్పుడు ఏదో వీర్య కణంలో చేరినా, ఎన్నో కోట్ల రకాల జీవరాశులలో మనము ఏ పశు, పక్ష్యాదులమో అయిపోకుండా మానవ జన్మ పొందడము ఎప్పుడు కలుగుతుందో అదే గొప్ప పూర్వ జన్మ సుకృతము. ఇంక మానవ జన్మ పొందిన తరువాత కూడా అహంకార, మమకారములను అతిక్రమించి, విషయ లాలసత్వాలకు లోను కాకుండా పరమాత్మ పాదారవిందములయందు బుద్ధి కలుగడం ఎంత గొప్ప అదృష్టము. కులశేఖరులు "మజ్జన్మనః ఫలమిదమ్ మధుకైటభారే" అని ముకుందమాలలో చెబుతారు కదా.

ఆ పాద పద్మముల యందు చేయు ప్రణామమే మనకు మోక్షాన్ని తెచ్చిపెట్టేది, మనము ఏది కావాలంటే దానిని ఈయడమే కాక మనము కోరుకునే పరమాత్మ వద్ద నిత్య కైంకర్య భాగ్యాన్ని ప్రసాదించేది కూడా.

ఈశావాస్యోపనిషత్ లో

"యుయోధ్యస్మజ్జుహురాణ మేనః

భూయిష్ఠాంతే నమ ఉక్తిమ్ విధేమ"

అని "క్షుద్రమైన భోగములయందు బలాత్కారముగా మమ్ములనాకర్షించుచున్నట్టి, నిన్ను పొందుటకు ప్రతి బంధకముగా నున్నటువంటి పాపములు మానుండి దూరము చేయుము. అధికముగా నమోవాకములు నీకు చేయు చుందుము"

అని మన ప్రతి బంధకములు ఆయనే తొలగించ వలెననీ మనము నమోవాకములు చేయుచుందుమనీ చెబుతారు.

అలాగే శ్రీవేంకటేశ స్తోత్రములో "సకృత్ సేవయా నిత్య సేవా ఫలమ్ త్వమ్ ప్రయచ్ఛ ప్రయచ్ఛ" అనుచు నిత్య సేవ అను ఫలమును కోరుతారు.

మనకు కావలసినది "నమ ఇత్యేవ వాదినః" అనినట్లు ఆయనకు నమోవాకములు పలకడం, "శూళ్ న్దిరున్దు ఏత్తువర్ పల్లాండే" అని చెప్పినట్లుగా ఆయనకు మంగళాశాసనము చేయడమూను. ఆవిషయమే ఈ శ్లోకములో ప్రస్తావిస్తున్నారు.

***నేను:*** నువ్వింటాకా పర్జన్యము ద్వారా నీటి బిందువులతో జీవాత్మ ఈ లోకానికి వస్తాడు అని అన్నావు కదా, అది కొంచెం వివరించవా!

***వదిన:*** ఈ వివరాలను పంచాగ్ని విద్య అని "జీవాత్మ ఒక జన్మలో శరీరము విడచి దివంగతుడైన తరువాత తన పాప, పుణ్యాలను అనుసరించి నరకమో, స్వర్గమో వాటియందు అనుభవముల తరువాత ఎలా తిరిగి వెనుకకు వస్తాడో" ఆ వివరాలు చెబుతారు. ఆ లోకాలలో ఆయా అనుభవాలకు అంటే సుఖానుభవాలకు దుఃఖానుభవాలకు తగిన శరీరాలతో అంటే ద్యులోకములో సోమరాజ శరీరముతోను, నరకలోకములో యాతనా శరీరముతోను ఉన్న జీవాత్మ తన కర్మ ఫలాన్ని అవసరమైనంత అనుభవించిన తరువాత పర్జన్య లోకములో ప్రవేశిస్తాడుట. ఇది రెండవ స్థితి. అక్కడనుండి వర్షపు నీటితో కలసి భూలోకములో సస్యములయందు ప్రవేశిస్తాడు. ఇది మూడవ స్థితి. ఒక వేళ ఆ నీటి బిందువు ఏ రాయి మీదనో, సముద్రములోనో పడిపోతే మళ్ళీ ఎన్నాళ్ళకో ఆ జీవాత్మ సస్యమును చేరడం అవుతుంది. ఇంక సస్యమునుండి పశు, పక్ష్యాదులలోనో, మానవులలోనో ఆహారము ద్వారా చేరి రేతస్సులో ప్రవేశిస్తాడుట. ఇది నాలుగవ స్థితి. ఇంక ఆ రేతస్సు అనగా

పురుష వీర్యము స్త్రీ గర్భాశయములో ప్రవేశించడం ఐదవ స్థితి. ఇలా ఐదు స్థితుల తరువాత జీవాత్మ పునర్జన్మ పొందుతాడుట. ఈ ప్రయాణంలో జీవాత్మ అంటే జీవాత్మతో బాటు సూక్ష్మశరీరము అంటే ఇంద్రియాలు, భూత సూక్ష్మాలు, మనస్సు కూడా కలసి ఉంటాయని అర్థం చేసుకోవాలి. ఈ సూక్ష్మ శరీరము మనము విరజను దాటి మనకు దివ్య శరీరము సంప్రాప్తించే దాకా ఉంటుంది.

*నేను:* అలాగయితే మనకు బ్రహ్మ రాత ఎలా ఉంటే అలా జరుగుతుంది అంటారు కదా, అలా లలాట లిఖితమైన మన వర్తమాన, భవిష్యత్తులు కూడా మారిపోతాయా ఇలా ఆశ్రయించడం వలన!

*వదిన:* ఆ విషయమే తరువాత శ్లోకము

20."విలుప్త మూర్ధన్య లిపి క్రమాణామ్

సురేంద్ర చూడాపద లాలితానామ్

త్వదంఘ్రి రాజీవ రజః కణానామ్

భూయాస్ ప్రసాదో మయి నాథ భూయాత్"

నాథ: ఓ హయగ్రీవ స్వామీ

మూర్ధన్య: లలాటమునందు (లిఖించబడిన దానిని)

విలుప్త: లోపింప చేయబడినదిగను

లిపి క్రమాణామ్: వ్యతిరేకమైన క్రమము చేయగలిగినది (నుదుటి రాతలను మార్చగలిగినది)గను(చేయగల)

సురేంద్ర: ఇంద్రుడు, బ్రహ్మ మొదలగు  వారియొక్క

చూడాపద: శిఖాబంధములచే

లాలితానామ్: గౌరవింపబడినవి అయిన

త్వత్: నీయొక్క

అంఘ్రి: పాదములనెడు

రాజీవ: పద్మములయొక్క

రజఃకణానామ్: పరాగ రేణువుల యొక్క

భూయాస్: గొప్పదైన

ప్రసాదః: అనుగ్రహము

మయి: నా యందు

భూయాత్: కలుగుగాక!

ఓ హయగ్రీవస్వామీ! చతుర్ముఖ బ్రహ్మ మా భవిష్యత్తును లలాటమునందు లిఖించునట. అట్లు లిఖించబడిన దానిని లోపింప చేయుటకును లేదా అనుకూలముగా చేయుటకును సామర్థ్యము గలవి నీ పాద పద్మముల యందలి పరాగ రేణువులు. "ఆ పాదరేణువుల అనుగ్రహము నాయందు కలుగు గాక" అని ప్రార్థిస్తున్నారు ఈ శ్లోకములో.

*నేను:* "అవశ్యమ్ అనుభోక్తవ్యమ్ కృతమ్ కర్మ శుభాశుభమ్" అని మనము చేసిన కర్మలకు ఫలితము అనుభవించ తప్పదు అంటారు కదా, మఱి అది కూడా మారుతుందా!

*వదిన:* నువ్వు పలక మీద రాసిన దాని మీద ధూళి పడ్డదనుకో, ఆ రాసినది కనపడదు, లేదా వేరొక రకంగా కూడా కనపడవచ్చును. అలాగే మనము పరమాత్మ పాద పద్మాలకు శిరస్సు వంచి నమస్కారము సమర్పించినప్పుడు ఆ పాద పద్మాలయందుండే శ్రీ పాద రేణువులు మన నుదుటి మీద ఉండే రాతలపై పడతాయట. అప్పుడు ఆ నుదుటి రాత చెరిగి పోయి, అనుకూలముగా మారి పోవడం అవుతుందని దేశికులు చమత్కరిస్తున్నారు.

శ్రీపాదరేణువులు అంటే భగవద్భక్తులు, భాగవతులు అని కూడా గ్రహించవచ్చును. అట్టి వారు కూడ మన నుదుటి వ్రాతను మనకనుకూలముగా నుండేటట్లు చేయగల సామర్థ్యము గలవారు. భగవద్రామానుజులు విష్ణువర్ధనుని కుమార్తెకు బ్రహ్మ రాక్షసుని వదలగొట్టిన వృత్తాంతము మనకు తెలుసును కదా!

అలాగే ఉదాహరణకు దేవేంద్రుడు గర్వముతో తప్పు చేయడం వలన ఆయనకు దేవేంద్ర పదవి పోయింది. అప్పుడు ఆయన పరమాత్మను ప్రార్థిస్తే, పరమాత్మ వామన రూపము దాల్చి బలి చక్రవర్తిని మూడడుగుల నేలను అర్థించి, త్రివిక్రముడై సమస్త లోకాలను తన రెండు పాదాలతో ఆక్రమించి, బలి చక్రవర్తిని పాతాళానికి పంపి, దేవేంద్రుడికి మళ్ళీ దేవేంద్ర పదవి లభ్యమయేటట్లు చేసేడు. ఇలాగే ఎన్నో సార్లు దేవేంద్రుడు ఇబ్బందులలో పడి సహాయము కోరుతూండడం వలన పరమాత్మ పాదములు సురేంద్రాదుల శిరస్సులచే గౌరవించబడేవి అని వర్ణిస్తున్నారు.

***నేను:*** అంటే మనం చేసిన పాపాలన్నీ ఏమిటవుతాయి!

***వదిన:*** పరమాత్మను ఆశ్రయించినవారి కర్మ ఫలాలు, (అంటే పాపాలే కాదు పుణ్యకర్మ ఫలాలు కూడ ఆయనను పొందడానికి ప్రతిబంధకాలే, వాటి వలన స్వర్గానుభవములు పొందవలసి వస్తుంది కదా!), ఏమిటవుతాయి అన్నది వేదాంత దేశికులు ఒక శ్లోకములో వేరొక గ్రంథములో చెప్పేరు.

"ప్రారబ్ధేతర పూర్వ పాపమఖిలమ్ ప్రామాదికమ్ చ ఉత్తరమ్

న్యాసేన క్షపయస్ అనభ్యుపగత ప్రారబ్ధ ఖండం చ నః

ధీ పూర్వోత్తర పాప్మ నామ జననాత్ జాతేపి తన్నిష్కృతేః

కౌటిల్యే సతి శిక్షయాపి అనఘయస్ క్రోడీకరోతి ప్రభుః"

అంటే "ఈ కర్మ ఫలాలను పూర్వాఘములు, ఉత్తరాఘములు అని విభజించాలిట. పూర్వము అనేక జన్మలలోను, ఈ జన్మలో పరమాత్మను ఆశ్రయించక ముందు చేసినవి పూర్వాఘములు. ఇవి రెండు విధాలు. సంచితము, ప్రారబ్ధము అని. ఇంకను ఫలానుభవమునకు రాక భవిష్యత్తులో అనుభవించవలసినవి సంచితములు. ఇంక ఈ జన్మలో ఫలానుభవమును ప్రారంభించుచున్నవి ప్రారబ్ధములు.

ఈ ప్రారబ్ధములలో ఫలమనుభవించుటకు ఆరంభమైనవి అభ్యుపగతములు. ఇంకను ఒకటి, రెండు జన్మలలో అనుభవించవలసినవి అనభ్యుపగతములు.

అలాగే ఉత్తరాఘములు కూడా ప్రామాదికములు, బుద్ధి పూర్వకములు అని రెండు రకములు.

ఇందులో తనను ఆశ్రయించి తనకు శరణాగతి చేసిన వారికి పరమాత్మ పూర్వాఘాలన్నిటినీ క్షమించి తొలగించేస్తాడుట.

ఉత్తరాఘములలో ప్రామాదికాలను కూడా క్షమించేస్తాడు. కాని బుద్ధి పూర్వకములైన ఉత్తరాఘాలను మాత్రము పరమాత్మ క్షమించడు. అందువలన ఆయనను ఆశ్రయించిన వాడు బుద్ధి పూర్వకముగా పాపకర్మలు చేయకూడదు. ఒక వేళ చేస్తే, తన తప్పు తెలుసుకొని పశ్చాత్తాపము పొంది ఆ పాపానికి ప్రాయశ్చిత్తము చేసుకొనిన పిదప ఆతనిని పరమాత్మ అనుగ్రహిస్తాడు. ఒకవేళ ప్రాయశ్చిత్తము కుటిల బుద్ధితో చేసుకోకపోతే పరమాత్మయే అతనికి తగిన శిక్ష విధించి ఆ పాప పరిహారము కూడ గావించి తరువాత తన దరి చేర్చు కుంటాడుట. ఆ రకంగా పాపాలు పోతాయన్న మాట.

"మామేకమ్ శరణమ్ వ్రజ అహమ్ త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి" (భ.గీ..18-66) అని కదా భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుని ప్రతిజ్ఞ. అంటే ఆయనను ఆశ్రయిస్తే ఆయనను పొందడానికి ప్రతిబంధకములైన పాపాలన్నీ పటాపంచలు కాక తప్పదు. శ్రీమద్రామాయణములో విభీషణ శరణాగతి సందర్భములో "సర్వ లోక శరణ్యాయ" అని విభీషణుడన్నట్లు చతుర్ముఖ బ్రహ్మాదులకే శరణ్యమైన వానికి ఆ బ్రహ్మ రాత ఒక లెక్కయా

***నేను:*** అంటే మనము ఈ పాద పద్మాలను, నువ్వు ఇందాకటి నుండీ చెబుతున్నావే, జీవ, పరబ్రహ్మాలకు గల శరీర, శరీరి సంబంధము, మనకుండే దేహాత్మ భ్రాంతి నివృత్తి, లౌకిక విషయ విరక్తి ఇవన్నీ తెలిసేక లేదా కలిగేక ఆశ్రయించాలా! ఈ జ్ఞానమంతా లేకపోయినా ఆశ్రయించవచ్చా!

***వదిన:*** ఆ విషయమే తరువాత శ్లోకములో చెబుతున్నారు.

21."పరిస్ఫురత్ నూపుర చిత్రభాను

ప్రకాశ నిర్ధూత తమానుషంగామ్

పదద్వయీమ్ తే పరిచిన్మహే అంతః

ప్రబోధ రాజీవ విభాత సంధ్యామ్"

*పరిస్ఫురత్: అంతటనూ ప్రకాశించుచున్న*

*నూపుర: మణి మంజీరములనెడు*

*చిత్రభాను: సూర్యుని యొక్క*

*ప్రకాశ: కాంతి చేత*

*నిర్ధూత: పోగొట్టబడిన*

*తమోనిషంగామ్: చీకటి సంబంధము కలిగినది*

*ప్రబోధ: జ్ఞానమనెడు*

*రాజీవ: పద్మమునకు*

*విభూత సంధ్యామ్: వికసింప చేయు ప్రాతః సంధ్యయును అగు*

*తే: నీ యొక్క*

*పదద్వయీమ్: పాద ద్వంద్వమును*

*అంతః: మనస్సునందు*

*పరిచిన్మహే: ఉపాసించెదము*

సూర్యుని కాంతి వలన ప్రాతః సంధ్య చీకటిని దూరము చేయునట్లు నీ పాద పద్మ యుగళ నూపురముల నుండి బయల్వెడలు జ్ఞానప్రకాశము అజ్ఞానమును పోగొట్టి మాలో జ్ఞానోదయము కల్గించును. అట్టి నీ పాద ద్వంద్వమును మా మనస్సునందు ధ్యానించెదము

అంటే ఆయన పాద నూపురాల కాంతి మన అజ్ఞానాన్ని పోగొట్టి విజ్ఞానాన్ని ఇస్తుంది. అందువలన ఆయనను ఆశ్రయించడానికి ముందు మనకు పాండిత్యము, శాస్త్ర జ్ఞానము అవసరము లేదన్నమాట.

జన్మించిన పిదప తెలివి లేనట్లున్న పరీక్షిత్తు నాభిపై శ్రీకృష్ణ భగవానుడు తన కాలి ప్రేలునుంచుట వలన పరీక్షిత్తు చైతన్య, విజ్ఞానములు కలవాడయ్యెనుట కదా!

***నేను:*** ఆయన పాదాల నూపుర ప్రకాశమే మనకు జ్ఞానాన్ని కలిగిస్తుంటున్నారా!

***వదిన:***ఆయనతో ఉన్న నూపురములు ఎలాంటివో సూర్యుడూ అంతే కదా. ఱెండింటికీ శక్తి, ప్రకాశము,అస్తిత్వము కూడా ఆయన వలననే.

ఋగ్వేదములో 1:22:20 మంత్రము విని యుంటావు కదా!

"ఓమ్ తద్విష్ణోః పరమమ్ పదమ్ సదా పశ్యంతి సూరయః దివీవ చక్షురాతతమ్..."

అంటే ఆ విష్ణుమూర్తి యొక్క గొప్పదైన పరమ పదమును (అనగా గొప్ప పాదమును/ నిత్య విభూతిని) దేవాదులూ/ నిత్యసూరులూ ఎల్లప్పుడూ ధ్యానిస్తూంటారట. అది దివ్యప్రకాశముగా వారికి తోస్తుందట.

అందువలన వారికి కూడా వెలుగు చూపునదిగా విష్ణు పరమపదము వర్ణించబడుతుంది.

అందుకే మనము ద్వయ మంత్రములో "చరణౌ శరణమ్ ప్రపద్యే" అని ఆ లక్ష్మీ సహితుడైన శ్రీమన్నారాయణుని శ్రీపాదములు ఆశ్రయిస్తాను అని చెబుతాము. అక్కడ "చరణౌ" అని రెండు చరణములు అన్నట్లు ఇక్కడ కూడా "పదద్వయామ్" అని రెండు పాదములు అని చెబుతున్నారు.

మన ద్వయ ప్రకరణంలో పిళ్ళై లోకాచార్యులవారు "ప్రజై ములైయిలే వాయ్ వైక్కుమాపోలే" అని "ఈ పాదములను ఆశ్రయించడం చంటి పిల్లవాడు తల్లి స్థనముల వద్ద నోరు పెట్టి నట్లు" అని చెబుతారు. అలాగే "తిణ్ కళల్ ఆయిరుక్కుమ్" అని మిక్కిలి స్థిరత్వము కలిగినవై "పిరాట్టియుమ్, అవనుమ్ విడిలుమ్ తిరువడిగళ్ విడాతు" అని ఆశ్రయించిన వారిని పిరాట్టియు, పెరుమాళ్ళును విడనాడినను శ్రీపాదములు విడనాడక కాపాడుననియూ, అమ్మకు నివాసమైన పరమాత్మ దివ్య మంగళ విగ్రహ నిరూపకాలనీ చెబుతారు. అందుకే యామునులు తన స్తోత్ర రత్నములో

"కదా పునః శంఖ .... త్వచ్చరణాంబుజద్వయమ్ మదీయ మూర్థానమలంకరిష్యతి" అనుచూ, ఆ త్రివిక్రమావతార సమయంలో నీవు సమస్త జగములపై నీ శ్రీపాదముంచినప్పుడు నేను ఏ అజ్ఞాన స్థితిలో ఉన్నానో తెలియదు, మళ్ళీ నీ శ్రీపాదము నా శిరస్సును అలంకరించు అదృష్టము నాకు ఎప్పుడు కలుగునో కదా అని వాపోతారు.

భగవద్గీతలో "దదామి బుద్ధి యోగమ్ తమ్ యేన మామ్ ఉపయాంతి తే" (భ.గీ. 10-10) అని తనను ప్రేమతో భజించు వారికి తానే జ్ఞానాన్ని ప్రసాదిస్తానని, దానివలన వారు తనను పొందగలరు అనీ భగవానుడు చెబుతాడు.

అలాగే తరువాతి శ్లోకములో "అహమ్ అజ్ఞానజమ్ తమః నాశయామి" (భ.దీ. 10-11) అని తానే వారి అజ్ఞానమును నశింపచేస్తాను అని చెబుతాడు.

అంటే పరమాత్మ పాదాలను ఆశ్రయించడానికి మనకు గొప్ప శాస్త్ర జ్ఞానము, పాండిత్యము అక్కరలేదు అన్నమాట.ఆశ్రయిస్తే ఆయనే చూసుకుంటాడు. అవసరమైన ఆచార్యుడిని పంపిస్తాడు, మనకు కావలసిన వివేకాన్ని కలిగిస్తాడు. మనకు నిజ జీవితంలో కూడా భగవంతుడిని ఆశ్రయించిన వారికి ఆచార్యులే స్వయంగా వచ్చి కృపజేసి సమస్త శాస్త్ర జ్ఞానాన్ని ప్రసాదించినట్లు మనవాళ్ళలోనే ఉదాహరణలున్నాయి కదా!

"అన్ఱి ఇవ్వులగమళందాయ్ అడి పోత్తి" అని గోదమ్మ ముందుగా పరమాత్మ పాదాలకే కదా మంగళాశాసనము చేస్తుంది. ఋగ్వేదము "ఉరుక్రమస్య స హి బంధురిత్థా విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః" (ఋ. మం. 01.154.005)

అనగా

"ఎలాగయితే జనులకు బంధువులను ఆశ్రయిస్తే సహాయము లభిస్తుందో, బాగుగా దాహము వేసిన వానికి మధుర జలములు గల కూపము వద్ద దాహము తీరుతుందో అలాగే ఆర్తులకు పరమాత్మ పాదముల వద్ద పూర్ణానందము లభిస్తుంది." అని చెబుతుంది కదా.

"ఉద్ధరతి ఉపరి భక్తజనాస్ ఇతి

ఊర్ధ్వ ఆశ్రయణ సూచిత శక్తిమ్

ఊర్ధ్వ పుండ్ర తిలకమ్ బహుమానాత్

కిమ్ బిభర్షి వరద! స్వలలాటే!

ఓ వరదరాజ! నీ భక్తులు (కాళీయుని పడగలపై నర్తించిన ) నీ పాద చిహ్నములను ఊర్ధ్వ పుండ్రములుగా తాము కూడ ఊర్ధ్వ గతిని పయనించి నిన్ను పొందవలెనని ధరింతురు. కాని నీకట్టి అవసరము లేకపోయిననూ నీవు కూడా ఊర్ధ్వ పుండ్రమును ధరించుటకు కారణము నీ శ్రీపాద చిహ్నమైన ఊర్ధ్వ పుండ్రము నీ భక్తులను నిన్ను చేర్చుట వలన దానిని అభిమానించి గౌరవించుటకే కదా!

(అనగా స్వామి శ్రీపాద చిహ్నములనిన తన భక్తులను ఉద్ధరించునని స్వామికి కూడ గౌరవమే అన్నమాట!).

"ఊర్ధ్వమ్ నయతి యత్ పుండ్రమ్ ప్రాణినః పాపకారిణః

తస్యాఖ్య ఊర్ధ్వ పుండ్రేతి తస్మాత్ తత్ ధారయేత్ బుధాః"

అని స్వామి శ్రీపాదములను ధరించిన పాపకర్ములైన జీవులు ఊర్ధ్వ గతి పొంది పరమపదాన్ని చేరుతారు అని శాస్త్రము చెబుతుంది. అంటే ఆ శ్రీపాదాలకే కాక శ్రీపాద చిహ్నాలకే అంత గొప్పదనమున్నది.

అందుకే సమాశ్రయణ సమయములో చేయు శంఖ, చక్రాంకణము, రామానుజ దాస నామము, మంత్రము, భగవత్కైంకర్య యజ్ఞములతో బాటు ఊర్ధ్వ పుండ్ర ధారణము కూడ చాల ముఖ్య మైనది.

***నేను:***అందుకే మనవాళ్ళు ఊర్ధ్వ పుండ్రధారణ చేస్తారన్నమాట. మఱి శంకర భగవత్పాదులు ఏమి ధరించేవారో.

***వదిన:*** ఆది శంకరులు తమ ముఖమున ఏమి ధరించేరో స్పష్టముగా తెలియదు. ఎందుకంటే ఆయన కాలము గురించి, జీవన వృత్తాంతాల గురించి సరియైన సాక్ష్యాధారాలు లేవు. కాని, మహా మహోపాధ్యాయ శ్రీ తిరువిశ నల్లూర్ రామసుబ్రహ్మణ్య శాస్త్రిగారు తాము రచించిన శ్రీ శంకర భాష్య గాంభీర్య నిర్ణయమనే గ్రంథములో "తస్మాత్ ఊర్ధ్వ పుండ్రమేవ గోపీ చందనేన భగవత్పాదానామ్-ఇతి సిద్ధమ్" అని వ్రాసి యుండుట వలన వారు కూడ భగవత్పాదారవింద సూచకంగా ఊర్ధ్వ పుండ్రాన్నే ధరించి నట్లు తెలుస్తోంది.

"గృహీత్వా ప్రేక్షమాణా సా భర్తుః కర విభూషణమ్ భర్తారమివ సంప్రాప్తా జానకీ ముదితా భవత్" అని సీతమ్మ తల్లి శ్రీరామ చంద్రుని కర విభూషణాన్ని చూచి శ్రీరామ చంద్రుడినే పొందినట్లు ఆనందమును పొందినదట. అలాగే ఎల్లప్పుడూ స్వామి పాదములను అంటి పెట్టుకుని యుండే నూపురములంటే దేశికులు అత్యంతాభిమానముతో కీర్తిస్తున్నారు.

దేశికులు ఈ శ్లోకము నుండి మరికొన్ని శ్లోకాలలో హయగ్రీవ మూర్తి వర్ణనము కటాక్షిస్తున్నారు. భగవత్స్వరూప వర్ణనలో ఱెండు పద్ధతులున్నాయి. పాదముల నుండి పైవరకూ వర్ణించడం ఒక పద్ధతి. "అమలనాదిపిరాన్" లో తిరుప్పాణాళ్వార్ "తిరుక్కమల పాదం వందు ఎన్ కణ్ణిన్ ఉళ్ళన ఒక్కిన్దదే" అనుచు మొదట పాదారవిందములముతో ప్రారంభించి "శెయ్య వాయ్ అయ్యో" అనియు "నీండ అప్పెరియవాయ కణ్గళ్" అని నేత్ర సౌందర్యము వర్ణిస్తూ ముగించేరు. తల్లిపాలు త్రాగు పిల్లడు ముందు స్థనాలనే తడుముతాడట కదా! అలాగే దేశికులు కూడా పాదముల నుండి వాటికి ఉండే నూపురాల నుండి ప్రారంభించేరు.

ఈ విషయాన్నే శ్రీవేంకటేశ్వర ప్రపత్తిలో

"ప్రాయః ప్రపన్న జనతా ప్రథమావగాహ్యా

మాతృస్స్నావివ శిశోః అమృతోపమానౌ

ప్రాప్తౌ పరస్పర తులామతులాంతరౌ తే

శ్రీ వేంకటేశ చరణౌ శరణమ్ ప్రపద్యే"

అని "ప్రపన్నులకు ప్రథమముగా ఆశ్రయము ఇచ్చేవీ, బిడ్డలకు తల్లి స్థనముల వలె అమృత సమానమైనవి, నిరుపమానమైనవి, పరస్పర తుల్యమైనవి అయిన శ్రీవేంకటేశ్వరుని పద ద్వంద్వము వద్ద శరణాగతి చేస్తున్నట్లు" చెబుతాము కదా!

నూపుర సూర్య కాంతితో ప్రబోధ(జ్ఞాన) రాజీవము(పద్మము) వికసిస్తుందట. ఎంత చక్కని రూపకాలంకారమో చూడు.

***నేను:*** అవును. అంతకు ముందు శ్లోకములో అంఘ్రి రాజీవమని అన్నారు, ఇక్కడ ప్రబోధ రాజీవమని అంటున్నారు, చాలా చక్కని వర్ణనము.

***వదిన:*** భగవద్గీతలో

"జ్ఞానేన తు తదజ్ఞానమ్ యేషామ్ నాశితితుమాత్మనః

తేషామాదిత్యవత్ జ్ఞానమ్ ప్రకాశయతి తత్పరమ్"...భ.గీ. 5-16"

అను శ్లోకమున "అట్టి జ్ఞానము వలన అజ్ఞానము తొలగి కలిగిన ఆత్మ స్వరూప జ్ఞానము సూర్యుని వలె సమస్తమును చక్కగా ప్రకాశింపజేస్తుంది."అని చెబుతారు కదా!

అన్నట్లు మరచి పోయాను. ఈ శ్లోకములో సాయం సంధ్య అని అనుకోకుండా "విభాత సంధ్యామ్" అని. ప్రాతః సంధ్య అని స్పష్టం చేస్తున్నారు. ఎందుకంటే ప్రాతః సంధ్య జ్ఞాన ప్రబోధకము అని వేదము చెబుతుంది.

"ఋతావారీ దివో అర్కైః అభోధ్యా

రేవతీ రోదసీ చిత్రమస్తాత్

ఆయతీమగస్ ఉషసమ్ విభాతీమ్

(ఋ.మం. III-61-6)

అంటే వివిధ వర్ణములతో ప్రకాశించు ప్రాతః సంధ్య జ్ఞాన ప్రబోధకము. అందుకే కదా గోదమ్మ తన స్నాన వ్రతాన్ని "శిత్తుమ్ శిఱుగాలే" అని తెల్లవారు జామున ప్రారంభించింది.

నేను: నూపురాలని సూర్యునితో పోలుస్తున్నారు కదా ఈ శ్లోకంలో, కాంతి ప్రసరిస్తున్నట్లు చెబుతున్నారు.

*వదిన:* అవును. అంతేకాదు. తరువాత శ్లోకంలో నూపురముల మణుల నుండి వచ్చే మనోహరమైన ధ్వనిని వర్ణిస్తున్నారు. ముందు కాంతి, తరువాత ధ్వనీ కదా!

ఈ నూపురాలను వేదములను రక్షించే మంజూషగా కూడా వర్ణిస్తున్నారు తరువాత శ్లోకములో.

22."త్వత్ కింకరాలంకరణోచితానామ్

త్వయైవ కల్పాంతర పాలితానామ్

మంజు ప్రణాదమ్ మణి నూపురమ్ తే

మంజూషికామ్ వేదగిరామ్ ప్రతీమః"

*మంజుప్రణాదమ్: మనోహరమైన ధ్వనిని కలుగ జేయునవి*

*తే:నీ యొక్క*

*మణి నూపురమ్: మణి మయమైన పాదాభరణమును*

*త్వత్: నీ యొక్క*

*కింకర: దాసుల చేత(భక్తుల చేత)*

*అలంకరణ: అలంకారము చేయ బడుటకు*

*ఉచితానామ్: తగి యున్న వి*

*త్వయా: నీ చేతనే*

*కల్పాంతర: వేర్వేరు కల్పములలో*

*పాలితానామ్: రక్షింపబడినవి అగు*

*వేద గిరామ్: వేద వాక్కుల యొక్క*

*మంజూషికామ్: జాగ్రత్త పరచుకొను పేటిక వలె*

*ప్రతీమః: అనుకొందుము(తెలిసి కొందుము)*

మణి మయములైన నీ నూపురములు మనోహరమైన శబ్దమును చేయునవి, నీభక్తులచేత అలంకారము చేయ బడుటకు తగియున్నవి, కల్పాంతమందు నీ చేతనే సంరక్షించబడునవి అని మేము తెలియుదుము.

*నేను:* అంతకు ముందు రెండు శ్లోకాలలో పాదారవిందాలను స్తుతించి, తరువాత ఈ రెండు శ్లోకాలలో మళ్ళీ కాలి నూపురాలను కీర్తిస్తున్నారు, ఎందుకో!

**వదిన:** శ్రీమద్రామాయణములో కిష్కింధాకాండములో శ్రీరామ చంద్రుడు తాను కన్నీటితో నున్న కనులతో తాను గుర్తించలేక సీతమ్మ ఆభరణాలను గుర్తించమని లక్ష్మణస్వామికి చెబితే లక్ష్మణస్వామి

"నాహమ్ జానామి కేయూరే

నాహమ్ జానామి కుండలే

నూపురే తు అభిజానామి

నిత్యమ్ పాదాభి వందనాత్"

అనుచు కేయూరములను, కుండలములను తాను గుర్తించలేను గాని నిత్యము పాదాభివందనము చేయుట వలన సీతమ్మ నూపురములను తాను గుర్తించేనని చెప్పెడుట.

అలాగే పరమాత్మ పాదముల వద్ద నమస్కారము చేయు

భక్తులకు వెన్వెంటనే కనబడేవి, ఆ పాదాలను ఎల్లప్పుడూ అంటి పెట్టుకుని ఉండే ఆ పాదాభరణాలు. అందువలన అవి భక్తుల పాదాభివందనాన్ని సూచిస్తాయి. ఆ మణి మయాలైన ఆ పాద నూపురాలు భక్తులకు అత్యంత మనోహరాలు, శ్రుతి బోధకాలూ అంటున్నారన్న మాట.

శ్రీవేంకటేశ్వర ప్రపత్తిలో "ఆనూపురార్పిత సుజాత సుగంధి పుష్ప సౌరభ్య సౌరభకరౌ" అని శ్రీవేంకటేశ్వరుని పాదములు నూపురముల వరకూ సుగంధ పుష్పములు అర్పించబడినట్లు చెప్పినట్లు భక్తులచే అలంకార యోగ్యములైనవి ఆ నూపురములు.

కల్పాంత సమయములో వేద సంప్రదాయము విచ్ఛిన్నము కాగా పునఃసృష్టి సందర్భంలో భగవానుడు హయగ్రీవ రూపము దాల్చి చతుర్ముఖునికి వేద, వేదాంగములనుపదేశించెనని చెప్పుకున్నాము కదా!

లోకమున ధనికుడు తన పుత్ర, పౌత్రాదులకోసం తన విలువైన వస్తువులను దాచి, అందిచ్చి నట్లు, హయగ్రీవ మూర్తి నూపుర మంజూషములందు దాచి యుంచి వేద వాఙ్మయమును తిరిగి చతుర్ముఖునికందిచ్చినట్లు వర్ణిస్తున్నారు.

అంటే వేదనాదము ఆ పద నూపుర ధ్వనుల నుండి వచ్చినదన్న మాట.

ఆయన పదముల యందు ధ్యాన నిమగ్నులై యున్నవారికి ఆ నూపుర నాదము వినబడుతుందట. యోగులకు ఓంకార నాదము వలె.

శ్రుతి కూడా పరమాత్మ పాదాలను "త్రీణి పదా విచక్రమే విష్ణుః" "పాదోఽస్య విశ్వా భూతాని

త్రి పాదస్యామృతమ్ దివి త్రిపాదూర్ధ్వ ముదైత్పురుషః" ఇత్యాదిగా కీర్తించినది కదా.

శ్రీ పరాశర భట్టర్ ఈ మణి మంజీరముల ధ్వని వేదరవము అనియూ, వాని నాదము భగవత్పాదారవింద మహిమను కొనియాడు చున్నదనియూ చెబుతూ"శింజాన శ్రుతి శింజినీ మణిరవైః ...జయమ్ త్రివిక్రమ ముఖమ్ ఘుష్యద్భిః ఆమ్రేడితమ్" అని చెబుతారు.

దేశికులు పాదుకా సహస్రములో "భాస్వత్ సువర్ణ వపుషామ్ మణి పాద రక్షే పద్మాసహాయ పద పద్మ విభూషణానామ్ మంజీర శింజిత వికల్పిత మంజునాదా మంజూషికేవ భవతీ నిగమాంత వాచామ్"అనుచు ఆ నూపురాలు నిగమాంత మంజూషాలు అని చెబుతారు.

అసలు దేశికులు పాదుకా సహస్రములో సుమారు 100 శ్లోకాలలో పరమాత్మ పాదాల నుండి వచ్చే మృదు, మధుర నాదాన్ని "నాద పద్ధతి" లో వర్ణిస్తారు.

ఉదాహరణకు

"శ్రుతీనామ్ భూషణానామ్ తే

శంకే రంగేంద్ర పాదుకే

మిథా సంఘర్ష సంజాతమ్

రజః కిమపి శింజితమ్"

ఓ రంగనాథ పాదుకా! నీ యందుగల దివ్యమైన మణుల నుండి జనించిన సంగీత నాదము వేదముల వేత్వేఱు శాఖలు మిమ్ములను కీర్తించుచున్నట్లున్నవి.అనిన్నీ

"విహితేషు అభివాదనేషు వైద్యైః

గమనే ధీరితగర్భ రత్న నాదా

మధురమ్ మధువైరి పాదరక్షే

భవతీ ప్రత్యభి వాదనమ్"

ఓ మధువైరి పాదరక్షలారా! మీ నుండి వెలువడు మధుర నాదములు వేదములు పరమాత్మ ముందు తమ వివరములు తెలుపు కొనుచుండగా ప్రత్యభి వాదనము చేయు చున్నట్లు ఉన్నది అనిన్నీ

ఇలా అనేక శ్లోకములలో దేశికులు పరమాత్మ పాదుకల నుండి బయల్వెడలు మధుర నాదాలను కీర్తిస్తారు. అలాగే ఇక్కడ కూడా పరమాత్మ నూపుర నాదాన్ని కీర్తిస్తున్నారు.

అంత మహిమాన్వితములైన పాదములు కనుకనే యామునులు స్తోత్ర రత్నములో

"కస్య పాదోదకేన స శివః స్వశిరో ధృతేన"

అని చెప్పినట్లు సాక్షాత్తూ ఆ పరమశివుడే ఆ పాదోదకాన్ని తన శిరముపై ధరిస్తాడని చెబుతారు.

*నేను:* పాదాలూ, పాదాభరణాలూ వర్ణించిన తరువాత ...

*వదిన:* ఇంతకు ముందు నాల్గు ఱెండు శ్లోకాలలో పాదాలను, ఱెండు శ్లోకాలలో పాదాభరణాలనూ కీర్తించిన తరువాత మూడు శ్లోకాలలో స్వామి శ్రీహస్తములను కీర్తిస్తున్నారు.

అందులో ప్రథమంగా స్వామి దక్షిణ హస్తాన్ని గురించి చెబుతున్నారు.

నేను: ఱెండు పాదాలకూ ఱెండు శ్లోకాలు, ఱెండు పాదాభరణాలకూ మఱి ఱెండు శ్లోకాలూను అనుకో. కాని చేతులకు ఈ మూడు లెక్క ఏమిటి.

*వదిన:* ఇక్కడ దేశికులు సందర్శించిన లేదా మనకు సందర్శింప చేస్తున్న హయగ్రీవ స్వామి, చతుర్భుజుడు. పైన ఱెండు వామ, దక్షిణ హస్తములతో శంఖ, చక్రాలను ధరించి యున్నాడు. దిగువ ఱెండు చేతులలో దక్షిణ హస్తములో వ్యాఖ్యాన ముద్ర చూపిస్తూ, అక్షమాల పట్టుకొని యున్నాడు. వామ హస్తములో పుస్తకాన్ని ధరించి యున్నాడు. ఈ శ్లోకాలలో దేశికులు శంఖ, చక్రాలను ధరించి యున్న చేతులను కాక మిగిలిన ఱెండు చేతులను వర్ణిస్తున్నారు. స్వామి ఆయుధాలలో అత్యంత ముఖ్యమైన శంఖ, చక్రాలను, వాటిని ధరించిన హస్తాలను మరచి పోయినారా, అంటే పంచాయుధ స్తోత్రములో చెప్పి నట్లు శంఖము "యస్య ధ్వనిః దానవ దర్ప హంతా" అని దాని ధ్వని దానవుల దర్పాన్ని సంహరించడానికీ, చక్రము "సురద్విషామ్ ప్రాణ వినాశి విష్ణోః" అని దేవ రిపుల ప్రాణాలు తీయడానికీ అన్నట్లు శత్రు సంహారానికి పనికి వచ్చేవి. పరమాత్మే తన దగ్గర ఉన్నప్పుడు మఱి శత్రువులెక్కడ, వారి సంహారమెందుకు. ఇక్కడ దేశికులు తనకు కావలసిన జ్ఞానాన్నిచ్చే వ్యాఖ్యాన ముద్ర, అక్షమాల, పుస్తకములతో ఉన్న ఱెండు హస్తాలను ఈ మూడు శ్లోకాలలో వర్ణిస్తున్నారు.తరువాత శంఖ, చక్ర ధరుడైన స్వామిని ధ్యానిస్తారనుకో.

23."సంచింతయామి ప్రతిభాదశాస్థాన్

సంధుక్షయం తమ్ సమయప్రదీపాన్

విజ్ఞాన కల్పద్రుమ పల్లవాభమ్

వ్యాఖ్యాన ముద్రా మధురమ్ కరమ్ తే"

*విజ్ఞాన: విజ్ఞానమను*

*కల్పద్రుమ: కల్ప వృక్షము యొక్క*

*పల్లవ ఆభమ్: చిగురు యొక్క కాంతి వంటి కాంతి కల్గినది*

*వ్యాఖ్యా ముద్రా: వ్యాఖ్యాన ముద్ర చేత*

*మధురమ్: మనోహరమైనది అగు*

*తే: నీ యొక్క*

*కరమ్: చేతిని*

*ప్రతిభా: మేధ అను*

*దశాస్థాన్: వత్తి కల*

*సమయ: సిద్ధాంతము/ శాస్త్ర జ్ఞానము అనెడు*

*ప్రదీపాన్: గొప్ప దీపములను*

*సంధుక్షయంతమ్: పెంపొందించునదిగా*

*సంచింతయామి: తలచుచున్నాము*

నీ కరము విజ్ఞానమను కల్ప వృక్షము యొక్క చిగురు వలె ప్రకాశవంతమై యున్నదిగను, వ్యాఖ్యాన ముద్ర చే మనోహరమై యున్నదిగను, ప్రతిభ అనెడు వత్తి చివర సిద్ధాంతమనెడు దీపపు వెలుగును ప్రజ్వరిల్ల చేయునదిగను భావింతును.

***నేను:*** అర్థం అయీ అవనట్టుగా ఉన్నది, కొంచెం వివరించవా!

***వదిన:*** మనము ఇంతకు ముందు అనుకున్నట్లు స్వామి దక్షిణ హస్తాన్ని ఈ శ్లోకంలో స్తుతిస్తున్నారు.

ఆ హస్తానికి మూడు విశేషణాలు చెప్పేరు.

ఇదివరకు వివరించుకున్నట్లు పరమాత్మ జ్ఞాన స్వరూపుడు, జ్ఞాన గుణకుడు కూడ. అంటే దీపము వలె తాను తేజస్స్వరూపుడై, బయటకు ప్రసరించే "ప్రభ" అనే తేజోద్రవ్యానికి ఆశ్రయము కూడ అయి ఉంటాడు. " విజ్ఞాన ఘన ఏవ", "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" మొదలైన ఉపనిషత్ వాక్యాలు ఈ విషయాన్నే తెలియ చేస్తాయి.

ఈ శ్లోకంలో ఆ పరమాత్మను విజ్ఞానమనెడు కల్పవృక్షముతో పోల్చి చెబుతున్నారు. ఈ విజ్ఞానము కల్ప వృక్షము వలె మనకేది కావాలంటే అది ఇస్తుంది. వృక్షము ఇచ్చేది దాని శాఖాగ్రము నుండే కదా, అందు వలన ఆయన కరము ఆ కల్ప వృక్షము యొక్క చిగురు వలె ఉన్నది అంటున్నారు. చిగురు అభివృద్ధికి, నవ్యత్వానికి, కోమలత్వానికి, అరుణ వర్ణానికి ప్రతీక. అలాగే ఈ కరము మన అభివృద్ధికి దోహదము చేస్తూ, ఎల్లప్పుడూ కొత్త దనాన్ని అందిస్తుంది అన్నమాట. అలాగే సుకుమారముగా, కోమలంగా ఉంటుందట ఆయన హస్తము. అలాగే ఆ చివరలు చిగురులవలె తామ్ర వర్ణ శోభితాలు.

అయితే హయగ్రీవ స్వామి చేతి చివరలకు ఇంత ఎఱుపు ఎలా వచ్చింది, ఈ ప్రశ్నకు సమాధానము కూరత్తాళ్వాన్ తమ వరద రాజ స్తవము లో చెబుతారు.

"సాలీయా ఇవ విటపాః సపల్లవాగ్రాః...

భాసంతే వరద! భుజాః తవారుణాగ్రాః"

వృక్ష శాఖలలా విశాలముగా నున్న నీ కరాల చివరలు అరుణ వర్ణముతో ఉన్నాయి.

"అంబోధేః స్వయమభిమంథనమ్ చకర్థ

క్షోణీంధ్రమ్ పునరబిభశ్చ సప్త రాత్రమ్

సప్తానామ్ వివలయసి స్మ కంఠముక్ష్ణామ్

ఆమ్లానాః వరద! తథాపి పాణయస్తే!"

అసహాయంగా సముద్ర మంథనము, గోవర్ధనోద్ధరణము, సప్త మద వృషభ సంహారణము వంటి గొప్పపనులు చేసినా నీ చేతులు కందలేదే!

"రింఖాతః వ్రజ సదనాంగణేషు కిమ్ తే

గోయష్టి గ్రహణ వశాన్ను గోప గోష్టామ్

ఆలంబాద్ధయనయ సూత్ర తోత్రయోర్వా

పాణీనామ్ వరద! తవారుణత్వమాసీత్"

పాల కోసం గొల్లల ఇళ్ళలో ప్రాకడం వలననో, ఆవులను తోలడానికి ముల్లు కర్ర పట్టు కోవడం వలననో, గుజ్జాలు తోలడానికి కొరడా పట్టు కోవడం వలననో..ఏదో దాని వలన అయి ఇలా అరుణ వర్ణము వచ్చి ఉంటుంది.

అంటే ఆ కరాగ్రాల అరుణ వర్ణము స్వామి ఔన్నత్యము, పరత్వము కాక అనురాగము, సౌలభ్యము తెలియజేస్తాయన్నమాట. అందులకే కాబోలు దేశికులు స్వామి పరత్వాన్ని సూచిస్తూ పైకి ఉన్న శంఖ, చక్రాలు వదలి అందు బాటులో క్రిందకున్న హస్తాలనే వర్ణిస్తున్నారు.

ఇక, ఆెండవ విశేషణము వ్యాఖ్యాన ముద్ర. దీనినే జ్ఞాన ముద్ర, చిన్ముద్ర అని కూడా అంటారు. స్వామి నమ్మాళ్వారు కూడా ఇలాగే జ్ఞాన ముద్రతో అనుగ్రహిస్తున్నట్లు మనం చూస్తుంటాము. చూపుడు వ్రేలును మిగిలిన మధ్య వ్రేలు, ఉంగరపు వ్రేలు, చిటికెన వ్రేలు నుండి విడిగా బొటన వ్రేలు తో చేర్చి ఉంచే ముద్రను వ్యాఖ్యాన ముద్ర అని అంటారు.

దీనికి అర్థము సత్త్వ, రజ, స్తమో యుతమైన ప్రకృతి సంగము వీడి జీవాత్మ పరమాత్మాభిముఖుడవడవమని, జీవాత్మను సూచించే చూపుడు వ్రేలు పరమాత్మను సూచించే బొటన వ్రేలును ఆశ్రయించి ఉండడమే ఈ ముద్రకు అర్థమని చెబుతారు.

ఆచార్యుని నుండి శిష్యుడు ఉపదేశము పొందడాన్ని కూడా ఈ ముద్ర సూచిస్తుందట.

ఈ ముద్రకు యోగ పరంగా కూడా చాలా విశిష్టత ఉందట, ఈ ముద్ర వలన బుద్ధికి చాంచల్యము పోయి, నిలకడ రావడం, ధ్యాన కేంద్రీకరణ సామర్థ్యము పెరగడం అవీ కలుగుతాయని చెబుతారు.

జీవాత్మ, పరమాత్మను ఆశ్రయించడం వలననే ఆ జీవాత్మకు సంపూర్ణత సిద్ధిస్తుంది అని బొటన వ్రేలు, చూపుడు వ్రేలు కలయిక వలన ఏర్పడే వర్తులాకారపు గుర్తు సూచిస్తుందట.

"మధ్యమాద్యాః త్రయోఽగుళ్యః ప్రసృతా విరళాయది తర్జన్యంగుష్ఠ సంయోగే హంసాస్యా కర ఈరిత" అని ఈ ముద్ర లక్షణము చెబుతారు.

పరాంకుశాష్టకములో నమ్మాళ్వార్ హస్తమున చిన్ముద్రను వర్ణిస్తూ

"నమజ్జనస్య చిత్త భిత్తి భక్తి చిత్ర తూలికా

భవాహి వీర్య భంజనే నరేంద్ర మంత్ర యంత్రణా

ప్రపన్న లోక కైరవ ప్రసన్న చారు చంద్రికా

శఠారి హస్త ముద్రికా హఠాత్కరోతు మే  తమః"

అనుచు "ఆ శఠగోపుల హస్త ముద్ర భక్తుల మనఃకుడ్యములపై భక్తిని చిత్రించు కుంచె వంటిది, సంసార సర్ప దష్టుల విషమును తొలగించు వైద్యుని మంత్ర యంత్రము వంటిది, ప్రపన్నులనెడు కలువపూవులకు మనోహరమైన వెన్నెల వంటిది, అట్టి శఠగోపుల హస్త ముద్ర నా అజ్ఞానమును నశింప చేయు గాక!" అని ప్రార్థిస్తారు కదా!

అంటే జ్ఞాన కల్ప ద్రుమమైన ఆ స్వామి మనకు ఆ సమస్త జ్ఞానాన్ని ప్రసాదించే విషయాన్ని ఈ వ్యాఖ్యాన ముద్ర సూచిస్తుంది.

మన జ్ఞానము ఎల్లప్పుడూ ఎప్పటి కప్పుడు కొత్త విషయములతోను, కొంగ్రొత్త పోకడలతోను ఇతరులతో వాదములందు ఎత్తుకు పై ఎత్తు వేయుటకు తగినట్లు, మన చుట్టు ప్రక్కల ప్రతికూలమైన విషయాలను గెలవ గలిగి నట్లు ఉండాలి. దీనినే ప్రతిభ అని అంటారు. "ప్రజ్ఞా నవ నవోన్మేష శాలినీ ప్రతిభా మతా" అని నిర్వచనము.

జ్ఞాన స్వరూపులైన స్వామి నుండి మనకు జ్ఞాన ప్రసరణము జరగాలంటే వత్తి అవసరము కదా.  ఆ వత్తి నుండి శాస్త్ర జ్ఞానము అనెడు కాంతి మనలను సన్మార్గములో నడిపించి దిశా నిర్దేశము చేస్తుంది.

"సమయ ప్రదీపాన్" అనుట వలన వేదమునకు విరుద్ధముకాని సిద్ధాంత జ్ఞానము అని తెలుస్తోంది. రంగరాజ స్తవము లో పరాశర భట్టర్ "యా వేద బాహ్యాః స్మృతయో యాశ్చ కాశ్చ కుదృష్టయః" అంటు కొంతమంది వేదమును అనుసరించని బౌద్ధ, జైనాది మతస్థులైతే, మఱికొందరు ఆ వేదాలను సమగ్రంగా అర్థం

చేసుకొనని కుదృష్టులు అని ఆ ఇరువురినీ ఒకే రకంగా నిరసిస్తారు. అట్టి జ్ఞానము కాకుండా మనకు శ్రుతి విహితమైన శాస్త్ర జ్ఞానమును అందిచ్చేది స్వామి హస్తము.

అట్టి జ్ఞాన దీపాన్ని మనలో ఎల్లప్పుడూ పెంపొందించడాని కన్నట్లుగా ఆ వ్యాఖ్యాన ముద్ర ఉన్నదట. మనమందరమూ భ్రమ, ప్రమాదము, అశక్తి, మఱపు, ప్రకృతి ప్రభావము మొదలైన కారణాల వలన సరి అయిన జ్ఞానము కోలుపోతూంటాము. ఆ చతుర్ముఖ బ్రహ్మకే ఆ స్థితి తప్పలేదు కదా. అందువలన మనకూ అట్టి స్థితి సంభవమే. అలాంటప్పుడు ఈ హయగ్రీవుల దక్షిణ హస్తమున గల వ్యాఖ్యాన ముద్ర ధ్యానిస్తే కొడి గట్ట బోయే దీపపు వత్తిని తన ఱెండు వ్రేళ్ళతో ఎగదోస్తున్నట్లున్న ఆ వ్యాఖ్యాన ముద్ర మనలో జ్ఞానమును పునఃప్రతిపాదించి పెంపొందస్తుందన్న మాట. అందువలన ఆ హయగ్రీవ స్వామిని ఆశ్రయించిన వారి జ్ఞానము అప్రతిహతము, దిన దిన ప్రవర్ధమానము అయి ఉంటుందట.

*నేను:* అవును, అమ్మా, వాళ్ళూ అలాగే ఱెండు వ్రేళ్ళతో వత్తిని ఎగదోస్తూ ఉంటారు, బాగా వెలుగుతూ ఉండడానికి. అలాగే హయగ్రీవ స్వామి కూడా మనలో ప్రతిభ అనే వత్తిని ఎప్పుడూ ఎగదోస్తూ ఉండడానికి అలా ఱెండూ వ్రేళ్ళూ కలిపి పట్టుకొని కాచుకొని ఉంటారన్న మాట, మనకు ఎప్పుడు జ్ఞాన ప్రకాశము తగ్గితే అప్పుడు ఎగదోయడానికి. మనకు ఎప్పుడు జ్ఞానము మందగిస్తే అప్పుడు ఆ ముద్రను తలచుకొంటే మఱి ఇబ్బంది లేదన్న మాట. బాగా చెప్పేరు. తరువాత శ్లోకంలో కూడా స్వామి మరొక హస్తము గురించి చెప్పేరా!

**వదిన:** స్వామి దక్షిణ హస్తమునే గురించి తరువాత శ్లోకములో కూడా స్తుతిస్తున్నారు.

ఆయన దక్షిణ హస్తమునందు దేశికులకు కనబడు తున్నవి ఉపదేశ ముద్ర, అక్ష మాల. ఉపదేశ ముద్రను ఇంతకుముందు స్తోత్రము చేసేరు. ఇక అక్షమాలను స్తుతిస్తున్నారన్న మాట.

*నేను:* ఈ ఉపదేశముద్ర, అక్షమాల ఒకే చేతిలో ఉండడానికి మరేమయినా కారణము ఉన్నదా!

***వదిన:*** పరమాత్మ అవతరించిన అవతారములలో నర, నారాయణావతారాలలో పరమాత్మ తానే నారాయణునిగా ఆచార్యుడై, నరునిగా శిష్యుడై అష్టాక్షరీ మంత్రోపదేశము చేసేడు. అలాగే శ్రీమన్నారాయణుడుగా లక్ష్మీ దేవికి ద్వయమంత్రాన్ని ఉపదేశించేడు. శ్రీకృష్ణావతారంలో పార్థునికి చరమశ్లోకాన్నీ ఉపదేశం చేసేడు.

సమస్త వాఙ్మయాన్నీ చతుర్ముఖునికి ఉపదేశించిన సంపూర్ణ ఆచార్య అవతారము శ్రీమన్నారాయణుని హయగ్రీవావతారము.

"శాస్త్ర జ్ఞానమ్ బహు క్లేశమ్ బుద్ధేః చలన కారణమ్ ఉపదేశాత్ హరిమ్ జ్ఞాత్వా" అని చెప్పినట్లు శాస్త్ర జ్ఞానము నేర్చుకొనుట అత్యంత కష్టమైనది, మన బుద్ధి నిలువకుండా ఉంటుంది కనుక ఆచార్యోపదేశము చేత పరమాత్మను తెలుసు కోవాలి. హయగ్రీవుల హస్తములలో కనపడే ఉపదేశముద్ర, అక్షమాల, తాళపత్ర గ్రంథము ఆచార్యుల వలన ఏమి నేర్చుకోవాలో సూచిస్తాయి.

ఆ ఉపదేశ ముద్ర ముందు అనుకున్నట్లుగా మనకూ, పరమాత్మకూ ఉండే సంబంధము చెబుతుంది. అక్షమాల ఆచార్యుని చేత ఉపదేశించబడే మంత్రాన్ని సూచిస్తుంది. మంత్రము చెప్పేది కూడా మనమెవరమో, పరమాత్మ ఎవరో, మనము ఆయనను పొందడానికి సాధనమేమిటో, దానికి ప్రతి బంధకాలేమిటో,అలా పరమాత్మను పొందితే ఫలమేమిటో ఈ విషయాలు మంత్రోపదేశము వలన తెలుస్తాయి. దీనినే అర్థ పంచక జ్ఞానమని అంటారు. ఈ మంత్రాను సంధానము చేసిన తరువాత శాస్త్రాధ్యయనము చేయాలి. ఈ విషయం స్వామి వామ హస్తములో ఉండే తాళపత్ర గ్రంథము తెలియ జేస్తుంది.

ఈ మూడింటికీ మరొక అర్థం కూడా చెబుతారు. ఉపనిషత్ "ఆత్మా అరే శ్రోతవ్యః మంతవ్యః నిదిధ్యాసితవ్యః ద్రష్టవ్యః" అని చెబుతుంది. అంటే పరమాత్మ గురించి ఆచార్యుని వద్ద ఉపదేశము వినాలి. దీనిని ఉపదేశ ముద్ర సూచిస్తుంది. తరువాత దానిని మననము చేయాలి. దీనిని అక్షమాల చెబుతుంది. తదనంతరము మనః ఫలకముపై ప్రతిష్ఠించుకొని నిరంతర ధ్యానము చేయాలి. ఈ నిరంతర ధ్యానము తైల ధారలా అంతరాయము లేకుండా ఉండాలని చెబుతారు. వామ హస్తము లో ఉన్న తాళ పత్ర గ్రంథము ఇలా ఎల్లప్పుడూ మనస్సులో పరమాత్మను ప్రతిష్ఠించుకోవడాన్ని సూచిస్తుంది. శాస్త్ర గ్రంథములలో ప్రతి పాదించబడిన పరమాత్మ విషయము ఆ గ్రంథాలలో ఎల్లప్పుడూ నిలచి ఉంటుందికదా.

ఇక్కడ శ్రోతవ్యః, మంతవ్యః అని వినాలి, మననము చేయాలి అని చెప్పిన ఉపనిషత్తు నిరంతర ధ్యాన "ప్రయత్నము"చేయాలి అని చెబుతుంది. "ప్రయత్నము" అని ఎందుకంటే మరే అంతరాయాలకు లోనుకాకుండా నిరంతరమూ మనఃఫలకముపై ప్రతిష్ఠించుకొని ఉండడం కష్టము. అర్జునుడు "మనో దుర్నిగ్రహమ్ చలమ్" అని మనస్సును నిగ్రహించడం చాలా కష్టము అంటాడు. ఆయన మర్యాద కోసం కష్టం అంటాడు కాని, మనకు అది అసంభవమే. దీనికి కారణాలు బాహ్య విషయ ప్రభావమే కాక మన

మనస్సులో పేరుకు పోయిన పాత జన్మ వాసనలు అని ఇంతకు ముందు చెప్పుకున్నాము. అందువలన దీనికి పరమాత్మానుగ్రహము కావాలి. అప్పుడు "ద్రష్టవ్యః" అని దర్శన సమానాకార సాక్షాత్కారము లభిస్తుంది.

అందు వలన తరువాత శ్లోకాలలో హయగ్రీవుల దివ్య మంగళ విగ్రహాన్ని వర్ణిస్తారు, దేశికులు.

*నేను:* హయగ్రీవులు అంటే అవతారమే కదా, మఱి మనం చదువుకుంటున్నప్పుడు ఈయనకూ, పరమ పదములోనున్న పరమాత్మకూ అభేదముగా చెప్పుకుంటున్నాము. అంటే ఏమీ భేదము లేదా.

*వదిన:* శ్రీమన్నారాయణుడు పరమ పదములో పరమ పద నాథునిగా పర స్వరూపునిగాను, సృష్ట్యాదులు నిర్వహించుటకు వ్యూహ స్వరూపునిగాను, ధర్మ సంస్థాపనాదులు చేయడానికి హయగ్రీవ, రామ, కృష్ణాద్యవతారములలో విభవ స్వరూపునిగాను, మన ఆత్మ యందు వేంచేసి యున్న అంతర్యామిగాను, శ్రీరంగాది క్షేత్రాలలోను, మన ఇళ్ళలోనూ వేంచేసి అర్చావతారముగాను మనలను కటాక్షిస్తున్నారు.

పరమాత్మను ఈ పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చా స్వరూపాలలో దేనినైనా ఆశ్రయించవచ్చును. ఆయన ఏ స్వరూపముతో ఉన్నా ఒక్క లాగే కటాక్షిస్తాడు. ఉపనిషత్ శాంతి మంత్రము "పూర్ణమిదమ్ పూర్ణమదః..." ఈ అన్ని స్వరూపాలు ఒక్కలాంటివే పూర్ణమైనవే, ఎక్కువ, తక్కువలేవీ లేవు అన్న విషయమే వివరిస్తుంది.

ఇంక తరువాత శ్లోకము చూద్దాము.

24."చిత్తే కరోమి స్ఫురితాక్ష మాలమ్

సవ్యేతరమ్ నాథ కరమ్ త్వదీయమ్

జ్ఞానామృతో దంచన లాలసానామ్

లీలా ఘటీ యంత్రమ్ ఇవాశ్రితానామ్"

*నాథ: హయగ్రీవ స్వామీ!*

*స్ఫురిత అక్షమాలమ్: ప్రకాశించుచున్న జపమాలను*

*త్వదీయమ్: నీకు సంబంధించిన*

*సవ్య ఇతరమ్ కరమ్: దక్షిణ హస్తమును*

*జ్ఞాన అమృత: జ్ఞానము అనెడు అమృతము యొక్క*

*ఉదంచన: ఉద్ధరణము నందు*

*లాలసానామ్: ఆసక్తిని గల*

*ఆశ్రితానామ్: భక్తుల యొక్క*

*లీలాఘటీ యంత్రమ్: క్రీడకై యున్న ఏతామును*

*ఇవ: పోలి యున్న*

*చిత్తే: (నా) మనస్సున*

*కరోమి: (ప్రతిష్ఠ) చేసికొందును*

అక్షమాలను ధరించి యున్న శ్రీహయ గ్రీవ భగవానుని దక్షిణ హస్తాన్ని ఈ శ్లోకములో వర్ణిస్తున్నారు.

స్వామీ! ప్రకాశించు జపమాల ధరించియున్న నీ దక్షిణ హస్తమును జ్ఞానామృతమును పైకి తోడి తెచ్చుటలో ఆసక్తి కల నీ భక్తులకు ఏతాము వలె ఉపయోగించు సులభమైన (ఆడుకునేందుకు తగినట్టి) యంత్రముగా నా మనస్సులో తలంచెదను.

***నేను:*** ఆ అక్షమాల ఏతాము అయితే దానిని త్రిప్పే వారు హయగ్రీవ స్వామి అన్న మాట. మన లాంటి ఊసర క్షేత్రాల ఉజ్జీవనానికి తగిన నీటిని అందస్తున్నారన్న మాట. ఏతాము అంటే ఒక పెద్ద చక్రమునకు కుండలో, నీరు తోడే పాత్రలో కట్టి ఉంటాయి. అప్పుడు ఆ చక్రాన్ని త్రిప్పుతూ ఉంటే ఆ నూతిలో అడుగున ఉన్న నీరు పైకి వచ్చి, బీటలు వారిన బీడు నేలలను తడిపి సస్య శ్యామలం చేస్తుంది. మేము సరళ యంత్రాలు చదువు కున్నప్పుడు చదువు కున్నాము. ఒక పనిని సులభంగా చేయడానికి సహాయపడే యంత్రము, అదే సరళ యంత్రముగా దీనిని చదువుకున్నాము.

***వదిన:*** అవును. మనకు కావలసిన జ్ఞానాన్ని సులభంగా సంపాదించడానికి, మన హృదయ క్షేత్రాలు ఉజ్జీవించి ఫలవంతమవడానికి పనికి వచ్చే యంత్రమన్నమాట. కాని నువ్వన్నట్లు నీరు కాదు, ఇక్కడ అమృతాన్ని తోడి ఇస్తున్నారు, హయగ్రీవ స్వామి. అమృతము అంటే అమరత్వాన్ని ఇచ్చేది. అంటే

"అనావృత్తిః శబ్దాత్ అనావృత్తిః శబ్దాత్" అని చివరి బ్రహ్మ సూత్రములో చెప్పినట్లు మరి పునర్జన్మ రహితంగా పరమ పదములో పరమాత్మ సాయుజ్యము, అంటే ఆయన గుణాలైన జ్ఞాన, బల, తేజో, వీర్య, ఐశ్వర్య, శక్తులనెడు షడ్గుణములయందు భగవానునితో సమానత కలిగి, "అహమన్నమ్ అహమన్నమ్ అహమన్నాదో అహమన్నాదః" అని అన్నట్లు ఆ పరమపద నాథుడిని ఎల్లప్పుడూ అనుభవిస్తూండే స్థితి కలిగిస్తాడన్న మాట హయగ్రీవ భగవానుడు.

ఈ చక్రము త్రిప్పడం ఒక క్రీడగా, ఏ శ్రమా మనకు అక్కర లేకుండా చేస్తాడని చెప్పడానికి, "లీలా" అని చెబుతున్నారు. రామానుజులు శ్రీభాష్యము మంగళ శ్లోకములో "అఖిల భువన...భంగాది లీలే" అనినట్లు. యామునులు స్తోత్ర రత్నములో నాథమునులను స్తుతిస్తూ "అక్లిష్ట జ్ఞాన వైరాగ్య రాశయే" అంటారు, అంటే ఆచార్యుల నుండి సంక్రమించినది సులభ గ్రాహ్యమైన జ్ఞానము అని కదా!

నిగూఢములైన తత్త్వార్థములను, జ్ఞాన విషయములను ఉపదేశించుట ద్వారా మనలను జ్ఞానామృత రసాప్లావితులను స్వామి చేతిలో అక్షమాల అతి సులభంగా చేసేస్తుందన్న మాట. ధనాన్ని నీ అంతట నువ్వు సంపాదించుకోవడానికి కష్టపడాలి కాని, మీ నాన్నగారు నిన్ను పిలచి అనంతమైన సంపత్తి ఇచ్చేస్తే మఱి నువ్వు కష్ట పడవలసిన పనేమున్నది.

*నేను:* ఇక్కడ ఆ "బావి లో అమృతము" అంటే శ్రుత్యాది శాస్త్రాల జ్ఞానమే కదా. మనకు జ్ఞాన సముపార్జనలో కష్టం తగ్గించి సులభంగా పొందిస్తాడన్న మాట.

*వదిన:* అందేకాదు. భగవద్గీతలో "త్రైగుణ్య విషయా వేదాః నిస్త్రైగుణ్యో భవార్జున"(భ.గీ. 2-45) అని చెబుతూ "యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే తావాన్ సర్వేషు వేదేషు" (భ.గీ. 2-46) అంటూ వేదాలు, మన శాస్త్రాలు సత్త్వ, రజ,స్తమో గుణాలకన్నిటికీ సంబంధించిన జ్ఞానమును కలిగి యుంటాయి. అంటే పుత్రులు కావలసిన వాళ్ళకు పుత్ర కామేష్టి గురించి చెప్పినట్లే, శత్రు సదృశులను తుద ముట్టించడానికి అభిచార హోమాల గురించి కూడా చెబుతాయి. ఎందుకంటే తన బిడ్డలపై ప్రేమ కలిగిన తల్లి బిడ్డ ఆరోగ్యానికి మంచిదైన ఆహారము పెట్టినట్లే, ఉపయోగము లేని సినిమా చూడడానికి డబ్బులు కూడా ఈయవచ్చును. లేకపోతే తన బిడ్డ ఆ డబ్బులకోసం మరేదో తప్పు చేస్తాడేమోనని భయపడుతుందన్న మాట. అలాగే వేద మాత కూడా మనకు తల్లి లాంటిదే కదా! అందువలన సత్త్వ గుణ ప్రధానమైన కర్మలతో బాటు మిగిలిన కర్మల జ్ఞానము కూడా మనకు ఈ శాస్త్రాలలో లభ్యమవుతుంది.

నీటితో నిండి యున్న సరస్సు వద్దకు వెళ్ళినప్పుడు, మనము మన అవసరాన్ని బట్టి అవకాశమును బట్టి నీటిని సంగ్రహించ గలుగుతాము కదా, అలాగే నన్న మాట.

అలా కాకుండా ఆచార్యులు మనకు ఏది హితమో, మనకు ఏది సాధ్యమో అలాంటి జ్ఞానాన్ని మనకు అందిస్తాడన్న మాట. చేప పిల్ల చెట్టెక్క లేదు కదా. అలాగే అంతమందుకీ అన్ని మార్గాలూ సాధ్యం కావు కూడా.

"ప్రకాశించుచున్న" అన్న విశేషణము ఇక్కడ మంచి జ్ఞానము అని సూచిస్తుంది.

*నేను:* వేద, శాస్త్రములు మనకు అవసరమేనా, మన బుద్ధిని, అనుభవాన్ని బట్టి, లోక జ్ఞానమును, తర్కమును ఉపయోగించి, అనుభవజ్ఞుల నుండి మనము యథార్థమైన జ్ఞానాన్ని పొందలేమా. ఎందుకంటే, కొంతమంది అసలు ఈ వేద శాస్త్రాలు విశ్వసించరే, ప్రమాణముగా తీసుకోరు. మరి వారందరూ ఉన్నారు కదా!

*వదిన:* ఆ వివరాలు తరువాత శ్లోకము చెప్పుకున్నప్పుడు చూద్దాము.

*నేను:* ఏమిటి ఆ శ్లోకము!

25."ప్రబోధ సింధోఃఅరుణ ప్రకాశైః

ప్రవాళ సంఘాతమ్ ఇవ ఉద్వహంతమ్

విభావయే దేవ సపుస్తకమ్ తే

వామమ్ కరమ్ దక్షిణమ్ ఆశ్రితానామ్"

*దేవ: ఓ హయగ్రీవ స్వామీ!*

*సపుస్తకమ్: పుస్తకముతో కూడినది*

*ఆశ్రితానామ్: భక్తులకు*

*దక్షిణమ్: జ్ఞానమును ఉదారముగా అనుగ్రహించుటలో సమర్థమైనదగు*

*వామమ్: ఎడమ*

*కరమ్: హస్తమును*

*అరుణైః: ఎఱ్ఱని*

*ప్రకాశైః: కాంతుల కారణము చేత*

*ప్రబోధ సింధోః: జ్ఞానమను సముద్రములోనీ*

*ప్రవాళ సంఘాతమ్: పగడపు సమూహమును*

*ఉద్వహంతమ్: ధరించినట్లు*

*విభావయే: భావించెదను*

ఓ హయగ్రీవ స్వామీ! భక్తులకు ఉదార భావమున జ్ఞాన ప్రదానమునందు తగు సామర్థ్యము కలదియై, పుస్తకమును ధరించి యున్న నీ వామ హస్తమును, అందుండి వెడలు చున్న అరుణ కాంతి వలన జ్ఞాన సాగరమునుండి గ్రహించబడిన ప్రవాళ సమూహమును ధరించి యున్నట్లు భావించుచున్నాను.

***నేను:*** "వామమ్ కరమ్ దక్షిణమ్" అని ఆ "కరమ్" అన్న పదానికి "వామమ్" అనీ, "దక్షిణమ్" అనీ కూడా వాడుతున్నారే, చిత్రముగా!

***వదిన:*** అది దేశికుల కవితా వైచిత్రి. ఇక్కడ విరోధాభాసాలంకారము ఉపయోగించేరు. "దక్షిణ" అంటే ఇక్కడ "ఉదారంగా ఈయగలిగిన" అని అర్థము.

ఇంతకు ముందు కుడి చేతికి చెప్పినట్లు ఎడమ చేయి కూడా అరుణ కాంతులు వెద జల్లుతూందట. ఆ కాంతి వలన చేతిలో ఉన్న పుస్తకము, పుస్తకమన్నా, తాళ పత్ర గ్రంథమన్నా ఒక్కటే అనుకో, ఆ పుస్తకము ఎఱ్ఱగా పగడాల గుంపులా ఉందట. పరమాత్మ జ్ఞాన సాగరము కదా, ఆయన చేతిలో శాస్త్ర గ్రంథము ప్రవాళ సమూహములా ఉందన్నమాట, అరుణ కాంతులీనుతూ. అరుణ కాంతి జ్ఞానమునకు చిహ్నము.

జ్ఞానము అనెడు అరుణ కాంతి ఆయన చేతి నుండి ఆ గ్రంథమునందు ప్రతి ఫలించి మనకు చేరుతోందన్నమాట. అంటే పరమాత్మ ఆ జ్ఞానాన్ని వేద, శాస్త్ర గ్రంథాల ద్వారా మనకందిచ్చి మనలో అనాదిగా వస్తున్న అజ్ఞానాన్ని పోగొడుతున్నాడు.

"తేషామేవ అనుకంపార్థమ్ అహమ్ అజ్ఞానజమ్ తమః

నాశయామి...జ్ఞాన దీపేన భాస్వతా" (భ.గీ. 10-11)

అని కృష్ణ భగవానుడు భగవద్గీతలో "తాను తన ఆశ్రితులను అనుగ్రహించడానికి జ్ఞాన దీపము చేత జ్ఞాన విరోధియూ,ప్రాచీన కర్మ రూపమైన అజ్ఞానము వలన కలిగినదియూ, భగవత్వ్యతిరేక విషయ ప్రావణ్యము కలిగించునదియూ అయిన అంధకారమును తొలగిస్తాను" అని చెప్పేడు కదా.

ఇందు వలన మనకు తెలుస్తున్నది ఆ వేదాలు మనకందిచ్చినది పరమాత్మయే. అదే కదా హయగ్రీవావతార రహస్యము. ఈ వేదములు అపౌరుషేయములు, అనగా జీవుళ్ళ చేత రచింపబడినవి కాదు కనుక జీవుళ్ళకు సంభవించే భ్రమ, ప్రమాదము, విప్ర లంభము, అశక్తి మొదలైన దోషములు లేనిది. అలా కాకుండా అనాది కర్మ వాసన దూషితమైన మన జ్ఞానము సంశయ, విపర్యయ, అజ్ఞాన, అన్యథా జ్ఞాన, విపరీత జ్ఞానాది దోషాల వలన ప్రభావితమై యథార్థమును ఎల్లప్పుడు తెలుసుకోలేము.

ఈ విషయాన్నే పరాశర భట్టర్ శ్రీరంగ రాజ స్తవములో

"హర్తుమ్ తమస్సదసతీ చ వివేక్తుమ్ ఈశో

మానమ్ ప్రదీపమివ కారుణికో దదాతి

తేనావలోక్య క్షుతినః పరి భుంజతే తమ్

తత్రైవ కేఽపి చపలాః శలభీ భవంతి"

"పరమ కారుణికుడైన భగవానుడు జ్ఞానాంధకారాన్ని తొలగించడానికి సత్, అసత్ వివేకము పొందడానికి శాస్త్రమను దీపాన్ని ప్రసాదించేడు. తద్వారా సుకృతులు తత్త్వ త్రయ జ్ఞానము (పరమాత్మ, జీవాత్మ, ప్రకృతి అని మూడు తత్త్వములు ఉన్నట్లు తెలియుట) కల్గి పరమాత్మను పొందుదురు. కాని కొంతమంది చపలురు( ఇతర మతస్థులు) దానియందు పడి శలభముల వలె నశించెదరు.( అనగా ఆ శ్రుతులను సమ్మానింపక, ఆ శ్రుత్యర్థము సమంగా గ్రహించక ఉజ్జీవనము పొందలేరు) అని చెబుతారు.

**నేను:** "సత్", "అసత్" అంటే "ఉన్నది", "లేనిది" అనేనా. ఈ విషయమై మన శాస్త్రాలు అంగీకరించే వారికి, అంగీకరించని వారికీ అభి ప్రాయ భేదాలున్నాయనేనా చెబుతున్నారు? ఏమిటి ఈ "ఉన్నది" "లేనిది" అంటే!

***వదిన:*** శాస్త్రాలను అంగీకరించని వాళ్ళకు, అంగీరించిన వాళ్ళకూ మధ్యనే కాదు, అంగీకరించని వాళ్ళలో, వాళ్ళలో వాళ్ళకూ, అంగీకరించేమని చెప్పిన వాళ్ళలో కూడా వాళ్ళలో వాళ్ళకూ భేదాలున్నాయి. పూర్తిగా

లోతులకు వెళ్ళవద్దు కాని, క్లుప్తంగా ఈ విషయాలు గుర్తు తెచ్చుకుందాము. నువ్వన్నట్లుగా ఏదయినా "ఉన్నది", "లేదు" అని తెలుసుకుందికి ముఖ్యంగా మూడు రకాల ప్రమాణాలున్నాయి.

1. ప్రత్యక్షము: అంటే ఇంద్రియ గోచరమవడం వలన తెలియబడడాన్ని ప్రత్యక్షము అని అంటారు.మనకు ఎదురుగా కనపడుతున్న గోడ ప్రత్యక్షముగా తెలుస్తోంది కదా, అలాగన్నమాట.

2. అనుమానము: ఒక హేతువుచే ఒక సాధ్యాన్ని ఊహించడాన్ని అనుమానము అంటారు. అంటే కొండ మీద పొగను చూచి అక్కడ నిప్పు ఉన్నదని ఊహించడం చేస్తామే, అలా.

3.శబ్దము: శ్రుతి, ఆప్త వాక్కును శబ్ద ప్రమాణము అని అంటాము. పరమాత్మ ఉన్నాడు అని వేదము చెప్పడం వలన తెలుస్తోంది కదా,

ఇందులో వేద ప్రమాణాన్ని అంగీ కరించని వాళ్ళలో చార్వాకులు ప్రత్యక్షాన్ని మాత్రమే అంగీకరిస్తారు. వారికి ప్రాపంచిక సుఖానుభవమే జీవన పరమావధి. తాను వలచినదే రంభ అనే ఈ వాదము తమకూ, సమాజానికీ కూడా ఆరోగ్యకరము కాదు కదా!

వేదాన్ని అంగీకరించని బౌద్ధులు, జైనులు ప్రత్యక్షాన్ని అంగీకరించక అనుమాన ప్రమాణాన్ని మాత్రమే అంగీకరిస్తారు. ఈ కనబడేదంతా క్షణికము, చివరకు అంతా శూన్యము అని బౌద్ధులంటే, ఇద్దరు సూర్యులు, ఇద్దరు చంద్రులు అంటూ చెప్పేవారు జైనులు. ఈ రెండు వాదాలు ఎందుకు వస్తాయంటే శ్రుతిని ప్రమాణంగా పరిగణించక నర మేధస్సుతో తత్త్వము చెప్పడం వలన. నర మేధస్సు పరిమితమైనదీ, త్రిగుణ ప్రభావితమైనదీ అని చెప్పుకున్నాము కదా.

ఇంక వేదాన్ని అంగీకరించేమని చెప్పే వాళ్ళలో సాంఖ్యులు వేదములో ఘోషింపబడిన పరమాత్మను అంగీకరించరు. అలాగే వేదాన్ని అంగీకరించేమనే యోగులు పరమాత్మని నామ మాత్రముగా అంగీకరించినా ఆయనకు ఏమీ విలువనీయరు. న్యాయ, వైశేషిక దర్శనముల వారు ఈ విశ్వానికి కారణము పరమాత్మ కాదు, పరమాణువులు అంటారు.

ఇంక అద్వైత దర్శనము వేదములో కొంత భాగము మాత్రము పరిగణనలోకి తీసుకొని పరమాత్మ తప్ప మిగిలినదంతా లేనిదే అంటారు. "అంటే సర్వ విశేష శూన్యమై చిన్మాత్ర స్వరూపమైన పరబ్రహ్మము ఒక్కటే

సత్యము, ఈ కనబడు సమస్త ప్రపంచము మిథ్యయే" అన్నది అద్వైత సిద్ధాంతము. అంటే నువ్వూ, నేనూ ఈ కనబడేవీ ...ఏవీ లేవన్నమాట వారి ప్రకారము.

ఇలా రకరకాలైన మతాలు, అభిమతాలూను, శ్రుతిని అంగీకరించక పోవడం వలనపూర్తిగా అర్థం చేసుకోక పోవడం వలననూ బయలు దేరేయి.

పరాశర భట్టర్ తమ శ్రీరంగ రాజ స్తవములో ఈ విషయాలన్నీ చాలా బాగా వివరించేరు

ఉదాహరణకు

యా వేద బాహ్యాః స్మృతయః అర్హతాదేః

వేదేషు యాః కాశ్చ కుదృష్టయః తాః

ఆగస్కృతామ్ రంగనిధే! త్వదధ్వని

తవ భవదనపేక్షమ్ రంగ భర్తుః బ్రువాతే

ఏదయినా ఒక కార్యము జరగాలంటే కారణము ఉండాలి కదా, న్యాయ, వైశేషిక దర్శనాల వారు ఈ అనంతమైన విశ్వానికి కారణం రంగనాథా, నిన్ను కాకుండా చిన్న కణాలు అంటారు, ఈ వేద కుదృష్టులు మహదైశ్వర్యము వదలి బిచ్చమెత్తుకొనే వాళ్ళతో సమానము.

ఈ సందర్భములో పరాశర భట్టర్ స్వామి రచించిన శ్రీగుణ రత్న కోశములో ఒక శ్లోకము గుర్తుకు వస్తుంది.

"ఆహుః వేదాన్ అమానమ్ కతిచన,

కతిచ అరాజకమ్ విశ్వమేతత్,

రాజన్వత్ కేచిదీశమ్ గుణినమపి గుణైః తమ్ దరిద్రాణమ్ అన్యే

భిక్షావన్యే సురాజమ్ భవమితి చ జడాః తే తలాతల్యకార్షుః"

"లోకములో కొందరు (చార్వాకులు, బౌద్ధులు, జైనులు వంటి వారు) వేదములను ప్రమాణముగా అంగీకరించరు. (వీరు నిర్దోషములైన వేదములను వదలి, భ్రమాదులతో మానవ కల్పితములై దోష పూరితములైన మతములను అనుసరించేవారు)

మఱి కొందరు వేదములను ఒప్పుకున్నా (సాంఖ్యులు మొదలైన వారు) ఈ ప్రపంచమును నియమించు, నిర్వహించు ఈశ్వరుడే లేడందురు. (ఏదయినా కార్యము ఉంటే దానికి కారణము ఉండకుండా ఎలా కుదురుతుంది. అందువలన ఈశ్వరుడు లేకుండా విశ్వముండదు కదా) .

మఱి కొందరు వేదములను, ఈశ్వరుడిని ఒప్పుకున్నా(అద్వైతులు మున్నగు వారు) సమస్త కల్యాణ గుణాకరుడైన ఈశ్వరుడిని నిర్గుణుడు అని అంటారు. (నిర్గుణుడైతే ఈ కనబడే సృష్టి ఎలా జరుగుతుంది).

మఱి కొందరు (శైవాదులు) ఆ పరమాత్మకు గుణాలున్నాయని ఒప్పుకున్నా భిక్ష కోరువాడు ఆ పరమాత్మ అంటారు. (తనకోసం భిక్షకు బయలు దేరిన వాడు మనకు సర్వోత్కృష్టమైన ఉత్తమ గతిని ఎలా ఈయగలడు. బ్రహ్మ, రుద్రేంద్రాదులందరూ తమ తమ మనుగడకు శ్రీమన్నారాయణుని అర్థించినవారే కదా).

ఈ రకంగా వివేకము లేనివారై(వివిధ మతాలవారు) జగడము లాడుకొంటూటారు. దీనికి కారణము ఓ లక్ష్మీ దేవీ! నీ కటాక్షము లేకపోవుటయే కదా!"

అని అంటారు పరాశర భట్టర్.

అంటే ఆ లక్ష్మీ నారాయణుల కటాక్షము వలన కృప చేయ బడిన వేద శాస్త్రాలను సమ్మానింపక పోవడం, సమంగా అర్థం చేసుకోక పోవడం అన్నమాట.

*నేను:* శ్లోకములో లక్ష్మీదేవిని ఉద్దేశించి కదా, మఱి లక్ష్మీ నారాయణుల కటాక్షము అని చెబుతున్నావు.

*వదిన:* "అర్థో విష్ణుః ఇయమ్ వాణీ" అని పరాశరులు విష్ణు పురాణములో చెప్పినట్లు లక్ష్మీదేవి శబ్దమైతే, శ్రీమన్నారాయణుడు తదర్థము కదా, వారెప్పుడు కలసియే కటాక్షిస్తారు.

ఇంతకు ముందు మనము చెప్పుకున్నాము కదా బృహస్పత్యాదులకే ఇలాంటి విపరీత జ్ఞాన, అన్యథా జ్ఞానము కలిగేయి అని.

*నేను:* వేదములో కొంత భాగము మాత్రమే పరిగణనలోకి తీసుకున్నవారు ఉన్నారు అన్నావు, అదెలా!

*వదిన:* వేదాంతములో కొన్ని వాక్యాలు జీవాత్మ, పరమాత్మ వేరు అని చెబుతాయి.

**ఉదా.** భోక్తా, భోగ్యమ్, ప్రేరితారమ్ చ మత్వా ..(భోక్త అనగా జీవుడు, భోగ్యమ్ అనగా అనుభవింపబడు ప్రకృతి, ప్రేరితారమ్ అనగా దీనికి ప్రేరణకు కారణమైన పరమాత్మ- అంటే మూడు తత్త్వాలన్నమాట ). ఇలాంటి వాక్యాలు జీవాత్మ, పరమాత్మ వేఱు అని చెబుతాయి.

కొన్ని వాక్యాలు ఆ ఱెండూ ఒకటే, వేఱు కాదు అని చెబుతాయి.

**ఉదా.** తత్ త్వమ్ అసి ..(నీవు అనగా జీవాత్మ అది అనగా పరమాత్మ అయి ఉన్నావు. అంటే జీవాత్మ, పరమాత్మ ఒక్కటే. అంటే జీవాత్మ వేఱుగా లేడు. )

ఈ ఱెండు రకాల వాక్యాలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు కొంతమందికి. అందువలన

ఈ ఇబ్బంది నుండి బయట పడడానికి, వేదము ముందు భేద శ్రుతులు చెప్పి, తరువాత అభేద శ్రుతులు చెప్పింది కనుక ముందు చెప్పబడిన భేద శ్రుతులను తరువాత చెప్పబడిన అభేద శ్రుతులు supersede చేసేస్తాయి కనుక భేద శ్రుతులను పరిగణనలోనికి తీసుకొననక్కరలేదు అంటారు వారు.

ఇలాగే కొన్ని శ్రుతి వాక్యాలు పరమాత్మ సగుణుడు, సకల కళ్యాణ గుణాకరుడు అంటే, మఱి కొన్ని నిర్గుణుడు, నిరంజనుడు అని చెబుతాయి. అక్కడ కూడా నిర్గుణుడు అని చెప్పే వాక్యాలను పరిగణనలోనికి తీసుకొని, సగుణుడు అని చెప్పే వాక్యాలు వదలి వేసేరు వారు.

ఇలా ఒక పుస్తకంలో ఒక అధ్యాయం చదివి, మరొక అధ్యాయం వదలి వేసి నట్లు చేయడం సబబు కాదని, భగవద్రామానుజులు అన్ని శ్రుతి వాక్యాలూ పరిగణనలోనికి తీసుకొని వాటి అర్థం సమన్వయం చేసి చెప్పేరు.

*నేను:* ఏమని

*వదిన:* భేద, అభేద శ్రుతులే కాక ఘటక శ్రుతులని కూడా ఉన్నాయి.

ఉదా. "యః పృథివ్యామ్ తిష్ఠన్ పృథివ్యా అంతరో యమ్ పృథివీ న వేద యస్య పృథివీ శరీరమ్..." ఎవరైతే పృథివి లోపల ఉంటాడో, ఆ ఎవరిని ఆ భూమి తెలుసుకొనదో, ఎవరికి పృథివి శరీరమై ఉంటుందో...(అతడు పరమాత్మ)

ఇలా జీవాత్మ, పరమాత్మలకు శరీర, శరీరి భావాన్ని, అపృథక్సిద్ధ సంబంధాన్ని అంటే ఎప్పుడూ వేరుగా ఉండని సంబంధాన్ని చెబుతోంది కదా ఈ వాక్యము.

మనం ఈ రకంగా జీవాత్మ, ప్రకృతి పరమాత్మతో శరీర, శరీరి భావంతో ఎప్పుడూ కలసి ఉంటారు అని అర్థం చేసుకుంటే భేద శ్రుతుల సందర్భంలో ఆ జీవాత్మ, పరమాత్మ వేరు అని అర్థమవుతుంది, అభేద శ్రుతుల సందర్భములో ఆ రెండూ ఎప్పుడూ వేరుగా ఉండవనీ తెలుస్తుంది. అప్పుడు ఇబ్బంది ఉండదన్న మాట.

ఇలాగే సగుణ శ్రుతులనూ, నిర్గుణ శ్రుతులనూ సమన్వయము చేస్తూ భగవద్రామానుజులు అనుగ్రహించేరు. సగుణ శ్రుతులకు పరమాత్మ సమస్త కళ్యాణ గుణాకరుడనిన్నీ, నిర్గుణ శ్రుతులకు ప్రాకృతమైన దోష గుణాలు ఏమీ లేని వాడనీ సమన్వయం చేసి వివరించేరు భగవద్రామానుజులు. ఈ విధంగా విరోధాభాస కనబడే శ్రుతి వాక్యాలను అన్నిటినీ సమన్వయం చేసి వేదాంత వాక్యాలన్నీ సమగ్రంగా అనుగ్రహించేరు భగవద్రామానుజులు.

నేను: అంటే, శ్రుతులను సంపూర్ణంగా ప్రమాణంగా పరిగణించాలి, సమంగా సమన్వయము చేసుకొని విషయాన్ని గ్రహించాలి. అందువలన శ్రుతి ప్రమాణము అవసరమనీ, దానిని సమంగా సమన్వయము చేసి అనుగ్రహించడానికి ఆచార్యుడు అవసరమనీ అర్థం అవుతోంది.

***వదిన:*** ఇలా శ్రుతులను సమంగా సమన్వయం చేసుకొని అర్థం చేసుకున్నప్పుడు వేదాలకు "ఉపబృంహణములు" అయిన, వాల్మీకి, పరాశరాదులు అందిచ్చిన, ఇతిహాస, పురాణముల సహాయము కూడా తీసుకోవాలి.

"ఇతిహాస పురాణాభ్యామ్ వేదమ్ సముపబృంహయేత్" అని వేద వ్యాస మహర్షి మహాభారతములో ప్రతి పాదించేడు కదా.

***నేను:*** "అపృథక్సిద్ధ సంబంధము" అంటే మరొక్కసారి చెప్పవా!

*వదిన:* ఒక పండు ఉన్నదనుకో, దానికి రంగు ఉంటుంది. పండు వేరు, దాని రంగు వేరు, కాని అవి రెండు ఎప్పుడూ వేరుగా ఉండవు, పండూ, పండు రంగు కలిసే ఉంటాయి. అలాగే పరమాత్మ, జీవాత్మ వేరే, కాని వేర్వేరుగా ఎప్పుడూ ఉండక ఎప్పుడూ కలిసే ఉంటాయి. అదే అపృథక్సిద్ధ సంబంధము.

*నేను:* ఇలాంటి మతాలు ఎన్ని ఉన్నాయో!

*వదిన:* భగద్విషయములో "ఆచార్య నంబిళ్ళై గారు " ఇలాంటి మతాలు ముఖ్యమైనవి 17 ఉన్నాయని చెబుతారు.

*నేను:* హయగ్రీవ భగవానుని వలన ఇప్పుడు నువ్వు చెప్పినట్లు ఆచార్యులు, శాస్త్రము రెండూ కూడా అనుగ్రహించబడుతాయి అన్న మాట.

*వదిన:* పిళ్ళై లోకాచార్యులవారు "శ్రీవచన భూషణము" లో

"అజ్ఞానమ్ పోవతు ఆచార్య జ్ఞానత్తాలే, అపూర్తి పోవతు ఈశ్వర పూర్తి యాలే....(సూ. 292)

అని అజ్ఞానము తొలగునది ఆచార్య సమాశ్రయణము వలననూ, జీవునికి అపూర్తి తొలగుట, అనగా కర్మ, జ్ఞాన, భక్త్యాది ఉపాయముల లేమి తొలగుట భగవానుడే ఉపాయముగా లభ్యమవడం వలననూ సంప్రాప్తిస్తుందని చెబుతారు. హయగ్రీవ భగవానుడే ఆచార్యుడై కటాక్షిస్తున్నాడు ఇక్కడ.

అందువలన "మంత్రముమ్, దేవతైయుమ్, ఫలముమ్, ఫలానుబందిగళుమ్, ఫల సాధనముమ్, ఐహిక భోగముమ్ ఎల్లామ్ ఆచార్యనే...(శ్రీ.భూ. సూ.322)అన్న పిళ్ళై లోకాచార్యుల వారి వాక్యము సార్ధకమవుతోందన్న మాట.

శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో

"యః శాస్త్ర విధిమ్ ఉత్సృజ్య వర్తతే కామకారతః

న స సిద్ధినవాప్నోతి న సుఖమ్ న పరామ్ గతిమ్..భ.గీ. 16-23

అని "శాస్త్రములో చెప్పిన దానిని విడచి ఎవడు తన కోరిక బట్టి అనుసరిస్తాడో అట్టి వాడు ఐహికముగను, ఆముష్మికముగను సిద్ధిని పొందడు" అని చెబుతూ

"తస్మాత్ శాస్త్రమ్ ప్రమాణమ్ తే కార్యాకార్య వ్యవస్థితౌ"...భ.గీ. 16-24

అని (శ్రుతి విహితమైన) చేయ వలసినది, చేయ దగనివి నిర్ణయించుకొనుటకు నీకు శాస్త్రము ప్రమాణము అని ఉద్బోధిస్తాడు.

ఆ శాస్త్ర ప్రామాణ్యత సూచిస్తూ తానే స్వయముగా హయగ్రీవ భగవానుడు తన హస్తముతో "ప్రీతి పూర్వకమ్ దదామి బుద్ధి యోగమ్" అని తాను ప్రీతి పూర్వకముగా, అంటే ఏదో ఇవ్వాలని ఇవ్వడం కాకుండా నా భక్తుడు నన్నాశ్రయించేడు అనే ఆనందముతో మనకు అందిస్తాడన్నమాట.

*నేను:* అందుకే కాబోలు బ్రహ్మ సూత్రములలో శాస్త్రయోనిత్వాధికరణము" పరమాత్మను శాస్త్రము వలననే తెలుసుకొనవలెనని చెబుతుంది.

మరొక సందేహము, సర్వజ్ఞుడు, సర్వ శేషి అయిన ఈ హయగ్రీవ భగవానుని చేతులలో పుస్తకము, అక్షమాల ఎందుకు, ఆయనకు వాటి అవసరము లేదు కదా, ఆయన జపము చేయనక్కరలేదు, పుస్తకము చదువనక్కరలేదు!

*వదిన:* నువ్వు చెప్పినట్లు పరమాత్మను శాస్త్రము వలననే తెలుసుకోవాలి. ప్రాకృత ఇంద్రియ గోచరము కాదు కదా. ఇంక అనుమాన ప్రమాణము ప్రకారమూ ఈ జగత్తంతటికీ కారణము ఉండాలి కనుక ఆ కారణమే పరమాత్మ అంటే ఆ కారణము ఒక్కటేనా, ఇంకా ఎక్కువ కారణాలున్నాయా, ఇలా సంశయ, విపర్యయాలకు వీలుంటుంది కదా.

ఇంక నీ రెండవ సందేహానికి సమాధానము, ఇక్కడ హయగ్రీవ స్వామి ఆచార్య స్థానములో ఉన్నాడు. ఆచార్యుడంటే

"ఆచినోతి హి శాస్త్రాణి

ఆచారే స్థాపయత్యపి

స్వయమ్ ఆచరతే యస్మాత్

తమ్ ఆచార్యమ్ ప్రచక్షతే"

అంటే "ఎవరు శాస్త్ర విహితమైన జ్ఞానానుష్ఠానములను తన శిష్యులకు అందించడమే కాక తానుకూడ స్వయముగా ఆచరిస్తాడో ఆయన ఆచార్యుడు" అని అర్థము.

భగవద్రామానుజులు తాను ఈ పార్థివ దేహమును విడచే ముందు శరీరము ఎంత సహకరించకుండా ఉన్నా తన శిష్యుల సహాయముతో లేచి, నిలబడి, సంధ్యావందనము చేసి, అర్ఘ్యము ఇచ్చేవారట.

శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతలో

"యద్యదాచరతి శ్రేష్ఠః

తత్త దేవేతరో జనః

స యత్ప్రమాణమ్ కురుతే

లోకః తదనువర్తతే"(భ.గీ...3-21)

అనుచు "శ్రేష్ఠుడు ఏ కర్మను ఏయే అంగములతో చేయు చున్నాడో దానిననుసరించి ఆయా కర్మనే ఆయా అంగములతో ఇతర జనము కూడ చేయును." అని చెబుతాడు. అందువలన

"న మే పార్థాస్తి కర్తవ్యమ్....వర్త ఏవ చ కర్మణి"...(భ.గీ. ..3-22)

అని తనకు కర్మలు చేయవలసిన అవసరము లేక పోయినా తాను శాస్త్ర విహిత కర్మలను నిర్వర్తిస్తానని చెబుతాడు.

అందువలన ఆ పుస్తకము, అక్షమాల వలన హయగ్రీవ భగవానుడు మనకు చెప్పేది తాను కూడా అనుసరిస్తున్నట్లు తెలుస్తోంది.

అంతేకాదు, మన సిద్ధాంతములో శాస్త్ర విహిత కర్మలు మనమందరమూ ఎల్లప్పుడు చేయ వలసినదే,

"కర్మణ్యేవాధికారస్తే

మా ఫలేషు కదాచన

మా కర్మ ఫల హేతుః భూః

మా తే సంగోఽస్తు అకర్మణి"..(భ.గీ.2-47)

అని చెప్పి నట్లుగా ఆ కర్మలను కర్తృత్వమునందు, ఫలమునందు సంగము లేకుండా, భగవత్కైంకర్యముగా , భగవన్ముఖ వికాసమునకై చేస్తున్నట్లు చేయాలి. శాస్త్ర విహితమైన కర్మలను వర్ణ, ఆశ్రమ ధర్మాలనూ అనుసరించి భగవచ్ఛేషత్వ భావనతో శరీరమున్నంత వరకూ చేస్తూండాలి.

ఈ విషయాన్నే భగవానుడు భగవద్గీతలో

"సర్వ కర్మాణ్యపి సదా

కుర్వాణః మద్వ్యపాశ్రయః

మత్ప్రసాదాత్ అవాప్నోతి

శాశ్వతమ్ పదమ్ అవ్యయమ్".....(భ.గీ.18-56)

అని కర్తృత్వాదులు తనపై ఉంచి, విహిత కర్మలు ఎల్లప్పుడు చేసి,నా అనుగ్రహము వలన( ఆ కర్మలు చేయడం వలన కాదు) శాశ్వతమైన పరమ పదాన్ని పొందుతావు అని చెబుతాడు.

ఇక్కడ హయగ్రీవ భగవానుని పుస్తకము, అక్షమాల వలన కూడా అదే విషయము తెలుస్తోంది.

***నేను:*** హయగ్రీవుల కర, చరణాల తరువాత దేశికులు ఏమి వర్ణిస్తున్నారో!

***వదిన:*** హయగ్రీవుల అవయవ శోభను వర్ణించిన తరువాత దేశికులు స్వామి దివ్య మంగళ విగ్రహ శోభను వర్ణిస్తున్నారు. ప్రత్యవయవ శోభను సౌందర్యమనీ, సముదాయ శోభను, అంటే ఆ అవయవములన్నీ కలసియున్న దివ్య మంగళ మూర్తి శోభను లావణ్య శోభ అనీ మన పెద్దలు చెబుతారు. అంటే తరువాత శ్లోకములో స్వామి లావణ్య శోభ వర్ణితమవుతోంది అన్నమాట.

ఆ శ్లోకము చూద్దాము.

26."తమాంసి భిత్వా విశదైః మయూఖైః

సంప్రీణయంతమ్ విదుషః చకోరాన్

విభావయే త్వామ్ నవ పుండరీకే

శరద్ఘనే చంద్రమ్ ఇవ స్ఫురంతమ్"

*విశదైః: స్వచ్ఛమైన*

*మయూఖైః: కిరణములచేత*

*తమాంసి: చీకట్లను*

*భిత్వా: భేదించి*

*విదుషః: జ్ఞానులు అనెడు*

*చకోరాన్: చకోర పక్షులను*

*సంప్రీణయంతమ్: (ఆ కిరణముల చేత) సంతోషింపచేయునట్టి*

*నవ పుండరీకే: నూతనమైన తెల్లతామరలో*

*స్ఫురంతమ్: ప్రకాశించునట్టి*

*చంద్రమ్ ఇవ: చంద్రుని వలె*

*విభావయే: భావింతును*

ఓ హయగ్రీవ స్వామీ! తన తెల్లని కాంతులతో చీకట్లను పారద్రోలు చంద్రుని కిరణములకొఱకు వేచి చూచు చకోర పక్షులను సంతోషింప జేయు చంద్రకాంతి వలె నీ కొఱకై వేచియుండు జ్ఞానులను ఆనందపరచును. తెల్లని తామర పుష్పముపై వేంచేసి యున్న నీవు శరత్కాలమునందు తెల్లని మేఘముపై ప్రకాశించు చంద్రుని వలె భాసించు చున్నట్లు భావించెదను.

***నేను:*** చకోరపక్షులు అంటే ఏమిటి?

*వదిన:* చకోర పక్షులు చంద్ర కిరణాల నుండి వచ్చే కాంతినే ధారక, పోషక, భోగ్యముగా భావించి, ఆ చంద్ర కిరణముల నుండి వచ్చు కాంతి వలననే జీవిస్తాయట. అలాగే "అనన్య చేతాః సతతమ్ యో మామ్ స్మరతి నిత్యశః..(భ.గీ...8-14) అనినట్లు మనస్సు ఇతర  విషయములపై ప్రవర్తించ కుండా ఆ పరమాత్మనే స్మరిస్తూ ఆయనే ధారకము, పోషకము, భోగ్యము అని ప్రవర్తించే వాళ్ళ లాంటివన్నమాట ఈ పక్షులు.  జ్ఞానులు. భగవద్గీతలో భగవంతుని ఆశ్రయించే వాళ్ళు నాలుగు రకాలు అని చెబుతారు.

ఈ చకోర పక్షులు చంద్ర కిరణ కాంతి తప్ప వేరొకటి కోరనట్లు ఈ జ్ఞానులు కూడ పరమాత్మ గుణానుభవము తప్ప వేరొకటి ఆకాంక్షించరు. అట్టి వారికి నమ్మాళ్వారు తిరువాయ్ మొళి లో  "ఉణ్ణుమ్ శోరుమ్, పరుగు నీరుమ్ తిన్నుమ్ వెత్తిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్" అని పరమాత్మయే ధారకమైన నీరు, పోషకమైన ఆహారము, భోగ్యమైన తాంబూలము కూడా అని అనుగ్రహించినట్లు వీరికి కూడ పరమాత్మ తోడి అనుభవమే జీవగఱ్ఱ.

ఆయన నుండి వెడలు తెల్లని స్వచ్ఛమైన కాంతుల చేత అంటే రజస్తమో గుణ రహితమైన జ్ఞానము చేత అని అర్థము.

*నేను:* పుండరీకము అంటే తామర పూవు, తామర పూవు చంద్రుడు కలసి ఎలాగ ఉంటారు?

*వదిన:* ఇక్కడ పుండరీకమంటే హృదయ పుండరీక మని అనుకొనవచ్చును. దేశికుల కవిత్వములో విరోధాభాసా వైచిత్రి అది. జ్ఞానుల హృదయ పుండరీకములలో శరత్కాలములో తెల్లని మేఘముపై నున్న చంద్రుని వలె ప్రకాశిస్తున్నాడుట ఆ హయ గ్రీవ భగవానుడు. అంటే స్వచ్ఛమైన వారి హృదయ పుండరీకమునందు వేంచేసి యున్నాడన్నమాట.

అంతే కాక "నారాయణ సరసిజాసన సన్నివిష్టః" అని శ్రీమన్నారాయణుని సరసిజాసనునిగా వర్ణిస్తాము కదా. హయగ్రీవ భగవానుడు కూడా అలాగే పద్మాసనుడుగానే ఇక్కడ వర్ణింప బడుతున్నా

*నేను:* ఇక్కడ చకోర పక్షిని జ్ఞానికి ఉపమానముగా చెప్పేవు. ఇక్కడ జ్ఞాని అంటే ప్రపన్నుడనే అర్థమా! చంద్రుడిని తప్ప వేరొకదానిని ఆశ్రయించకుండా చంద్ర కిరణాలే తనకు ధారక, పోషక, భోగ్యాలన్నట్లు ప్రవర్తిస్తున్నది కదా ఈ చకోర పక్షి.

*వదిన:* ఇక్కడ ఈ జ్ఞానులు భక్తులు. వీరు పరమాత్మ గుణానుభవమే ధారకము, పోషకము, భోగ్యము అని ఆ పరమాత్మను భజించుచున్నవారు. ఇక్కడ భక్తికీ, ప్రపత్తికీ ఉండే సూక్ష్మమైన భేదాన్ని గ్రహించాలి.

చకోర పక్షి చంద్ర కిరణాల కోసం రాత్రి చంద్రుని వంక తన మోము పెట్టి ఆ కిరణాల కాంతిని ఆస్వాదిస్తోంది, ఆనందిస్తోంది, జీవిస్తోంది. అంటే తాను చంద్ర కిరణాలకై తన ప్రయత్నము చేస్తూంది తప్ప మానలేదు.

ఆ చంద్రకిరణాస్వాదన తనకు ధారకముగా స్వీకరిస్తోంది.

అంటే స్వయత్నము, స్వప్రయోజనము రెండూ ఉన్నాయి. ఇది భక్తి లక్షణము.

ప్రపత్తిలో స్వయత్నము, స్వప్రయోజనము కూడా ఉండవు.

మనము మన ప్రయత్నము చేయకుండా ఉపాయముగా ఉన్న భగవానుని అతడే ఉపాయమని మనసులో స్వీకరించుట "ప్రపత్తి". దీనిని సిద్ధోపాయము అని అంటారు. భక్తి విషయములో కర్మాచరణము, ఇక్కడ చకోర పక్షి విషయములో చంద్రునిపై దృష్టి పెట్టి ఆ చంద్రకిరణములనాస్వాదించడం, జ్ఞాన సముపార్జనము, చకోర పక్షి సందర్భములో ఆ కిరణములే తనకు ధారకాదులని ఆ చంద్రునితో తమకు గల సంబంధము తెలుసుకొనడం, ఇవి ఉంటాయి. కాని ప్రపత్తి విషయంలో అలా కాదు.

*నేను:* కాని మనకు జ్ఞానమున్నది కదా, జ్ఞానము లేని రాయి వంటి అచైతన్య వస్తువులలా కాక జ్ఞానముండడం వలన మన జీవనానికి, ఉజ్జీవనానికి మన ప్రయత్నము మనము చేయకుండా ఎలా ఉంటాము?

*వదిన:* మనము ఇంతకు ముందు చెప్పుకున్నట్లు మనకు అంటే జీవాత్మలకు, పరమాత్మకు శరీరాత్మ భావ సంబంధముంటుంది. శరీరము ఆత్మకు అధీనమై ఏ పనినైనా చేస్తుంది తప్ప తనంత తాను ప్రవర్తించదు. శరీరము ఏ పని చేసినను ఆ ప్రయోజనము ఆ ఆత్మకు కాని శరీరమునకు కాదు. అదే విధముగా చైతన్యమున్న జీవాత్మలు కూడ భగవదాధీనములై పరమాత్మ వలననే తమ అస్థిత్వము కలిగి యుంటాయి. ఆ పరమాత్మ సంకల్పము చేతనే ప్రవర్తిస్తూ ఉంటాయి. తమ వ్యాపారములు కూడ తమ కొఱకు కాక భగవదానందము కొఱకే నిర్వర్తించవలసి ఉంటుంది. ఇదే ఉపనిషత్సిద్ధాంతము భగవద్రామానుజులు మనకు అందిచ్చినది. ప్రపన్నుని స్వరూపము, స్థితి, ప్రవృత్తి భగవదాధీనములై భగవన్ముఖవికాసమునకే నిర్వచింపబడాలి. ఈ విషయాన్నే స్వామి పిళ్ళై లోకాచార్యులవారు తమ "శ్రీవచన భూషణములో

"స్వయత్న నివృత్తి పారతంత్ర్య ఫలమ్, స్వప్రయోజన నివృత్తి శేషత్వ ఫలమ్"

అని అనుగ్రహిస్తారు. అంటే జీవాత్మకు ఱెండు ప్రధాన ధర్మాలు "పారతంత్ర్య, శేషత్వాలు". పారతంత్ర్యానికి ఫలము స్వయత్న నివృత్తి. శేషత్వానికి ఫలము స్వప్రయోజన నివృత్తి. మనవారు భరతాళ్వాన్ ను పారతంత్ర్యానికి, లక్ష్మణస్వామిని శేషత్వానికి ఉదాహరణంగా చెబుతారు కదా.

*నేను:* అలాగయితే మనకు అచైతన్య పదార్థాలైన శిలలకు, కలపకూ భేదమేమిటి?

*వదిన:* పిళ్ళై లోకాచార్యులవారు ఈ విషయాన్నే

"అచిద్వ్యా వ్యావృత్తిక్కు ప్రయోజనముమ్ ఉపాయత్తిల్ ఉపకార స్మృతియుమ్ ఉపేయత్తిల్ ఉగప్పుమ్" అని అనుగ్రహించేరు.

అంటే సర్వేశ్వరుడు తానే ఉపాయమై మనకు అనర్థములు తొలగించి ఇష్టములు కలిగించునపుడు ఉపకార స్మృతి కలిగి ఉండాలి. సర్వేశ్వరుని పొందిన తరువాత ఆ సర్వేశ్వరుని సాన్నిధ్య ప్రాప్తి యందు, ఆయన కైంకర్యము చేయుటయందు ప్రీతి కలిగి యుండాలి.

*నేను:* అంటే ఆయన మనను రక్షించడానికి మనము ఏమీ చేయనక్కరలేదా!

***వదిన***: మళ్ళీ పిళ్ళైలోకాచార్యుల వాక్యము చూద్దాము.

"రక్షణతుక్కు అపేక్షితమ్ రక్ష్యత్వానుమతియే"

అంటే బురదలో పడిన పసివానిని ఉద్ధరించడానికి కన్నతల్లి వలె పరమాత్మ మనలను ఉద్ధరించుటకు ఎదురు చూస్తూంటాడుట. కాని మనము ఆ చిన్న పిల్లవాడు తల్లి చేతులు తోసి వేసి బురదలో పొర్లాడినట్లు ఈ సంసారమున పొర్లాడుతూ ఇతరోపాయములను ఆశ్రయిస్తూ ఉంటాము. మన ఇతర ప్రయత్నములు మాని వాని రక్షణమును అంగీకరించుటయే మనము చేయవలసినది.

*నేను:* అంటే ద్రౌపది వస్త్రాపహరణ సమయములో తనను తాను రక్షించుకొనడం మాని, మఱి ఎవరినీ అర్థించక ఱెండు చేతులూ పైకెత్తి శ్రీకృష్ణుని శరణాగతి చేసినట్లన్నమాట.

అంటే భక్తి అంటే పరమాత్మతో మనకు సంబంధము తెలిసి, ఆయన స్వరూప, రూప, గుణాదులను అనుభవించి మనము ఆనందించడమన్న మాట. అంటే ప్రయత్నము, ప్రయోజనము మనది.

ప్రపత్తి అంటే సంపూర్ణ శేషత్వ, పారతంత్ర్యాలతో ఆ పరమాత్మకే పరతంత్రునిగా మన రక్షణ బాధ్యత ఆయనకే వదలి మనమేమి చేసినా ఆయన ప్రీతి కొఱకు ఆయన చేయిస్తున్నట్లు చేయడం. ఇక్కడ స్వప్రయత్నము, స్వప్రయోజనమూ మనవి కావని మనస్సులో పూర్తిగా నాటుకొని ఉండాలి. అంతేనా.

***వదిన:*** క్లుప్తంగా అంతేననుకో. కొన్ని విషయాలు గుర్తుంచుకో.

- భక్తి సాధ్యోపాయము. ప్రపత్తి సిద్ధోపాయము.
- భక్తి ప్రవృత్తి మార్గము. ప్రపత్తి నివృత్తి మార్గము.
- భక్తికి కర్మ, జ్ఞానాలు అంగాలు. ప్రపత్తికి కర్మ, జ్ఞానాలు అంగాలుగా అవసరము లేదు.
- భక్తి అచైతన్యమైన ఉపాయము. ప్రపత్తిలో ఉపాయము పరమ చైతన్య స్వరూపమైన పరమాత్మే.
- భక్తుడు కూడ ప్రపత్తి చేయవచ్చును. ఎందుకంటే భక్త్యుపాయము ఫలించడానికి మన అనేక పాపకర్మల నుండి విముక్తి కలగాలి. ఇందు కోసం భక్తికి అంగముగా ప్రపత్తి చేయవచ్చును. అలాగే ప్రపన్నుడు భక్తిని మోక్షోపాయముగా కాక పరమాత్మ ప్రయోజనమునకై అంటే ఆయన ఆనందమునకై అవలంబింపబడు మార్గముగా ప్రవర్తించ వచ్చును.
- భక్తికి ప్రేమ, సంబంధ జ్ఞానము ముఖ్యము. ప్రపత్తికి విశ్వాసము, సంపూర్ణ పారతంత్ర్యము ప్రధానము.
- భక్తి వలన ఈ జన్మాంతమున మోక్షము కలుగక పోవచ్చును. ప్రపత్తి వలన ఈ జన్మాంతమున మోక్షము లభ్యమవుతుంది.

ఇంకా మిగిలిన వివరాలు తరువాత మరెప్పుడైనా తెలుసుకుందాము. ఇప్పుడు తరువాత శ్లోకము చూద్దామా!

**27."దిశంతు మే దేవ సదా త్వదీయాః**

**దయాతరంగానుచరాః కటాక్షాః**

**శ్రోత్రేషు పుంసామ్ అమృతమ్ క్షరంతీమ్**

**సరస్వతీమ్ సంశ్రిత కామధేనుమ్"**

*దేవ: ఓ హయగ్రీవ స్వామీ!*

*దయా: దయ అనెడు ప్రవాహము యొక్క*

*తరంగానుచరాః: కెరటములను అనుసరించునవి అయిన*

*త్వదీయాః: నీకు సంబంధించిన*

*కటాక్షాః: కడగంటి చూపులు*

*పుంసామ్: జనుల యొక్క*

*శ్రోత్రేషు: చెవుల యందు*

*అమృతమ్: అమృతమును*

*క్షరంతీమ్: స్రవించునది*

*సంశ్రిత కామధేనుమ్: ఆశ్రితులకు అభీష్టములు కలిగించునదైన*

*సరస్వతీమ్: విద్యా, కవిత్వ, పాండిత్య సంపదలను*

*సదా: ఎల్లప్పుడు*

*మే: నాకు*

*దిశంతు: ఇచ్చును గాక!*

ఇక్కడ అమృతము అను పదమునకు క్షీరము అని అర్థము చెప్పుకుంటే క్షీరమును కురిపించు కామధేనువు అని అర్థము చెప్పుకొనవచ్చును.

*నేను:* శరణాగతి చేసిన దేశికులు తనకోసం ఏమీ కోర కూడదు కదా! మఱి ఈ వాక్శుద్ధి కావాలని ఎందుకు కోరుతున్నారు.

*వదిన:* ఆ వాక్శుద్ధి, కవిత్వ, పాండిత్యాలు పరమాత్మ కైంకర్యానికే. తన కోసం, తనకు పేరు, ప్రఖ్యాతుల కోసం కాదు. ఆ కవిత్వ, పాండిత్యాలు పరమాత్మ యొక్క వైభవాన్ని ఇతరులకు తెలియ జేయడానికి, ఉపనిషత్సిద్ధాంతమైన మన విశిష్టాద్వైత సంప్రదాయాన్ని అందరికీ తెలియ జేసి వారిని ఉద్ధరించడానికి అన్న మాట. ఆ విద్యతో ద్రవ్యార్జనకు కాదు. అందుకే ఆయన స్నేహితులయిన విద్యారణ్య స్వామి అత్యంత బీదరికములో నున్న దేశికులను చూడలేక విజయనగర రాజాస్థానమునకు వచ్చి కట్న కానుకలను స్వీకరించమని ఎంత ప్రార్థించిననూ ఆయన ఒప్పుకోలేదు.

"న మే పిత్రార్జితమ్ కించిత్ న మయా కించిదార్జితమ్

అస్తి మే హస్తి శైలాగ్రే వస్తు పైతామహమ్ ధనమ్"

"నేను ఆర్జించిన ధనము కాని, పిత్రార్జితము కాని నా వద్ద లేవు. కాని, హస్తిగిరిపై (వరదరాజస్వామి అనెడు) మా తాతగారు నాకందిచ్చిన సంపద యున్నది. "

అని ఒక పత్రము పై వ్రాసి ఇచ్చి తనకు హస్తిగిరి నాథుడైన వరదరాజ స్వామి యే సమస్త సంపద కనుక తనకు వేరే సంపద అక్కర లేదని వారు పంపిన ధన, కనకాదులను విద్యారణ్యులకు త్రిప్పి పంపేరుట.

మనం గ్రహించ వలసినది ఆయన ప్రార్థిస్తున్నది మనలాంటి వాళ్ళకోసం. అంటే ఆయన తన కోసం కాక తన శ్రోతలగురించి, ఆశ్రితులగురించి ప్రార్థిస్తున్నారు. తన ప్రవచన, పాండిత్యాదులు శ్రోతల కర్ణములయందు అమృతము పోసినట్లుండాలి. అంటే వారికి రస మధురముగా ఉండడం తో బాటు అమృతత్వాన్నీ అంటే మోక్షమునూ ప్రసాదించాలి. కాని ఇహము లేకుండా పరమ పదము ఒక్కటే అంటే చాలామందికి నిరుత్సాహము కదా. అందువలన ఆశ్రితులకు అభీష్టాలనూ కటాక్షించాలి. ఇక్కడ అభీష్టములు అంటే ఇహ లోకమునందు నిశ్చింతగా అమందానందముతో పరమాత్మ కైంకర్యము చేసుకొనుట, దివ్య దేశ వాసము చేయుట మొదలగునవి. ఆచార్యులు చేసేది ఇదే. పరమాత్మ కటాక్షమును తమ వాగ్రూపముగా అనుగ్రహించి, తమ శ్రోతలైన శిష్యులకు ఆ పరమపద నాథునితో సాయుజ్యమును కటాక్షిస్తారు. ఈ లోకములో

భగవత్భాగవత కైంకర్య ప్రాప్తి కూడా కలుగ జేస్తారు.అందుకే దేశిక నామము వారి విషయములో సార్థకమైనది. శ్రీభాష్యాది గ్రంథములను కాలక్షేప రూపములో శతాధిక శిష్యులకు అనుగ్రహించేరు. శతాధికముగా గ్రంథములనూ అనుగ్రహించేరు.

అందుకే వేదాంత దేశికులు 27 ఏళ్ళనాటికే శ్రీరంగములో అత్యున్నత ఆచార్య గోష్ఠిలో స్థానాన్ని పొందేరు. ఆ గోష్ఠిలో అందరి కంటే పిన్నవయస్సు వారు ఆయనే.

*నేను:* సాయుజ్యము అంటే సమాన మైన లక్షణాలని కదా, ముక్తాత్మకు పరమపద నాథునితో సమానముగా అన్ని లక్షణాలూ వచ్చేస్తాయా?

*వదిన:* వేదాంత దేశికులు వేరొక చోట ఈ ప్రశ్నకు సమాధానముగా ముఖ్యముగా

1. జగత్కారణత్వ

2. మోక్ష ప్రదానత్వ

3.సర్వ ధారణత్వ

4.సర్వ నియంతృత్వ

5.సర్వ శేషిత్వ

6.సర్వ శరీరత్వ

7.సర్వ శబ్ద వాచ్యత్వ

8.సర్వ వేద వేద్యత్వ

9.సర్వ లోక శరణ్యత్వ

10.సర్వ ముముక్షు ఉపాస్యత్వ

11.సర్వ వ్యాప్తత్వ

12.లక్ష్మీ సఖత్వ

13.భూమీ నాయకత్వ

14. నీళా నాయకత్వ

15.ఆది శేష పర్యంకత్వ

16.గరుడ ధ్వజత్వ

17.పుండరీకాక్షత్వ

లక్షణములు పరమాత్మకే చెందినవి. ఇవి ముక్తాత్మకు వర్తించవు అని వివరించేరు. అందువలన ప్రధానముగా పైన చెప్పబడిన లక్షణాలు తప్ప మిగిలిన పరమాత్మ లక్షణాలు ముక్తాత్మ కూడా పొందుతాడు.

*నేను:* అంటే తమ లౌకిక లాభాలకు కాక పోయినా వేరే వాళ్ళ ఐహికమైన ఇష్టాలు కూర్చడానికి , కష్టాలు తీర్చడానికి ఇలా పరమాత్మను ప్రార్థించవచ్చా!

*వదిన:* వేదాంత దేశికులే వేరొక సందర్భములో ఒక బీదవాడయిన బ్రహ్మ చారి తన పెళ్ళికి ధనము కావాలని ప్రార్థిస్తే "శ్రీస్తుతి" అనే స్తోత్రమును ఆశువుగా చెబుతూ అమ్మవారిని ప్రార్థిస్తే బంగరు నాణెములు వర్షించేయట. వాటిని తాను తాకకుండా ఆ బ్రహ్మచారిని వినియోగించుకొనమన్నారుట కదా. ఉదాహరణకు పూర్తిగా సరిపడక పోయినా, మనకు రామాయణములో తనను తాను రక్షించుకొనడానికి ఏ ప్రయత్నమూ చేయని సీతమ్మ, హనుమకు నిప్పంటించినట్లు తెలిసిన వెంటనే ఆ హనుమకు చల్లగా ఉండాలని(నిప్పు ఆరిపోవాలని కాదు) "శీతో భవ హనూమతః" అని పలికి హనమంతునికి అగ్ని చల్లగా ఉండేటట్లు చేసినది కదా.

*నేను:* తమ శిష్యులకు, అనుచరులకు ఇహ, పర సౌఖ్యము కోసం ప్రార్థిస్తున్నారు. కాని తమ అనుచరులు కాకుండా ప్రతి కూలంగా ఉండేవాడు కూడా ఉంటారు కదా. వారి మాట ఏమిటి!

*వదిన:* వారి విషయము తరువాతి శ్లోకములో ప్రస్తావిస్తున్నారు.

28."విశేష విత్పారిదేషు నాథ!

విదగ్ధ గోష్ఠీ సమరాంగణేషు

జగీషతో మే కవితార్కికేంద్రాన్

జిహ్వాగ్ర సింహాసనమ్ అభ్యుపేయాః"

*నాథ!: స్వామీ!*

*విశేషవిత్: సమస్త శాస్త్ర విశేషములు తెలిసిన*

*పారిషదేషు: పరిషత్తుల యందు*

*విదగ్ధ: వాదమునందు సమర్థులైన వారియొక్క*

*గోష్ఠీ: సభయను*

*సమరాంగణేషు: (వాదముల) యుద్ధ స్థానములయందు*

*కవి తార్కికేంద్రాన్: (పరమతములను ప్రచారము చేయు) గొప్ప కవులను, తర్క పండితులను*

*జగీషతః: జయింపగోరు*

*మే: నా యొక్క*

*జిహ్వా: నాలుక యొక్క*

*అగ్ర: చివర అనెడు*

*సింహాసనమ్: గొప్ప ఆసనమును*

*అభి ఉపేయాః: అధిష్ఠింతువు గాక!*

స్వామీ! సమస్త శాస్త్రముల యందలి రహస్యములను తెలిసిన వారును, వాద కుశలురును అయిన గొప్ప కవులను, తర్క పండితులను పరిషత్తులందు వాగ్యుద్ధమున జయింపగోరు నాయొక్క జిహ్వాగ్రమును సింహాసనమునందు అధిరోహించి నన్ను అనుగ్రహించి వారిని జయించునట్లు చేయుము.

*నేను:* అంటే కవిత్వ, తర్క పాండిత్యములయందు గొప్ప ప్రావీణ్యత కల్గిన తన విరోధులను వాగ్యుద్ధములలో జయించడానికి తగిన వాక్శక్తి కోరుకుంటున్నారన్న మాట.

*వదిన:* ఈ శ్లోకాలను చదివే మనకు వాక్శక్తి ఆ హయగ్రీవ భగవానుడు అనుగ్రహించాలని ఈ శ్లోకాల అంతరార్థముగా మనము తెలుసుకోవాలి.

పరాంకుశులు అంటే రజస్తమో గుణములచేత మత్తెక్కి యున్న పర మతానుచరులను మత్త గజములకు అంకుశము వంటి పరాంకుశుల (నమ్మాళ్వార్) వలె అట్టి వేద బాహ్యులను, కుదృష్టులను తన జిహ్వాగ్రముపై వసించి సరిదిద్దమని ప్రార్థిస్తున్నారు ఈ శ్లోకములో. "మయర్వఅమదినలమ్ అరుళినన్" అన్న విధంగా నమ్మాళ్వార్లకు జ్ఞానము కృప చేసిన పరమాత్మను ప్రార్థిస్తున్నారు.

పాండ్య రాజు ఆస్థానములో పరతత్త్వమును నిరూపించి ధర్మ ప్రతిష్ఠాపనము చేయుటకు పరమాత్మ పనుపున పెరియాళ్వార్ వేంచేసి పరమాత్మ కరుణ వలన ఆ సభలో వారి నందరనూ ఏ విధముగా జయించి శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని ఎలా స్థాపించేరో అలాగన్న మాట.

వాద కుశలురైన పండితులను జయించి తమ సంప్రదాయాన్ని స్థాపించడానికి దేశికులు ఎనలేని సేవ చేసేరు. ఉదాహరణకు తిరువహీంద్ర పురములో దేవనాదన్ పెరుమాళ్ళ ఆలయములో 15 సిద్ధాంతాలలో నిష్ణాతులైన పండితులను తానొక్కరూ వాదములో ఓడించి సిద్ధాంత స్థాపన చేసేరు. "ఆ విషయాలను పరమత భంగము" అను గ్రంథములో వివరించేరు.

అలాగే శ్రీరంగములో అనేకమంది అద్వైత పండితులతో వాదించి వారినందరనూ జయించిన వివరాలు ఆయన రచించిన "శత దూషిణి" అనే గ్రంథములో చూడవచ్చును.ఇవే కాక దేశికులు "తత్త్వ ముక్తా కలాపము", "సర్వార్థ సిద్ధి", "మీమాంసా పాదుక" మొదలైన గ్రంథాలను తమ సిద్ధాంత స్థాపనకై రచించేరు.

ఆయన తార్కిక, మీమాంసా పటిమ ఎంత ప్రఖ్యాతము అంటే అద్వైతాచార్యులైన "విద్యారణ్య స్వామికి", ద్వైత మత పుంగవులైన "అక్షోభ్య తీర్థులకు" వాదము జరిగినప్పుడు వారికి న్యాయ నిర్ణేతగా ఉండడానికి దేశికులను ప్రార్థించేరుట. 40 రోజులకు మించి జరిగిన ఆ వాదములో తమ చిన్ననాటి స్నేహితుడైన విద్యారణ్య స్వామి కాక అక్షోభ్య తీర్థులు వాదములో నెగ్గినట్లు దేశికులు నిర్ణయించేరుట. ఇప్పటికీ ఈ విషయానికి గుర్తుగా కర్ణాటకలో "ముళుబాగల్" లో "హుంచడ కల్లు గుట్ట" వద్ద ఈ వాద విజయ స్థంభమును చూడవచ్చునట. వేదాంత దేశికుల తర్క జ్ఞానము అంత గొప్పది.

దేశికుల సమ కాలికులు, అద్వైత పండితులు, దేశికుల గ్రంథమైన యాదవాభ్యుదయానికి స్వయముగా వ్యాఖ్యానము వ్రాసిన వారు అయిన అప్పయ్య దీక్షితులు దేశికుల గురించి

"తమ్ విచింత్య స్సర్వత్ర

భావాః సంతి పదే పదే

కవితార్కిక సింహస్య

కావ్యేషు లలితేష్వపి"

"కవిత్వమునందు, తర్క విద్య యందు సింహము వంటి దేశికుల కవిత్వ, పాండిత్య ప్రతిభ ఆయన యొక్క సరళ మైన కావ్యాలలో కూడా అడుగడుగునా కనబడుతుంది" అని కీర్తిస్తారు.

ఇక్కడ "జిహ్వ" అను పద ప్రయోగము "హ్వేఞ్- స్పర్థాయామ్ శబ్దే చ" అను ధాతుజన్యమైనందు వలననూ, "జి జయే ఇత్యస్మాత్ నస్ ప్రత్యయః హుగాగమశ్చ నిపాత్యతే ఇతి వ్యాఖ్యేయమ్" అన్న వివరణ బట్టియు "స్పర్థలో గెలుపు" అన్న విషయం సూచిస్తూ సందర్భోచితముగా ఉన్నది.

***నేను:*** అంటే తాను ప్రతి వాదులను జయించాలని ప్రార్థిస్తున్నారా!

***వదిన:*** ఆ విషయాన్ని తరువాత శ్లోకములో ఇంకా వివరిస్తున్నారు.

29. "త్వామ్ చింతయన్ త్వన్మయతామ్ ప్రపన్నః

త్వామ్ ఉద్గృణన్ శబ్దమయేన ధామ్నా

స్వామిన్ సమాజేషు సమేధిషీయ

స్వచ్ఛంద వాదాహవ బద్ధశూరః"

*స్వామిన్: ఓ హయగ్రీవ స్వామీ!*

*సమాజేషు: విద్వాంసుల సభలలో*

*త్వామ్: నిన్ను*

*చింతయన్: ధ్యానించుచు*

*త్వత్: (అంతర్యామిగా ఉన్న ) నీయొక్క*

*మయతామ్: (స్వరూప, స్వభావములు ) నిండి యున్నట్లు*

*ప్రపన్నః: కలిగిన వాడనై*

*శబ్దమయేన: శబ్ద రూపమగు*

*ధామ్నా : తేజస్సుతో(శరీరముతో)*

*త్వామ్: నిన్ను*

*ఉద్గృణన్: స్తుతించుచు*

*స్వచ్ఛంద: సర్వతోముఖమైన*

*వాద: వాదములనెడు*

*ఆహవే: యుద్ధమునందు*

*బద్ధ: బంధింపబడిన*

*శూరః:గొప్ప ప్రతి వాదులు కల్గిన వాడనై*

*సమేధిషీయ: వృద్ధి పొందెదను గాక!*

నిన్ను ధ్యానించుచు, నాకు అంతర్యామిగానున్న నీతో తాదాత్మ్యము చెందిన వాడనై నిన్ను స్తుతించుచు, సర్వతోముఖములైన వాగ్యుద్ధములయందు, శబ్దరూపమైన తేజస్సు చేత ప్రతి వాదులు మాటలు రాక యుండెడునట్టి గొప్ప స్థితిని పొందెదను గాక.

హనుమానుడు సుందరకాండములో

"యథా రాఘవ నిర్ముక్తః శరః శ్వసన విక్రమః గచ్ఛేత్ తద్వత్ గమిష్యామి లంకామ్" అని "రాఘవుని చేత విడువ బడిన బాణము వలె వాయువేగముతో లంకానగరానికి వెళ్ళెదను" అని చెప్పినట్లు దేశికులు తన జిహ్వాగ్రమునందు హయగ్రీవులు వసించి యుండగా ఆయనను ధ్యానించడం వలన తన ప్రతివాదులందరూ మూగబోతారు అంటున్నారు ఈ శ్లోకములో.

*నేను:* నిన్ను ధ్యానించుచు, నీయొక్క రూపము పొందడము అంటే!

*వదిన:* మామూలుగా "నేను లావుగా ఉన్నాను" అంటే "నీ శరీరము లావుగా ఉన్నది" అని అర్థము. మనం చాలా మంది మామూలుగా ఈ శరీర స్థితి నుండే ప్రవర్తిస్తాము. నాకు తీపి ఇష్టము, వేడి పడదు అంటే నాశరీరానికి తీపి ఇష్టము, వేడి పడదు అని కదా అర్థము అప్పుడు ఈ స్థితి నుండే ఆలోచిస్తున్నామన్నమాట. అలా కాకుండా కొంతమంది అంతకంటే ఉన్నతమైన స్థితిలో ఉండి తాను జీవాత్మ అని తెలిసి ప్రవర్తిస్తూంటారు. వారికి శరీరానికి పురుగులు పట్టినా ఆ పురుగులు వారికి కాదు అనే ప్రవర్తించగలరు. సుఖ, దుఃఖాలకు భేదం వారు పట్టించుకోరు.

ఇంక, ఇంతకంటే ఉన్నతమైన స్థితి పరమాత్మానుభవ స్థితి. అంటే అంతర్యామితో తాదాత్మ్య స్థితి. ఈ స్థితిల తనకు అంతర్యామిగా ఉన్న పరమాత్మకు తాను శేషినని, పరమాత్మయే సమస్తమూ చేయిస్తున్నాడనీ తెలిసి ప్రవర్తించే స్థితి అన్నమాట. వాళ్ళు సంతతము పరమాత్మను ధ్యానము చేస్తూ, ఆ తాదాత్మ్యానుభవములో ఉన్నవారు. ఆ స్థితిలో "నేను చేస్తున్నాను" అంటే పరమాత్మ చేస్తున్నాడనే అర్థము. వామదేవుడను ఋషి "నేను మనువును, సూర్యుడను" అన్నాడుట. ("తదేతత్ పశ్యన్ ఋషిః వామదేవః ప్రతి పేదే అహమ్ మనుః అభవం సూర్యశ్చ..."). అంటే అక్కడ ఆయన పరమాత్మానుభవ స్థితిలో ఉన్నాడన్నమాట. అంతర్యామిగా ఉన్న పరమాత్మయే "అహమ్" అంటే అక్కడ అర్థము. జీవాత్మ ఆ అంతర్యామి విశిష్టమై తనకంటూ ప్రత్యేకమైన అస్తిత్వము లేనిదై ఉన్న స్థితి అది.

అలాగే ప్రహ్లాదుడు "సర్వేశ్వరుడు అన్నిటిలో ఉండడం వలన వాడే నేను, నానుండియే సర్వమూ కలుగుతోంది, సర్వము నాయందే కలదు" ("సర్వగత్వా దనంతస్య స ఏవాహ మవస్థితః మత్తః సర్వమహమ్ సర్వమ్ మయి సర్వమ్ సనాతనే") అంటాడు. ఇక్కడ కూడా ప్రహ్లాదుడు పరమాత్మతో తాదాత్మ్యము చెందిన స్థితిలో ఉన్నాడన్నమాట. "అహమ్ బ్రహ్మాస్మి" అని నేను పరబ్రహ్మను అయి ఉన్నాను అన్నప్పుడు కూడా ఇలాగే అర్థం చేసుకోవాలి.

ఇక్కడ "నేను" అనే స్థితి పరమాత్మతో తాదాత్మ్యము చెంది ఉండడము అంటే "నేను" నాశనమయి పోయి పరమాత్మయే ఉందని అర్థం కాదు. నేను ముఖ్య మంత్రిని అయినాను అంటే నేను నాశనము అయిపోయి ముఖ్యమంత్రి మాత్రమే ఉంటాడని కాదు కదా! నేను ముఖ్య మంత్రి స్థితితో తాదాత్మ్యము చెంది ఉన్నానని అర్థము. శ్రీభాష్యములో ఇంద్ర ప్రాణాధికరణములో ఇంద్రుడు "మామ్ ఉపాస్య" అని నన్ను ఉపాసింపుము అని అంటే "ఆ ఇంద్రునికి అంతర్యామిగా ఉన్న పరమాత్మను ఉపాసింపుము" అని అర్థము చెబుతారు.

అలాగే ఇక్కడ కూడా హయగ్రీవ స్వామిని సంతతము ధ్యానించడం వలన దేశికులు కూడా ఆ హయగ్రీవులతో తాదాత్మ్య స్థితి పొందుతున్నారని అర్థం చేసుకోవాలి. సంస్కృతములో "భ్రమర కీటక న్యాయము" అని ఉంది. "భ్రమరము తన గూడులో నున్న పురుగు చుట్టూ ధ్వని చేస్తూ పరిభ్రమించుట చేత తత్సంకల్పిత ప్రయత్నము వలన ఆ పురుగు భ్రమరాకృతి పొందుతుంది" అని చెబుతారు. అలాగే సతత హయగ్రీవ ధ్యానము వలన దేశికులు ఆ పరమాత్మానుభవము కలిగి, ఆయనతో తాదాత్మ్య స్థితి పొందుట వలన సర్వతోముఖమైన వాగ్యుద్ధముల యందు ప్రతి వాదులు జయింపబడాలని ప్రార్థిస్తున్నారు.

*నేను:* మరి "వృద్ధి పొందెదను గాక" అంటే అర్థము ఏమిటి? తానే వృద్ధి పొందుతున్నాను, అంటే ప్రఖ్యాతి పొందుతున్నాను అని కాదా!

**వదిన:** ఇక్కడ ప్రతి వాదులను గెలిచినది హయగ్రీవులే. లేదా ఆ హయగ్రీవ స్వామితో తాదాత్మ్యము చెంది యున్న దేశికులు. ఇక్కడ వృద్ధి అంటే సామాన్యమైన శరీర సంపర్కావస్థనుండి పరబ్రహ్మతో తాదాత్మ్యము పొందిన స్థితి వృద్ధియే కదా. అంతేకాదు, ఆ రకంగా ప్రత్యర్థులు జయింప బడి, సిద్ధాంత స్థాపనా కార్యక్రమములో తానుకూడ ఒక పనిముట్టుగా ఉపయోగబడుట కూడ ఎంతో ఆనందదాయకము కదా!సీతా, రాములు అరణ్యములలో ఆనందిస్తోంటే లక్ష్మణస్వామి కూడా ఆనందిస్తున్నట్లు "రమమాణాః వనే త్రయః" అంటారు కదా వాల్మీకి మహర్షి. కపిల్ దేవ్ ప్రపంచ కప్పు గెలిస్తే నువ్వు గెంతులు వెయ్యలేదూ. అంటే నువ్వే ఆ టీములో భాగమైనట్లు, తాదాత్మ్యము చెంది. అలాగే.

వేదాంత దేశికులు ఘంటావతారము కదా. ఘంట శ్రుత్యాది శాస్త్ర శ్రవణానికి, ప్రజా బాహుళ్యంలో తమో గుణాన్ని తొలగించి ఆస్తికత్వము కలిగించ డానికి, అశాస్త్రీయ విషయ శ్రవణము నుండి రక్షించడానికి ఉపయోగించేది. ఈ పై శ్లోకాలు ఆ విషయాన్ని చెబుతున్నాయి.ఈ పై శ్లోకాలను పఠించడం వలన, ధ్యానించడం వలన వాక్శక్తి, వాద పటిమ, కవితా సామర్థ్యము కలుగు తాయని పెద్దలు చెబుతారు. అందు వలన చాలా మంది తాము

ప్రవచనములనుగ్రహించేటప్పుడు, వాదములయందు పాల్గొను వేళల్లోను, పాండిత్య ప్రతిభా ప్రదర్శనలలోను ఈ శ్లోకాలను, హయగ్రీవులను, దేశికులను ధ్యానిస్తారట.

***నేను:*** ఇప్పటి దాకా నాకర్థమయినది ఏమిటంటే ఇహ లోకానికి సంబంధించిన జ్ఞానానికి, పర లోకానికి సంబంధించిన జ్ఞానానికి కూడా హయగ్రీవ భగవానులను ఆశ్రయించాలి అని. మనము చతుష్షష్టి కళలు అంటామే, సంగీతము, నాట్యము, చిత్రలేఖనము లాంటివి అన్నీ, ఇంగ్లీషులో skills అని కూడా అంటాము. అవి కూడా ఈ విద్యలలో భాగమేనా, లేక వాటికి మినహాయింపు ఉన్నదా!

***వదిన:*** సంస్కృత కళాశాల అంటాము కదా, కళ అంటే కూడా విద్యయే. హయగ్రీవ స్తోత్రములోనిది కాకపోయినా మనము తరచుగా చదువుకునే శ్లోకము

"అభంగుర కలాదాన

స్థూల లక్ష్యత్వమీయుషే

తుంగాయ మహసే తస్మై

తురంగాయ ముఖే నమః"

"కొఱత లేని(నిత్యమైన) కళల(విద్యల) యొక్క దానమును చేయుటలో అధికమైన లక్ష్యమును కలిగి యుండుటను పొందుచున్న వాడును, గొప్ప ప్రకాశము కలిగిన వాడును అయిన హయ ముఖునకు నమస్కరించుచున్నాను" అన్న శ్లోకములో మనము కళలు అని విద్యలకు వ్యవహరిస్తూ, వాటిని బాగుగా ఇచ్చేవాడుగా హయగ్రీవ భగవానుని స్తోత్రము చేస్తున్నాము కదా. అయినా, నీ సందేహము తీర్చడానికా అనినట్లు తరువాత శ్లోకములో అనన్య గతికత్వము ప్రదర్శిస్తూ, దేశికులు "అగతిః కలానామ్" అని అన్నారు.

**నేను:** ఏమిటి ఆ శ్లోకము!

**వదిన:**

30. "నానావిధానామ్ అగతిః కలానామ్

న చాపి తీర్థేషు కృతావతారః

**ధ్రువమ్ తవానాథ పరిగ్రహాయాః**

**నవమ్ నవమ్ పాత్రమ్ అహమ్ దయాయాః"**

**అంటే**

*నానా విధానామ్: అనేక విధములైన*

*కలానామ్: విద్యలకు(కళలకు)*

*అగతిః: స్థానము(లక్ష్యము) ను కాను( అనగా ఏ విద్యలను నేర్చిన వాడను కాను).*

*తీర్థేషు: పుణ్య తీర్థములయందు(తీర్థులు అనగా జ్ఞానుల సన్నిధి యందు)*

*కృత: చేయ బడిన*

*అవతారః: స్నానము కల వాడిని( సేవనము కల వాడిని)*

*న చ: కూడా కాను*

*అనాథ: వేఱొక్క నాథులు లేనివారిని*

*పరిగ్రహాయాః: పరిగ్రహించునట్టి( దరి చేర్చు కొనునట్టి/ రక్షించునట్టి)*

*తవ: నీయొక్క*

*దయాయాః: కరుణకు*

*నవమ్ నవమ్: మిక్కిలి క్రొత్తదైన( ఏ మాత్రమూ పరిణితి లేని)*

*పాత్రమ్: విషయమును(పాత్రమును) (అనునది)*

*ధ్రువమ్: నిశ్చయము*

**అనగా**

**నేను ఏ విధమైన విద్యలనూ నేర్చిన వాడను కాను. కనీసము అలా నేర్వడానికి మంచి పనులు చేయడమో, జ్ఞానులను సేవించడమో కూడా చేసినవాడిని కాదు. అందువలన ఆకించిన్యత్వము, అనన్య గతికత్వము**

నాయందు సంపూర్ణముగా వర్తిస్తాయి. ఇట్టి అనాథలను రక్షించ వలసిన నీ దయకు (ఏమాత్రము పరిణితి లేని) తగిన విషయమును(పాత్రమును) నేను అనునది నిశ్చయము. (కనుక నీవే నన్ను రక్షించ వలెను).

***నేను:*** తాను అనాథ కనుక రక్షించమని చెబుతున్నారా!

***వదిన:*** భగవద్రామానుజుల "శరణాగతి గద్య" చదివి ఉంటావు కదా. దానిలో చెబుతారు,

రాముడు "అనృతమ్ నోక్త పూర్వమ్ మే న చ వక్ష్యే కదాచన

రామః ద్విర్నా భిభాషతే"

అన్నాడుట. అంటే రాముడు అసత్యమును ఇంతకుముందు ఎప్పుడూ చెప్పలేదు. ఇకముందు ఎప్పుడూ చెప్పడు. రాముడు ఎప్పుడూ రెండు రకాలుగా మాటలాడడు. అని అన్న ఆ రాముడే

"సకృదేవ ప్రపన్నాయ తవాస్మి ఇతి యాచతే

అభయమ్ సర్వ భూతేభ్యః దదామి ఏతత్ వ్రతమ్ మమ"

అంటే నీవాడిని అని ఒక్కసారి యాచిస్తే పశు, పక్ష్యాదులని, దుష్టులు, దానవులు అని కూడా చూడకుండా అంతమంది జీవుళ్ళకు అభయము ఇస్తాను. ఇలా ఇవ్వడం నా వ్రతము కనుక నాకు వ్రత భంగము కాకూడదు కనుక నేను వారికి రక్షణ ఇస్తాను. అన్నాడు.

సత్య వాక్య పాలకుడు అయిన రాముడు ఇలా అన్న తరువాత రక్షణ ఇవ్వక తప్పడు కదా!

అలాగే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు

సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకమ్ శరణమ్ వ్రజ

అహమ్ త్వా సర్వ పాపేభ్యః మోక్షయిష్యామి.."

వేరే అన్ని ధర్మాలను మోక్షోపాయాలుగా స్వీకరించకుండా నన్నే శరణు పొందు. నేను నిన్ను సర్వ పాపములనుండి రక్షించి మోక్షము కృప చేస్తాను" అని చెప్పేడు కదా!

ఇక్కడ కూడా దేశికులు తన యొక్క "ఆకించిన్యత్వము", "అనన్య గతికత్వము" విన్నపిస్తున్నారు. అయితే ఇంతకుముందు ఒకసారి విన్నపించేరు కదా, అది చాలదా, మళ్ళీ విన్నపించాలా అంటే అలా విన్నపము చేయడం భగవానునికి అవసరమై కాదు, మనము మరొక దారి పట్టకుండా ఉండడానికి, మళ్ళీ మళ్ళీ ఆ స్మరణ వలన కలిగే భోగ్యత్వమును ఆస్వాదించుకోడానికి అని మనము అర్థము చేసుకోవాలి. ఇక్కడ దేశికులు తన "ఆకించన్యత్వము", "అనన్య గతికత్వము" విన్నవిస్తూ ఈ శ్లోకాలు చదువుతున్న మన చేతకూడా విన్నపింప చేస్తున్నారు. లేకపోతే అహంకారుదులతో ఉండే మనము అలా చేయక ప్రక్క దారులు పట్టి పోతాము కదా!

ఇంతకు ముందు అనుకున్నట్లు ఇలా శరణాగతి చేయడం మనకు ఆళ్వార్ల పాశురాలలోను, పూర్వాచార్యుల కృతులలోను చూస్తూనే ఉంటాము.

ఉదాహరణకు "నుణ్ణఱివు ఇలేన్" అని నమ్మాళ్వారు, "అఱివు ఒణ్ణుమ్ ఇలేన్"

అని ఆండాళ్ళు తమకు జ్ఞానము లేనట్లు విన్నపము చేస్తారు.

యామునులు స్తోత్ర రత్నములో

"నిమజ్జతః అనంత భవార్ణవాంతః

చిరాయ మే కూలమ్ ....

త్వయాపి లబ్ధమ్ భగవన్ ఇదానీమ్

అనుత్తమమ్ పాత్రమిదమ్ దయాయాః

....సర్వమ్ సహే మే సహజమ్ హి దుఃఖమ్

కిమ్ తు త్వదగ్రే శరణాగతానామ్

పరాభవః నాథ! న తే అనురూపః"

అంటూ ఈ సంసార సాగరములో పడి కొట్టుకొని పోతున్న ఏమాత్రము పనికిరాని నాకు ఎంతో కాలానికి నువ్వు, అలాగే నీకు నేను దొరికేము. ఒక వేళ నన్ను నువ్వు వదిలేస్తే నాకు ఈ సంసార సాగరపు దుఃఖము అలవాటే

కనుక నాకేమీ బాధ లేదు, కాని నీ దగ్గరకు వచ్చిన శరణాగతులను వదలి వేయడం నీ స్వరూపానికి తగనిది కనుక నీ పేరు, ప్రతిష్ఠ పోతుంది చూసుకో"మ్మని చెప్పినట్లు

ఇక్కడ దేశికులు "ఏమాత్రము పరిణితి లేని అనాథనైన నేను అనన్యగతిశ్శరణ్యుడవైన నీకు తగిన పాత్రమును, అనగా విషయమును" అని విన్నపిస్తున్నారు.

బాగా కాల్చబడకుండా పచ్చి పచ్చిగా ఉండి పనికిరాని కుండలాగా పరిణితి లేకుండా పనికిరాని విషయముగా తనను పోల్చుకొంటున్నారు దేశికులు.

ఇక్కడ "అంశ మాత్రే కలా" అను అర్థాన్ని బట్టి "కలా" అనడం వలన ఏ కొంచెము కూడా నేర్వని వాడను అని కూడా అర్థము చేసుకొన వచ్చును.

తాము స్వయముగా ఆశ్రయించకున్ననూ, "ఏత్త కలంగళ్ ఎదిర్ పొంగి మీదళిప్ప మాత్తాదే వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్" అనినట్లు "నిరంతరమూ తమ ఉదారతతో జ్ఞానమును కోరకున్ననూ వర్షించెడు ఆచార్యులున్ననూ అట్టి ఆచార్యులను ఆశ్రయించ కుండుటే కాక ఆ జ్ఞానమును స్వీకరించి, నిలుపుకొన లేని పచ్చి కుండను" అని తనను దేశికులు సంబోధించుకొనుట మనలాంటి వారి కొరకే అని ఇక్కడ తెలుసుకోవాలి.

ఇక్కడ తీర్థ శబ్దము వలన "న ధర్మ నిష్ఠోస్మి.." అనినట్లు ధర్మ బద్ధమైన కర్మానుష్ఠానము లేనివాడను అని చెప్పుటచే "ఆకించన్యత్వము", జ్ఞానులైన ఆచార్యులు అను అర్థము చేత "అనన్య గతికత్వము" కూడా సూచితమవుతున్నాయి. శరణాగతికి ఇవి రెండే కదా ప్రధానముగా కావలసినవి.

ఈ శ్లోకము యామునులు ఇదే విధముగా తన స్తోత్ర రత్నములో

"తదహమ్ త్వదృతే న నాథవాన్

మదృతే త్వమ్ దయనీయవాన్ న చ

విధి నిర్మితమ్ ఏతత్ అన్వయమ్

భగవన్! పాలయ మాస్మ జీహపః"

"స్వామీ, నీ దయ కోరే వాళ్ళను నువ్వు వదలవు, నాకు నువ్వు తప్ప రక్షించడానికి వేరొక నాథుడు లేడు. ఇంతకంటే నీ దయను చూపించడానికి తగిన వాళ్ళు ఎవరూ నీకు ఉండరు. అదృష్ట వశాత్తూ వచ్చిన (నన్ను రక్షించడమనే) ఈ అవకాశము వదులుకోకు." అని చెప్పిన శ్లోకమును జ్ఞప్తికి తెస్తుంది.

ఈ విధముగా దేశికులు ఈ శ్లోకములో హయగ్రీవులకు "తన" అనే వ్యాజముతో "మన" సంరక్షణ బాధ్యత గుర్తు చేస్తున్నారు.

*నేను:* అంటే మనకు కూడా మనము తెలుసుకొన వలసినది ఈ విధముగా తెలియ జేస్తున్నారన్నమాట!

*వదిన:* మనము ముఖ్యముగా తెలుసుకొన వలసినది తరువాత శ్లోకములో ఇంకా విపులీకరిస్తున్నారు చూడు.

**31."అకంపనీయాని అపనీతి భేదైః**

**అలంకృషీరన్ హృదయమ్ మదీయమ్**

**శంకా కలంకాపగమ్ ఉజ్జ్వలాని**

**తత్త్వాని సమ్యంచి తవ ప్రసాదాత్"**

అంటే

*అపనీతి భేదైఃతప్పుడు న్యాయముల వలన( కుతర్కములవలన)*

*అకంపనీయాని: చలించనివి*

*శంకా: సందేహములు అనెడు*

*కలంక: దోషములను*

*అపగమ: తొలగించుట చేత*

*ఉజ్జ్వలాని: బాగుగా ప్రకాశించునవి*

*సమ్యంచి: యథార్థములైనవి యగు*

*తత్త్వాని: చిత్, అచిత్, ఈశ్వరుడు అనెడు మూడు తత్త్వములను*

*మదీయమ్: నాయొక్క*

*హృదయమ్: హృదయమును*

*తవ: నీయొక్క*

*ప్రసాదాత్: అనుగ్రహము వలన*

*అలంకృషీరస్: అలంకరించును గాక!*

అనగా

యథార్థములైన తత్త్వములు మూడు. అవి చిత్తు, అచిత్తు, ఈశ్వరుడు. కాని కొందరు అసలు యథార్థమైన తత్త్వమే లేదని సర్వమూ శూన్యమని, మఱి కొందరు అట్టి యథార్థమైన తత్త్వము ఒక్కటే అనియు అదియే బ్రహ్మమనియూ, ఈ కనబడునది అంతయు భ్రాంతి అనియూ, మఱి కొందరు ప్రకృతి, పురుషుడు అను ఱెండే యథార్థములైన తత్త్వములున్నాయని ఇలా పలు రకములుగా చెప్పుచుందురు. వీరిలో కొందరు వేద బాహ్యులు, అనగా వేదములను వేదములను ప్రమాణముగా పరిగణించని వారు(బౌద్ధులు మొదలగు వారు), మఱి కొందరు కుదృష్టులు అనగా వేదములను ప్రమాణముగా అంగీకరించినా వాటిని తప్పుగా అర్థము చేసికొనిన వారు( అద్వైతులు, సాంఖ్యులు మున్నగువారు). ఇటువంటి వారి కుతర్కములవలన చలించని నిశ్చలమైన, యథార్థ జ్ఞానమును నీవు కృప చేయుము. అట్టి జ్ఞానము కుతర్కముల వలన ఏర్పడిన నా యందలి అజ్ఞానమును తొలగించి నా హృదయమును అలంకరించి ప్రకాశించు చుండును గాక.

***నేను:*** యథార్థ జ్ఞానము అంటే తత్త్వత్రయ జ్ఞానము కలగడం అన్నమాట. ఆ జ్ఞానము హృదయమును అలంకరించి ప్రకాశించడం అంటే!

***వదిన:*** మనము ఇంతకు ముందు చెప్పుకున్నదే.

సర్వమూ శూన్యము అనేది బౌద్ధులు. అంటే వారు యథార్థమైన తత్త్వము ఏదీ లేదని అంటారు. ఈ విషయాన్నే తన శ్రీరంగ రాజ స్తవములో ప్రస్తావిస్తూ పరాశర భట్టర్ స్వామి

"ప్రతీతిః చేత్ ఇష్టా న నిఖిల నిషేధో యది న కః

నిషేద్ధాతో న ఇష్టో నిరుపధినిషేధః సదుపధౌ

నిషేధే అన్యత్ సిద్ధ్యేత్ వరద! ఘట భంగే శకలవత్

ప్రమాశూన్యే పక్షౌ శ్రుతిః అపి మతే అస్మిన్ విజయతామ్"

"ప్రత్యక్షముగా తెలుస్తున్న జగత్తును అయథార్థము అనుట తప్పు. కుండ లేదు అంటే కుండ ఇప్పుడు లేదు, ఇక్కడ లేదు అని తప్ప కుండ అను పదార్థము అయథార్థము అని కాదు కదా. కుండ వేఱొక చోట, వేఱొక సమయమున ఉండవచ్చును. ఇంతకు ముందున్న కుండ ఇప్పుడు లేదు ముక్కలై పోయింది కనుక కుండ అనేది భ్రమే అనడం తప్పు, దానికి అర్థము కుండ రూపాంతరము చెందనది అని అర్థము. ఆ కుండ ఒకప్పుడు ఉండి దాని ప్రయోజనాన్ని ( నీరు నింపి ఉంచడం మొదలైనవి) సాధించి పెట్టినది.ఈ కారణాల వలన శూన్య వాదము తప్పు. " అని చెబుతారు.

అలాగే

"ఏతత్ రామాస్త్రమ్ దలయతు కలిబ్రహ్మ మీమాంసకాంశ్చ

జ్ఞప్తిః బ్రహ్మ ఏతత్ జ్వలత్ అపి నిజ అవిద్యయా బంభ్రమీతి

తస్య భ్రాంతిమ్ తామ్ శ్లథయతి జిత అద్వైత విద్యః తు జీవః

యత్ యత్ దృశ్యమ్ తత్ వితథమ్ ఇతి యే జ్ఞాపయాంచ కృరజ్ఞాః"

"పరబ్రహ్మము చిన్మాత్ర జ్ఞానము. అది అనాదిగా వచ్చిన అవిద్యచేత బాధితమై జీవ, బ్రహ్మలు వేఱు అను భ్రాంతికి లోబడి ఉంటుంది. "తత్త్వమసి" వంటి మహా వాక్యముల జ్ఞానము వలన ఆ భ్రాంతి పోయి బ్రహ్మ మొక్కటే యథార్థమైన తత్త్వము అను విషయము అవగతమవుతుంది". అను అద్వైత సిద్ధాంతము కలి పురుషుని ప్రభావము వలన వచ్చిన కుదృష్టుల అభిప్రాయము. ఇట్టి అనృత విచారాలు రామబాణము వంటి అశాస్త్రీయ పరమైన తత్త్వ జ్ఞానము వలన ఛిన్నా భిన్నమగును." అనుచు వేద బాహ్యులను, కుదృష్టులను నిరసిస్తూ, ఇదంతా కలి పురుష ప్రభావమున అజ్ఞానము వలన జనించినవి అని వివరిస్తారు.

యథార్థమైన తత్త్వములు మూడు. అవి చిత్(అనగా జీవాత్మలు), అచిత్(అనగా ప్రకృతి) మఱియు ఈశ్వరుడు. మనము ఇంతకు ముందు అనుకొనినట్లు జీవాత్మలు, ప్రకృతి కూడా ఈశ్వరునికి శరీరముగా అనగా జీవ, ప్రకృతులు పరమాత్మతో శరీర, శరీరి సంబంధముతో పరమాత్మ విశిష్టములై ఉంటాయి. ఇది యథార్థ జ్ఞానము. కాని మన మనస్సు పూర్వ వాసనల వలననూ, ప్రకృత ప్రకృతి విషయ ప్రభావాల వలననూ కలుషితమవడం వలన ఈ జ్ఞానము యథార్థ రూపములో ప్రసరించదు, ప్రకాశించదు. ఈ పూర్వ జన్మ వాసనల ప్రభావమును తొలగించుకోవడం మన ప్రయత్నము వలన కుదరదు. అందువలన హయగ్రీవ భగవానుల అనుగ్రహము చేత ఆ అజ్ఞానము తొలగి యథార్థ జ్ఞాన ప్రకాశము సంభవము అవుతుంది. దాని కొఱకే దేశికులు హయగ్రీవులను ప్రార్థిస్తున్నారు ఈ శ్లోకములో.

అసలు హయగ్రీవుల అవతార కారణమే చతుర్ముఖునికి యథార్థ జ్ఞానాన్ని అందీయడానికి కదా!

హయగ్రీవుల అనుగ్రహము ఉన్నప్పుడు సంశయ, విపర్యయాదులు పోయి యథార్థ జ్ఞానము కలుగు తుంది.

ఇక్కడ తత్త్వములు అంటే ప్రకృతికి సంబంధించిన 24 తత్త్వములు, జీవాత్మ, పరమాత్మ లకు సంబంధించిన యథార్థ జ్ఞానము అని కూడా అర్థము చేసుకొన వచ్చును.

***నేను:*** హయగ్రీవుల గొప్ప దనాన్ని ఎంతో విపులంగా స్తోత్రము చేయడమే కాక మన రామానుజుల సిద్ధాంతాన్ని ఎంత విశదముగా వివరిస్తున్నారో కదా, ఈ స్తోత్రములో!

***వదిన***: అది దేశికుల గొప్పదనము. అందుకే

"నిగమాంత గురు ప్రోక్తమ్ గ్రంథమ్ కంచిత్ పఠంతి యే

విమతస్థాన్ సమస్తామ్ శ్చ తే జయంతి న సంశయః"

"వేదాంత దేశికుల గ్రంథమును కొలదిగా చదువుకున్న వారు ఇతర మతాల వారిని నిస్సందేహముగా జయించి రామానుజ సిద్ధాంత స్థాపన చేయగలరు" అని అంటారు. మనము కూడా ఈ స్తోత్రము ద్వారా భగవద్రామానుజుల సిద్ధాంతాన్ని మఱి యొకసారి పునశ్చరణ చేసినట్లయింది.

***నేను:*** ఇంత గొప్ప హయగ్రీవులను ధ్యానించు కోవడానికి ఆయన యొక్క మూర్తి సంపూర్ణమైన వర్ణనము ఒక్కసారి చెబితే బాగుండును!

***వదిన:*** ఆ హయగ్రీవుల వారి మూర్తి సంపూర్ణ వర్ణనమునకై ధ్యాన శ్లోకమే తరువాత శ్లోకము.

32."వ్యాఖ్యా ముద్రామ్ కర సరసిజైః

పుస్తకమ్ శంఖ చక్రే

బిభ్రద్భిన్న స్ఫటిక రుచిరే

పుండరీకే నిషణ్ణః

ఆమ్లాన శ్రీః అమృత విశదైః

అంశుభిః ప్లావయన్మామ్

ఆవిర్భూయాత్ అనఘ మహిమా

మానసే వాగధీశః"

**అంటే**

*కర సరసిజైః: పద్మముల వంటి (నాల్గు) చేతులచే*

*వ్యాఖ్యా ముద్రామ్: ఉపదేశ ముద్రను*

*పుస్తకమ్: పుస్తకమును*

*శంఖ చక్రే: శంఖ చక్రములను*

*బిభ్రత్: ధరించి యున్న*

*భిన్న స్ఫటిక: భిన్నమైన స్ఫటిక మణి వలె*

*రుచిరే: మనోహరమైన( కాంతి వంతమైన)*

*పుండరీకే: (తెల్లని) తామర పుష్పమునందు*

*నిషణ్ణః: ఆసీనుడై యున్న*

*అమ్లాన శ్రీః: ఎప్పుడూ వాడకుండా నిత్య నూతనమైన ప్రకాశము కల్గిన(నిత్య శోభాయమానమైన లక్ష్మీ దేవి తో కూడి యున్న )*

*అనఘ మహిమా: దోషములు లేని గొప్పదనము కల*

*వాక్ అధీశః: వాక్కులకు స్వామి యగు హయగ్రీవ మూర్తి*

*అమృత విశదైః: అమృతము వలె తెల్లని, ఆహ్లాదకరమైన*

*అంశుభిః: కాంతులతో*

*మామ్: నన్ను*

*ప్లావయన్: తడపుచూ*

*మానసే: మనస్సునందు*

*ఆవిర్భూయాత్: ఆవిర్భవించి వేంచేసి యుండు గాక!*

అనగా

పద్మముల వంటి తన నాల్గు చేతులయందు ఒక చేతిలో ఉపదేశ ముద్రను, మఱి యొక చేతితో పుస్తకమును, తక్కిన ఱెండు చేతులతో శంఖ చక్రములను ధరించి, భిన్న స్ఫటికము వలె మనోహరమైన కాంతి కల్గి, ఎప్పుడూ వాడకుండా నిత్య నూతనమైన ప్రకాశము కల (**నిత్య శోభాయమానమైన లక్ష్మీ దేవితో కూడి యుండి) తెల్లని తామర పుష్పము పై ఆసీనుడై దోషములు లేని గొప్పదనము గల వాక్కులకు (దోషములు లేని) * స్వామి యగు హయగ్రీవ మూర్తి అమృతమువలె స్వచ్ఛముగా, తెల్లగా ఆహ్లాద కరముగా నుండు కాంతులతో నన్ను తడపుచూ నా మనస్సునందు ఆవిర్భవించి వేంచేసి యుండు గాక!

* దోషరాహిత్యము వాక్కులకు, వాగధీశునకు కూడా వర్తిస్తుంది.

**శ్రీ అంటే ప్రకాశము, లక్ష్మీ దేవి అని కూడా అర్థము చేసుకొన వచ్చును

ఇంతకుముందు క్రిందనుండి పైకి వర్ణించేరు కదా. ఇప్పుడు హస్తములనుండి ప్రారంభిస్తున్నారు.

ఆయన చేతులు పద్మముల వలె ఉన్నాయట. అందులో కుడి చేతిలో వ్యాఖ్యా ముద్ర కనబడుతోంది.

మనము ఇంతకు ముందు అనుకున్నట్లుగా "వ్యాఖ్యా ముద్ర" అన్నా ఉపదేశ ముద్ర అన్నా ఒక్కటే. చిటికెన వేలు, ఉంగరపు వేలు, మధ్య వేలు చాచి యుంచి చూపుడు వేలును, బొటన వేలితో చేర్చితే ఏర్పడే హంస ముఖము వంటి ముద్రకు "వ్యాఖ్యా ముద్ర" అని పేరు. హంస అంటే మంచిని స్వీకరించి, చెడుని తిరస్కరించే లక్షణాన్నీ, ఆచార్యులనూ, హయగ్రీవులనూ గుర్తు చేస్తుంది కదా!

రెండవ చేతిలో పుస్తకాన్ని ధరించి యున్నారు స్వామి, తాను వాగీశ్వరుడినని, జ్ఞాన ప్రదాతను అని తెలియ చేస్తూ.

తాను శ్రీమన్నారాయణావతారమేనని తెలుపుతూ "వలక్కై ఆళి ఇడక్కై శంగమ్" అనినట్లు మిగిలిన రెండు చేతులలో శంఖ, చక్రాలను ధరించి యున్నారు.

భిన్న స్ఫటికము కాంతి ప్రసారాన్ని అనగా జ్ఞాన ప్రసారాన్ని సూచిస్తుంది. అంతేకాక స్ఫటికము స్వచ్ఛతకు, సౌందర్యానికీ గుర్తు కనుక హయగ్రీవ భగవానుడు అఖిల హేయ ప్రత్యనీకుడనీ, కల్యాణ గుణాకరుడనిన్నీ తెలుస్తుంది.

ఆయన ఎడమ కాలు మడచి, కుడికాలు క్రిందన ఉంచి తెల్లని తామర పుష్పమునందు వేంచేసి యున్నారట. మనోహరమైన తెల్ల తామర పుష్పమును మనము హృదయ పుండరీకముగా అర్థము చేసికొన వచ్చును.

దోష రహితమై, నిత్య నూతనమై, శోభాయమానమై "అకలకిల్లేన్ ఇఱైయుమ్ ఎన్ఱు" అనినట్లు ఎప్పుడు విడిగా ఉండలేని లక్ష్మీ సమేతుడై దోష రహితములైన వాక్కులకు అనగా జ్ఞానానికి స్వామి అయిన హయగ్రీవ భగవానుడు పద్మాసనమున వేంచేసి యున్నాడు.

అట్టి స్వామి అమృతము వలె ఆహ్లాదకరముగా, ఉజ్జీవ కారకముగా ఉండు కాంతులతో సంసార దావానలమునందు తపింపబడి, ఆర్తుడనైన నన్ను తడుపుతూ నా మనస్సు నందు వేంచేసి యుండుగాక అని వేదాంత దేశికులు హయగ్రీవులను ప్రార్థిస్తున్నారు. ఇది హయగ్రీవ స్వామి వారి ధ్యాన శ్లోకము. ఇందులో వర్ణించ బడిన హయగ్రీవ స్వరూపాన్ని మనస్సులో ప్రతిష్ఠించుకొని ధ్యానించుట వలన సమస్త విద్యలూ సంప్రాప్తమై, ఈ లోకమున సకల ఐశ్వర్యములే కాక, మరణానంతరము పరమపద ప్రాప్తి కూడా కలుగునని పెద్దలు చెబుతారు.

5వ శ్లోకమునుండి ఇంతకు ముందు శ్లోకము వరకు ఉన్న శ్లోకములను ఉపజాతి ఛందస్సు నందు రచించిన దేశికులు ఈ శ్లోకాన్ని "మందాక్రాంతా వృత్తము" లో రచించేరు. మన సంప్రదాయములో చివరి శ్లోకమును విశేష ఛందస్సుతో రచించడం ఒక ఆచారము. అటులనే దేశికులు ఈ శ్లోకాన్ని అందమైన "మందాక్రాంతా వృత్తము" లో అందించేరు.

ఆ హయగ్రీవ భగవానుడు మన మనస్సులలో మెల, మెల్లగా ఆక్రమించి నిలకడగా చోటు చేసుకోవాలన్న మాట.

ఈ స్తోత్రములో ఈ ధ్యాన శ్లోకము చాలా ముఖ్యమైన శ్లోకము. 5వ శ్లోకమునుండి ఇంతకు ముందు శ్లోకము వరకు ఉన్న శ్లోకములను ఉపజాతి ఛందస్సు వలసినది.

*నేను:* అంటే ఈ శ్లోకముతో హయగ్రీవ స్తోత్రము పూర్తి అయినట్లేనా!

*వదిన:* తరువాతి శ్లోకము ఫల శ్రుతి శ్లోకము.

33.వాగర్థ సిద్ధి హేతోః పఠత

హయగ్రీవ సంస్తుతిమ్ భక్త్యా

కవితార్కిక కేసరిణా

వేంకట నాథేన విరచితామ్ ఏతామ్

అంటే

*కవితార్కిక: కవిత్వము నందును, తర్కము నందును కూడ*

*కేసరిణా: సింహము వలె గొప్ప వారయిన, ప్రతి వాదులను జయించగల సామర్థ్యము గల, కవితార్కిక కేసరి అను బిరుదు గల*

*వేంకట నాథేన: వేంకట నాథులు అను పేరు గల వేదాంత దేశికులచేత*

*విరచితామ్: రచించబడిన*

*ఏతామ్: ఈ*

*హయగ్రీవ సంస్తుతిమ్: హయగ్రీవ స్తోత్రమును*

*వాక్+అర్థ: శబ్దార్థముల యొక్క*

*సిద్ధ హేతోః : సిద్ధిని పొందుటకై*

*భక్త్యా: భక్తితో*

*పఠత: పఠింపుడు*

అనగా

కవితార్కిక బిరుదాంకితులును, వేంకట నాథ నామ ధేయులును అయిన వేదాంత దేశికులచేత రచింప బడిన ఈ హయగ్రీవ స్తోత్రమును శబ్దార్థ సిద్ధి పొందుటకు పఠించ వలెను. అనగా దీనిని పఠించిన వారు వాగర్థ సిద్ధి పొందుదురు.

***నేను:*** "కవితార్కిక సింహము" అన్న బిరుదము దేశికులకు అప్పటికే ఉండేదా!

***వదిన:*** ఈ శ్లోకము తరువాత చేర్చబడి యుండవచ్చును. లేదా నమ్మాళ్వారు "ఆయిరత్తిప్పత్తుమ్" అని అని మొదటి దశకమునుండి తన తిరువాయ్ మొళి వేయి పాశురాల గ్రంథము అని చెప్పినట్లు దేశికులు భవిష్యద్దర్శన సామర్థ్యము కల ఆచార్యులు అవడం వలన అలా వ్రాసి యుండవచ్చును కూడా. అంతే కాక దేశికులు 21 ఏళ్ళకే కవితా పాండిత్యాలలోను, తర్క శాస్త్రాదులలోను నిష్ణాతులని మనము ఇంతకు ముందు అనుకున్నాము కదా. అందువలన ఆ బిరుదము ఆయనకు అప్పటికే ప్రచారములో ఉన్నా ఆశ్చర్యము లేదు.

ఈ శ్లోకములో ఈ స్తోత్రమును భక్తితో పఠించిన వారు వాగర్థ సిద్ధి పొందుదురు అనుట వలన "వారు లక్ష్మీ నారాయణులను" పొందగలరని అర్థము చేసుకొన వచ్చును.

**"అర్థో విష్ణుః ఇయమ్ వాణీ"** అని కదా విష్ణు పురాణములో పరాశర మహర్షి చెబుతారు, అంటే శబ్దము లక్ష్మీ దేవి, అర్థము శ్రీమన్నారాయణుడు అన్న మాట. వారిద్దరూ శబ్దార్థముల వలె ఎప్పుడూ జంటగానే ఉంటారు. ఈ రకంగా ఈ శ్లోకములో కూడా దేశికులు లక్ష్మీ హయగ్రీవులను, వాగర్థములను స్మరిస్తూ మనకు వారి ఆశ్రయణము సంప్రాప్తము అగునట్లు అనుగ్రహిస్తున్నారు దేశికులు. స్తుతి అంటే స్తోత్రము కదా, సంస్తుతి అనడం వలన ఈ స్తోత్రము యొక్క గొప్పదనము, మహాత్మ్యము, ప్రామాణ్యము తెలుస్తోంది.

"భక్త్యాతు అనన్యయా లభ్యః" అని భగవానుడు భగవద్గీతలో చెప్పినట్లు, "భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా" అని భగవద్రామానుజులు శ్రీభాష్యము మంగళ శ్లోకములో "పరమాత్మ యందు భక్తి రూపాపన్న జ్ఞానము కలుగ వలెనని" ప్రార్థించి నట్లు  ఇక్కడ కూడా దేశికులు ఈ స్తోత్రమును భక్తితో పఠించవలెనని చెబుతున్నారు.

మిగిలిన వారు పెద్ద శ్రమ అక్కర లేకుండా ఈ స్తోత్రాన్ని భక్తితో పఠిస్తే చాలును, వాగర్థ సిద్ధి కలుగుతుందని "నమ్మాళ్వారు" తమ తిరువాయ్ మొళిలో ప్రతి దశకానికి "కురుగూర్ శడగోపన్ శొల్ ఓరాయిరత్తిప్పత్తుమ్" అని చెప్పినట్లు ఔదార్యముతో దేశికులు కూడా మంగళాశాసనము చేస్తున్నారు.

"వాగర్థ సిద్ధి" అని వాగర్థముల అవినాభావ సంబంధము తెలియ చేయడం వలన దేశికులు భక్తితో ఈ స్తోత్రము చదివిన వారికి "వాగర్థ సిద్ధి కలుగుతుంది" అనే తన వాక్కు అర్థ వంతమే అవుతుందని అంటే అట్టి వారికి "వాగర్థ సిద్ధి" తప్పక కలుగుతుందని సూచిస్తున్నారు. "ఋషీణామ్ పునరాద్యానామ్ వాచమర్థోనుధావతి" అని కదా ఆర్యోక్తి. ఆ విషయము తెలుపడానికే అన్నట్లు ఈ శ్లోకమును "ఆర్యా వృత్తములో" దేశికులు రచించేరు.

చివరగా వేదాంత దేశికుల మరొక తనియన్ శ్లోకము కూడా పెద్దలు చెబుతారు.

**"కవితార్కిక సింహాయ**

**కల్యాణ గుణ శాలినే**

**శ్రీమతే వేంకటేశాయ**

**వేదాంత గురవే నమః**

**అంటే**

*కవితార్కిక సింహాయ: కవితార్కిక సింహము అను బిరుదము కల్గిన*

*కల్యాణ గుణ శాలినే: కల్యాణ గుణములు మెండుగా కల*

*శ్రీమతే వేంకటేశాయ: శ్రీమాన్ వేంకటేశులను నామధేయము కల*

*వేదాంత గురవే: వేదాంత దేశికులకు*

*నమః: నమస్కారము*

అనగా

కవితార్కిక సింహ బిరుదాంకితులు, కల్యాణ గుణాకరులు, శ్రీమాన్ వేంకటేశ నామధేయులు అయిన వేదాంత దేశికులకు నమస్కారము.

*నేను:* నాకు ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు వదినా, హయగ్రీవ స్తోత్రము గురించి ఇంతకు ముందుకు విన్నాను కాని, వేదాంత దేశికుల గురించీ, ఈ స్తోత్రము గురించి ఇన్ని గొప్ప విషయాలు ఉంటాయని నేను ఎప్పుడూ ఊహించలేదు. నువ్వు చెప్పిన ఈ స్తోత్రార్థము నాకు జ్ఞాపకము ఉన్నంత మట్టుకు క్లుప్తంగా చెబుతాను. తప్పులుంటే కొంచెం సరి చేస్తావా.

*వదిన:* నేను చెప్పిన కాదు, వేదాంత దేశికులు చెప్పిన అను.

అలాగే చెప్పు, కవితార్కిక సింహ కృతిని మరొకసారి సింహావలోకనము చేసినట్లవుతుంది.

*నేను:* హయగ్రీవ భగవానులను సాక్షాత్కారము చేసుకొన్న వేదాంత దేశికులు, స్వచ్ఛమై, ప్రకాశమానమైన ఆయన స్వరూపాన్ని, హయగ్రీవ మంత్రమును సూచిస్తున్న ఆయన నోటి నుండి వచ్చు శబ్దమును స్తుతించి, ఆయనకు శరణాగతి చేసి, ఆయన అనుగ్రహము ఇంతకుముందు పొందిన వారిని సంస్మరించుకొని, వారి మూర్తిని దర్శించి, ధ్యానించి వారి ప్రసాదము వలన మంచి జ్ఞానము, వాగర్థ సిద్ధి కలగాలని ప్రార్థిస్తున్నారు ఈ స్తోత్రములో.

ఇంకొంచెం వివరంగా చెప్పాలంటే, కవితార్కిక కేసరులు, సర్వ తంత్ర స్వతంత్రులు అయిన వేదాంత దేశికులు చతుర్ముఖ బ్రహ్మకు వేద విజ్ఞానాన్ని పునఃప్రదానము గావించిన హయగ్రీవ అవతారాన్ని సంస్మరిస్తూ, సమస్త శ్రుత్యర్థ సమాహారమైన "హయగ్రీవ మంత్రమును" , తదర్థమును స్తుతించి, తనకు సాక్షాత్కరించిన స్వామికి శరణాగతి చేస్తూ, హయగ్రీవుల పరత్వము, తన యొక్క ఆకించన్యత్వము, అనన్య గతిత్వము తెలియ జేసుకొని, ఆ స్వామి ఇంతకు ముందు సరస్వతీ దేవికి, దక్షిణామూర్తికి, వ్యాస, వాల్మీకాదులకు, చతుర్ముఖ బ్రహ్మకు, బృహస్పతికి మొదలైన వారికందరికీ సమగ్రమైన విజ్ఞానము పొందుటకు అనుగ్రహించిన విషయమును కీర్తిస్తూ, వేద మంత్ర మయమైన శరీరముతో సమస్త యజ్ఞములకు భోక్తయై, శ్రుతులకు,

అకారాది అక్షర మాతృకకు మూలమై చిదచిత్తులను సృష్టించి, వానిలో అంతర్యామియై వేంచేసి యుండి ఆ చిదచిత్తులకు పరమావధి యగు హయగ్రీవులను స్తోత్రము చేస్తున్నారు.

నిండు వెన్నెల వలె మనోహరమై, అమృతానంద ప్రవాహము వలె నుండు రూపమును జ్ఞానులు ధ్యానమును చేయు చుందురనియు, అట్టి వారికి హయగ్రీవ ప్రసాదమున అమోఘమైన వాక్శక్తి కలుగుననియు, వారినుండి వెలువడు వాక్ప్రవాహములు వలన గంగా ప్రవాహము కూడ అల్ప వేగము కలదిగా అన్పించుననియు, అట్లు ధ్యానించువారు తమకు కలుగు ఆనందము వలన పులకాంకిత దేహులై, కండ్లనుండి ఆనంద బాష్పములు వెడలు చుండగా హయగ్రీవుని అనుభవిస్తూ ఆయన అనుగ్రహము వలన ఈ సంసార సాగరాన్ని దాట గలరని దేశికులు ఈ స్తోత్రములో వివరిస్తున్నారు.

అట్టి హయగ్రీవుల పాద పద్మముల వద్ద నమస్కారము చేయు చున్నానని, అట్లు చేయుట వలన తన పూర్వ కర్మ ఫలాలన్నీ తొలగి పోయి, పరిపూర్ణమైన జ్ఞానము కలుగుననీ చెబుతున్నారు స్వామి దేశికులు ఈ స్తోత్రములో.

స్వామి విగ్రహాన్ని వర్ణిస్తూ, ఆయన దక్షిణ హస్తమున వ్యాఖ్యా ముద్ర శాస్త్ర జ్ఞాన జ్యోతిని ప్రజ్వరిల్ల చేయు చున్నట్లును, అక్ష మాల భక్తుల ఉజ్జీవనానికి జ్ఞానామృతమును తోడి ఇచ్చు ఏతాము వలెను, వామ హస్తముననున్న పుస్తకము జ్ఞాన సాగరము నుండి గ్రహించబడిన ప్రవాళ పంక్తి వలె అరుణ కాంతితో జ్ఞాన ప్రదాన సామర్థ్యము కలిగి యున్నట్లును తెలిపి, అట్టి హయగ్రీవుల నుండి ప్రసరించు జ్ఞానమే ధారక, పోషక, భోగ్యములుగా భావించి, జీవించు భక్తులను ఆనంద పరుస్తుందని ఆశ్రితులకు అభీష్టములు నెరవేర్చు ఆయన కటాక్ష వీక్షణాలు తమకు సమస్త విద్యా, పాండిత్య సంపదలను ప్రసాదించాలని, సంప్రదాయ సంరక్షణకై తాను పరిషత్సభలయందు పాల్గొనునప్పుడు తన జిహ్వాగ్రము నందు వేంచేసి యుండి తనకు ఆయా వాగ్యుద్ధాలలో విజయమును సంప్రాప్తింప చేయాలని, సంతతము హయగ్రీవుల ధ్యానము వలన హయగ్రీవానుభవమున ఆయనతో తాదాత్మ్య స్థితిని పొంది, సిద్ధాంత స్థాపనా విద్వద్వాదాలలో తాము జయ శీలురు కావాలని ప్రార్థిస్తున్నారు దేశికులు ఈ స్తోత్రములో.

తాను వేరొక ఉపాయము గాని గతి గాని లేని అనాథనై హయగ్రీవుల వద్ద శరణాగతి చేస్తున్న వాడననీ, అట్టి తనకు యథార్థ జ్ఞానమునందు అజ్ఞాన జనితములైన సంశయాలు లేకుండునట్లు చిత్, అచిత్, ఈశ్వరుడు అను తత్త్వత్రయము యొక్క జ్ఞానమును ప్రసాదించి అనుగ్రహిస్తూ తన హృదయమునందు హయగ్రీవులు ఎప్పుడూ వేంచేసి యుండాలనీ ప్రార్థిస్తున్నారు.

చివరగా హయగ్రీవ భగవానుల ధ్యాన శ్లోకములో "దక్షిణ హస్తమున ఉపదేశ ముద్రను, వామ హస్తమున పుస్తకమును, మిగిలిన రెండు చేతులయందు శంఖ చక్రములను ధరించి, లక్ష్మీ సమేతుడై, భిన్న స్ఫటికము వలె స్వచ్ఛములు, మనోహరములు అయిన కాంతులను ప్రసరింప చేస్తూ, తెల్లని పుండరీకమున వేంచేసి యున్న నిర్దోషములైన వాక్కులకు స్వామి అయిన హయ గ్రీవ భగవానుడు తన హృదయ పుండరీకమునందు ఎల్లప్పుడూ వేంచేసి యుండి అనుగ్రహించుచుండాలని" వేదాంత దేశికులు ఈ స్తోత్రాన్ని ముగించేరు.

***వదిన:*** క్లుప్తంగానైనా ముఖ్యమైన విషయాలన్నీ గుర్తుంచుకున్నావు.

ఇప్పుడు ఒక్కసారి మొత్తము స్తోత్రాన్ని చదువుకుందామా.

***నేను***: అలాగే.

॥ శ్రీహయగ్రీవస్తోత్రమ్ ॥

శ్రీః

శ్రీమాన్ వేఙ్కటనాథార్యః కవితార్కికకేసరీ ।
వేదాన్తాచార్యవర్యో మే సన్నిధత్తాం సదా హృది ॥

జ్ఞానానన్దమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్ ।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే ॥ ౧॥

స్వతః సిద్ధం శుద్ధస్ఫటికమణి భూభృత్ప్రతిభటం
సుధాసధ్రీచీభిర్ద్యుతిభిరవదాతత్రిభువనమ్ ।
అనన్తైస్త్రయ్యన్తైరనువిహిత హేషాహలహలం
హతాశేషావద్యం హయవదనమీడీమహి మహః ॥ ౨॥

సమాహారః సామ్నాం ప్రతిపదమృచాం ధామ యజుషాం

లయః ప్రత్యూహానాం లహరి వితతిర్బోధజలధేః ।
కథాదర్పక్షుభ్యత్కథకకుల కోలాహలభవం
హరత్వన్తర్ధ్వాన్తం హయవదన హేషా హలహలః ॥ ౩॥

ప్రాచీ సన్ధ్యా కాచిదన్తర్నిశాయాః
ప్రజ్ఞాదృష్టేరఞ్జనశ్రీరపూర్వా ।
వక్త్రీ వేదాన్ భాతు మే వాజివక్త్రా
వాగీశాఖ్యా వాసుదేవస్య మూర్తిః ॥ ౪॥

విశుద్ధ విజ్ఞాన ఘన స్వరూపం
విజ్ఞాన విశ్రాణన బద్ధదీక్షమ్ ।
దయానిధిం దేహభృతాం శరణ్యం
దేవమ్ హయగ్రీవమహం ప్రపద్యే ॥ ౫॥

అపౌరుషేయైరపి వాక్ప్రపఞ్చైః
అద్యాపి తే భూతిమదృష్టపారామ్ ।
స్తువన్నహం ముగ్ధ ఇతి త్వయైవ
కారుణ్యతో నాథ కటాక్షణీయః ॥ ౬॥

దాక్షిణ్యరమ్యా గిరిశస్య మూర్తిః
దేవీ సరోజాసన ధర్మపత్నీ ।
వ్యాసాదయోఽపి వ్యపదేశ్యవాచః
స్ఫురన్తి సర్వే తవ శక్తిలేశైః ॥ ౭॥

మన్దోఽభవిష్యన్నియతం విరిఞ్చో
వాచాం నిధే వఞ్చితభాగధేయః ।
దైత్యాపనీతాస్ దయయైవ భూయోఽపి
అధ్యాపయిష్యో నిగమాస్ న చేత్ త్వమ్ ॥ ౮॥

వితర్కడోలాం వ్యవధూయ సత్వే
బృహస్పతిం వర్తయసే యతస్త్వమ్ ।
తేనైవ దేవ త్రిదశేశ్వరాణామ్
అస్పృష్ట డోలాయిత మాధిరాజ్యమ్ ॥ ౯॥

అగ్నౌ సమిద్ధార్చిషి సప్తతన్తోః
ఆతస్థివాస్ మన్త్రమయం శరీరమ్ ।
అఖణ్డసారైర్హవిషాం ప్రదానైః
ఆప్యాయనం వ్యోమసదాం విధత్సే ॥ ౧౦॥

యన్మూలమీదృక్ ప్రతిభాతి తత్వం
యా మూలమామ్నాయ మహాద్రుమాణామ్ ।
తత్వేన జానన్తి విశుద్ధ సత్వాః
తామక్షరా మక్షరమాతృకాం త్వామ్ ॥ ౧౧॥

అవ్యాకృతాద్ వ్యాకృతవానసి త్వమ్
నామాని రూపాణి చ యాని పూర్వమ్ ।

శంసన్తి తేషాం చరమాం ప్రతిష్ఠాం
వాగీశ్వర త్వాం త్వదుపజ్ఞవాచః ॥ ౧౨॥

ముగ్ధేన్దు నిష్యన్ద విలోభనీయాం
మూర్తిం తవానన్ద సుధా ప్రసూతిమ్ ।
విపశ్చితశ్చేతసి భావయన్తే
వేలాముదారామివ దుగ్ధసిన్ధోః ॥ ౧౩॥

మనోగతం పశ్యతి యః సదా త్వాం
మనీషినాం మానస రాజహంసమ్ ।
స్వయమ్ పురోభావ వివాదభాజః
కింకుర్వతే తస్య గిరో యథార్హమ్ ॥ ౧౪॥

అపి క్షణార్ధం కలయన్తి యే త్వామ్
ఆప్లావయన్తం విశదైర్మయూఖైః ।
వాచాం ప్రవాహైరనివారితైస్తే
మన్దాకినీం మన్దయితుం క్షమన్తే ॥ ౧౫॥

స్వామిన్ భవద్ధ్యాన సుధాభిషేకాత్
వహన్తి ధన్యాః పులకానుబన్ధమ్ ।
అలక్షితే క్వాపి నిరూఢమూలమ్
అఙ్గేష్వివానన్దథుం అఙ్కురన్తమ్ ॥ ౧౬॥

స్వామిన్ ప్రతీచా హృదయేన ధన్యాః
త్వద్ధ్యాన చన్ద్రోదయ వర్ధమానమ్ ।
అమాన్తమానన్ద పయోధిమన్త
పయోభిరక్ష్ణాం పరివాహయన్తి ॥ ౧౭॥

స్వైరానుభావాస్త్వదధీన భావాః
సమృద్ధవీర్యాస్త్వదనుగ్రహేణ ।
విపశ్చితో నాథ తరన్తి మాయాం
వైహారికీం మోహన పిఞ్ఛికాం తే ॥ ౧౮॥

ప్రాఙ్నిర్మితానాం తపసాం విపాకాః
ప్రత్యగ్రనిఃశ్రేయస సమ్పదో మే ।
సమేధిషీరంస్తవ పాదపద్మే
సంకల్ప చిన్తామణయః ప్రణామాః ॥ ౧౯॥

విలుప్త మూర్ధన్య లిపి క్రమాణామ్
సురేన్ద్ర చూడాపద లాలితానామ్ ।
త్వదంఘ్రి రాజీవ రజఃకణానామ్
భూయాన్ ప్రసాదో మయి నాథ భూయాత్ ॥ ౨౦॥

పరిస్ఫురన్నూపుర చిత్రభాను-
ప్రకాశ నిర్ధూత తమోనుషఙ్గామ్ ।
పదద్వయీం తే పరిచిన్మహే ఽన్తః

ప్రబోధ రాజీవ విభాత సన్ధ్యామ్ ॥ ౨౦॥

త్వత్కిఙ్కరాలఙ్కరణోచితానాం
త్వయైవ కల్పాన్తర పాలితానామ్ ।
మఞ్జుప్రణాదం మణినూపురం తే
మఞ్జూషికాం వేదగిరాం ప్రతీమః ॥ ౨౨॥

సఞ్చిన్తయామి ప్రతిభాదశాస్థాస్
సన్ధుక్షయన్తం సమయ ప్రదీపాస్ ।
విజ్ఞాన కల్పద్రుమ పల్లవాభం
వ్యాఖ్యాన ముద్రా మధురం కరం తే ॥ ౨౩॥

చిత్తే కరోమి స్ఫురితాక్షమాలం
సవ్యేతరం నాథ కరం త్వదీయమ్ ।
జ్ఞానామృతోదఞ్చనలమ్పటానాం
లీలాఘటీ యన్త్రమివాశ్రితానామ్ ॥ ౨౪॥

ప్రబోధ సిన్ధోరరుణైః ప్రకాశైః
ప్రవాళ సఙ్ఘాతమివోద్వహన్తమ్ ।
విభావయే దేవ సపుస్తకం తే
వామం కరం దక్షిణమాశ్రితానామ్ ॥ ౨౫॥

తమాంసి భిత్వా విశదైర్మయూఖైః

సమ్ప్రీణయన్తం విదుషశ్చకోరాన్ ।
నిశామయే త్వాం నవపుణ్డరీకే
శరద్ఘనే చన్ద్రమివ స్ఫురన్తమ్ ॥ ౨౬॥

దిశన్తు మే దేవ సదా త్వదీయాః
దయాతరఙ్గానుచరాః కటాక్షాః ।
శ్రోత్రేషు పుమ్సామమృతమ్ క్షరన్తీం
సరస్వతీం సంశ్రిత కామధేనుమ్ ॥ ౨౭॥

విశేషవిత్పారిషదేషు నాథ
విదగ్ధ గోష్ఠీసమరాఙ్గణేషు ।
జిగీషతో మే కవితార్కికేన్ద్రాన్
జిహ్వాగ్ర సింహాసనమభ్యుపేయాః ॥ ౨౮॥

త్వాం చిన్తయన్ త్వన్మయతాం ప్రపన్నః
త్వాముద్గృణన్ శబ్దమయేన ధామ్నా ।
స్వామిన్ సమాజేషు సమేధిషీయ
స్వచ్ఛన్ద వాదాహవ బద్ధశూరః ॥ ౨౯॥

నానావిధానామగతిః కలానాం
న చాపి తీర్థేషు కృతావతారః ।
ధ్రువం తవానాథపరిగ్రహాయాః
నవం నవం పాత్రమహం దయాయాః ॥ ३० ॥

అకమ్పనీయాన్యపనీతి భేదైః
అలన్కృషీరస్ హృదయం మదీయమ్ ।
శఙ్కాకళఙ్కాపగమోజ్జ్వలాని
తత్వాని సమ్యఞ్చి తవ ప్రసాదాత్ ॥ ౩౧ ॥

వ్యాఖ్యా ముద్రాం కరసరసిజైః పుస్తకమ్ శఙ్ఖచక్రే
బిభ్రద్భిన్నస్ఫటికరుచిరే పుణ్డరీకే నిషణ్ణః ।
అమ్లానశ్రీరమృతవిశదైరంశుభిః ప్లావయస్ మాం
ఆవిర్భూయాదనఘ మహిమా మానసే వాగధీశః ॥ ౩౨ ॥

వాగర్థ సిద్ధిహేతోః
పఠత హయగ్రీవసంస్తుతిం భక్త్యా ।
కవితార్కికకేసరిణా
వేఙ్కటనాథేన విరచితామేతామ్ ॥ ౩౩ ॥

॥ ఇతి శ్రీహయగ్రీవస్తోత్రం సమాప్తమ్ ॥

కవితార్కికసింహాయ కల్యాణగుణశాలినే ।
శ్రీమతే వేఙ్కటేశాయ వేదాన్తగురవే నమః ॥

*నేను:* అడిగిన వెంటనే ఏ విషయాన్నీ భగవద్విషయము నుండి సామాన్య విషయాల వరకూ అరటి పండు ఒలిచి నోట్లో పెట్టి నట్లు వివరించ గల సాక్షాత్తూ ఆ హయగ్రీవ వాణీ స్వరూపిణి అయిన నిన్ను నాకు వదినగా పొందడం నా పూర్వ జన్మలో చేసుకొన్న సుకృతము. మా అమ్మ తరువాత నాకు అమ్మవంటి నీకు మనఃపూర్వకంగా నమస్కరించడం, నిన్ను అను క్షణం స్మరించుకోవడం తప్ప మఱి యొక రకంగా నీ ఋణము తీర్చు కొన గలగడం ఎన్ని జన్మ లెత్తినా నాకు కుదరని పని. అందుచేత వదినా, నా నమోవాకాలను స్వీకరించి నన్ను అనుగ్రహించు.

**తిర్వేంగడాంబామ్ కరి వంశ లక్ష్మీమ్**

**సన్నారసింహార్య సధర్మ పత్నీమ్**

**శ్రీ అప్పలాచార్య సుతామ్ నమామి**

**శ్రీకృష్ణ ప్రేమీమ్ శఠగోప వాణీమ్.**

===================================================================